

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 177

బుధవారం 17-9-2025



ప్రాణధారలో చాంపియన్

గుత్తా జ్వాల నవజాత శిశువులకు ప్రాణాధారమైన తల్లి పాలను డొనేట్ చేయడంలో చాంపియన్‌గా నిలిచి దేశం మన్ననలు పొందుతోంది.

- 11లో

ప్రధాన స్పాన్సర్‌గా అపోలో టైర్స్

భారత క్రికెట్ జట్టు కొత్త జెర్సీ స్పాన్సర్‌గా 'అపోలో టైర్స్' ఎంపికైంది. ఒప్పందంలో భాగంగా రెండున్నరేళ్లకు గానూ ఆ సంస్థ బీసీసీఐకి రూ. 579 కోట్లు చెల్లిస్తుంది.

-14లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆరోగ్యకరమైన జీవనశైలిలో 'టెక్-ఫ్రీ ఈవెనింగ్స్' భాగం కావాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. టెక్-ఫ్రీ సాయంత్రాలలో ఇష్టమైన పుస్తకం చదువుకోవడం నుంచి తోట పని వరకు ఏదైనా చేసుకోవచ్చు. ముందు ఓ నెలరోజులు పాటించి చూస్తే సరి! మార్పు ఏమిటో మీకే తెలుస్తుంది.

● న్యూస్‌మేకర్ - గుత్తా జ్వాల

గుత్తా జ్వాల బ్యాడ్మింటన్ చాంపియన్‌గా అందరికీ తెలుసు. కాని నవజాత శిశువులకు ప్రాణాధారమైన తల్లి పాలను డొనేట్ చేయడంలో కూడా చాంపియన్‌గా నిలిచి దేశం మన్ననలు పొందుతోంది. పాలు పడని తల్లులు జబ్బుతో ఉన్న పిల్లలు, నవజాత శిశువులకు పాలు ఇవ్వలేనప్పుడు దానం ఇచ్చిన పాలు ఎంతో మేలు చేస్తాయి అంటున్న ఆమె 30 లీటర్ల తల్లిపాలు డొనేట్ చేసింది. వివరాలు...

ప్రాణధారలో చాంపియన్



'నా పాపకు పాలు పట్టించాక ఇంకా చాలా పాలు మిగులుతున్నాయనిపించింది. వాటిని ఏం చేయాలా... అనుకున్నాను. మా చెల్లెలికి ప్రిమెచ్యూర్ బేబీ పుట్టినప్పుడు మొదటి వారం వేరే వాళ్ల దగ్గర నుంచి చనుబాలు తీసుకున్నట్టు తను చెప్పింది. అలా చాలామంది చంటి పిల్లలకు చనుబాలు అవసరమని గుర్తుకొచ్చింది. హైదరాబాద్‌లోని నిలోఫర్‌లో ప్రతిరోజూ కనీసం 80 మంది పిల్లలకు బయటి నుంచి చనుబాలు కావాలని ఎవరో చెప్పారు. నా దగ్గర అదనంగా ఉన్న పాలు ఎంతమంది పిల్లలకు అందితే అంత మంచిదని చనుబాల దానం చేశాను' అంటున్నారు గుత్తా జ్వాల.

మొన్నటి ఏప్రిల్‌లో ఆమెకు ఐవీఎఫ్ ద్వారా పాప పుట్టింది. ఆమెకు మీరా అనే పేరు పెట్టారు గుత్తా జ్వాల ఆమె భర్త విష్ణు విశాల్. పాప పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ గుత్తా జ్వాల తన చనుబాలు 30 లీటర్లు దానం చేశారు. ఈ సంగతిని తాజాగా ఆమె వెల్లడించి 'ఇది అదనపు చనుబాలు ఉన్న తల్లులందరికీ స్ఫూర్తినివ్వాలి. పాలు వృథా పోయే బదులు అవసరం ఉన్న చంటి పిల్లలకు అందితే ఎంతో మేలు. ప్రతి తల్లీ మిల్క్ బ్యాంక్‌ల గురించి తెలుసుకోవాలి. చనుబాలు దానం చేయాలి' అందామె.



ఆరోగ్యమే పాలు

అథ్లెట్‌గా మొదటి ఇరవై ఏళ్ల నేను జంక్ ఫుడ్ తినలేదు. వ్యాయామం, మంచి ఆహారం తీసుకుంటూ జీవితం గడిపాను. అందుకే నాకు పాలు సమృద్ధిగా ఉన్నాయి. పాప కడుపు నిండుగా తాగాక రోజులు అర లీటరుగా పైగా పాలు నాలో పొంగుతున్నాయి. అవన్నీ సేకరించి దానం చేస్తున్నాను. అవి కొందరు పసిపిల్లలకు అందుతున్నాయన్న భావన నాకెంతో సంతోషం ఇస్తోంది.
– గుత్తా జ్వాల

పాలకై ఎదురుచూపులు

నిత్యం ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేద, బీద వర్గాల్లోని తల్లులకు ప్రిమెచ్యూర్ బేబీలు పుడుతుంటారు. కాన్పు తర్వాత అనారోగ్యం పాలైన తల్లులు పాలు ఇవ్వలేరు. కొందరికి పాలు పడవు. కొందరికి పౌష్టికాహార లోపం వల్ల తగినన్ని పాలు రావు. చంటి పిల్లలకు తల్లిపాలకు మించి అమృతం లేదు. అది ఏ విధంగా అందినా గొప్పే. అందుకే గుత్తా జ్వాల అలాంటి పిల్లలను తన చనుబాలు దక్కాలని అనుకుని నీలోఫర్‌లో దానం చేశారు. 'నా చనుబాలు దానం చేసే ముందు మా డాక్టర్‌ని అడిగి సలహా తీసుకున్నాను. ఒకటి రెండు రక్త పరీక్షలు చేసి నేను దానం ఇవ్వొచ్చో కూడదో చెప్పారు. ఆ తర్వాత ఎలక్ట్రిక్ పంప్ సహాయంతో చనుబాలు తీసి కవర్లలో ఫ్రీజ్ చేసి నిల్వ చేయవచ్చు. సరైన ఫ్రీజర్లలో నిల్వ చేసిన చనుబాలను ఆరు నెలల వరకూ వాడొచ్చని డాక్టర్లు చెప్పారు. నేను చనుబాలు ఇస్తానని ఇన్ఫార్మ్ చేస్తే నిలోఫర్ వాళ్లే వచ్చి తీసుకెళ్లారు' అని చెప్పింది జ్వాల.

పిల్లలే ముఖ్యం

'తల్లులు రకరకాల కారణాల వల్ల పిల్లలకు చనుబాలు ఇవ్వడం లేదు. నేనేమీ తప్పు పట్టను. ఉద్యోగాలకు వెళ్లే మహిళలకు ఇవి తప్పవు. కొందరి పాలు రావు. కాని బిడ్డతో అనుబంధం ఏర్పడాలన్నా, వారితో ఉద్వేగాలు పంచుకోవాలన్నా తల్లి పాలు ఇవ్వడం మంచిదని నా అభిప్రాయం. మన సమస్యలు ఎన్ని ఉన్నా బిడ్డ ఆరోగ్యమే తల్లులకు ప్రథమం కావాలి' అంటున్నారు జ్వాల.

ఆరోగ్యంగా ఉన్న తల్లులు అపోహలు వీడి, మూఢ విశ్వాసాలకు పోకుండా తమ దగ్గర అదనంగా ఉన్న పాలు దానం చేయాలని పిలుపిస్తున్నారామె.



నీలిమా సీపాని

విల్ పవర్‌తోనే అవకాశాలను కూడా సృష్టించుకోవచ్చు' ఇంటి వద్ద ఉంటూ కూడా మన కలలను సాధించుకోవచ్చు అంటున్నారు హైదరాబాద్ వాసి నీలిమా సీపాని. ఆన్‌లైన్ మ్యాథ్స్ ట్యూటర్‌గా ఇంటినుంచే వర్క్ చేస్తూ ఇటీవల ఢిల్లీలో జరిగిన పోటీలలో మిసెస్ యూనిటీ టైటిల్‌ను గెలుచుకున్నారు. ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబ జీవనం కొనసాగిస్తూనే విద్యార్థులను తీర్చిదిద్దే ట్యూటర్‌గా బిజీగా ఉంటూ రన్‌వే వేదికలపైనా తన టాలెంట్‌ను నిరూపించుకుంటున్నారు నీలిమ. ఇవన్నీ ఎలా సాధ్యం అంటే.. తన ప్లానింగ్‌ను ఇలా మన ముందుంచారు.

మిస్ట్రెస్ యూనిటీ ఆసియా 2025

విల్ ఉంటేనే పవర్ సాధ్యం

''బీఎస్సీ మ్యాథ్స్ తర్వాత ఎంబీయే చేశాను. పెళ్లయ్యాక మావారు నందకుమార్ యతిరాజులు ఉద్యోగరీత్యా అమెరికా వెళ్లాను. ఇద్దరు కూతుళ్లు. ఆరేళ్ల క్రితం ఇండియాకి వచ్చేశాం. పిల్లల బాగోగులు, వారి చదువులు, కుటుంబం అంటూ చాలా పనులను పక్కన పెట్టక తప్పలేదు. ఇండియా వచ్చాక క్యూ మ్యాథ్ ఆన్‌లైన్‌లో ట్యూటర్‌గా చేరాను. విదేశాలలో ఉండే పిల్లలు నాకు స్టూడెంట్స్‌గా ఉన్నారు. అందుకని, సాయంకాలం నుంచి తెల్లవారుజామున మూడు గంటల వరకు ఆన్‌లైన్‌లోనే పిల్లలకు క్లాసులు తీసుకుంటూ ఉంటాను. పేద విద్యార్థులకు ఉచితంగా చెబుతుంటాను.

నైట్ షిఫ్ట్స్.. బిజీ షెడ్యూల్

పగలు పడుకొని, రాత్రిళ్లు డ్యూటీ చేస్తే మన అన్ని అలవాట్లలోనూ, ఆరోగ్యంలోనూ చాలా మార్పులు వస్తాయి. అందుకని, రోజూ జిమ్‌కి వెళ్లడం, హెల్దీ ఫుడ్ తీసుకోవడంపై దృష్టి పెట్టాను. ఏడాదిక్రితం ఆన్‌లైన్‌లోనే ముంబయ్‌లోని మిథాలీ మోడలింగ్ అండ్ మోర్‌కి రిజిస్ట్రేషన్ చేసుకున్నాను. ఢిల్లీలో కిందటి నెలలో జరిగిన మిసెస్ యూనిటీ వరల్డ్ ఆసియా– 2025లో టైటిల్ రావడం నిజంగా చాలా ఆనందాన్నిచ్చింది.

టాలెంట్ రౌండ్, ఫ్యాషన్ రౌండ్, ఈవెనింగ్ గౌన్ రౌండ్.. ఇలా ఆరు రౌండ్లలో ఎంపిక చేశారు. ఈ ఫ్యాషన్ షోలో పాల్గొనడం, టైటిల్ గెలుచుకోవడం దాదాపు ఏడు నెలలుగా నా బిజీ షెడ్యూల్ మధ్యే ప్లాన్ చేసుకున్నాను. మొత్తం హైదరాబాద్‌లోనే ఉంటూ ప్రిపేర్ అయ్యాను. రోజూ గంటసేపు జిమ్, తక్కువ కార్బ్స్, ఎక్కువ ప్రొటీన్లు ఉండే ఆహారం రోజుకు 6–7 సార్లు తీసుకునేలా ప్లాన్ చేసుకున్నాను. ఇంటిపని, ట్యూషన్, హెల్త్ ప్లానింగ్, నిద్ర..



యూనిటీ షో అంటే...

ఒక కాజ్ గురించి ఈ షో రన్ చేస్తున్నారు. నేను చేస్తున్న వర్క్ పైనే జడ్జీలు ప్రశ్నలు వేశారు. నా బిజీ షెడ్యూల్ ప్లానింగ్ గురించి అడిగినప్పుడు 'విల్ పవర్ ఉన్నప్పుడే టైమ్ క్రియేట్ చేసుకుంటాం' అని చెప్పాను. 'టీచింగ్‌లో ఉన్నాను. యాక్టివిటీస్ చేస్తున్నాను. ఈ టైటిల్ వల్ల ఇంటా, బయటా పేరు వస్తుంది, ఆర్థికపరంగానూ మంచి మార్పులు వస్తాయి' అని చెప్పాను. మేం తీసుకుంటున్నది ఆన్‌లైన్ క్లాస్‌లు. పక్కన కూర్చోబెట్టుకొని చెప్పలేం. ఆన్‌లైన్‌లోనే వాళ్లని మోటివేట్ చేయాలి. అది ఎలా చేస్తానో.. వివరించాను. పేరెంట్స్‌తోనూ, పిల్లలతోనూ రిలేషన్‌షిప్ ను ఎలా డెవలప్ చేస్తానో చెప్పాను. మా పెద్దమ్మాయి ఇంజినీరింగ్ థర్డ్ ఇయర్. చిన్నమ్మాయి 8వ తరగతి చదువుతోంది.

వీటన్నింటికీ టైమ్ మేనేజ్‌మెంట్ చాలా అవసరం. నాలుగు రోజులు మాత్రం ముంబయ్‌లో ఉండి.. రన్‌వే పైన వాక్, పోజెస్, జడ్జీలు అడిగిన ప్రశ్నలకు ఇవ్వాల్సిన సమాధానాలు... శిక్షణ తీసుకున్నాను.

స్వయంగా ఎంపిక

మాకు కలర్ కోడ్ ఇచ్చారు. లాంగ్ గౌన్స్ చెప్పారు. దీంతో కాస్ట్యూమ్స్ అన్నీ నేనే ప్లాన్ చేసుకున్నాను. నాకు ఇష్టమైన పీకాక్ థీమ్‌తో ఈవెనింగ్ గౌన్లను ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చి, ప్రిపేర్ చేయించుకున్నాను. హై ఫ్యాషన్ తో పాటు ధోతీ-కుర్తా వంటి ఇండో వెస్ట్రన్ లుక్స్ కూడా క్రియేట్ చేశాను. నా స్కూల్ రోజుల్లో భరతనాట్యం నేర్చుకున్నాను. ఇక్కడ ఫ్యామిలీ ఫంక్షన్లలో ప్రదర్శనలు ఇస్తూ ఉంటాను. ఆ అనుభవంతో కాంతారా సినిమా సాంగ్‌ని రెండున్నర నిమిషాలు కంపోజ్ చేసి, దానిని ప్రదర్శించాను. అందుకు తగిన కాస్ట్యూమ్, జ్యువెలరీని నేనే ఎంచుకున్నాను. ప్రోగ్రామ్ మొత్తం ఆరు రోజుల పాటు జరిగింది. ప్రతిరోజూ ఉదయం టీ టైమ్ ఉంటుంది. టీమ్ అందరితో ఎలా కలుస్తాం, మనతో మనమే ఉంటున్నామా.. అనేది కూడా పరిశీలనలో ఉంటుంది. దేశవిదేశాల నుంచి వచ్చిన వారున్నారు కాబట్టి, అందరితో మన ర్యాపో ఎలా ఉందో కూడా చూస్తారు. ఇలాంటప్పుడు మన డ్రెస్సింగ్, మేకప్ చాలా కాన్ఫిడెంట్‌గా ఉండాలి. సెల్ఫ్‌మేకప్ కూడా వచ్చి ఉండాలి.

నన్ను నేను ఇలా రూపొందించుకోవడానికి మా అత్తగారి సపోర్ట్ చాలా ఎక్కువ. బాగా ఎంకరేజ్ చేస్తారు. నవంబర్‌లో మరొక ఫ్యాషన్ షో ఉంది. దానికి ప్లాన్ చేస్తున్నాను. రాబోయే మిసెస్ యూనిటీ ఫ్యాషన్ షోకు జడ్జ్‌గా ఉండబోతున్నాను'' అని వివరించారు ఈ మల్టీ టాలెంటెడ్ టీచర్ అండ్ మిస్ యూనిటీ టైటిల్ విన్నర్.

– **నిర్మలారెడ్డి**, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

● లీగల్

పునర్వివాహం చేసుకున్నా... మొదటి భర్త ఆస్తిలో హక్కులు తొలగిపోవు

నా భర్త చనిపోయిన తరువాత భార్యను కోల్పోయిన ఒకతన్ని రెండవ పెళ్లి చేసుకున్నాను. మొదటి భర్తతో నాకు పదేళ్ల పాప, ఏడేళ్ల బాబూ ఉన్నారు. నా రెండవ భర్తకు కూడా 12 సంవత్సరాల పాప ఉంది. నా ప్రశ్న ఏమిటంటే, ఇప్పుడు నా మొదటి భర్త ద్వారా పుట్టిన ఇద్దరు పిల్లలు రెండవ భర్తకు సహజ సంతానంగా లేదా దత్తత సంతానం అయిపోతారా? నా మొదటి భర్త ఆస్తిలో నాకు, నా ఇద్దరు పిల్లలకు వాటా వస్తుందా? నా మొదటి భర్తకి వారసత్వపు ఆస్తితోపాటు – స్వార్జితం ద్వారా కూడా ఆస్తులు ఉన్నాయి. రెండవ భర్త ఆస్తిలో నా సంతానానికి హక్కు ఉంటుందా? నా మొదటి భర్త అమ్మగారు అంటే మా అత్తయ్యగారు బతికే ఉన్నారు. ఆవిడది కూడా మా మామయ్యగారితో రెండవ వివాహమే! కానీ ఆమెకి మొదటి భర్తతో పిల్లలు లేరు. రెండవ వివాహం చేసుకుంటే మొదటి భర్త ఆస్తిలో వాటా రాదు అని చట్టం ఉంది కాబట్టే ఆవిడకి కూడా తన మొదటి భర్త నుంచి ఆస్తి రాలేదని, నాకు కూడా అలాగే రాదని చెబుతోంది. అది నిజమేనా?
- ఒక సోదరి, ఖమ్మం జిల్లా

బహుశా మీ అత్తయ్యగారి మొదటి భర్త చనిపోయిన కాలంలో అది నిజం కావచ్చు. పూర్వం 'హిందూ వితంతు వివాహ చట్టం, 1856' అని ఉండేది. అప్పట్లో అది చాలా విప్లవాత్మక చట్టం అయినప్పటికీ ఆ చట్టం ప్రకారం రెండవ పెళ్లి చేసుకున్న వితంతు మహిళకు మొదటి భర్త ఆస్తిలో ఎటువంటి హక్కు ఉండేది కాదు. కానీ ఈ చట్టం 1983లో రద్దు అయింది. ప్రస్తుత చట్టంలో వితంతు వివాహం/లేదా పునర్వివాహం చేసుకున్న స్త్రీకి మొదటి భర్త ఆస్తిపై ఉన్న హక్కులు తొలగిపోవు! అలా తొలగిస్తే అది రాజ్యాంగ స్ఫూర్తికే వ్యతిరేకం. కాబట్టి మీకు మాత్రం మీ మొదటి భర్త ఆస్తిలో ఒక భాగం వాటా ఉంటుంది.

ఇక మీ పిల్లల విషయానికి వస్తే... మీరు రెండవ పెళ్లి చేసుకున్నంత మాత్రాన మీ మొదటి భర్త ద్వారా కలిగిన సంతానం రెండవ భర్తకు చెందరు. ఒకవేళ రెండవ భర్త నిజమైన తండ్రిగా వ్యవహరించాలి అని మీరు అనుకుంటే, మీరు మీ పిల్లలను చట్టబద్ధంగా దత్తత ఇవ్వవలసి వస్తుంది. అయితే దత్తత ఇచ్చేసిన తర్వాత సాధారణ పరిస్థితిలో అయితే దత్తత ఇవ్వబడ్డ పిల్లలకు వారి సహజ తల్లిదండ్రుల ఆస్తులలో (పూర్వీకుల ఆస్తిలోనైనా లేక స్వార్జితంలో అయినా) ఎటువంటి హక్కు ఉండదు. కానీ దత్తత తీసుకున్న తల్లిదండ్రుల ఆస్తిలో మాత్రం దత్తపుత్రులకు/దత్త పుత్రికకు వారి సహజ సంతానంతో సమానంగా హక్కు ఉంటుంది. అంటే మీ రెండవ భర్తకి మీరు దత్తత ఇస్తే ఆయన తదనంతరం (వీలునామా రాయకుండా మరణిస్తే) ఆస్తిలో తన సొంత కూతురితో సమానంగా మీ పిల్లలకు కూడా చెరొక వాటా వస్తుంది. దత్తత ఇచ్చే సమయానికి ఒకవేళ మీ మొదటి భర్త ఆస్తిలో పంపకాలు జరిగి మీ పిల్లలకి ఆ ఆస్తి ఇప్పటికే వచ్చి ఉన్నట్లయితే, వారిని దత్తత ఇచ్చేసినప్పటికీ కూడా వారి ఆస్తి వారి వద్దనే ఉంటుంది. అంటే మీరు ముందుగా మీ మొదటి భర్త నుండి సంక్రమించే ఆస్తిని పంచుకుని తర్వాత పిల్లల్ని దత్తత ఇస్తే పిల్లలకి నష్టం వుండదు. ఎందుకంటే మీ రెండవ భర్త తన ఆస్తిని తనకు ఇష్టం వచ్చిన వాళ్ళకి ఇచ్చుకోవచ్చు. మీ పిల్లలకి ఇవ్వకపోతే వారు చేయని తప్పుకి పిల్లలు బలయ్యే అవకాశం ఉంది కదా! ఈ విషయాలు అన్నింటిని మీ మొదటి భర్త తల్లిగారికి వివరించండి. ఒప్పుకోని పక్షంలో మీరు పార్టిషన్ సూట్ ద్వారా మీ హక్కును అలాగే మీ పిల్లల హక్కును కూడా కాపాడుకోవచ్చు. మీరు ఇచ్చిన సమాచారం ఆధారంగా మాత్రమే పైన వివరణ ఇవ్వడం జరిగింది. ఇలాంటి కేసులలో పూర్తి పత్రాలతో, సమాచారంతో దగ్గరలోని లాయర్‌ని కలవడం అవసరం.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

● బంధం

అమ్మ ఆటో

'ఒంటరితనం అనేది బాధను వందరెట్లు చేస్తుంది' అంటారు. భర్త చనిపోయిన తరువాత బాధపడుతూ ఒంటరితనంలో కూరుకుపోయింది సత్యవతి.
'ఎప్పుడూ ఇంట్లో ఉండడం కంటే నలుగురిలో కలిస్తే అమ్మ కాస్త చురుగ్గా ఉంటుంది' అని ఆలోచించాడు సత్యవతి కుమారుడు, ఆటోడ్రైవర్ గోపి. ఆ ఆలోచన ఫలితంగానే కుమారుడి ఆటోలో రోజూ అనేక ఊళ్లకు వెళుతుంటుంది సత్యవతి. పన్నెండేళ్ల కాలంలో ఆమెకు ఎంతోమంది ప్రయాణికులు పరిచయం అయ్యారు. బంధువులయ్యారు.
అవును...ఇప్పుడు 84 ఏళ్ల సత్యవతి హుషారుగా ఉంటోంది.
గోపి నడిపే ఆటోకు 'అమ్మ ఆటో' అని పేరు!



తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడేనికి చెందిన మాసగాని సత్యవతి కుమారుడు గోపి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. తండ్రి మరణంతో తల్లి బెంగగా ఉండడంతో ఆమెను తనతోపాటు ఆటోలో తీసుకు వెళ్లి కబుర్లు చెబుతూ తిప్పేవాడు. రోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 వరకు కొడుకుతో పాటు సత్యవతి ఆటోలోనే తిరుగుతుంది. తల్లి లేకుండా ఆటో స్టార్ట్ చేయడు గోపీ.
'అసలే రోజులు బాగోలేవు. ఎక్కడ చూసినా రోడ్డు ప్రమాదాలే. ఇంట్లో ఉన్నప్పుడు గోపి గురించి భయంగా ఉండేది. ఇప్పుడు వాడి వెంటే ఉంటున్నాను కాబట్టి ఎలాంటి భయం లేదు. రోజూ ఆటోలో వెళ్లడం వల్ల ఎంతోమంది నాకు పరిచయం అయ్యారు. బంధువులు అయ్యారు' సంతోషంగా అంటుంది సత్యవతి.

'ఇంట్లో అమ్మ ఎప్పుడూ నాన్న గురించి ఆలోచిస్తూ బాధపడుతుంది అనే బెంగ ఒకప్పుడు ఉండేది. ఇప్పుడు అమ్మ నాతో పాటే ఉండడం వల్ల ఎలాంటి బెంగా లేదు. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. నా వెనక అమ్మ ఉంది అనే ధైర్యం ఉంది' అంటున్నాడు 52 ఏళ్ల గోపి.

– కాసాని వెంకటేశ్వర్లు, సాక్షి, దేవరపల్లి, తూర్పుగోదావరి జిల్లా

● పురస్కారం


మొన్నటి వరకు...
'జితాంక్ సింగ్ గుర్జార్ పేరు విన్నారా?' అనే ప్రశ్నకు వెంటనే వచ్చే జవాబు...
'సారీ... తెలియదు'
ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆ పేరు పరిచయం అయింది.
'ఎవరీ జితాంక్ సింగ్ గుజ్జార్?' అని



సెర్చ్ ఇంజిన్‌లను అడిగేవారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. తొలి చిత్రంతోనే అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు సింగ్.
టొరంటో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (టిఐఎఫ్ఎఫ్) లో జితాంక్ సింగ్ గుర్జార్ తీసిన విముక్త్ (ఇన్ సెర్చ్ ఆఫ్ ది స్కై) ప్రతిష్ఠాత్మమైన నెట్‌పాక్ (నెట్‌వర్క్ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఏషియా సినిమా) అవార్డ్ గెలుచుకుంది.

జితాంక్ జీత్ గయా!

పక్కా పల్లెటూళ్లో పుట్టి పెరగడం వల్ల జితాంక్ ప్రకృతి ప్రపంచానికి చేరువయ్యే అవకాశం దొరికింది. రణగొణ ధ్వనులు లేని ఆ ప్రశాంతత బాగా ఇష్టంగా ఉండేది. తనకు ఆశ్చర్యంగా అనిపించేవాటిని, అద్భుతంగా అనిపించేవాటిని అందమైన కథలుగా చెబుతుండేవాడు. ఆ కథలు చెప్పే అలవాటే జితాంక్‌సింగ్‌ను సినిమా ప్రపంచంలోకి తీసుకు వచ్చింది.



జితాంక్ సింగ్ గుర్జార్

ప్రాంతీయ భాషలో తీసిన చిత్రాన్ని ప్రపంచం మెచ్చింది

ఆ దంపతులకు వయసు పైబడుతోంది. జీవనాధారమైన తమ పొలాన్ని కోల్పోయే ప్రమాదం ముంచుకొస్తోంది. ఒక్కగానొక్క కొడుకు నారన్‌కు మేధో సామర్థ్యాలు లేవు. మానసికంగా అస్థిరంగా ఉంటాడు. ఒక వైపు నారన్‌ను ఎప్పుడూ కనిపెట్టుకొని ఉండాలి. మరో వైపు ఆర్థిక కష్టాలు. ఎన్నో సమస్యల మధ్య ఒక పరిష్కారాన్ని ఆశిస్తూ మహాకుంభమేళాకు వారి ఆధ్యాత్మిక ప్రయాణం మొదలవుతుంది. గంగానదిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తే తమ కష్టాలు తీరుతాయని వారు ఆశిస్తారు. గ్రామీణ భారత జీవితం, నమ్మకాలు, అపనమ్మకాలకు, అదృష్ట దురదృష్టాలకు అద్దం పట్టిన సినిమాగా 'విముక్త్' ప్రశంసలు అందుకుంది. ఈ సినిమా బ్రజ్ భాషలో తీశారు. కేవలం పదకొండురోజుల్లో చిత్రీకరణ పూర్తి చేశారు. టొరంటో ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ సెంటర్ పీస్ సెక్షన్‌లో ప్రదర్శించారు.

ఆ పిల్లల కన్నీళ్లలో నుంచి పుట్టిన కథ... విముక్త్

ఎన్నో సంవత్సరాలు ఫ్రాన్స్‌లో గడిపిన పూజా విశాల్ శర్మ తన మూలాలను వెదుక్కుంటూ స్వదేశానికి వచ్చింది. ఒకరోజు ఆమె గ్వాలియర్‌లోని ఒక స్వచ్ఛంద సంస్థ బుద్ధిమాంద్యం ఉన్న పిల్లల కోసం నిర్వహిస్తున్న ఆశ్రమానికి వెళ్లింది. ఆ పిల్లలు పేదింటి బిడ్డలు. వారిని చూసి బాగా కదిలిపోయిన పూజ 'విముక్త్: ఇన్ సెర్చ్ ఆఫ్ ది స్కై' పేరుతో కథ రాసింది. 'విముక్త్'కు సినిమా రూపం ఇస్తే చాలామందికి చేరువ అవుతుందనే ఉద్దేశంతో తొలిసారిగా నిర్మాతగా మారింది. సినిమాకు సహ రచయితగా కూడా పనిచేసింది.

గ్రామీణ ప్రపంచం... కథల చలమ

గ్రామీణ ప్రపంచంలో ఎన్నో కథలు ఉన్నాయి. వాటిని ప్రపంచానికి చెప్పడం అంటే జితాంక్‌కు ఇష్టం.
'ది మోస్ట్ పర్సనల్ ఈజ్ ది మోస్ట్ క్రియేటివ్' అనే విలువైన మాట అంటే ఇష్టం. ఆ ఇష్టంతోనే 'విముక్త్' కథకు స్క్రీన్‌ప్లే సమకూర్చి సినిమాగా మలిచాడు. ఇది నిర్మాత పూజా విశాల్ శర్మ రాసిన కథ. నటులు, సాంకేతిక వర్గం ఫైనల్ అయ్యాక... 'ఇదీ కథ' అని వారికి చెప్పాడు. ప్రతి క్యారెక్టర్ గురించి విశ్లేషించి వివరంగా చెప్పాడు. నటులు తమ క్యారెక్టర్‌లలో పూర్తిగా మమేకం కావడానికి ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహించాడు.

కుంభమేళాలో షూటింగ్

జనసముద్రంలో మహా కుంభమేళాలో షూటింగ్ అంటే మాటలు కాదు. తమది చిన్న యూనిట్ కావడంతో ప్రతి సీన్ గురించి జాగ్రత్తగా ప్రణాళిక వేసుకున్నాడు. ఏ దృశ్యాన్ని ఎక్కడ చిత్రించాలనేదాని కోసం ఎన్నో స్థలాలను పరిశీలించాడు. సరియైన లొకేషన్‌లను ఎంపిక చేసుకోవడం ఒక సవాలు అయితే, జనసమూహాలలో సహజ చిత్రీకరణ అనేది మరో సవాలు. ఎలా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ విజయవంతంగా షూటింగ్ పూర్తిచేశాడు జితాంక్.
'మహాకుంభమేళా సన్నివేశాలు లేకపోతే ఈ సినిమాయే లేదు. కాబట్టి కుంభమేళాలోని సన్నివేశాలనే మొదట చిత్రీకరించాం. ఆ తరువాత మధ్యప్రదేశ్‌లోని బర్లై, పద్వా గ్రామాలలో షూటింగ్ చేశాం' అంటాడు జితాంగ్ సింగ్.
'గ్రామీణ ప్రాంత కథలు మాత్రమే కాదు పట్టణాలలోని ఎన్నో సంక్లిష్ట జీవితాలకు చిత్రరూపం ఇవ్వాలనుకుంటున్నాను' అంటున్నాడు జితాంక్ సింగ్ గుర్జార్.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 16న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,14,710	1,07,270	1,35,500
విజయవాడ	1,14,000	1,02,600	1,33,800
విశాఖపట్నం	1,11,930	1,02,600	1,44,000
రాజమండ్రి	1,14,000	1,05,680	1,33,800
ప్రొద్దుటూరు	1,14,400	1,05,250	1,34,000
చెన్నై	1,12,140	1,02,800	1,44,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 177
బుధవారం 17-9-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'



సరికొత్త శిఖరాలకు పసిడి

99.9 శాతం స్వచ్ఛతగల బంగారం 10 గ్రాములు ఢిల్లీలో రూ.1,15,100

ఒక్క రోజులో రూ.1,800 పెరుగుదల

డాలర్ బలహీనత, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల కోత అంచనాలతో పసిడిలో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్న ఫలితం

- వివరాలు 15లో



చర్చలు సానుకూలం

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని త్వరగా అమల్లోకి తెచ్చేలా చూడాలని భారత్, అమెరికా నిర్ణయించాయి.

- వివరాలు 6లో



గాజాపై భీకర దాడులు

గాజా నగరంపై ఇజ్రాయెల్ సైన్యం తాజాగా చేపట్టిన దాడుల్లో 68 మంది పాలస్తీనియన్లు మృతిచెందారు.

- వివరాలు 6లో



న్యూయార్క్ టైమ్స్‌పై ట్రంప్ దావా

'ద న్యూయార్క్ టైమ్స్' తనకు రూ.1.32 లక్షల కోట్లు పరిహారం చెల్లించేలా ఆదేశాలివ్వాలని ట్రంప్ కోర్టుకెక్కారు.

- వివరాలు 6లో



మళ్లీ క్లౌడ్ బరస్ట్

హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో మళ్లీ క్లౌడ్ బరస్ట్ సంభవించింది. వరదలు, కొండచరియలు విరిగిపడటంతో 18 మంది మృతిచెందారు.

- వివరాలు 6లో

పట్టువిడుపులుంటేనే పరిష్కారం!



సాదాబైనామాపై నిపుణుల సూచన

చట్టం, నిబంధనల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకూడదు

ఉదారంగా వ్యవహరిస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం

అమ్మిన వ్యక్తి కూడా అఫిడవిట్ ఇవ్వాలనే నిబంధన రైతుకు ఇబ్బందికరంగా మారే చాన్స్

మళ్లీ కోర్టు కేసులు, ఇతరత్రా తలనొప్పులకు అవకాశం

దీనిపై సానుకూలంగా ప్రభుత్వం!

చుట్టుపక్కల వారిని విచారించి క్రమబద్ధీకరించాక నిబంధనగా చేర్చే యోచన.. ప్రత్యేక మార్గదర్శకాలతో ముందుకు వెళ్లాలంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: సాదా బైనామా.. తెలంగాణ రైతాంగం పరిష్కారం కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్న భూ సమస్య. దాదాపు 9.84 లక్షల దర ఖాస్తులకు సంబంధించిన 11 లక్షలకు పైగా ఎకరాలకు యాజమాన్య హక్కులు ఇచ్చే ప్రక్రియ. దీని అమలు కోసం ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాకపోయినా, ఈ క్రమబద్ధీకరణ విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న, వ్యవహరించాల్సిన తీరుపై చర్చోప చర్చలు జరుగుతున్నాయి. చట్టం, నిబంధనల పేరుతో రైతులపై కఠినంగా కాకుండా అందరి ఆమోదం మేరకు ఉదారంగా వెళ్లడం ద్వారానే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భూ చట్టాల నిపుణులు చెబుతున్నారు.

తొలుత మూడు.. ఆ తర్వాత మరిన్ని

గతంలో ఉన్న ధరణి చట్టం స్థానంలో భూభారతి చట్టం తెచ్చినప్పుడు సాదా బైనామాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మూడు కొత్త అంశాలను చేర్చింది. సమస్య పరిష్కారానికి 2020లో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుని ఉండాలని, 12 ఏళ్లుగా భూమి అనుభవంలో ఉండాలని, సమస్య పరిష్కారమయ్యేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కట్టాలని స్పష్టం చేసింది. అయితే ఆ తర్వాత చట్టానికి నిబంధనలు తయారు చేసేటప్పుడు అదనంగా మరికొన్ని నిబంధనలు పెట్టారు. సాదా బైనామా పరిష్కరించి 13 బీ సర్టిఫికెట్ ఇచ్చేటప్పుడు స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు ఎంత ఉంటే అంత ప్రభుత్వానికి చెల్లించాలని, సాదా బైనామాపై విచారణ సందర్భంగా కొన్న వ్యక్తితో పాటు అమ్మిన వ్యక్తి కూడా అఫిడవిట్ ఇవ్వాలనే నిబంధనలు విధించారు.

ఈ అఫిడవిట్‌తోనే తంటా..

రాష్ట్ర ప్రభుత్వం సాదా బైనామాలను పరిష్కరించే క్రమంలో చట్టంలోని నిబంధనల మేరకు వెళ్తే సన్న, చిన్నకారు రైతాంగానికి చాలా ఇబ్బందులు వస్తాయని భూచట్టాల నిపుణులు చెపుతున్నారు. గత ప్రభుత్వం దరఖాస్తులు తీసుకుని పరిష్కరించకుండా వెళ్లిపోతే, ఈ ప్రభుత్వం సదరు దరఖాస్తులను పరిష్కరించకపోగా, రైతులను ఇబ్బందుల్లోకి నెట్టిందని, కోర్టుల పాలు చేసిందనే అపప్రద మూటగట్టుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. వాస్తవానికి 2007 కంటే ముందు సాదా బైనామాలను పరిష్కరించే సమయంలో అమ్మిన వ్యక్తి సమ్మతి తప్పనిసరి అనే నిబంధన ఉండేది. కానీ దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు ఆ నిబంధనను తీసేశారు. ఎప్పుడో అమ్మిన వ్యక్తి ఇప్పుడు అంగీకరించేందుకు ఇష్టపడక పోవచ్చు కాబట్టి చుట్టుపక్కల రైతులను విచారణ చేసి, లేదంటే గ్రామ పెద్దల స్టేట్‌మెంట్ ఆధారంగా కూడా క్రమబద్ధీకరించేందుకు వెసులుబాటు కల్పించారు. దీనికి తోడు పహాణీలోని సాగుదారు కాలమ్‌లో ఉన్న కొన్న వ్యక్తి పేరును ఆధారంగా పరిగణనలోకి తీసుకునేవారు. 2009–16 వరకు

మిగతా 13వ పేజీలో ▶

కొత్త డిస్కమ్‌కు గ్రీన్‌సిగ్నల్

త్వరలోనే అన్ని అనుమతులు ఇస్తామన్న సీఎం

ఆర్థికపరమైన అంశాలపై అధ్యయనం చేయాలని సూచన

విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మూడో విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటుకు సంబంధించి విద్యుత్ అధికారులు రూపొందించిన ప్రణాళికకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే ఆర్థికపరమైన అంశాలపై మరింత అధ్యయనం చేయాలని సూచించారు. ఏయే సంస్థల నుంచి రుణాలు పొందే వీలుంది? ఎంత మేర రుణాలు తీసుకోవచ్చన్న దానిపై నిర్దిష్ట సమాచారం అందించాలని అధికారులకు చెప్పినట్లు తెలిసింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంగళవారం

మిగతా 3వ పేజీలో ▶

అవినీతి అనకొండ

రూ.300 కోట్ల ఆస్తులు కూడబెట్టిన విద్యుత్ శాఖ ఏడీఈ

హైదరాబాద్ సహా 10 ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ సోదాలు

ఏడీఈ అంబేడ్కర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు; అరెస్టు





సోదాల్లో ఏసీబీ స్వాధీనం చేసుకున్న రూ. 2.18 కోట్ల నగదు. ఇన్‌సెట్‌లో విద్యుత్ శాఖ ఏడీఈ అంబేడ్కర్

3లో

న్యూస్‌రీల్

థర్డ్ పార్టీ జోక్యాన్ని భారత్ ఒప్పుకోలేదు



ఆపరేషన్ సిందూర్ వేళ భారత్–పాక్ మధ్య కాల్పుల విరమణకు చొరవ తీసుకున్నానని.. తన వల్లే యుద్ధం ఆగిందంటూ ట్రంప్ చెప్పిన మాటల్లోని డొల్లతనాన్ని పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ బయటపెట్టారు.

- వివరాలు 6లో

మెట్రో రైల్ ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్



హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు సర్కారు అదనపు బాధ్యతలు అప్పగించింది.

- వివరాలు 3లో

ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్లానింగ్ ఎలా?



ఫీజు రీయింబర్స్‌మెంట్ హేతుబద్ధీకరణపై ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఈ దిశగా ఏర్పాటు చేసే ప్రత్యేక కమిటీలో అధికారులతోపాటు కాలేజీ యాజమాన్య ప్రతినిధులను సైతం చేర్చాలని నిర్ణయించింది.

- వివరాలు 13లో

'మర్రి'కి అటూఇటూ రోడ్డు!



హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిలో భాగంగా 'అప్పా' కూడలి నుంచి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న 915 మర్రి వృక్షాలను కాపాడేందుకు మధ్యేమార్గంగా ఎన్‌హెచ్‌ఏఐ ప్రత్యామ్నాయ డిజైన్‌ను రూపొందించింది.

- వివరాలు 13లో

చార్జిషీట్లు వేసిన తరువాత మళ్లీ దర్యాప్తు ఏంటి?

వివేకా కేసులో సునీతను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

మేం ఈ కేసును పర్యవేక్షించడం ఏమిటి?



- ఈ వాదనలను సీబీఐ కోర్టు దృష్టికి ఎందుకు తీసుకువెళ్లలేదు?
- ఒక దాని వెంట ఒకటి పిటిషన్లు వేస్తుంటే విచారణ పూర్తయ్యేదెప్పుడు?.. ఇలా చేస్తుంటే విచారణ పూర్తి కావడానికి దశాబ్ద కాలం పడుతుంది
- దర్యాప్తు పూర్తి చేసిన తరువాతే కదా చార్జిషీట్లు వేసింది
- అలాంటప్పుడు తదుపరి దర్యాప్తు కోరి మీరు సాధించేదేంటి?
- బెయిల్ రద్దు విషయంలో మేం జోక్యం చేసుకోం..
- సునీతను నిలదీసిన అత్యున్నత న్యాయస్థానం

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తు జరిపేలా సీబీఐని ఆదేశించాలన్న వివేకా కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతారెడ్డి అభ్యర్థనపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. చార్జిషీట్ దాఖలయ్యాక ఇప్పుడు దర్యాప్తు కోరడం ఏమిటంటూ ఆమెను ప్రశ్నించింది. ఒకదానివెంట ఒకటి పిటిషన్లు వేస్తుంటే విచారణ పూర్తయ్యేదెప్పుడని ప్రశ్నించింది. దర్యాప్తు పూర్తయ్యాకే కదా చార్జిషీట్లు వేసిందని ప్రశ్నించింది. మీరు ఇపుడు చేస్తున్న

మిగతా 12వ పేజీలో ▶

భావ ప్రకటన స్వేచ్ఛపై దాడే

'ఇండియా టుడే' గ్రూప్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్

ప్రభుత్వ తప్పిదాలను ఎండగడుతున్న 'సాక్షి'పై వరుసగా అక్రమ కేసులు పత్రికా స్వేచ్ఛపై దాడే

'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు.. చట్టాన్ని దుర్వినియోగం చేయడమే

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పరిస్థితి దేశంలో మరెక్కడా లేదు

పత్రికా స్వేచ్ఛను కాపాడుకునేందుకు 'సాక్షి'కి అండగా నిలబడతాం



13లో

మావోయిస్టుల కాల్పుల విరమణ?

పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేఖ!

ప్రభుత్వం కూడా నెల రోజులు విరమణ పాటించాలని విజ్ఞప్తి

ధ్రువీకరించని పోలీసువర్గాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తీవ్ర నిర్బంధ పరిస్థితుల నేపథ్యంలో బేషరతుగా కాల్పుల విరమణకు మావోయిస్టులు అంగీకారం తెలిపారు. ఈ మేరకు మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ ఆగస్టు 15న రాసినట్లుగా ఉన్న లేఖ ఆలస్యంగా వెలుగు చూసినట్లు మంగళవారం అర్ధరాత్రి జాతీయ మీడియా, సోషల్ మీడియాలో కథనాలు ప్రసారమయ్యాయి. హిందీలో విడుదలైన ఈ లేఖలో.. తమ పార్టీ జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో అమరుడు కాకముందు నుంచే శాంతి చర్చల ప్రస్తావనను ప్రభుత్వం ముందుకు తెచ్చినట్లు అభయ్ వెల్లడించారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా, దేశంలో మారుతున్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, హోంమంత్రి అమిత్‌షా మొదలు ప్రధాని నరేంద్ర మోదీ వరకు అనేకమంది ఆయుధాలు వదిలిపెట్టి జనజీవన స్రవంతిలో కలవాలంటూ చేసిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని సాయుధ పోరాటం విరమించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. అయితే ఈ అంశంపై దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న ఇతర మావోయిస్టు నేతలతో చర్చించుకుని తుది నిర్ణయానికి వచ్చేందుకు కనీసం నెల పాటు ప్రభుత్వం తరఫున కూడా కాల్పుల విరమణ కావాలని కోరారు. కొన్ని కారణాల వల్ల లేఖ

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



..రద్దు చేస్తారేమోననిపిస్తోంది సార్!

క్లుప్తంగా...

190 జీవో జారీపై టీజేఏసీ హర్షం

ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన టీజేఏసీ చైర్మన్ మారం, ప్రధాన కార్యదర్శి ఏలూరి



మీడియాతో మాట్లాడుతున్న మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాస్‌రావు

సాక్షి, హైదరాబాద్: జీవో 317తో మారిన ఉద్యోగులకు ఖాళీ ఉన్న చోట, కోరుకున్న జిల్లాల్లో రెండుమూడేళ్లు పనిచేసేందుకు తాత్కాలికంగా అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం 190 జీవో జారీ చేయడంపై టీజేఏసీ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేబినెట్ సబ్ కమిటీ, సీఎస్‌లకు మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. 317 జీవో ద్వారా వేరే జిల్లా, జోన్‌కు వెళ్లిన ఉద్యోగులు, స్పౌజ్ కేసులు, పరస్పర బదిలీలు, ప్రమోషన్ అవకాశం రానివారికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇది టీజేఏసీ నిరంతర పోరాట విజయమన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో సామాన్యులకు మేలు

మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సయ్యద్ జాఫర్



సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రేట్లను తగ్గించడం ద్వారా ప్రజలు, వ్యాపారులకు మేలు చేకూరిందని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సయ్యద్ జాఫర్ ఇస్లాం అన్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో భారీ సంస్కరణలకు అవకాశం కల్పించిందని చెప్పారు. యూపీఏ హయాంలో రాష్ట్రాలు, కేంద్రానికి వేర్వేరు రేట్లు ఉండేవని, వ్యాట్, ఆక్ట్రాయ్, ఎంట్రీ ట్యాక్స్ వంటి అనేక పరోక్ష పన్నులు ఉండేవని గుర్తుచేశారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో పార్టీ జాతీయ కార్యదర్శి అనిల్ ఆంటోని, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణల ప్రధాన ఉద్దేశం 'ఈజ్ ఆఫ్ లివింగ్'ని పెంచడం, ప్రజల రోజువారీ అవసరాలకు సంబంధించిన వస్తువులను తక్కువ ధరలకు అందించటమేనని సయ్యద్ చెప్పారు.

అర్హత లేకున్నా పిటిషన్.. రూ.20 వేలు జరిమానా

సింగరేణి సీఎండీపై పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: సింగరేణి కాలరీస్ డైరెక్టర్‌గా ఎస్.బలరాం కొనసాగే అర్హత లేదంటూ దాఖలైన పిటిషన్‌లో పిటిషనర్ తీరును హైకోర్టు తప్పుబట్టింది. అర్హత లేకున్నా పిటిషన్ వేసినందుకు రూ.20 వేలు జరిమానా విధిస్తూ ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్, బలరాం డైరెక్టర్ పోస్టుకు అనర్హుడని ప్రకటించాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన సంపత్‌కుమార్ వ్యక్తిగత హోదాలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు మంగళవారం విచారణ చేపట్టారు. సింగరేణి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఇక్కడే పనిచేసి తొలగింపునకు గురైన పిటిషనర్ గతంలోనూ పిటిషన్ వేశారని, కోర్టు రూ.50 వేలు జరిమానా విధించిందన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. గతంలో విధించిన జరిమానా కోర్టు ఒత్తిడితో చెల్లించారన్నారు. సర్వీసులోని వ్యక్తిపై పిటిషన్ దాఖలు చేసినప్పుడు ఆ పోస్టుకు పోటీదారై ఉండాలని, ఇక్కడ పిటిషనర్‌కు ఆ అర్హత లేదన్నారు. కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు భారీ జరిమానాతో విధించాల్సి ఉన్నా.. ఇటీవలే రూ.50 వేలు చెల్లించిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని రూ.20 వేలు మాత్రమే జరిమానా విధిస్తున్నామన్నారు.

పిల్లల బతుకులు ఆగం చేయొద్దు

రాజకీయాల్లోకి వాళ్లను లాగొద్దు

- రూ.3 కోట్ల ఆరోపణలు రుజువు చేయాలి
- అప్పులు చేసి పిల్లల్ని చదివించాం
- మూడు దఫాలు రద్దు చేశారు.. ఇది నాలుగో దఫా.. ఇలాగైతే ప్రభుత్వ ఉద్యోగాలపై నమ్మకం పోతుంది
- గ్రూప్ 1 ర్యాంకర్ల తల్లిదండ్రుల ఆవేదన



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న గ్రూప్ 1 మెయిన్స్ ర్యాంకర్ల తల్లిదండ్రులు

సాక్షి, హైదరాబాద్: 'యువత జీవితాలతో రాజకీయాలు చేయొద్దు. రూ.3 కోట్లు తీసుకుని ఉద్యోగాలు అమ్ముకున్నారంటున్నారు. అమ్ముకున్న వారెవరు? కొనుక్కున్నవారెవరు? ఇలా మాట్లాడే వారి దగ్గర ఏమైనా ఆధారాలుంటే చూపించాలి. మీరు రాజకీయాలు చేసుకోండి. లేనిపోని మాటలు మాట్లాడి పిల్లల బతుకులు ఆగం చేయొద్దు. ప్రభుత్వంపై మాకు నమ్మకం ఉంది. పిల్లలకు ఇబ్బందులు లేకుండా నియామక పత్రాలు ఇస్తారని ఆశిస్తున్నాం. ఏది ఏమైనా విచారణకు మేము కూడా సహకరిస్తాం. రూ.3 కోట్లకు ఎన్ని సున్నాలుంటాయో కూడా మాకు తెలీదు. అంత సొమ్ముంటే ఏ వ్యాపారమో చేసుకునే వాళ్లం. రూ.3 కోట్లు కాదు.. బ్యాంకులో రూ.3 లక్షలుంటే చూపండి. మావి పేద కుటుంబాలు, కాయ కష్టం చేసి పిల్లల్ని చదివించాం. పిల్లలు కూడా రాత్రి పగలు తేడా లేకుండా, పండుగలు, ఇతర శుభ కార్యాలకు దూరమై, ఒక దీక్ష చేసినట్లు చదువుకుని, ర్యాంకులు సాధిస్తే అసత్య ఆరోపణలతో వారిని అవమానిస్తున్నారు. ర్యాంకర్లు ఎవరైనా, ఏదైనా చేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారు? పిల్లలకు న్యాయం చేయాలి. ఇప్పటికే మూడు దఫాలు రద్దు చేశారు. ఇలాగే కొనసాగితే ప్రభుత్వ ఉద్యోగాలపై భవిష్యత్తరాలకు నమ్మకం పోతుంది..' అంటూ నియామక పత్రాల కోసం ఎదురుచూస్తున్న పలువురు గ్రూప్–1 ర్యాంకర్ల తల్లిదండ్రులు వాపోయారు. మంగళవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంది

గ్రూప్–1 ఉద్యోగాలు అమ్ముకున్నారంటున్నారు. రూ.3 కోట్లు అని ప్రారంభించి రూ.1,700 కోట్ల స్కాం అంటున్నారు. అభియోగం మోపితే సరిపోదు. దాన్ని నిరూపించగలగాలి. ఇక్కడున్న తల్లిదండ్రులకు రూ.3 కోట్లు ఇవ్వగలిగే స్థోమత ఉందా.? లక్షల్లో అప్పులు చేసి పిల్లల్ని చదివించారు. న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంచాలి.

– దాదా సలాం, గోదావరిఖని, 46వ ర్యాంకర్ తండ్రి

ఎప్పటికీ అశోక్‌నగర్‌లోనే ఉండాలా?

రాజకీయ నాయకులు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవద్దు. ఆరోపణలు విని మేము చాలా బాధపడుతున్నాం. 563 మంది రూ.3 కోట్లు చొప్పున ఇస్తే సుమారు రూ.1,700 కోట్లు అవుతుంది. అంత సొమ్ముఎక్కడి నుంచి వచ్చింది, ఎవరికి చేరిందనేది నిరూపించాలి. రూ.లక్షలు ఫీజులు కడుతూ ఎప్పటికీ అశోక్ నగర్‌లోనే ఉండాలా?

– పావని, ర్యాంకర్ తల్లి

రాజకీయం పార్టీలు చూసుకోవాలి

వారం రోజులుగా జరుగుతున్న వ్యవహారం మొత్తం చూస్తున్నాం. రూ.3 కోట్లు అంటూ ప్రచారం చేస్తున్నారు. పిల్లల భవిష్యత్తును నాశనం చేయొద్దు. అందరూ సహకరించాలి. రాజకీయం ఉంటే ఆయా పార్టీలు చూసుకోవాలి.

– జంగారెడ్డి, 159వ ర్యాంకర్ తండ్రి

నిందలు భరించలేకపోతున్నాం..

నా కొడుకు మూడు దసరాల నుంచి ఇప్పటివరకు ఒక్క దఫా కూడా మాతో లేడు. గతంలో ప్రిలిమ్స్‌లో అవకతవకలు జరిగాయన్నారు. ఈసారి మెయిన్స్ రాసి ర్యాంకు వచ్చినప్పుడు ఏమీ అనలేదు. తీరా జాబ్‌లో చేరే సమయంలో రాజకీయ నాయకుల స్వార్థాల కోసం విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారు. ఇదెంతవరకు సమంజసం? ఏమైనా సరే నిందలు వేయకండి. భరించలేకపోతున్నాం.

– లలిత, 67వ ర్యాంకర్ ఉదయ్‌కిరణ్ తల్లి

జీఎస్టీ రేట్ల తగ్గింపులో ప్రముఖ పాత్ర నాదే

రాష్ట్రానికి రూ.5వేల కోట్ల ఆదాయ నష్టం వస్తోంది

- అయినా పేద, మధ్యతరగతి, రైతాంగ వర్గాల కోసం భరిస్తున్నాం
- తగ్గుతున్న వస్తువుల ధరలను దుకాణాల ముందు ప్రదర్శించాలి
- ట్రేడర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: జీఎస్టీ రేట్ల తగ్గింపులో ప్రముఖ పాత్ర తనదేనని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. 'జీఎస్టీ రేట్ల సవరణ కోట్లాది మంది ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమం. జీఎస్టీ కౌన్సిల్ సభ్యునిగా ప్రజల పక్షాన నిర్ణయాలు తీసుకోవడంలో నేను ప్రముఖ పాత్ర పోషిస్తున్నా'అని ఆయన వెల్లడించారు. జీఎస్టీ రేట్ల సవరణతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.5 వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోతుందని, అయినా పేద, మధ్య తరగతి ప్రజలు, రైతుల శ్రేయస్సుకు ఆ నష్టాన్ని భరిస్తున్నామని స్పష్టం చేశారు. జీఎస్టీ రేట్ల సవరణ నేపథ్యంలో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో వ్యాపార వర్గాలతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో భట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల మేలు కోసం జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ జరగాలని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కేబినెట్ మొత్తం విధాన నిర్ణయం తీసుకుందన్నారు. సవరించిన రేట్లతో పెద్ద సంఖ్యలో వస్తువుల ధరలు తగ్గుతున్నాయని, ఈ ఫలాలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంతోపాటు వ్యాపారులందరిపై ఉందని చెప్పారు. రేట్ల సవరణ ద్వారా తగ్గిన వస్తువుల వివరాలు ప్రజలకు వ్యాపారులు తెలియజేయాలని, తగ్గిన ధరలను దుకాణాల ముందు ప్రదర్శించాలని కోరారు. జీఎస్టీ రేట్ల సవరణతో సిమెంటు ధరలు తగ్గుతాయని, ఈ కారణంగా నిర్మాణ రంగం ఊపందుకునే అవకాశాలుంటాయని చెప్పారు. పన్ను ఎగవేయాలని, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను అడ్డదారిలో కొట్టేయాలని కొందరు వ్యాపారులు చేసే ప్రయత్నాల వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందన్నారు. నిజాయితీగా వ్యాపారాలు చేసేవారు అడ్డదారులు తొక్కే వ్యాపారుల గురించిన సమాచారాన్ని అందించాలని కోరారు. వ్యాపార వర్గాలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ విషయంలో ఎప్పుడైనా ప్రభుత్వ ద్వారాలు తెరిచే ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎంఏ. రిజ్వీ, కమిషనర్ హరితతోపాటు బీమా, డెయిరీ, ఎలక్ట్రానిక్స్ రంగాలకు చెందిన వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

15 రోజుల్లో ఆదాయ పెంపు మార్గాలపై నివేదిక ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెంచడంలో భాగంగా అన్ని శాఖలను సమన్వయం చేసే బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీరియస్‌గా తీసుకోవాలని మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఆదాయ వనరుల సమీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం సచివాలయంలో సమావేశమైంది. భట్టి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఉపసంఘం సభ్యులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తోపాటు ఆర్థిక, వాణిజ్యపన్నులు, ఎక్సైజ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రవాణా, ఇతర ఆదాయార్జిత విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆదాయ పెంపుదలకు గల మార్గాలను అధ్యయనం చేసి 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి సర్కిల్‌వారీగా పన్నుల శాఖ ఆదాయాన్ని సమీక్షించాలని, రవాణా శాఖలో ఆదాయ లక్ష్యాలు చేరుకునేందుకు అవసరమైన ప్రత్యేక పాలసీని రూపొందించాలని భట్టి చెప్పారు.

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

మరో గత్యంతరం లేకే నిర్ణయం

- నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రకటన



వద్దిరాజు రాకేశ్

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు బుధవారం ఉదయం నుంచి నిలిచిపోనున్నాయి. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్ విజ్ఞప్తి చేసినా.. సేవల నిలిపివేతకే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో గత ఆగస్టు నుంచి ప్రభుత్వ స్పందన కోసం ఎదురు చూసినా ప్రయోజనం లేకపోవడంతో సేవలు నిలిపి వేయడం మినహా మరో గత్యంతరం లేకుండా పోయిందని అసోసియేషన్ అధ్యక్షుడు వద్దిరాజు రాకేశ్ ఒక వీడియో ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక సమస్యలతో పాటు ఆసుపత్రుల్లో సేవలకు సంబంధించి కూడా చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని మంత్రి, ఆరోగ్యశ్రీ సీఈవోలకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో 470 వరకు ఆసుపత్రులు ఉండగా వీటికి సంబంధించి రూ.1,400 కోట్ల బకాయిలు ఉన్నట్లు అసోసియేషన్ చెబుతోంది. తెల్లరేషన్‌కార్డు ఇవ్వగానే ఆస్పత్రుల్లో చేర్చుకునే ఆస్పత్రుల్లో సేవలు నిలిచిపోవడంతో పేదలు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. బిల్లుల బకాయిలను రాబట్టుకోవడం కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులు సేవలను బంద్ చేయడం ఈ ఏడాదిలో ఇది రెండో సారి. 2024 డిసెంబర్ నాటికి బకాయిలు రూ.1,000 కోట్లు దాటాయని పేర్కొంటూ జనవరి 10 నుంచి ఐదారు రోజులపాటు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపి వేశారు.

ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయొద్దు

ప్రైవేటు ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్ విజ్ఞప్తి

21 నెలల్లో రూ.1,779 కోట్లు బిల్లులు చెల్లించినట్లు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పేదల వైద్య సేవలను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యశ్రీ సేవలను యథావిధిగా కొనసాగించాలని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. బిల్లుల బకాయిలు చెల్లించలేదనే కారణంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ఇప్పటికే అల్టిమేటం ఇచ్చింది. ఈ నేపథ్యంలో వైద్య సేవల నిలిపివేత నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఉదయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతోపాటు, గడిచిన 21 నెలల్లో రూ.1,779 కోట్లను హాస్పిటళ్లకు ప్రభుత్వం చెల్లించిందని ఆయన వెల్లడించారు. అలాగే 1,375 వైద్య చికిత్సల చార్జీలను సగటున 22 శాతం పెంచినట్లు తెలిపారు. చార్జీల పెంపు, కొత్త ప్యాకేజీల చేర్పుతో ప్రభుత్వంపై అదనంగా రూ.487.29 కోట్ల భారం పడిందని చెప్పారు. ప్రస్తుతం ఆస్పత్రులకు నెలకు రూ.95 కోట్లు చెల్లిస్తున్నామని, దానిని రూ.100 కోట్లకు పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించిందని ఉదయ్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో సేవల నిలిపివేత నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు.

నేడు.. రేపు కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు

చాలాచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అనేక జిల్లాల్లో మరో రెండు రోజులు భారీ వర్షాలు, చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. బుధవారం 7 జిల్లాల్లో, గురువారం మరో 4 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, రైతులు పంటలపై పిచికారీలు చేయొద్దని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త పి.లీలారాణి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం బుధ, గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో చాలాచోట్ల, ఆ తర్వాత రెండు రోజుల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 27 నుంచి 32 డిగ్రీల సెల్సియస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 20 నుంచి 25 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు కావొచ్చన్నారు.

- బుధవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.
- గురువారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురవొచ్చన్నారు.
- తర్వాత మూడు రోజులు కూడా అన్ని జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలుల కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆమె తెలిపారు.
- బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట పొలాల్లో మందులను పిచికారీ చేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలని డా.లీలారాణి రైతులకు సూచించారు.

రేగోడ్‌లో దంచికొట్టిన వాన



నీట మునిగిన వరి పంట

రేగోడ్(మెదక్): మెదక్ జిల్లా రేగోడ్ మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు వర్షం దంచికొట్టింది. రాష్ట్రంలోనే ఇక్కడ అత్యధికంగా 12.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. కల్వర్టులపై వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రేగోడ్, జగిర్యాల, టి.లింగంపల్లి, మర్పల్లి తదితర గ్రామాల్లో పలు ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు నానా తంటాలు పడ్డారు. పత్తి, వరి పంటలు నీట మునగడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి ఎన్నికపై విచారణ

నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీగా వెంకట్రామిరెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. 2021 నవంబర్‌లో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో ఎమ్మెల్యే కోటాలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా మాజీ ఐఏఎస్ వెంకట్రామిరెడ్డి ఎన్నికైన విషయం విదితమే. ఈ ఎన్నిక చట్టవిరుద్ధమంటూ జగిత్యాల జిల్లాకు చెందిన జె.శంకర్‌తోపాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. '2007 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ వెంకట్రామిరెడ్డి 2021, నవంబర్ 15 వరకు అధికారిగా కొనసాగారు. బీఆర్ఎస్ పార్టీలో చేరే ఉద్దేశంతో ఆల్ ఇండియా సర్వీసెస్ (డెత్–కమ్–రిటైర్‌మెంట్ బెనిఫిట్స్) రూల్స్‌లోని రూల్ 16 (2ఏ) ప్రకారం స్వచ్ఛంద పదవీ విరమణ నోటీసు సమర్పించారు. కానీ దీనిపై నిర్ణయం తీసుకునే అధికారం ఉన్న కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డీఓపీటీ)కి పంపలేదు. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 6(1) ప్రకారం వెంటనే అతన్ని అనర్హుడిగా ప్రకటిస్తూ.. ఎన్నికను రద్దు చేయాలి'అని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ నంబర్ కేటాయించేందుకు రిజిస్ట్రీ నిరాకరించింది. ఫైలింగ్ నంబర్‌పై సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టి విచారణ నంబర్‌ను కేటాయించాలని ఆదేశించింది.

జైళ్ల శాఖ సిబ్బందికి సీఎం అభినందన



7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీమీట్-2025 విజేతలతో సీఎం రేవంత్‌రెడ్డి, అధికారులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 11 వరకు 7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీమీట్–2025ను విజయవంతంగా నిర్వహించడంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. పోటీల్లో మొత్తం 133 పతకాల్లో 28 (21 బంగారు, 4 రజతం, 3 కాంస్యం) పతకాలు కైవసం చేసుకున్న తెలంగాణ జైళ్లశాఖ డీజీ సౌమ్యామిశ్రా, ఇతర అధికారులు, సిబ్బందిని సీఎం అభినందించారు. కార్యక్రమంలో హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, ఐజీ మురళి బాబు, వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్, ఎస్పీలు శివ కుమార్ గౌడ్, కళాసాగర్, డ్యూటీ మీట్ పోటీ విజేతలు పాల్గొన్నారు.

విద్యా విధానంపై సీఎం సమీక్ష నేడు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యా విధానంపై బుధవారం ముఖ్యమంత్రి సమీక్షించనున్నా రు. దీనిపై ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయడం తెలిసిందే. ఈ కమిటీ తొలిసారి భేటీ అవుతోంది. కొత్త బోధన ప్రణాళిక, నైపుణ్యంతో కూడిన విద్య, పాఠశాల స్థాయి నుంచే కృత్రిమ మేధ వినియోగం, ఆధునిక సాంకేతికతతో బోధన తదితర అంశాలతో తెలంగాణకు కొత్త విద్యా విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కమిటీ అక్టోబర్ 31లోగా ప్రభుత్వానికి నివేదిక అందజేయాల్సి ఉంటుంది. వివిధ వర్గాల అభిప్రాయాలను తెలుసుకుని, ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అమల్లో ఉన్న సరికొత్త బోధన విధానాలను కమిటీ అధ్యయనం చేస్తుంది.

మత్తయ్యను విచారించాల్సిందే

- ఓటుకు నోటు కేసులో మత్తయ్య విచారణ కీలకం
- సుప్రీంకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం
- వచ్చే సోమవారానికి విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: ఓటుకు నోటు కేసులో ఏ4 ముద్దాయి జెరూసలేం మత్తయ్యను విచారించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం విన్నవించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మత్తయ్యపై 2016లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను తెలంగాణ హైకోర్టు క్వాష్ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అదే ఏడాది జూలై 6న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇదే సందర్భంలో ఈ కేసులో కీలక సాక్షిగా ఉన్న ఎల్విస్ స్టీఫెన్‌సన్ సైతం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లను మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి, ప్రతివాది మత్తయ్య తరఫున ప్రియాంక ప్రకాశ్ వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తులో భాగంగా మత్తయ్యను విచారించాల్సిన అవసరం మేనకా గురుస్వామి తెలిపారు. కేసు విచారణ ప్రాథమిక దశలో ఉండగానే మత్తయ్య పేరును ఎఫ్ఐఆర్ నుంచి తొలగించటం సరికాదన్నారు. అందువల్ల హైకోర్టు తీర్పును కొట్టివేయాలని కోరారు. మరోవైపు ఈ కేసులో అమికస్ క్యూరీగా తప్పుకుంటున్నట్లు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే ధర్మాసనానికి తెలిపారు. అందుకు అనుమతించిన బెంచ్, వచ్చే సోమవారం ఈ కేసును తిరిగి విచారిస్తామని తెలిపింది.

స్థానికత వర్తింపజేయడం లేదు

సుప్రీంకోర్టులో పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ స్థానికతకు సంబంధించిన కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైద్య విద్య ప్రవేశాల్లో స్థానిక కోటాకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు ప్రయోజనాన్ని తెలంగాణ ప్రభుత్వం కేవలం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకే వర్తింపజేస్తూ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు అన్యాయం చేస్తోందని పేర్కొంటూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. మంగళవారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ముందు పిటిషనర్ తరఫు న్యాయవాది ఈ విషయం ప్రస్తావించారు. కేసును శుక్రవారం విచారణ జాబితాలో చేర్చాలని అభ్యర్థించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది హాజరయ్యేలా చూడాలని సీజేఐ ఆదేశించారు.

అసలేంటీ వివాదం?: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో 'స్థానిక అభ్యర్థి' కోటాకు అర్హత సాధించాలంటే ఒక అభ్యర్థి తప్పనిసరిగా తెలంగాణలో వరుసగా 4 సంవత్సరాలు చదివి ఉండాలన్న 2017 నిబంధనలను సుప్రీంకోర్టు సెప్టెంబర్ 1న సమర్థించింది. అయితే రాష్ట్రం వెలుపల పనిచేసే అఖిల భారత సర్వీసులు లేదా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం సూచించిన సవరణను సుప్రీంకోర్టు అంగీకరించింది. దీని ప్రకారం బదిలీపై రాష్ట్రం వెలుపల పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, తెలంగాణ కేడర్‌కు చెందిన అఖిల భారత సర్వీసుల అధికారులు రాష్ట్రం వెలుపల పనిచేస్తున్నప్పుడు వారి పిల్లలకు మినహాయింపు లభించింది. అయితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు వర్తింపచేయడం లేదని పిటిషనర్ పేర్కొన్నారు.

'స్థానికత'పై వివరణ ఇవ్వండి

కాళోజీ వర్సిటీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో 'స్థానికత'నిబంధనలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని హైకోర్టు ఆదేశించింది. 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని సూచించింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. తెలంగాణకు చెందిన తనకు స్థానిక కోటాలో సీటు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ నీట్ ర్యాంకర్ శశికిరణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'శశికిరణ్ తల్లిదండ్రులు తెలంగాణలోనే ఉద్యోగం చేస్తున్నారు. ఒకటో తరగతి నుంచి 8 వరకు ఇక్కడే చదివిన అతను.. 9, 10, ఇంటర్ ఏపీలోని కోరుకొండ (ఆంధ్రప్రదేశ్) సైనిక్ స్కూల్‌లో చదివాడు. అయినా శశికిరణ్‌కు స్థానిక కోటాలో సీటు ఇచ్చేందుకు వర్సిటీ నిరాకరించింది. ఇది ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014లోని సెక్షన్ 95కు విరుద్ధం'అని నివేదించారు. వర్సిటీ నుంచి వివరాలు తెలుసుకుని చెప్పేందుకు సమయం కావాలని స్టాండింగ్ కౌన్సిల్ కోరడంతో ధర్మాసనం విచారణ వాయిదా వేసింది. తెలంగాణ వారు అయి ఉండి, కేంద్ర సర్వీస్‌లో భాగంగా మరోచోట ఉద్యోగం చేస్తున్న వారి పిల్లలకు స్థానిక కోటా సీటు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ మరో విద్యార్థి ఎం.సిద్ధార్థ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, పిటిషనర్ వద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని వర్సిటీని ధర్మాసనం ఆదేశించింది.

22 నుంచి బీ ఫార్మసీ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: బీ ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 22 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు సాంకేతిక విద్య కమిషనర్ ఎ.దేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. 22, 23 తేదీల్లో ఆప్షన్లు ఇవ్వొచ్చని, 25వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 26లోగా రిపోర్టు చేయాలని సూచించారు.



ఒకటి కాదు..
మల్టిపుల్ రిటైర్‌మెంట్స్ కావాలి

ఉద్యోగ విరమణ అనేది సాధారణంగా రిటైర్‌మెంట్ వయసు వచ్చినపుడు చేస్తారన్న విషయం తెలిసిందే. అయితే, రిటైర్‌మెంట్ అనేది ఉద్యోగ, వృత్తిగత జీవితానికి ముగింపు కాదని ఓ విరామం మాత్రమేనని నవ యువతరం బలంగా వినిపిస్తోంది. ఇప్పుడు వివిధ రకాల ఉద్యోగాల్లో, పని ప్రదేశాల్లో, ఇతరత్రా పరిస్థితులు వేగంగా మారిపోతున్న నేపథ్యంలో భారతీయులు మల్టీ రిటైర్‌మెంట్లకు మొగ్గుచూపుతున్న ధోరణి క్రమంగా పెరుగుతోంది.

బహుళ-పదవీ విరమణలు తీసుకోవాలనే ధోరణి వివిధ తరాలకు చెందిన వారిలో పెరుగుతుండగా.. యువ, మధ్య వయస్కుల్లో అధికంగా ఉంటోంది. హెచ్ఎస్‌బీసీ సంస్థ తాజాగా నిర్వహించిన 'క్వాలిటీ ఆఫ్ లైఫ్-అఫ్లూయెన్స్ ఇన్వెస్టర్ స్నాప్‌షాట్-2025' అధ్యయనంలో ఇలాంటి ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. భారత్ సహా 12 దేశాల్లో 10 వేల మందికి పైగా సంపన్న వయోజనుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా నివేదికను రూపొందించారు. ఇందులో జెన్‌జెడ్-మిల్లీనియల్స్ తరానికి చెందిన వారు రిటైర్‌మెంట్‌ను ఉద్యోగ అంతం లేదా విరమణగా చూడకుండా... విరామాలతో మళ్లీ కొనసాగించే పనిగా సూత్రీకరిస్తుండటం గమనార్హం. ఇలా తీసుకునే రిటైర్‌మెంట్‌లు మూడునెలల నుంచి ఏడాది దాకా ఉంటున్నాయి.

- సాక్షి, హైదరాబాద్

ముందు వరుసలో భారతీయులు

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఈ ధోరణిలో భారతీయులు ముందువరుసలో ఉండటం విశేషం. అయితే సంపన్న వర్గాల వారే మల్టీ-రిటైర్మెంట్స్‌ను ఎక్కువగా తీసుకుంటున్నారు. ఏదైనా ఉద్యోగం, వ్యాపారం లేదా పని చేసేవారు 55-60 ఏళ్ల వయసు వచ్చే దాకా ఆగకుండా నలభైల్లోనే ఈ రిటైర్‌మెంట్లు తీసుకుంటున్నారు. వర్క్-రిటైర్‌మెంట్-వర్క్ కల్చర్‌కే జెన్-జెడ్ (1997-2012 మధ్య జన్మించిన వారు), మిల్లీనియల్స్ (1981-96 మధ్య పుట్టిన వారు) ఓటు వేస్తున్నారు. డిజిటల్ మాధ్యమాల ప్రభావాల మధ్య పుట్టి పెరిగిన వారు కాబట్టి జెన్-జెడ్‌ను డిజిటల్ నేటివ్స్‌గానూ పరిగణిస్తున్నారు. జీవనశైలి, అభిరుచులు, అలవాట్లకు తగ్గట్టుగా మూడు నెలల నుంచి ఏడాది దాకా మినీ రిటైర్‌మెంట్ తీసుకుంటున్న వారే అధికంగా ఉంటున్నారు. ఇలా కెరీర్‌లో బ్రేక్ తీసుకోవడం ద్వారా తమ జీవనశైలిని మెరుగుపరుచుకునేలా రీచార్జ్ కావడంతోపాటు తమ అభిరుచులను మరింత గాఢంగా ఆస్వాదించేందుకు అవకాశం దొరుకుతుందని వీరు భావిస్తున్నారు. ఇలాంటి బ్రేక్‌ల వల్ల తమ వృత్తిగత జీవితం, కెరీర్, లైఫ్‌స్టైల్ మరింత మెరుగవుతుందనే భావనలో వారున్నారు.

సర్వేలోని ముఖ్యాంశాలు..

సగటున 44 ఏళ్ల వయసులో తొలి మినీ రిటైర్‌మెంట్ తీసుకోవాలనే భావనలో భారతీయులు ఉంటే.. ప్రపంచస్థాయి సగటు 47 ఏళ్లుగా ఉంది.

తమ జీవిత కాలంలో ఇలాంటి రిటైర్‌మెంట్ కనీసం ఒకటి తీసుకోవాలని భావిస్తున్న సంపన్న భారతీయులు 48శాతం.

ఇలాంటి విరామాలు 2, 3 తీసుకోవాలనే ఆలోచనతో ఉన్న భారతీయులు 44 శాతం. వీరిలో కొందరు ఆరేళ్లకోసారి బ్రేక్ తీసుకునేందుకు మొగ్గుచూపుతున్నారు.

మొత్తంగా 85 శాతం మంది మల్టీ రిటైర్‌మెంట్లకు సై అంటున్నారు. మల్టీ రిటైర్‌మెంట్‌తో తమ జీవనశైలిలో మంచి మార్పును గమనించినట్టు చెబుతున్నారు.

కనీసం ఒక చిన్న పదవీ విరమణ తీసుకున్న వారిలో 87% మంది తమ జీవితాన్ని సానుకూలంగా ప్రభావితం చేసిందన్నారు.

పిల్లలు, వృద్ధ తల్లిదండ్రులతో కూడిన కుటుంబసభ్యులతో నాణ్యమైన సమయాన్ని గడపడానికి 34 శాతం ఈ పద్ధతిని ఎంచుకుంటున్నారు.

బహుళ రిటైర్‌మెంట్లతో శారీరక, మానసిక, భావోద్వేగ పరమైన అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నవారు 31 శాతం.

నిర్దేశిత సెలవుల పరిమితులు లేకుండా ప్రయాణించడం, కొత్త ప్రదేశాలు, సంస్కృతులను అన్వేషించేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుంటామన్న వారు 30 శాతం.

ఇది తమ దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు, వ్యక్తిగత అభివృద్ధికి దోహదం చేస్తుందన్న వారు 28 శాతం.



కెరీర్ లక్ష్యాలను తిరిగి అంచనా వేయడానికి పని నుంచి విరామం తీసుకోవడం కొత్త అవకాశాలకు దారితీస్తుందని అంచనా వేస్తున్న వారు 25 శాతం.

వర్క్-రిటైర్‌మెంట్-వర్క్ కల్చర్‌కే జెన్-జెడ్ మిల్లీనియల్స్ ఓటు
- ఈ గ్లోబల్ ట్రెండ్‌లో ముందువరుసలో భారతీయులు
- జీవనశైలి అలవాట్లను మెరుగుపరుచుకునేందుకు మూడు నెలల నుంచి ఏడాది దాకా మినీ రిటైర్‌మెంట్
- హెచ్ఎస్‌బీసీ తాజా అధ్యయనంలో వెల్లడి

వర్క్-రిటైర్‌మెంట్-వర్క్ అంటే...

మొదట కొన్నేళ్లపాటు ఉద్యోగం, వ్యాపారం ఇతర వ్యాపకాలు చేసి 40-45 ఏళ్ల మధ్యవయసులో రిటైర్‌మెంట్ తీసుకుంటారు. విరామం అనేది అది కొన్ని నెలల నుంచి సంవత్సరం దాకా ఉండొచ్చు. తర్వాత మళ్లీ తిరిగి మరేదైనా ఉద్యోగం, వ్యాపారం వంటి దాన్ని ఎంచుకుంటారు.


కొత్త బాటలో..

"బహుళ పదవీ విరమణలను జీవనశైలి మెరుగు కోసం తీసుకుంటున్న వాటిగానే భావించాలి తప్ప సంప్రదాయ కెరీర్ విరామంగా కాదు. బహుళ-పదవీ విరమణలతో కొంతమంది తమ సంపదను కూడబెట్టుకునేందుకు సమయాన్ని వెచ్చిస్తున్నారు. తమ కుటుంబాల అవసరాలకు అనుగుణంగా కొత్త దిశలను ఎంచుకుంటున్నారు. -హెచ్ఎస్‌బీసీ అధ్యయనకర్తలు

అవినీతి అనకొండ

రూ.300 కోట్ల ఆస్తులు కూడబెట్టిన విద్యుత్ శాఖ ఏడీఈ

- హైదరాబాద్ సహా 10 ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ సోదాలు
- ఏడీఈ అంబేడ్కర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు; అరెస్టు



సోదాల సందర్భంగా ఏడీఈ అంబేడ్కర్

సాక్షి, హైదరాబాద్:
ఒక ఇంట్లో ఏకంగా రూ.2.18 కోట్ల నగదు..
బ్యాంకు ఖాతాల్లో రూ.77 లక్షలు..
కారులో రూ.5.5 లక్షలు..
హైదరాబాద్‌లో ఫ్లాట్లు, నివాస స్థలాలు, ఓ రసాయన పరిశ్రమ..
నల్లగొండలో వ్యవసాయ భూమి..
పెద్దమొత్తంలో బంగారు ఆభరణాలు..

విద్యుత్ శాఖ అధికారి అక్రమార్జన చూసి ఏసీబీ అధికారులే విస్తుపోయారు. సోదాల్లో పట్టుబడిన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.300 కోట్లకు పైనే ఉంటుందని అంచనా వేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. టీజీఎస్‌పీడీసీఎల్‌లో ఇబ్రహీంబాగ్ ఆపరేషన్స్ ఏడీఈ (అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్)గా ఉన్న ఈరుగు అంబేడ్కర్ ఆదాయానికి మించిన ఆస్తులు కల్గి ఉన్నట్టుగా అందిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారుల ప్రత్యేక బృందాలు మంగళవారం ఉదయం నుంచి సోదాలు చేపట్టాయి. అంబేడ్కర్ ఇల్లు, ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లు సహా మొత్తం 10 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించాయి. మంగళవారం రాత్రి వరకు సోదాలు కొనసాగగా.. అంబేడ్కర్ మార్కెట్ రేట్ ప్రకారం వందల కోట్ల విలువైన స్థిర, చరాస్తులతో పాటు పెద్ద మొత్తంలో నగదు, బంగారం కూడబెట్టినట్టు అధికారులు గుర్తించారు. అనంతరం ఆయన్ను అరెస్టు చేశారు. ఈ దాడులపై ఏసీబీ డీజీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అంబేడ్కర్ తన సర్వీస్‌లో పలు పనులకు సంబంధించి పెద్ద మొత్తంలో లంచాలు తీసుకున్నట్టు తెలిపింది.

10 ప్రాంతాల్లో 15 బృందాలు

రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌బాబు నేతృత్వంలో 15 ఏసీబీ బృందాలు హైదరాబాద్ ఖానామెట్‌లోని మాగ్నా లేక్ వ్యూ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నంబర్ 307లోని అంబేడ్కర్ నివాసంతో పాటు హైదరాబా ద్‌లోని పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, అలాగే మెదక్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలోని 10 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాయి. పటాన్‌చెరులోని అంబేడ్కర్ బినామీ ఇంట్లో తనిఖీ చేయగా రూ.2.18 కోట్ల నగదు పట్టుబడింది. శేరిలింగంపల్లిలో ఒక ఫ్లాట్, గచ్చిబౌలిలో జీప్లస్ 5 భవనం, హైదరాబాద్‌లోని పలు కీలక ప్రాంతాల్లో ఆరు నివాస స్థలాలు, పది ఎకరాల్లో అంబేడ్కర్ పేరిట ఉన్న ఒక కెమికల్ కంపెనీ (అమ్‌తర్), నల్లగొండ జిల్లా పెన్‌పహాడ్‌లోఒక వ్యవసాయ భూమి, రెండు కార్లు, బ్యాంకు ఖాతాల్లో 77 లక్షలు నగదు, పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, అంబేడ్కర్ కారులో రూ. 5.50 లక్షలు గుర్తించారు. ఏసీబీ సోదాలు మంగళవారం రాత్రి వరకు కొనసాగాయి.

సహకరించిన వారిపై చర్యలు

అంబేడ్కర్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో పూర్తి స్థాయి విచారణ అనంతరం మంగళవారం సోదాలు చేపట్టినట్టు ఏసీబీ రంగారెడ్డి రేంజ్ డీఎస్పీ ఆనంద్ మీడియాకు తెలిపారు. అంబేడ్కర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి అరెస్టు చేశామని చెప్పారు. దర్యాప్తు తర్వాత అంబేడ్కర్‌కు సహకరించిన వారిపై కూడా చర్యలు తప్పవని పేర్కొన్నారు.
– ఏసీబీ డీఎస్పీ ఆనంద్

ఇటీవలి కాలంలో కొన్ని భారీ అవినీతి కేసులు ఇలా..

- హెచ్ఎండీఏ ప్లానింగ్ మాజీ డైరెక్టర్, టీఎస్ రెరా కార్యదర్శి శివ బాలకృష్ణపై 2024 జనవరి 24న ఏసీబీ దాడులు నిర్వహించింది. రూ.100 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు గుర్తించింది.
- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మాజీ ఇంజనీర్-ఇన్-చీఫ్ మురళీధర్ రావును 2025లో జూలై 15న ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అరెస్టు చేసింది. హైదరాబాద్ (బంజారాహిల్స్), కరీంనగర్, జహీరాబాద్‌లో 10 చోట్ల చేసిన దాడుల్లో రూ.200 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించింది.
- కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 6, 7, 8లో పనిచేసిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్‌పై 2025 జూన్ 11న ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌లో పలు చోట్ల ఏసీబీ దాడులు నిర్వహించింది. రూ.70 కోట్ల విలువైన స్థిర, చరాస్తులు గుర్తించింది.
- కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఇంజనీర్-ఇన్-చీఫ్ (గజ్వేల్)గా, కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీగా పనిచేసిన భూక్య హరిరామ్‌ను ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో 2025లో ఏప్రిల్ 26న ఏసీబీ అరెస్టు చేసింది. రూ.200 కోట్లకు పైగా అక్రమాస్తులు గుర్తించింది.

క్లుప్తంగా...

అవినీతి తహసీల్దార్‌కు ఏడాది జైలు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి తహసీల్దారుగా పనిచేస్తూ.. 2011లో ఒక రైతు వద్ద పట్టాదారు పాసు పుస్తకం కోసం రూ.లక్ష లంచం డిమాండ్ చేసి ఏసీబీకి చిక్కిన శ్రీనివాసరాజుకు నాంపల్లి ఏసీబీ కోర్టు మంగళవారం ఏడాది జైలు శిక్ష విధించింది. రూ.25 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకుంటే మరో నెల రోజుల పాటు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం శ్రీనివాసరాజు సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో ఎలక్షన్ విభాగం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు.

బంగారం, రాగి అన్వేషణకు లైన్‌క్లియర్

లైసెన్స్ పత్రాలు స్వీకరించిన సింగరేణి సీఎండీ



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నుంచి లైసెన్స్ పత్రాలను అందుకుంటున్న సీఎండీ బలరామ్

కొత్తగూడెం అర్బన్: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కర్ణాటకలోని దేవదుర్గ ప్రాంతంలో బంగారం, రాగి అన్వేషణకు అనుమతి లభించింది. ఈ మేరకు జారీ అయిన లైసెన్స్ పత్రాలను కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు అందజేశారు. హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. గత మార్చిలో కేంద్ర గనుల శాఖ నిర్వహించిన కీలక ఖనిజాల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొని 37.75 శాతం రాయల్టీతో దేవదుర్గ ప్రాంతంలోని 199 చ.కి.మీ. విస్తీర్ణంలో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు అనుమతి దక్కించుకుంది.

మాదక ద్రవ్యాలను ఎలా గుర్తించాలి?

ఎక్సైజ్ అధికారులకు శిక్షణ

సాక్షి, హైదరాబాద్: తనిఖీలకు వెళ్లినప్పుడు ఏం చేయాలి? అనుమానిత ప్రదేశంలో దొరికిన పదార్థాలు, వస్తువులను ఎలా పరిశీలించాలన్న అంశంపై అవగాహన పొందేందుకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. డ్రగ్స్‌తో పాటు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు లభిస్తాయనే అనుమానం ఉన్న ప్రాంతాలకు తనిఖీలకు వెళ్లినప్పుడు.. డ్రగ్ కెమికల్స్, సింథటిక్ డ్రగ్స్‌ను ఎలా గుర్తించాల న్న అంశంపై ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం శిక్షణ నిర్వహించారు. డ్రగ్ కంట్రోల్ విభాగం అధికారి సి.హెచ్.కార్తీక్ చైతన్య ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖకు చెందిన టాస్క్ ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బందికి ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మావోయిస్టుల కాల్పుల విరమణ?

▶ మొదటి పేజీ తరువాయి

విడుదల జాప్యమైనట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని రేడియో లాంటి ప్రభుత్వ వార్తా సంస్థల ద్వారా గానీ, ఇంటర్నెట్ ద్వారా కానీ తెలిజేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే మావోయిస్టుల లేఖను పోలీసు వర్గాలు ధ్రువీకరించడం లేదు. అయితే లేఖలోని వాస్తవికతను పరిశీలించాల్సి ఉందని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం, హోం మంత్రి విజయ్ శర్మ చెప్పారు. బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ కూడా..మావోయిస్టుల లేఖలోని వాస్తవికతను, అందులోని అంశాలను పరిశీలిస్తున్నామని అన్నారు.

మెట్రో రైల్ ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్

- ప్రభుత్వ సలహాదారుడిగా ఎన్వీఎస్ రెడ్డి
- రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లు బదిలీ



ఎన్వీఎస్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడి (పట్టణ రవాణా)గా నియమితులయ్యారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పోస్టులో కొనసాగనున్నారు. ఆయన స్థానంలో మెట్రో రైల్ ఎండీగా హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. స్టడీ లీవ్ నుంచి తిరిగి వచ్చిన శ్రుతి ఓఝాను స్త్రీ, శిశు, దివ్యాంగ, వయోజనుల సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించి.. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి శ్రీజనను తప్పించారు. ఇంటర్మీడియెట్ విద్య డైరెక్టర్ కృష్ణ ఆదిత్యకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శిగా అదనపు బాధ్య తలు అప్పగించి.. ఈ పోస్టు అదనపు బాధ్య తల నుంచి కె.సీతాలక్ష్మిని తొలగించారు. హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ కోటా శ్రీవా త్సవను అదే సంస్థ జాయింట్ కమిషనర్ (జనరల్)గా బదిలీ చేయడంతోపాటు సంస్థ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

మాజీ సీఎస్ ఎస్‌కే జోషిపై చర్యలొద్దు

రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కా ళేశ్వరం ప్రాజెక్టుపై విచా రణ జరిపిన జస్టిస్ పినా కి చంద్రఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శైలేంద్ర కుమార్ జోషిపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేస్తూ, తదుపరి విచారణను అక్టోబర్ 7వ తేదీకి వా యిదా వేసింది. జస్టిస్ ఘోష్ నివేదికను రద్దు చేయాలని జోషి దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి వా దనలు వినిపిస్తూ.. కమిషన్ నివేదిక ఆధారంగా పిటిషనర్‌పై ఎటువంటి ప్రతికూల చర్యలు ఉండవని చెప్పారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ, ఇతర కేంద్ర సంస్థల నివేదికల ఆధారంగా మాత్రమే సీబీఐ విచా రణ చేస్తుందని విన్నవించారు. గత విచారణ సందర్భంగా ధర్మాసనం అడిగిన ప్రశ్నకు పిటిషనర్ తరఫు న్యాయవాది తరుణ్ జి.రెడ్డి సమాధానమిస్తూ.. వెబ్‌సైట్ నుంచి నివేదిక కాపీని డౌన్‌లోడ్ చేసుకున్నామని చెప్పారు.

డిజిటల్ ఇండియా లక్ష్యాలకు తెలంగాణ ఆదర్శం

- మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: టీ-వాలె ట్‌లోని ఇన్‌స్టంట్ మనీ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్)నే గేమ్‌ఛేంజర్‌గా మారిందని, డిజిటల్ ఇండియా లక్ష్యాలకు తెలంగాణ ఆదర్శంగా నిలు స్తోందని రాష్ట్ర ఐటీ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలి పారు. త్వర లో యూపీఐ, క్యూఆర్ కోడ్ ఆధారిత కొనుగోళ్లు, ఆటోమేటెడ్ బిల్ పేమెంట్ వంటి సేవలను ప్రారంభించనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. టీ-వాలెట్ ప్రారంభమై నప్పటినుంచి ఇప్పటివరకు రూ. 36 వేల కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయన్నారు. ఇప్పటివరకు 2.74 కోట్ల ఐఎంపీఎస్ లావాదేవీల ద్వారా రూ.16,765 కోట్లకు పైగా నిధులు బదిలీ అయ్యా యని తెలిపారు. టీ- వాలె ట్‌లో ఇప్పటివరకు 16.14 లక్షల మంది వినియోగ దారులు నమోదు చేసుకున్నారని, మొబై ల్, వెబ్, రాష్ట్రవ్యాప్తంగా 4,500 మీసేవా కేంద్రాలు, 11,000 ఫేర్ ప్రైస్ షాపుల ద్వారా 5.83 కోట్ల లావా దేవీలు జరిగాయన్నారు.

కొత్త డిస్కమ్‌కు గ్రీన్‌సిగ్నల్

▶ మొదటి పేజీ తరువాయి

రాత్రి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, జెన్‌కో ఎండీ హరీశ్‌రావు, సింగరేణి సీఎండీ బలరాం, డిస్కమ్‌ల సీఎండీలు ముషారఫ్, వరుణ్‌రెడ్డి, రెడ్‌కో చైర్మన్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితాలన్నీ కొత్త డిస్కమ్ పరిధిలోకి..

ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాలన్నీ కొత్త డిస్కమ్ పరిధి పర్యవేక్షణలోకి తేవాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యవసాయం, ఎత్తిపోతల పథకాలు, గ్రామీణ మంచినీటి సరఫరా, జీహెచ్ఎంసీ పరిధిలోని తాగునీటి సరఫరాను కొత్త డిస్కమ్ పరిధిలోకి తెచ్చేందుకు వీలుగా రూపొందించిన ప్రణాళికను సీఎంకు అధికారులు వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రెండు డిస్కమ్‌లు కమర్షియల్ ఆపరేషన్ విధులు నిర్వర్తిస్తాయని, కొత్త డిస్కమ్ ప్రభుత్వ పథకాలను పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఈ డిస్కమ్‌కు కావాల్సిన మానవ వనరులను రెండు డిస్కమ్‌ల పరిధి నుంచి తాత్కాలికంగా ఏర్పాటు చేయవచ్చని, కొంతమందిని తాత్కాలికంగా నియమించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో డిస్కమ్ ఏర్పాటుకు కావాల్సిన నిధుల సమీకరణపై ప్రభుత్వం చర్చించాల్సి ఉందని, కేబినెట్ ఆమోదం తర్వాత దీనిపై స్పష్టత ఇస్తామని సీఎం అన్నట్టు తెలిసింది. వీలైనంత త్వరగా కొత్త డిస్కమ్ ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులు ఇస్తామని అన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

రాజధానిలో అండర్ గ్రౌండ్ కేబుల్

రాష్ట్ర రాజధానితో పాటు, పరిసర జిల్లాల్లో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న వైనాన్ని అధికారులు సీఎంకు వివరించారు. భవిష్యత్తులో స్మార్ట్ టెక్నాలజీతో నడిచే ట్రాన్స్‌ఫార్మర్లు, కేబులింగ్ వ్యవస్థ అవసరాన్ని తెలియజేశారు. ఇతర దేశాల్లో అండర్ గ్రౌండ్ కేబుల్ విధానం అమలులో ఉందంటూ.. దీన్ని రాజధానిలోనూ తీసుకొచ్చేందుకు రూపొందించిన సమగ్ర నివేదికను ముఖ్యమంత్రికి అందజేశారు. ఎక్కువ స్థలం ఆక్రమించకుండా సబ్ స్టేషన్ల ఏర్పాటు విధానాన్ని ఇందులో ప్రస్తావించారు. ఆన్‌లైన్ విధానంలో సబ్ స్టేషన్లు, ఆధునిక టెక్నాలజీ ద్వారా వాటి పనితీరును గుర్తించే వ్యవస్థ గురించి వివరించారు. సబ్ స్టేషన్ సామర్థ్యానికి మించి విద్యుత్ కనెక్షన్లు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయాలను అదుపు చేయాలని సీఎం ఆదేశించారు.

అవినీతిపై ఓ కన్నేయండి

విద్యుత్ శాఖ అవినీతిమయమైందన్న ఆరోపణలు సర్వత్రా విన్పిస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నట్టు తెలిసింది. తాజాగా ఓ అధికారి ఏసీబీకి చిక్కడంపై ఆయన ఆరా తీశారు. విద్యుత్ సంస్థల్లో కీలకమైన అధికారులపైనా ఆరోపణలున్నాయని, ఆదాయానికి మించి ఆస్తులున్నట్టు ఏసీబీ అధికారులు తమ దృష్టికి తెచ్చినట్టు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శితో సీఎం అన్నట్టు తెలిసింది. ఏసీబీతో సమన్వయం చేసుకుని, అక్రమ ఆస్తులున్న వారి జాబితాను రూపొందించాలని ఆయన సూచించినట్లు సమాచారం. జెన్‌కోలో ఓ డైరెక్టర్ స్థాయి అధికారి అవినీతి వ్యవహారంపై సీఎం ప్రత్యేకంగా ఆరా తీసినట్టు తెలిసింది.

హైదరాబాద్‌లో 'బ్లాస్టింగ్'కు అనుమతి విధానమేంటి?

వివరాలివ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో అభివృద్ధి పనుల్లో భాగంగా పేలుళ్లకు అనుమతి ఇస్తున్న విధానాలపై పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం బ్లాస్టింగ్ జరుగుతోందా లేదా? అనేది ప్రధానం కాదు.. అనుమతి ఎలా ఇచ్చారన్నదే తేలాలని స్పష్టంచేసింది. జూబ్లీహిల్స్ నివాస ప్రాంతంలోని కొండరాళ్ల తొలగింపునకు రాత్రిపగలు పేలుళ్లు నిర్వహిస్తున్నారని పత్రికల్లో వచ్చిన కథనంపై విచారణ జరపాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్ లేఖ రాయగా, సుమోటో పిల్‌గా విచారణ చేపట్టేందుకు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఆదేశించిన విషయం విదితమే. ఈ పిల్‌పై సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ ముఖ్య నియంత్రణాధికారి, రెవెన్యూ నుంచి వచ్చిన ఎన్‌ఓసీని పరిశీలించి హైదరాబాద్ నగర పోలీసు చట్టం-1348 ఫస్లీ ప్రకారం పేలుళ్లకు పోలీస్ కమిషనర్ అనుమతిస్తారని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. బ్లాస్టింగ్‌లకు అనుమతి ప్రక్రియపై పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను గురువారానికి వాయిదా వేసింది. అనుమతులన్నీ తీసుకుని రక్షణ చర్యలతో బ్లాస్టింగ్‌లు చేపట్టామని, ఎవరూ తమపై ఫిర్యాదు చేయలేదని డీఎస్ఆర్ఎస్ఆర్ ప్రైమ్ స్పేసెస్ సంస్థ తరఫు న్యాయవాది చెప్పారు.

ట్రాన్స్‌జెండర్ల భవిష్యత్తుకు అండగా ప్రభుత్వం

- మెట్రో రైల్ లిమిటెడ్‌లో 20 మంది సెక్యూరిటీ గార్డులుగా నియామకం
- నియామక పత్రాలు అందజేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న ట్రాన్స్‌జెండర్ సెక్యూరిటీ గార్డులు

సాక్షి, హైదరాబాద్: ట్రా న్స్‌జెండర్ల భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎస్సీ, ఎస్టీ, మై నార్టీ, దివ్యాంగులు, ట్రా న్స్‌జెండర్ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భరో సా ఇచ్చారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో 20 మంది ట్రాన్స్‌జెండర్లకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌లో సెక్యూరిటీ గార్డులుగా నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డు నియామకాల కోసం 300-400 మంది దరఖాస్తు చేసుకోగా, నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేశామన్నారు. 'సమాజంలో గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో ఈ అవకాశం కల్పించాం. కష్టపడి పనిచేస్తే ట్రాన్స్‌జెండర్లకు మంచి భవిష్యత్తు ఉంటుంది. తాము ఏమాత్రం తక్కువ కాదని నిరూపించుకోవాలి' అని మంత్రి ఉద్బోధించారు. ఈ నియామకాలు 'బాధితులు' అన్న ముద్ర నుంచి 'భాగస్వాములు' అనే గౌరవప్రదమైన స్థాయికి తీసుకెళ్తాయని ఒక ట్రాన్స్‌జెండర్ తన అభిప్రాయం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ, ఎస్సీ డెవలప్‌మెంట్ విభాగం సీనియర్ ఐఏఎస్ అధికారి అనితా రామచంద్రన్, డిజేబుల్డ్ వెల్ఫేర్ డైరెక్టర్ శైలజ, ఎస్ఐఎస్ ఇండియా లిమిటెడ్ నిర్వాహకులు గిరిజష్ పాండే, ట్రాన్స్‌జెండర్లకు యూనిఫామ్‌లను స్పాన్సర్ చేసిన దీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్ ఫౌండర్ ముకుంద మాల, మౌంట్ ఫాంట్ సోషల్ ఇన్‌స్టిట్యూషన్ డైరెక్టర్ వర్గీస్ తెక్కనాథ్, ట్రాన్స్ వెల్ఫేర్ ఫౌండర్ వాసవి తదితరులు పాల్గొన్నారు.



ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా నిస్వార్థంగా ప్రజాసేవ చేసేవారి సంఖ్య పెరగాలి. వారి ఆదర్శవంతమైన భావాలు ప్రజలకు దారి చూపాలి. ప్రజా జీవితంలో మనిషి ఎలా ప్రవర్తించాలో చూపించటానికి వారి జీవితం ఒక నమూనా కావాలి.

– పెరియార్ ఇ.వి. రామస్వామి

సాక్షి

బుధవారం, 17 సెప్టెంబర్ 2025

ఉన్నంతలో ఉపశమనం

వివాదాస్పద వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు సోమవారం జారీచేసిన మధ్యంతర ఆదేశాలు అటు పిటిషనర్లకూ, ఇటు కేంద్ర ప్రభుత్వానికీ పాక్షిక ఉపశమనం ఇచ్చాయి. చట్టంపై మొత్తంగా స్టే విధించకపోవటం కేంద్రానికి సంతృప్తి కలిగిస్తే, కొన్ని కీలక నిబంధనల అమలును నిలిపేయటం విపక్షాలకూ, పిటిషనర్లకూ సంతోషాన్నిచ్చింది. అయితే ఈ కేసులో పిటిషనర్ అయిన ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ వంటివారు ఈ ఉత్తర్వులపై నిరాశ పడకపోలేదు. పిటిషనర్లలో ఒవైసీతోపాటు ఎంపీలు మహువా మొయిత్రా(టీఎంసీ), మనోజ్ కుమార్ ఝా(ఆర్జేడీ), జియావుర్ రహమాన్(కాంగ్రెస్) ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్, సీపీఐ కూడా చట్టాన్ని సవాలు చేశాయి. మొన్న ఏప్రిల్‌లో పార్లమెంటు ఆమోదించిన ఈ చట్టంపై మొత్తం 65 పిటిషన్లు దాఖలయ్యాయంటేనే ఇదెంత వివాదాస్పదమైనదో అర్థమవుతుంది. చట్టం రాజ్యాంగబద్ధమో కాదో ఈ ఉత్తర్వులు తేల్చలేదు. తుది తీర్పు ఆ అంశాన్ని పరిశీలిస్తుంది.

వక్ఫ్ ఆస్తులు దుర్వినియోగానికి గురవుతున్నాయనీ, ప్రభుత్వ ఆస్తులు, ప్రైవేటు ఆస్తులు ఆక్రమణకు గురవుతున్నాయనీ కేంద్రం భావించింది. వాటిని చక్కదిద్దే ఉద్దేశంతోనే సవరణలు తెచ్చామని చెప్పింది. ముఖ్యంగా రిజిస్టర్ కాకపోయినా నిరాటంకంగా వక్ఫ్ అధీనంలో ఉంటే ఆ ఆస్తులు దానికే చెందుతాయన్న (వక్ఫ్ బై యూజర్) భావనను ఈ చట్టం రద్దు చేసింది. ఇకపై వక్ఫ్ ఆస్తులకు లిఖిత పూర్వక దస్తావేజు ఉండి తీరాలని నిర్దేశించింది. సుప్రీంకోర్టు ఈ నిబంధనపై స్టే విధించేందుకు నిరాకరించింది. కొన్నేళ్లుగా ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురవుతున్నాయని చట్టసభ గుర్తించి, దాన్ని నివారించాలనుకోవటం ఏకపక్ష చర్య ఎలా అవుతుందని ధర్మాసనం ప్రశ్నించింది. అలాగే వక్ఫ్ ఆస్తులకు 1995 నాటి చట్టం ఒక ప్రత్యేక ప్రతిపత్తినిచ్చింది. దాని ప్రకారం వక్ఫ్ ఆస్తి దురాక్రమణకు గురైందని ఏ దశలో గుర్తించినా దాని స్వాధీనానికి వక్ఫ్ బోర్డు చర్యలు తీసుకోవచ్చు. తాజా సవరణ దీన్ని రద్దు చేయటాన్ని ధర్మాసనం సమర్థించింది. ఇతర ఆస్తులతో సమానంగా పరిగణించటం వివక్ష తొలగింపే అవుతుందని భావించింది.

అన్య మతస్థులు కనీసం అయిదేళ్లుగా ఇస్లాం ఆచరణలో ఉంటేనే వక్ఫ్‌కు ఆస్తులు దానం చేయొచ్చన్న నిబంధనపై ధర్మాసనం స్టే విధించటం ఒక రకంగా ఊరట. ఇస్లాం ఆచరణంటే ఏమిటో చట్టం వివరించకపోవటం, దాన్ని గుర్తించటానికి రాష్ట్ర ప్రభుత్వాలు ఖరారు చేసే నిబంధనలు, అందుకోసం ఏర్పాటయ్యే వ్యవస్థ సంగతి తేలేవరకూ ఈ నిబంధన నిలిచిపోతుంది. పౌరులు తమ ఆస్తిని ఎలా ఉపయోగించాలో నిర్ణయించుకునే హక్కు రాజ్యాంగంలోని 300వ అధికరణం ఇచ్చింది. అన్య మతస్థులు వక్ఫ్ బోర్డుకు ఆస్తులివ్వరాదన్న నిబంధన దీన్ని ఉల్లంఘించటం లేదా? తుది తీర్పులోనైనా దీన్ని పరిశీలించక తప్పదు. వివాదాస్పద ఆస్తులపై వక్ఫ్ బోర్డుకూ, ప్రభుత్వాలకూ తగువు ఏర్పడినప్పుడు కలెక్టర్ స్థాయి అధికారి నిర్ణయించవచ్చన్న నిబంధనపై ధర్మాసనం స్టే ఇచ్చింది. ఈ నిబంధనలో మరో వైపరీత్యముంది. అసలు అలాంటి విచారణ మొదలైన మరుక్షణమే అది వక్ఫ్ ఆస్తిగా పరిగణించటానికి వీల్లేదని చెబుతోంది. మొత్తానికి వివాదాలను ట్రిబ్యునల్స్ లేదా హైకోర్టులు మాత్రమే తేల్చాలనటం సరైన నిర్ణయం. అయితే వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులకు స్థానం కల్పించాలన్న నిబంధనను కొంత మార్పుతో అలాగే ఉంచటం సబబు కాదు. హిందూ, సిక్కు, క్రైస్తవ మతాలకు చెందిన సంస్థల్లో అన్య మతస్థులకు చోటు లేనప్పుడు, వక్ఫ్ బోర్డుల్లో మాత్రం ఎందుకుండాలి?

వక్ఫ్ చట్టంలో సమస్యలున్నాయి... సరిచేయమని కోరేవారిలో ఆ మతస్థులూ ఉన్నారు. అలా చేసే ముందు ముస్లిం మతాచార్యులతో, ముస్లిం పర్సనల్ లా బోర్డుతో మాట్లాడాలి. పార్టీల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలి. పార్లమెంటులో అలజడి రేగాక బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) ఏర్పాటు చేశారు సరే... కానీ విపక్షాల అభ్యంతరాలను పట్టించుకున్నారా? సమర్థమైన, లోప రహితమైన విధానాలు తీసుకురాదల్చుకుంటే స్వాగతించాల్సిందే. కానీ ఆ విషయంలో ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నించాలి. అటువంటి చర్య ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.ఏకాదశి రా.1.17 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పునర్వసు ఉ.9.38 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** సా.5.26 నుండి 7.00 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.31 నుండి 12.19 వరకు, **అమృత ఘడియలు:** రా.2.46 నుండి 4.18 వరకు, **మతత్రయ ఏకాదశి.**

సూర్యోదయం : 5.51
సూర్యాస్తమయం: 6.00
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఇది విమోచనమే!

అభిప్రాయం



సీహెచ్. విద్యాసాగర్ రావు

'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని ఎలుగెత్తిన సాహితీ యోధుడు స్వర్గీయ దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవం ఇటీవలే జరుపుకొన్నాం. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17ను 'విమోచన దినోత్సవం'గా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ ఏడాది కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా రానుండటం కోట్లాది తెలంగాణ రతనాలతో దాశరథికి నివాళులు అర్పించడమే అవుతుంది.

వీరులను స్మరించుకోవడానికి...

1998 సెప్టెంబర్ 17న హైదరాబాద్ నిజాం కాలేజీ మైదానంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించి, నాడు నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన సమర యోధులను సత్కరించి వారి సమక్షంలోనే సెప్టెంబర్ 17ను 'హైదరాబాద్ విమోచన దినం'గా ప్రకటించి, ప్రభుత్వమే అధికారిక ఉత్సవాలను నిర్వహించాలనీ, ప్రధాన కూడళ్లలో పోరాట యోధుల విగ్రహాలను ప్రతిష్ఠించాలనీ డిమాండ్ చేశాం. అది మొదలు బీజేపీ ఈ అంశంపై నిరంతరం ఉద్యమాలు చేస్తూనే ఉంది.

ఇకపై ప్రతి ఏడాది సెప్టెంబర్ 17న 'హైదరాబాద్ విముక్తి దినం' నిర్వహించేందుకు భారత ప్రభుత్వం నిర్ణయించిందంటూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2024 మార్చ్ 12న ఒక గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ''1947 ఆగస్ట్ 15న భారతదేశం స్వాతంత్ర్యం పొందిన 13 నెలల వరకూ హైదరాబాద్‌కు స్వేచ్ఛ లభించలేదు. అది నిజాం పాలనలో ఉంది. 'ఆపరేషన్ పోలో' పేరిట పోలీస్ చర్య తర్వాత 1948 సెప్టెంబర్ 17న ఈ ప్రాంతం నిజాం పాలన నుండి విముక్తి పొందింది. అయితే, సెప్టెంబర్ 17ను 'హైదరాబాద్ విముక్తి దినం'గా జరపాలని ఈ ప్రాంత ప్రజల నుండి డిమాండ్ ఉంది. ఇప్పుడు హైదరాబాద్‌ను విముక్తి చేసిన మర వీరులను స్మరించుకోవడానికీ, యువత మనస్సులో దేశభక్తి జ్వాలను నింపడానికీ, ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న 'హైదరాబాద్ విముక్తి దినం' జరుపుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది'' అని ఆ గెజిట్‌లో పేర్కొన్నారు.

అసంబద్ధమైన పేర్లు

గతంలో హైదరాబాద్ సంస్థానంలో ఉండి... మహారాష్ట్ర, కర్ణాటకల్లో కలిసిన జిల్లాల్లో ఆ ప్రాంత ప్రజల ఒత్తిడి మేరకు అక్కడ విమోచన ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నారు. 2001 నుంచి మహా రాష్ట్రలో, 2009 నుంచి కర్ణాటకలో అక్కడి ప్రభుత్వాలు అధికారిక విమోచన ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి. ఈ నిర్ణయాలు తీసుకున్నవి అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాలే కావడం విశేషం.

తెలంగాణలో మాత్రం ప్రజలు ఎన్ని ఉద్యమాలు చేసినా ప్రభుత్వాలు మాత్రం అధికారికంగా విమోచన ఉత్సవాలు నిర్వహించేది లేదని భీష్మించుకు కూచున్నాయి. కేంద్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో చివరకు ఒక మెట్టు దిగి గత మూడు సంవత్సరాలుగా అధికారిక వేడుకలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ వేడుకలను 'విమోచన దినోత్సవం'గా కాకుండా 'జాతీయ సమైక్యతా దినోత్సవం', 'ప్రజా పాలనా దినోత్సవం' అంటూ సంబంధం లేని పేర్లతో సెప్టెంబర్ 17 ఉద్దేశ్యాన్ని నీరుగార్చడం ఆశ్చర్యం కలిగిస్తోంది. భారత రాజ్యాంగం స్వభావ రీత్యా సమాఖ్యగా ఉన్నా... ఆత్మ ఒక్కటే అని సాధారణంగా చెప్పుకొంటాం. అందుకే, రాజ్యాంగంలో ఈ దేశాన్ని 'రాష్ట్రాల సమాఖ్య'గా పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం గెజిట్ ప్రచురించి సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో అధికారిక వేడుకలు నిర్వహిస్తుంటే... దానికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం వేరే పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించడం అసంబద్ధంగా ఉంటుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

1947లో భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి హైదరాబాద్ సంస్థానం దేశంలోని సంస్థానాల్లో చాలా పెద్దది. బ్రిటిష్ అండదండలతో అరాచకాలు సాగిస్తున్న నిజాం నవాబుపై తెలంగాణ ప్రజలు పోరాటాన్ని ఉద్ధృతం చేశారు. మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావుతో పాటు ఎంతో మందిని ఉస్మానియా యూనివర్సిటీ నుండి బహిష్కరిస్తే ఇతర రాష్ట్రాల్లో చదువు కొనసాగించి విద్యావంతులుగా విలసిల్లారు. పరకాల, బైరాన్‌పల్లిల్లో వెలుగు చూసిన దారుణ కృత్యాలు హైదరాబాద్ సంస్థానంలో అడుగడుగునా జరిగాయి.

తెలంగాణ విమోచన కోసం ఆనాడు ప్రతి గ్రామంలో పోరాటాలు జరిగాయి. అతి సామన్యులైన మహిళలు, పురుషులు దృఢ చిత్తంతో సైనికులై పోరాడిన ఘటనలు కోకొల్లలు. వారి త్యాగాలు అనన్య సామాన్యం, అనితర సాధ్యం. రాబోవు తరాలకు వారి చరిత్ర ప్రేరణ దాయకం. ఒళ్లగగుర్పొడిచే సాహస ఘట్టాలెన్నో ఉద్యమ చరిత్రలో కనిపిస్తాయి. ఆ ప్రజా పోరాటమే పోలీసు చర్యకు మార్గం సుగమం చేసింది. అందుకే 1948 సెప్టెంబర్ 17 'హైదరాబాద్ విమోచన పొందిన రోజు' తప్ప మరొకటి కాదు. కేంద్ర ప్రభుత్వం విమోచన దినంగా అధికారిక ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా విమోచన దినంపేరిట రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహించి, అమర వీరులకు నివాళులు అర్పించాల్సిన బాధ్యత ఉంది.

సెప్టెంబర్ 17న హైదరాబాద్ విముక్తి దినం' జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయినా తెలంగాణ ప్రభుత్వాలు 'జాతీయ సమైక్యతా దినోత్సవం', 'ప్రజా పాలనా దినోత్సవం' అంటూ సెప్టెంబర్ 17 ఉద్దేశ్యాన్ని నీరుగార్చడం ఆశ్చర్యం కలిగిస్తోంది.


వ్యాసకర్త మహారాష్ట్ర మాజీ గవర్నర్

1948 సెప్టెంబర్ 17 : హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో భాగమైన రోజు



ఇదెలా విముక్తి?

విశ్లేషణ



నిఖిలేశ్వర్

నిజాం హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబర్ 17న ఇండియన్ యూనియన్‌లో విలీనమైన తర్వాత, కాలగతిలో 77 ఏళ్లు కలిసిపోయాయి. ఏటా ఈ రోజును 'విలీన దినోత్సవం'గా గుర్తు చేసుకుంటున్నాము. అయినా ప్రతి సంవత్సరం రాజకీయంగా ఈ రోజు 'విముక్తా', 'విలీనమా', 'విద్రోహమా' అనే మీమాంస కొనసాగుతూనే ఉంది. ఎవరికి వారు తమ రాజకీయ ప్రయోజనాల కోసం, చారిత్రక వాస్తవాలను దాటవేస్తున్నారు. అసలు ఆనాడే నిజాం లొంగిపోయి, సర్దార్ వల్లభ్ భాయి పటేల్ ముందు చేతులు జోడించి నమస్కరించి, తన రాజ్యాన్ని 'విలీనం' చేసిన నిజాన్ని విస్మరిస్తున్నారు.

ఆర్య సమాజీయులు, ఆరెస్సెస్ శ్రేణులు నిజాంను గద్దె దింపి, ముస్లింలను ఓడించిన దినమనీ, ఒక 'విముక్తి దిన'మనీ ఈ రోజు దాకా ప్రచారం చేస్తూనే ఉన్నారు. తెలంగాణలోని ఆనాటి ప్రజల తిరుగుబాటునూ, రైతాంగ సాయుధ పోరాటాన్నీ హిందూ–ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రిస్తున్నారు. కానీ మరో విధంగా చరిత్ర చెబుతున్నది. ఆనాటి ఆ పోరాటం... ఖాసిం రజ్వీ రజాకార్ల మూకలకూ, నిజాం నవాబుకూ, కులీన హిందూ భూస్వాములకూ, దేశ్‌ముఖ్‌ల పెత్తనానికీ వ్యతిరేకంగా సాగిన 'ప్రజాయుద్ధం!'

రెచ్చగొట్టేందుకే...

తెలంగాణలో రాజ్యాధికారాన్ని సాధించే దిశలో ఆనాటి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ, ఫ్యూడల్ నిజాం రాజ్యానికి వ్యతిరేకంగా రైతాంగాన్ని సమీకరించింది. కాంగ్రెస్ అనుయాయులు, ఆర్యసమాజీయులు వంటి వారు తమ తమ పద్ధతుల్లో తిరుగుబాటు చేశారు. తెలుగు భాష, సంస్కృతి పునరుద్ధరణలో 'ఆంధ్ర మహాసభ' చారిత్రక కర్తవ్యాన్ని నిర్వహించింది.

కొన్ని కమ్యూనిస్టు విప్లవ గ్రూపులు ఈ విలీన దినాన్ని 'విద్రోహ' దినమని వాదిస్తున్నాయి. కమ్యూనిస్టు పార్టీలో అతివాద – మితవాద పంథాల మధ్య సాగిన ఆనాటి అఖిల భారత స్థాయి చర్చలను అర్థం చేసుకోగలిగితే, అనివార్యంగా ఆనాటి సాయుధ రైతాంగ పోరాటాన్ని విరమించవలసిన పరిస్థితులను గ్రహించగలం. ఆ తర్వాత 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు, ఎంతో అభిమానంతో అత్యధిక సీట్లతో కమ్యూనిస్టు పార్టీని గెలిపించారు.

ఇక 'విముక్తి' పేరుతో మత విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాల్లో భాగంగా, సెప్టెంబర్ 17ను భారతీయ జనతా పార్టీ తన రాజకీయ అవసరాలకు, ప్రజా ఆకర్షక ఓట్ల కోసం ఉపయోగించుకుంటున్నది. ఆనాటి నిజాం శాసనాన్ని వదిలించుకొన్నప్పటికీ... రాజకీయం రంగులు మారినా తెలంగాణ ప్రజలు ఆధిపత్య కులాల, భూస్వామ్య పెత్తందార్ల ఆధిపత్యాన్నీ, కులవివక్షనూ, పీడననూ భరిస్తూనే ఉన్నారు కదా! మరి వారికి రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం లభించనపుడు అది 'విముక్తి' ఎలా అవుతుంది?

1971లో ఖండేరావు కులకర్ణి హిందీలో 'హైద్రాబాద్ – ముక్తి సంగ్రామ్' శీర్షికన నిజాం వ్యతిరేక ప్రజాపోరాటాన్ని ఆర్య సమాజ్ దృష్టితో రచించారు. 1971–75 మధ్య ఖండే రావు రాసిన ఆ వ్యాసాలను నేను 'హైద్రాబాద్ అజ్ఞాత చరిత్ర పుటలు' అనే శీర్షికన తెలుగులో అనువదించాను. ఆ రచన మరాఠీ, ఇంగ్లీషుల్లో కూడా అనువదించబడింది. ఆనాటి చారిత్రక పోరాట కాలాన్నీ, తదుపరి పరిణామాలనూ సాకల్యంగా తెలుసుకోవాలనుకొంటే కామ్రేడ్స్ రావినారాయణరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు రచించిన గ్రంథాలనూ చదవవలసి ఉంటుంది.

'యూనియన్' హింస

ఏడవ నిజాం కాలంలో తెలంగాణలోని హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ లాంటి కొన్ని పట్టణాలు తప్ప అత్యధిక గ్రామాలు ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. విద్య, వైద్యం అందుబాటులో లేవు. కొందరు భూస్వాములు – దొరలు శాసించిన ఆ గ్రామాల్లో దోపిడీ, దౌర్జన్యాలు కొనసాగాయి. వాటికి తోడుగా నల్లగొండ జిల్లాలోని భువనగిరి చుట్టుపక్కల పల్లె పోరాటాల్లో ఖాసిం రజ్వీ అనుచరుడు ఛోటే మియా నాయకత్వాన రజాకార్లు చేసిన దోపిడీలు, లైంగిక దాడులను చరిత్ర నమోదు చేసింది. నా బాల్యంలో నేను స్వయంగా వీరెల్లి, కాటేపల్లి, చాడ మూర్తిరెడ్డి గూడెం గ్రామాల్లో రజాకార్ల దౌర్జన్యాలను చూశాను. మా బంధువులతోపాటు గడ్డివాముల్లో ప్రాణ రక్షణ కోసం దాగిన రోజులు గుర్తుకొస్తున్నాయి.

నిజాం హైద్రాబాద్ విలీనం తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పాలన కొనసాగింది. 1948–52 మధ్య కాలంలోనే ఇండియన్ యూనియన్ సైన్యాలు నెహ్రూ–పటేల్ ఆదేశాలతో తెలంగాణ–ఆంధ్ర ప్రాంతాల కమ్యూనిస్టు నాయకులను, అనుయాయులను 'వెంటాడి', చిత్రహింసలు పెట్టి ఎన్‌కౌంటర్లు చేశాయి. చాలామందిని జైల్లో పెట్టారు.


మొత్తం మీద... చరిత్ర నిర్మాతలైన సామాన్య ప్రజలు– ముస్లిం సోదరులతో సహా ఆనాటి దోపిడీ, హింసాకాండలను విప్లవ ప్రతిహింసతో ప్రతిఘటించి, ప్రపంచ విప్లవ విముక్తి పోరాటాల చరిత్రలో నిలిచిపోయారు.

రాజకీయం రంగులు మారినా తెలంగాణ ప్రజలు ఆధిపత్య కులాల, భూస్వామ్య పెత్తందార్ల ఆధిపత్యాన్నీ, కులవివక్షనూ, పీడననూ భరిస్తూనే ఉన్నారు కదా! మరి వారికి రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం లభించనపుడు అది 'విముక్తి' ఎలా అవుతుంది?

వ్యాసకర్త కవి, సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత । 91778 81201

యోధులకే చరిత్రలో స్థానం లేదా?

అభిప్రాయం



కూనంనేని సాంబశివరావు

భారతదేశానికి స్వాతంత్ర్యం 1947 ఆగస్టు 15న రాగా, ఆనాటి హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబర్ 17న భారతదేశంలో 'విలీన'మైనది. ఆ చారిత్రక ఘట్టాన్ని గుర్తించడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి ప్రభుత్వాలు గానీ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అధికారంలోకి వచ్చిన అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం గానీ, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గానీ ఎందుకు వెనుకంజ వేశాయో తెలుసుకోవాల్సిన అవసరం తెలంగాణ ప్రజలకు ఉన్నది.

మాటెందుకు మార్చారు?

తెలంగాణ రాష్ట్ర అవతరణకు ముందు విలీన ఉత్సవాన్ని అధికారికంగా ఎందుకు జరపడం లేదని అప్పటి ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోసిన ఆనాటి ఉద్యమ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు, తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవంగా అధికారికంగా ప్రకటిస్తామని పదేపదే చెప్పినది వాస్తవమా, కాదా? తెలంగాణ ఏర్పాటు తర్వాత మొదటి ముఖ్యమంత్రిగా కేసీఆర్ 2021 నుంచి 'సమైక్యతా దినోత్సవం' పేరుతో తెలంగాణ వీర చరిత్రను కనుమరుగయ్యేలా చేయడం ఎందుకో చెప్పగలరా? కేసీఆర్‌ను, ఆయన ప్రభుత్వాన్ని నిందించిన కాంగ్రెస్... రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత సమైక్యతా దినోత్సవం పేరు మార్చి 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం'గా జరపాలని నిర్ణయించడం వెనుక కారణమేమిటో ప్రజలకు చెప్పాలి. ఆనాటి పోరాటంలో ఇసుమంత పాత్ర లేని ఆర్ఎస్ఎస్ గానీ, ఈనాటి బీజేపీ గానీ ఓట్ల రాజకీయాల్లో పవిత్ర పోరాటానికి మతం రంగు పులిమే దుస్సాహసానికి పాల్పడటం వాస్తవం కాదా?

వాస్తవాలు విస్మరిస్తారా?

హైదరాబాద్ సంస్థాన రాజు ముస్లిం అయినప్పటికీ జమీందారులు, జాగీర్దారులు, భూస్వాములు దాదాపు 90 శాతం మంది హిందువులే అన్నది వాస్తవం కాదా? తెలంగాణ భూస్వామ్య ముస్లింలు కేవలం 2,000 కుటుంబాలే కాగా, పేద ముస్లింలు లక్షలాది మంది ఉన్నారు. ప్రసిద్ధ జర్నలిస్టు, ముస్లిం విద్యావంతుడైన షోయబుల్లా ఖాన్‌ను క్రూరంగా చంపింది ముస్లింలు అయిన రజాకార్లు కాదా? ముస్లిం అయినా షేక్ బందగీని



◆ కమ్యూనిస్టులంటే ఎంత వ్యతిరేకత ఉన్నా చరిత్రను చరిత్రలా చూడాలి కదా! తెలంగాణ వీర పోరాటాన్ని గుర్తించకపోవడమంటే ఆనాటి అమరులు 4,000 మందిని అవమానించడం కాదా?

చంపినది నిజాం అండ ఉన్న విసునూరు రామచంద్రారెడ్డి కాదా? నిజాంకు ఎదురు తిరిగిన విద్యావంతుడైన అల్లావుద్దీన్‌ను చంపింది రజాకార్లు కాదా? పేద వ్యవసాయ కూలీ అయిన దొడ్డి కొమరయ్యను చంపింది హిందువైన విసునూరు రామచంద్రారెడ్డి కాదా? నిజాం రాక్షస పాలనకు వ్యతిరేకంగా హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తి చేసి భారతదేశంలో విలీనం కావాలనే డిమాండ్‌తో 1947 సెప్టెంబర్ 11న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్‌లలో మఖ్దూం ముస్లిం కాదా?

సర్దార్ వల్లభాయ్ పటేల్ ముందు లొంగిపోయిన నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌ను యుద్ధ ఖైదీగా చూడవలసిన ఆనాటి కేంద్ర ప్రభుత్వం ఆయనకు 'రాజ ప్రముఖ్' హోదాను, సంవత్సరానికి కోటి రూపాయల భరణాన్ని ప్రకటించడమే కాకుండా రజాకార్ల సైన్యాధికారి ఖాసిం రజ్వీని పాకిస్తాన్ వెళ్లిపోవడానికి అనుమతించలేదా? దీనిని హిందూ–ముస్లిం పోరాటం అంటారా! చీకట్లో కుదిరిన ఒప్పందం అంటారా? కమ్యూనిస్టుల పోరాట విరమణ తర్వాత కూడా కమ్యూనిస్ట్ పార్టీపై నిషేధం ఉండటం, అనేకమంది నాయకులు జైళ్లలో ఉన్నందువల్ల, వారి పేర్లు ఓటర్ల లిస్టులో లేకపోవడం వల్ల 'పీడీఎఫ్' పేరుతో కొన్ని స్థానాలలోనే పోటీ చేసినప్పటికీ... తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ 36 స్థానాలను గెలవగా, అన్ని స్థానాలలో పోటీ చేసిన కాంగ్రెస్ 38 స్థానాల్లో మాత్రమే గెలవడం చరిత్ర కాదా? నెహ్రూ కంటే రావి నారాయణరెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిచినది చరిత్ర కాదా? ఇటువంటి వీరోచిత చరిత్రను కనుమరుగు చేయడం క్షమార్హమేనా? కమ్యూనిస్టులంటే ఎంత వ్యతిరేకత ఉన్నా చరిత్రను చరిత్రలా చూడాలి కదా! తెలంగాణ వీర పోరాటాన్ని గుర్తించకపోవడమంటే ఆనాటి అమరులు 4,000 మందిని, మొత్తంగా తెలంగాణ సమాజాన్ని అవమానించడం కాదా?

సెప్టెంబర్ 17ను అధికారికంగా విలీన దినోత్సవంగా గుర్తిస్తే పాలకులను చరిత్ర క్షమిస్తుంది. లేకుంటే వారు చరిత్ర గుయ్యారంలోకి నెట్టి వేయబడతారు.

వ్యాసకర్త కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

ఉవ్వెత్తున ఎగసిన ప్రజా ప్రతిఘటన

సందర్భం



జూలకంటి రంగారెడ్డి

ఆనాటి వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగింది భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం. తెలంగాణ సాయుధ పోరాటం అమోఘమైన విజయాలను, అనుభవాలను అందించింది. నేటికీ స్ఫూర్తినీ, చైతన్యాన్నీ రగిలిస్తూనే ఉంది. 77వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలు సెప్టెంబర్ 10 నుండి 17 వరకు జరుపుకొంటున్న సందర్భంగా ఆనాటి వీరుల త్యాగాలను, చరిత్రను తెలుసుకోవాలి.

ఆ గడీ నుంచే మొదలు...

ప్రపంచంలోకెల్లా అత్యంత సంపన్నుడు నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్. నిజాం ఎస్టేట్ దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు, జాగీర్దార్లు, జమీందార్లు, అమీన్లు, భూస్వాములు నిజాం దోపిడీకి మూల స్తంభాలు. వీళ్ళ చేతిలో లక్షలాది ఎకరాల భూమి ఉండేది. ప్రజలు కేవలం వెట్టి చేసే బానిసలుగా ఉండేవారు. మొత్తం భూమిలో 10 శాతం నిజాం సొంత కమతం కింద ఉండేది. దీనిని 'సర్ఫేఖాస్' అనేవారు.

నైజాం కాలంలో 1942లోనే నిర్వహించిన సర్వే ప్రకారం, నిజాం కింద 3,665 మంది దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు ఉండేవారు. వారి కింద మక్తేదార్, బంజర్‌దార్, ఇజార్దార్లు ఉండేవారు. జనగామ తాలూకాలో విసునూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి ఒక్కడికే 60 వేల ఎకరాల భూమి ఉండేది. విసునూరు గడి నుండే సాయుధ పోరాటం మొదలవడానికి అగ్గి రాజుకుంది. చిట్యాల ఐలమ్మ తిరుగుబాటుతో అది మొదలైంది. పాలకుర్తిలో ఐలమ్మ భూములను గుంజుకోవడానికి పొలంలో పండిన ధాన్యాన్ని గడీకి తరలించటానికి దేశ్‌ముఖ్ గూండాలు చేసిన ప్రయత్నం ఫలించలేదు. భీమిరెడ్డి నర్సింహారెడ్డి అండతో 'ఆంధ్ర మహాసభ'లో చేరిన ఐలమ్మ చైతన్యవంతంగా ప్రజలను ఏకం చేసి దొర గూండాలను తిప్పికొట్టింది. ఆ పోరాటం గ్రామ గ్రామానికీ పాకింది. మట్టి మనుషులను మహా వీరులను చేసింది. 1946 జూలై 4న కడివెండి గ్రామంలో ప్రజలు ఊరేగింపు జరిపారు. ఇది సహించలేని దొర తల్లి జానకమ్మ (జానమ్మ దొరసాని) తన వద్ద ఉన్న 200 మంది గూండాలచే ఊరేగింపుపై దాడి చేయించింది. కాల్పులలో



◆ తెలంగాణ సాయుధ రైతాంగ తిరుగుబాటు తొలిదశలో గొప్ప విజయాలను సాధించింది. ఆ పోరాటం 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచింది. మూడు వేల గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలను స్థాపించింది.

ముందు భాగంలో ఉన్న 'దొడ్డి కొమురయ్య' అమరత్వం పొందాడు. కొమురయ్య బలిదానం ఉద్యమాన్ని ఉరకలెత్తించింది. దీన్ని సహించలేని నిజాం కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించాడు. ఇదే సాయుధ ప్రతిఘటనకుదారి తీసింది.

ఇప్పటికీ ప్రజా వ్యతిరేక విధానాలే!

తెలంగాణ సాయుధ రైతాంగ తిరుగుబాటు తొలిదశలో గొప్ప విజయాలను సాధించింది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పోరాటాలు ఉధృతమయ్యాయి. 16 వేల చదరపు మైళ్ళ వరకు విస్తరించాయి. ఆ పోరాటం 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచింది. మూడు వేల గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలను స్థాపించింది. దొరలు, భూస్వాములు గడీల నుండి పట్టణాలకు పారిపోయారు. వెట్టి చాకిరీ రద్దయింది. 1946 సెప్టెంబర్ 17న సాయుధ పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ పిలుపునివ్వగా అది 1951 వరకు కొనసాగింది.

ఈ పోరాటం విజయం సాధిస్తే దేశమంతటికీ వ్యాపిస్తుందని గ్రహించి నాటి నెహ్రూ ప్రభుత్వం బెంబేలెత్తింది. అందుకే 1948 సెప్టెంబర్ 13 నుండి భారత ప్రభుత్వం నిజాం సంస్థానంపై పెద్దయెత్తున 'ఆపరేషన్ పోలో' పేరుతో సైనిక చర్య జరిపింది. నాలుగు రోజుల్లోనే నిజాం నవాబు లొంగుబాటుతో హైదరాబాదు సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. దీంతో నిజాం పాలన ముగిసింది. ఆ తర్వాత కమ్యూనిస్టులను ఊచకోత కోశారు. ఈ పోరాటంలో నాలుగు వేల మందికి పైగా వీరులు అమరులైనారు. 10 వేల మందికి పైగా కొన్ని సంవత్సరాలపాటు జైళ్ళలో నిర్బంధాలకు గురయ్యారు. నిజాం సైన్యం, రజాకార్, యూనియన్ సైన్యాల చేతిలో 50 వేల మందికి పైగా అనేక అకృత్యాలు, అమానుషాలకు గురయ్యారు. తప్పని పరిస్థితుల్లో సాయుధ పోరాట విరమణ జరిగింది.

నిజాం సంస్థానం భారత యూనియన్‌లో విలీనమై 77 ఏళ్లవుతున్నా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు గడుస్తున్నా... ప్రజల కష్టాలు మాత్రం తీరలేదు. నాటి నుండి నేటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడి పోయింది.

వ్యాసకర్త మాజీ ఎమ్మెల్యే, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు



అడవి దున్నల పోట్లాట

ములుగు జిల్లా తాడ్వాయి అభయారణ్యంలో రెండు అడవి దున్నలు పోట్లాటకు దిగాయి. మంగళవారం అడవి దున్నలు పోట్లాడుకుంటున్న దృశ్యం అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాక్ కెమెరాకు చిక్కింది. కాగా తాడ్వాయి అటవీ ప్రాంతంలో అడవి దున్నల సంఖ్య పెరిగినట్లు భావిస్తున్నారు.
- ఎస్ఎస్ తాడ్వాయి

మానేరులో చిక్కుకున్న పది మంది

- అప్రమత్తమై రక్షించిన స్థానికులు

సుల్తానాబాద్ రూరల్ (పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గట్టిపల్లి మానేరు వాగులోకి ఇసుక కోసం మంగళవారం వెళ్లిన ట్రాక్టర్ యజమానులు, కూలీలు వరద ఉధృతిలో చిక్కుకున్నారు. ఇసుక తీసుకొచ్చేందుకు ఐదు ట్రాక్టర్లతో యజమానులు ఎనెంక క్రాంతి, గుర్రం రాజేశ్, నల్లవెల్లి మహేశ్, పడాల తిరుపతి, నల్లవెల్లి నాగరాజు, మహేశ్, ఎనంక వెంకటేశ్, ఎనంక ప్రశాంత్, కూలీలు గుర్రం రవి, రమ్య గట్టిపల్లి గ్రామ శివారులోని మానేరులోకి వెళ్లి ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్నారు. అయితే సోమవారం రాత్రి 9 గంటలకు ఎల్ఎండీ గేట్లు ఎత్తి మానేరులోకి విడుదల చేసిన నీరు.. మంగళవారం గట్టిపల్లి శివారులోకి చేరింది. హఠాత్తుగా మానేరు ఉధృతి పెరగడంతో ఆ పదిమంది ట్రాక్టర్లపై నిల్చొని స్థానికులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. వారు వెంటనే మానేరు ఒడ్డుకు చేరుకుని తాళ్లసాయంతో బాధితులను ఒడ్డుకు చేర్చారు.



తాడు సాయంతో బాధితులను ఒడ్డుకు చేర్చుతున్న స్థానికులు

ట్రాక్టర్లు వరద ఉధృతిలో కొట్టుకుపోయాయి. సమాచారం అందుకున్న సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎల్ఎండీ గేట్లు ఎత్తి మానేరులోకి నీటిని విడుదల చేశారని, సమీప గ్రామస్తులు, పశువులు, గొర్రెలకాపరులు, మత్స్యకారులు మానేరులోకి వెళ్లొద్దని పోలీస్ అధికారులు సూచించారు.

అక్టోబర్ 1 నుంచే ధాన్యం కొనుగోళ్లు: చౌహాన్



సాక్షి, హైదరాబాద్: ఈ వానాకాలం సీజన్‌లో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిపేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. మంగళవారం ఎంసీఆర్‌హెచ్ ఆర్డీలో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, పలువురు అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ధాన్యం కొనుగోళ్లకు అక్టోబర్ ఒకటో తేదీ నుంచే ఆయా గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయాలని చౌహాన్ ఆదేశించారు.

యూరియా దొరక్క యువ రైతు ఆత్మహత్య



స్ట్రెచర్‌పై మృతుడు అఖిల్

వర్ధన్నపేట: యూరియా దొరక్క మనస్తాపం చెందిన ఒక యువ రైతు గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని రామవరం గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉడుత అఖిల్ (22) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. యూరియా బస్తాల కోసం పది రోజులుగా తిరుగుతున్నా దొరకడం లేదు. యూరియా లేకపోవడంతో పంట ఎదగలేదు. దీంతో అఖిల్ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లలేదు. కోతులు మక్కజొన్న, పత్తి పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం తల్లితో మాట్లాడుతూ ఆందోళన వ్యక్తం చేశాడు. అన్న బతుకుతెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లాడని, ఉన్న రూ.5 లక్షల అప్పు తీర్చడం ఎలా? అని మనస్తాపానికి గురయ్యాడు. తల్లితో మాట్లాడిన కొద్ది సేపటి తర్వాత అఖిల్ బావి వద్దకు వెళ్లి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్తున్న క్రమంలో మృతి చెందాడు. యూరియా దొరక్క పోవడం, కోతులు పంటకు నష్టం కలిగించడం, అప్పుల బాధతోనే తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని తల్లి రమ కన్నీరు మున్నీరుగా విలపించింది. తనకు రెండు ఎకరాల భూమి ఉందని, గతంలోనే భర్త మృతి చెందినట్లు తెలిపింది.

అంధ విద్యార్థుల గళం అద్భుతః

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసలు
- దివ్యదృష్టి ఆల్బమ్ ఆవిష్కరణ



దివ్యాంగ విద్యార్థులకు సంగీత వాద్య పరికరాలు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. చిత్రంలో మంత్రులు పొన్నం, అడ్లూరి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి తదితరులు

సాక్షి, హైదరాబాద్/కరీంనగర్: కరీంనగర్ జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగీతంలో శిక్షణ పొందిన ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సంగీత వాయిద్య పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంధ విద్యార్థులు పాడిన దివ్యదృష్టి వీడియో ఆల్బమ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. పిల్లలు సుదీర్ఘ సంస్కృత సమాసాలతో ఉన్న స్తోత్రాలను అలవోకగా గానం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతిని, ఆల్బమ్‌కు దర్శకత్వం వహించిన నంది శ్రీనివాస్, సంగీతం అందించిన కేవీ.శర్మ, సంగీత ఉపాధ్యాయిని సరళ, వీడియోగ్రఫీ చేసిన లక్ష్మీగౌతమ్‌ను సీఎం అభినందించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండు కాళ్లు కోల్పోయి...

రెండు కాళ్లు కోల్పోయిన తనకు చికిత్సతో పాటు కృత్రిమ కాళ్లు అందించి.. మళ్లీ నడడానికి అవకాశం కల్పించినందుకు వరంగల్ జిల్లా దామెర మండల పులకుర్తి గ్రామానికి చెందిన గెండేటి రాహుల్ మంగళవారం సీఎంను రేవంత్ రెడ్డిని తన కుటుంబ సభ్యులతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 2024 నవంబర్ 2న రాజస్తాన్ వెళ్తుండగా రాహుల్‌ను.. కొందరు దుండగులు రైలు నుంచి బయటకి తోసేయడంతో ఆయన రెండు కాళ్లను కోల్పోయారు. సీఎం సహాయ నిధి కింద సహాయం అందించినందుకు ఆయన రేవంత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

2 లక్షల టన్నుల యూరియా లోటును భర్తీ చేయండి

- కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్‌కు రాష్ట్ర మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- కేంద్రమంత్రులు రామ్మోహన్, కుమారస్వామిలతో భేటీ



జాతీయ రబీ సదస్సులో మాట్లాడుతున్న తుమ్మల

సాక్షి, న్యూఢిల్లీ: ఖరీఫ్ సీజన్ ప్రణాళిక ప్రకారం ఇప్పటి దాకా ఏర్పడిన 2 లక్షల టన్నుల యూరియా లోటును ఈ నెలలోనే భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. రబీ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా ముందుగానే ప్రతి నెలా రెండు లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్‌తో భేటీ అయ్యారు. వీలైనంత త్వరగా తెలంగాణకు అవసరమైన యూరియా సరఫరా చేస్తామని అనుప్రియ పటేల్ హామీ ఇచ్చారని తుమ్మల చెప్పారు.

బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయండి

బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖల మంత్రి హెచ్‌డీ.కుమారస్వామిని కలిసి కోరారు. ఈ అంశంపై త్వరలోనే సమావేశం అవుదామని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్టు తుమ్మల వెల్లడించారు.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు అంశంపై కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరారు.

సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ ప్రగతి...

సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ రాష్ట్రం ప్రగతి సాధించిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన జాతీయ రబీ సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో తెలంగాణ సాధించిన పురోగతిని ఇతర రాష్ట్రాల ప్రతినిధులకు వివరించారు. సదస్సు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'విత్తనాలతో పాటు నూనెగింజల పంటల్లో.. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ప్రత్యేక గుర్తింపు సాధించింది. 2,601 రైతు వేదికలు ఏర్పాటు చేయడం, ప్రతీవారం రైతు నేస్తం లాంటి డిజిటల్ సమావేశాలు నిర్వహించడం ద్వారా 13 లక్షల మంది రైతులు, అందులో 3 లక్షల మహిళా రైతులు నేరుగా శాస్త్రవేత్తలు, అధికారులను కలవగలుగుతున్నారు.తెలంగాణ విత్తన రంగానికి జాతీయ గుర్తింపు ఇవ్వాలి' అని తుమ్మల కోరారు.

థర్డ్ పార్టీ జోక్యాన్ని భారత్ ఒప్పుకోలేదు


ద్వైపాక్షిక అంశమేనని తేల్చిచెప్పింది

- కీలక అంశాలపై చర్చలకు సిద్ధంగా ఉన్నాం
- మాతో చర్చలపై భారత్ స్పందించడం లేదు
- పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వెల్లడి
- ట్రంప్ చెప్పింది అబద్ధమని పరోక్షంగా స్పష్టీకరణ

ఇస్లామాబాద్: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్–పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణకు తానే చొరవ తీసుకున్నానని, తన హెచ్చరికల వల్లే యుద్ధం ఆగిపోయిందని పదేపదే చెప్పుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాటల్లోని డొల్లతనాన్ని పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ బయటపెట్టారు. కాల్పుల విరమణ విషయంలో మూడో పక్షం జోక్యాన్ని భారత్ ఎంతమాత్రం అంగీకరించలేదని తేల్చిచెప్పారు. అంటే ట్రంప్ చెప్పినదంతా అబద్ధమని పరోక్షంగా స్పష్టంచేశారు. తాజాగా అల్‌జజీరా మీడియా సంస్థకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. కీలకం అంశాలపై పొరుగుదేశంతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కానీ, తమతో చర్చలపై భారత్ స్పందించడం లేదని చెప్పారు. భారత్‌తో ఇటీవల సంప్రదింపులు ఏమైనా జరిగాయా? మూడో వ్యక్తి ఎవరైనా జోక్యం చేసుకున్నారా? అని అడిగిన ప్రశ్నకు ఇషాక్ దార్ బదులిచ్చారు. అలాంటిదేమీ లేదని అన్నారు. రెండు దేశాల వ్యవహారాల్లో మూడో వ్యక్తి ప్రమేయాన్ని భారత్ ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించదని వెల్లడించారు. భారత్–పాక్‌ల నడుమ మధ్యవర్తిత్వం వహించానని, రెండు దేశాల మధ్య యుద్ధాన్ని ఆపేశానని ట్రంప్ చేస్తున్న ప్రకటనలపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో నుంచి వివరణ కోరామని ఇషాక్ దార్ తెలిపారు. ద్వైపాక్షిక అంశాలపై థర్డ్ పార్టీ జోక్యాన్ని భారత్ ఒప్పుకోవడం లేదంటూ ఆయన తమతో చెప్పారని వివరించారు.

భారత్‌ను అడుక్కోలేం కదా!

''కాల్పుల విరమణ గురించి చర్చిద్దామంటూ అమెరికా నుంచి మే 10వ తేదీన ఆఫర్ వచ్చింది. ఒక తటస్థ వేదికపై అతిత్వరలో చర్చలు ప్రారంభిద్దామని మార్కో రూబియో మాకు చెప్పారు. కానీ, ఆ చర్చలేవీ జరగలేదు. జూలై 25వ తేదీన వాషింగ్టన్‌లో జరిగిన భేటీలో రూబియో కలిశారు. కాల్పుల విరమణ ఒప్పందం కోసం మీరు ఏర్పాటు చేస్తారన్న సమావేశం ఎందుకు జరగలేదని ప్రశ్నించాను. ఇది ద్వైపాక్షిక అంశమని, మూడో పక్షం జోక్యాన్ని అనుమతించబోమని భారత్ తేల్చిచెప్పిందని, అందుకే సమావేశం ఏర్పాటు చేయలేకపోయామని బదులిచ్చారు. భారత్, పాక్‌ల సంబంధించినది ఏదైనా సరే ద్వైపాక్షిక అంశమేనని భారత్ చెబుతుండగా ఇక మేము ఏం చేయగలం. మూడో వ్యక్తిని కూడా అనుమతించాలని భారత్‌ను అడుక్కోలేం కదా! శాంతిని కోరుకొనే దేశం పాకిస్తాన్. చర్చల ద్వారాపై సమస్యలు పరిష్కారం అవుతాయని మేము విశ్వసిస్తున్నాం. అందుకు రెండు దేశాలూ ముందుకు రావాలి. చర్చలకు భారత్ ఒప్పుకుంటే మేము కూడా సిద్ధంగా ఉన్నాం. ఉగ్రవాదం, వాణిజ్యం, ఆర్థికం, జమ్మూకశ్మీర్ తదితర అన్ని అంశాలపై సమగ్రంగా చర్చిద్దాం. థర్డ్ పార్టీని అనుమతించాలని మేము కూడా పట్టుబట్టడం లేదు'' అని ఇషాక్ దార్ సూచించారు.


ఇషాక్ దార్

ట్రంప్ విజ్ఞప్తిని తిరస్కరించిన భారత్

ఈ ఏడాది మే నెలలో పాకిస్తాన్ ఉగ్రవాదుల భరతం పట్టడమే లక్ష్యంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. నాలుగు రోజుల్లోనే ఆపరేషన్ ముగిసింది. భారత్–పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందంటూ రెండు దేశాల ప్రభుత్వాల కంటే ముందే ట్రంప్ ప్రకటించారు. సోషల్ మీడియాలో పోస్టుచేశారు. దీనిపై విమర్శలు వచ్చినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదు. భారత్, పాక్‌లపై వాణిజ్యపరమైన ఒత్తిడి తీసుకొచ్చి యుద్ధం ఆగేలా చేశానని, ఆ క్రెడిట్ తనకే దక్కాలని, అంతేకాకుండా నోబెల్ శాంతి బహుమతికి తాను అర్హుడినని ట్రంప్ పదేపదే ప్రకటనలు చేస్తూ వచ్చారు. దీనిపై భారత్ స్పందిస్తూ ట్రంప్ వాదనను పలుమార్లు తిప్పికొట్టింది. రెండు దేశాలతో సంబంధం లేని మూడో వ్యక్తి చెబితే కాల్పుల విరమణకు తామెందుకు ఒప్పుకుంటామని ప్రశ్నించింది. పాకిస్తాన్ కాళ్లబేరానికి వచ్చి ప్రాధేయపడడం వల్లే దాడులు ఆపేశామని స్పష్టంచేసింది. నోబెల్ శాంతి బహుమతికి తన పేరును అధికారికంగా ప్రతిపాదించాలని ట్రంప్ విజ్ఞప్తి చేయగా, భారత్ నిర్మొహమాటంగా తిరస్కరించింది.

నేటి నుంచి వైష్ణోదేవి యాత్ర పునఃప్రారంభం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రియాసీ జిల్లా త్రికూట పర్వతాల్లో కొలువైన మాతా వైష్ణోదేవి ఆలయ తీర్థయాత్ర ఈ నెల17వ తేదీ నుంచి తిరిగి ప్రారంభం కానుంది. అయితే, వాతావరణం అనుకూలంగా ఉంటేనే యాత్ర మొదలవుతుందని ఆలయ బోర్డు మంగళవారం తెలిపింది. ఆగస్టు 26వ తేదీన ఆలయ మార్గంలో కొండచరియలు విరిగిపడి 34 మంది యాత్రికులు చనిపోవడం తెల్సిందే. ఘటన నేపథ్యంలో ముందు జాగ్రత్తగా యాత్రను నిలిపివేశారు. ఈ నెల 14వ తేదీన యాత్ర పునఃప్రారంభం అవుతుందని ఆలయ బోర్డు ప్రకటించింది. అయితే, ఎడతెరిపి లేని వానలతో వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. అయితే, రెండు రోజుల క్రితం కొందరు యాత్రికులు కాట్రా బేస్ క్యాంప్ వద్ద ఆందోళనకు దిగడంతో యాత్రను తిరిగి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించింది.

హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో మళ్లీ క్లౌడ్ బరస్ట్

18 మంది మృతి, పలువురు గల్లంతు • కొనసాగుతున్న సహాయక చర్యలు

డెహ్రాడూన్/సిమ్లా: హిమాలయాల్లోని హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో మళ్లీ మేఘ విస్ఫోటం సంభవించింది. సోమవారం రాత్రి నుంచి వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఆకస్మిక వరదలు సంభవించి కొండచరియలు విరిగిపడ్డాయి. ఇందుకు సంబంధించిన ఘటనల్లో ఉత్తరాఖండ్‌లో 15 మంది, హిమాచల్ ప్రదేశ్‌లో ముగ్గురు చనిపోయారు. వీరిలో యూపీలోని మొరాదాబాద్ జిల్లాకు చెందిన ఆరుగురు ట్రాక్టర్ ట్రాలీలో డెహ్రాడూన్‌లో టాన్స్ నదిని దాడుతుండగా వచ్చిన వరదలో కొట్టుకుపోయినవారున్నారు. ఉత్తరాఖండ్‌లో గల్లంతైన 16 మంది కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతోపాటు ఫైర్ సిబ్బంది రంగంలోకి అన్వేషణ చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన సుమారు 900 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జర్ఘూ ప్రాంతంలో చిక్కుకుపోయిన మరో ఎనిమిది మందిని కాపాడేందుకు అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. కొండప్రాంతాల నుంచి వచ్చి పడుతున్న వరదల్లో కార్లు కొట్టుకుపోగా, ఇళ్లు, వ్యాపార సంస్థలు దెబ్బతిన్నాయి. డెహ్రాడూన్‌లో పలు వంతెనలు కొట్టుకుపోయాయి. గంగ, యమున నదులు ప్రమాద స్థాయికి దగ్గర్లో ప్రవహిస్తున్నాయి. వివిధ ఘటనల్లో ముగ్గురు చనిపోయారు. టామ్సా నది ప్రమాద స్థాయికి చేరుకుంది. దీంతో, తప్‌కేశ్వర్ ఆలయంతోపాటు ప్రఖ్యాత హనుమాన్ విగ్రహం భుజం వరకు నీట మునిగింది. నది గత 25, 30 ఏళ్లలో ఇంత తీవ్రంగా ప్రవహించడం ఇదే మొదటిసారని తప్‌కేశ్వర్ ఆలయ పూజారి బిపిన్ జోషి చెప్పారు. దేవ్‌భూమి ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లోకి వరద చేరడంతో చిక్కుకుపోయిన సుమారు 500 మంది విద్యార్థులను ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి. డెహ్రాడూన్–ముస్సోరి రోడ్డుపై పలు ప్రాంతాల్లో వరద చేరడంతో పర్యాటకులు, సందర్శకులు ఎక్కడి వారక్కడే ఉండిపోవాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోనూ పరిస్థితి దాదాపు ఇంతే తీవ్రంగా ఉంది. సిమ్లాలో 12 గంటల వ్యవధిలో 14.2 సెంటీమీటర్ల వాన కురిసింది. అతిభారీ వర్షం కురియడంతో మండి జిల్లాలోని ధరంపూర్‌లో ప్రధాన బస్‌స్టాండ్ వరదలో మునిగిపోయింది. ఒక వర్క్‌షాప్, పంప్ హౌస్‌తోపాటు దుకాణాలు, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన 20 బస్సులు నీట మునిగిపోయాయి. ఒక వ్యక్తి గల్లంతైనట్లు చెబుతున్నారు. పలు వాహనాలు వరదల్లో కొట్టుకుపోయాయి. మండి జిల్లా బ్రాగ్టా గ్రామంలో ఇల్లు కూలి ఇద్దరు మహిళలు, చిన్నారి ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన మరో ఇద్దరిని ఆస్పత్రిలో చేర్పించారు. గల్లంతైన మరో నలుగురి కోసం సహాయక సిబ్బంది తీవ్రంగా గాలింపు చేపట్టారు. సిమ్లాలోని హిమ్‌ల్యాండ్ సమీపంలో మట్టి చరియలు విరిగి ప్రధాన రహదారి మూసుకుపోయింది. పలు వాహనాలను మట్టి, బురద కప్పేశాయి. ధరంపూర్‌లో వరద కారణంగా ఆర్టీసీ బస్సులకు రూ.6 కోట్ల మేర నష్టం వాటిల్లిందని డిప్యూటీ సీఎం ముకేశ్ అగ్ని హోత్రి తెలిపారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో కొనసాగు తున్న ప్రకృతి బీభత్సం వెనుక కారణాలను వాతావరణ విభాగం ప్రాంతీయ అధికారి సీఎస్ తోమర్ వివరించారు. పొడిపశ్చిమ గాలులు, తేమ కలిగిన తూర్పు గాలులు పరస్పర తారసిల్లిన ఫలితంగానే క్లౌడ్ బరస్ట్ సంభవించిందన్నారు. ఇవే పరిస్థితులు మరో 24 గంటలపాటు కొనసాగి, భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశముందని విశ్లేషించారు.


సిమ్లాలో భారీవర్షాలతో కొండచరియలు పడి ధ్వంసమైన వాహనాలు

చర్చలు సానుకూలం

- సాధ్యమైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని భారత్, అమెరికా నిర్ణయం
- వర్చువల్ విధానంలో కొనసాగనున్న చర్చలు

న్యూఢిల్లీ: అత్యంత కీలకమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం(బీటీఏ)పై భారత్, అమెరికా ప్రతినిధుల మధ్య మంగళవారం ఢిల్లీలో చర్చలు జరిగాయి. సాధ్యమైనంత త్వరగా ఒప్పందాన్ని అమల్లోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని ఇరుపక్షాలు నిర్ణయించుకున్నాయి. పరస్పరం ప్రయోజనం చేకూరేలా ఈ ఒప్పందం ఉండాలని తీర్మానించుకున్నాయి. ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు పూర్తి సానుకూలంగా జరిగాయని భారత వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. చర్చలను త్వరగా ముగించడానికి ప్రయత్నాలు వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది. భారత్‌తో వాణిజ్య చర్చల కోసం అమెరికా నుంచి వచ్చిన బృందానికి బ్రెండాన్ లించ్ నేతృత్వం వహించారు. ఆయన దక్షిణ, మధ్య ఆసియాకు అమెరికా సహాయ వాణిజ్య ప్రతినిధిగా పని చేస్తున్నారు. చర్చల కోసం తన బృందంతో కలిసి సోమవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్నారు. మంగళవారం రోజంతా చర్చలు జరిగాయి. భారత్ తరపున వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. భారతదేశ ఉత్పత్తులపై అమెరికా ప్రభుత్వం 50 శాతం టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో వాణిజ్య ఒప్పందంపై చర్చలు ఊపందుకోవడం విశేషం. 50 శాతం టారిఫ్‌లు విధించిన తర్వాత అమెరికా నుంచి ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ఇండియాకు రావడం ఇదే మొదటిసారి. భారత్, అమెరికాల మధ్య వాణిజ్య చర్చలు వర్చువల్ విధానంలో కొనసాగుతాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తదుపరి ముఖాముఖి భేటీ కోసం ఇరుపక్షాలు కలిసి త్వరలో ఒక తేదీని ఖరారు చేసుకుంటాయని తెలిపాయి. భారత్, అమెరికాల మధ్య ఇప్పటిదాకా ఆరుసార్లు వాణిజ్య చర్చలు జరిగాయి. ఇండియాతో వాణిజ్య బంధానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ట్రంప్ ప్రకటనను భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఇరుదేశాల వాణిజ్య చర్చలకు సంబంధించి పాడి, వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో ప్రతిష్టంభన నెలకొన్నట్లు తెలుస్తోంది. ఆయా ఉత్పత్తులను అనుమతించాలని అమెరికా డిమాండ్ చేస్తుండగా, భారత్ అందుకు అంగీకరించడం లేదు. తమ రైతుల ప్రయోజనాలు కాపాడే విషయంలో రాజీపడబోమని చెబుతోంది.

మోదీకి ట్రంప్ జన్మదిన శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. 75వ జన్మదినం సందర్భంగా మోదీకి శుభాకాంక్షలు తెలియజేశారు. భారత్‌తో సంబంధాల పునరుద్ధరణకు అమెరికా ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్న సమయంలో ఇరువురు నేతలు మాట్లాడుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రంప్ ఫోన్‌కాల్ అనంతరం మోదీ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. డొనాల్డ్ ట్రంప్ తరహాలోనే భారత్–అమెరికా సమగ్ర భాగస్వామ్యాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడానికి తాను కూడా పూర్తిగా కట్టుబడి ఉన్నట్లు స్పష్టంచేశారు. తనతో ఫోన్‌లో మాట్లాడి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మిత్రుడు ట్రంప్‌కు మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు ప్రధాని మోదీ 75వ జన్మదినం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 75వ జన్మదినం సందర్భంగా బుధవారం ఆయన పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నారు. మోదీ నేడు మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాలోని బైన్సోలా గ్రామంలో పర్యటిస్తారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌తోపాటు ఎనిమిదో జాతీయ పౌష్టికాహార మాసోత్సవాన్ని ప్రారంభిస్తారు. 'ప్రధానమంత్రి మాతృ వందన యోజన' కింద లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు బదిలీ చేస్తారు. తల్లులు, శిశువుల ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి 'సుమన్ శక్తి చాట్‌బాట్'ను ప్రారంభిస్తారు. 'సేవా పఖ్వాడా'లో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ దాకా దేశవ్యాప్తంగా ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నారు. పూర్తిగా స్వదేశీ ఉత్పత్తులతో మేళాలు ఏర్పాటు చేస్తారు.

నంజెగౌడ ఎన్నిక రద్దు రీకౌంటింగ్‌కు హైకోర్టు ఆదేశం

మాలూరు: కర్ణాటకలో గత శాసనసభ ఎన్నికలలో కోలారు జిల్లా మాలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి కేవై నంజే గౌడ ఎన్నికను హైకోర్టు రద్దు చేసింది. ఆ ఎన్నికల్లో కేవలం 248 ఓట్ల ఆధిక్యంతో నంజే గౌడ నెగ్గారు. బీజేపీకి చెందిన ప్రధాన ప్రత్యర్థి కేఎస్ మంజునాథ్ గౌడ రీకౌంటింగ్ జరిపించాలని హైకోర్టులో కేసు వేశారు. రెండేళ్ల సుదీర్ఘ విచారణ తరువాత మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ దేవదాస్ రీకౌంటింగ్ నిర్వహించాలని ఆదేశించారు. అంతేకాకుండా ఎమ్మెల్యే నంజే గౌడ ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు వెలువరించారు. నెలరోజుల్లోగా మళ్లీ కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలను ప్రకటించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించారు. అయితే, హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టుకు వెళ్లడానికి ఎమ్మెల్యేకు అవకాశం ఇచ్చారు. 30 రోజుల్లోగా సుప్రీంకోర్టు స్పందించకపోతే యథావిధిగా రీకౌంటింగ్‌ను జరపాలని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళతానని నంజే గౌడ చెప్పారు.

గాజాపై భీకర దాడులు

- దక్షిణం వైపు వెళ్లిపోవాలంటూ ప్రజలకు హెచ్చరికలు
- మంగళవారం దాడుల్లో 68 మంది మృత్యువాత
- ఇజ్రాయెల్ జనహననానికి పాల్పడుతోందన్న ఐరాస

జన హననానికి ఆధారాలు

ఇజ్రాయెల్ ఆర్మీ గాజా ప్రాంతంలో జనహననానికి పాల్పడుతోందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సమితి నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ పేర్కొంది. మారణహోమానికి ముగింపు పలికి, ఇందుకు బాధ్యులైన వారిని శిక్షించేందుకు చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. ఈ కమిటీ 2023 అక్టోబర్ 7వ తేదీ నుంచి గాజాపై ఇజ్రాయెల్ ఆర్మీ సాగిస్తున్న దాడులు, మానవహక్కుల ఉల్లంఘన పర్యవసానాలను రికార్డు చేసింది.

జెరూసలేం: గాజా నగరంపై ఇజ్రాయెల్ ఆర్మీ మంగళవారం దాడులను మరింత తీవ్రతరం చేసింది. హమాస్ సైనిక వనరుల నాశనమే లక్ష్యంగా గ్రౌండ్ ఆపరేషన్ చేపట్టినట్లు ప్రకటించింది. 'ప్రమాదకరమైన యుద్ధ జోన్'గా మారిన నగరాన్ని వీడి దక్షిణప్రాంతంలోని అల్ మువాసిలో ఏర్పాటు చేసిన మానవీయ జోన్‌కు తరలివెళ్లాలని ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. సోమవారం రాత్రి నుంచి కొనసాగిస్తున్న దాడుల్లో మరో 68 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. ఎడతెగని దాడులతో భీతిల్లిన జనం నగరాన్ని వీడి పెద్ద సంఖ్యలో వెళ్లిపోతున్నారు. తీరం వెంబడి రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. అంతకుముందు, ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ మంగళవారం ఉదయం 'గాజా తగులబడుతోంది'అంటూ వ్యాఖ్యానించారు. హమాస్ సాయుధ వనరులను ధ్వంసం చేసి, బందీలను విడిపించుకుంటామన్నారు. లక్ష్యం నెరవేరేదాకా వెనక్కి తగ్గేది లేదన్నారు. దీంతో, ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చగా, కాల్పుల విరమణ కోసం ఇప్పటి వరకు కొనసాగిన దౌత్యప్రయత్నాలకు ముగింపు పలికినట్లేనని భావిస్తున్నారు.

ఆగని మారణకాండ

గాజా నగర జనాభా దాదాపు 10 లక్షలు కాగా ఇజ్రాయెల్ ఆర్మీ హెచ్చరికల నేపథ్యంలో గత నెల నుంచి ఇప్పటి వరకు 2.20లక్షల మంది దక్షిణాదికి వలస వెళ్లినట్లు ఐరాస అంచనా వేసింది. మంగళవారం ఈ నగరంపై ఇజ్రాయెల్ ఆర్మీ దాడులను ఉధృతం చేసింది. ఈ దాడుల్లో కనీసం 68 మంది చనిపోయినట్లు అల్ జజీరా తెలిపింది. సోమవారం రాత్రంతా శతఘ్నులు, హెలికాప్టర్లు, క్షిపణులు, డ్రోన్లు, ఎఫ్–16 యుద్ధ విమానాలతోవిరామం లేకుండా బాంబింగ్ కొనసాగిందని షిఫా ఆస్పత్రి డైరెక్టర్ మహ్మద్ అబూ సెల్మియాహ్ వ్యాఖ్యానించారు. తమ ఆస్పత్రికి పదుల సంఖ్యలో మృతదేహాలు వచ్చాయన్నారు. కనీసం 90 మంది క్షతగాత్రులకు చికిత్స చేశామన్నారు. భవనాల శిథిలాల కింద చాలామందే చిక్కుకుని ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఇజ్రాయెల్ శత్రువు: ఈజిప్టు

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో సోమవారం ఇజ్రాయెల్ చేరుకుని, ప్రధాని నెతన్యాహూతో చర్చలు జరిపారు. గాజాలో క్షేత్రస్థాయి ఆపరేషన్ ప్రారంభమైనందున, ఒప్పందం కుదుర్చుకునేందుకు తగు సమయం లేదంటూ వ్యాఖ్యానించారు. ఎంతో ముఖ్యమైన ఈ ఆపరేషన్ కొన్ని వారాల్లోనే ముగియనుందన్నారు. అనంతరం ఆయన ఖతార్ రాజధాని దోహాకు చేరుకున్నారు. దోహాలో జరుగుతున్న అరబ్, ముస్లిం దేశాల నేతల సమావేశం ఖతార్‌పై ఇజ్రాయెల్ గత వారం చేపట్టిన దాడులను తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా చేపట్టాల్సిన చర్యలపై ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. అయితే, ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధానికి దౌత్యపరమైన ఒత్తిడుల ద్వారా ముగింపునకు తేవాలని నిర్ణయించింది. ఇజ్రాయెల్‌ను శత్రువంటూ దోహాలో జరిగిన సమావేశంలో ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ అల్ సిస్సి అభివర్ణించారు. 1979లో రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు మొదలయ్యాక ఇజ్రాయెల్‌ను ఆ దేశం ఇంత తీవ్రంగా నిందించడం ఇదే మొదటిసారని చెబుతున్నారు. అయితే, ఇది కేవలం తమ అసంతృప్తి తీవ్రతను వ్యక్తం చేసేందుకే తప్ప, ఇజ్రాయెల్‌తో సంబంధాలను తెంచుకునేందుకు కాదని అంటున్నారు.


గాజా నగరం వీడి వెళ్తున్న వారితో కిక్కిరిసిపోయిన రహదారి

అస్సాం సివిల్ సర్వీసు అధికారిణి నూపుర్ బోరా అరెస్టు

- సోదాల్లో రూ.2 కోట్ల విలువైన నగదు, ఆభరణాలు స్వాధీనం
- వలసదార్ల పేరిట భూముల రిజిస్ట్రేషన్లకు సహకరించినట్లు ఆరోపణలు


నూపుర్

గౌహతి: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అస్సాం సివిల్ సర్వీసు(ఏసీఎస్) అధికారిణి నూపుర్ బోరాను ప్రత్యేక నిఘా విభాగం అధికారులు అరెస్టు చేశారు. భూకుంభకోణంలో ఆమె పాత్రపై ఆరోపణలు రావడంతో అదుపులోకి తీసుకున్నారు. రాజధాని గౌహతిలోని ఇమె ఇంటితోపాటు మరో మూడు ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో దాదాపు రూ.2 కోట్ల నగదు, బంగారు ఆభరణాలు లభించినట్లు తెలిసింది. ప్రభుత్వ భూమిని అక్రమ వలసదార్ల పేరిట రిజిస్ట్రేషన్‌కు చేయడానికి సహకరించి, లంచాలు తీసుకున్నట్లు నూపుర్ బోరాపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆమెపై దర్యాప్తు కొనసాగుతోందని అస్సాం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ చెప్పారు.

ఎవరీ అధికారిణి?: నూపుర్ బోరా 1989 మార్చి 31న అస్సాంలోని గోలాఘాట్ జిల్లాలో జన్మించారు. తొలుత డీఐఈటీ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేశారు. 2019లో ఏసీఎస్ అధికారిణిగా విధుల్లో చేరారు. 2019 నుంచి 2023 దాకా అసిస్టెంట్ కమిషనర్‌గా, తర్వాత సర్కిల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు సోమవారం అరెస్టు చేశారు. సోదాల్లో రూ.90 లక్షల నగదు, రూ.కోటికిపైగా విలువైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ఆమెపై గత ఆరు నెలలుగా తనకు ఫిర్యాదులు వచ్చాయని సీఎం హిమంత బిశ్వ శర్మ చెప్పారు. ఆమెపై నిఘా పెట్టినట్లు వెల్లడించారు. బార్‌పేట జిల్లాలో సర్కిల్ ఆఫీసర్‌గా పనిచేసిన సమయంలో ప్రభుత్వ భూములను ప్రభుత్వ, సాత్ర భూములను ఆక్రమ వలసదార్ల పరం చేసేందుకు సహకరించారని పేర్కొన్నా రు.

ప్రతి పనికీ రేటుకార్డు!: ఎమ్మెల్యే అఖిల్ గొగోయ్ నేతృత్వంలోని కృషక్ ముక్తి సంగ్రామ్ సమితి(కేఎంఎస్ఎస్) అనే సంస్థ నూపుర్ బోరాపై ఫిర్యాదు చేసింది. భూముల లావాదేవీలకు సంబంధించిన ప్రతి పనికీ లంచాలు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొంది. భూముల మ్యాప్‌నకు రూ.1,500, ల్యాండ్ రికార్డుల్లో పేరు చేర్చడానికి లేదా తొలగించడానికి రూ. 2 లక్షలు తీసుకున్నారని స్పష్టంచేసింది. నూపుర్ బోరా సహాయకుడు, బార్‌పేట రెవెన్యూ సర్కిల్ ఆఫీసర్ సురాజిత్ డేకా ఇంట్లోనూ సోదాలు జరిగా యి. నూపర్ బోరా అండతో అతడు పలు భూము లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు.

యూపీలో ఒకే ఇంట్లో 4,271 మంది ఓటర్లు

ఆప్ నేత సంజయ్ సింగ్ ఆరోపణ

లక్నో: ఉత్తరప్రదేశ్ ఎన్నికల జాబితాలో భారీ మొత్తంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆప్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ మంగళవారం ఆరోపించారు. మహోబా జిల్లాలోని ఒకే ఒక ఇంటి నంబర్‌తో 4,271 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారన్నారు. లక్నోలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మహోబా జిల్లాలోని రెండు ఇళ్లలో 243, 185 ఉన్నట్లు కనుగొని షాకయ్యా. తాజాగా, ఒకే ఇంట్లో 4,271 మంది ఓటర్లున్నారు. అంటే ఆ కుటుంబంలోని మొత్తం సభ్యులు కనీసం 12 వేల మంది ఉండి ఉంటారు'అని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే గ్రామంలో మొత్తం ఓటర్లు సుమారు 16 వేలు కావడం మరింత తీవ్రమైన అంశమన్నారు. బీజేపీ, ఎన్నికల కమిషన్ కలిసి యూపీలో ఓట్ల చోరీ మొదలుపెట్టాయన్నారు. అదేవిధంగా, బిహార్‌లో బీజేపీ–జేడీయూ సంకీర్ణ ప్రభుత్వం లక్ష్యంగా సంజయ్ సింగ్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలోని భాగల్పూర్‌లో పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ గ్రూప్‌కు ఎకరా కేవలం రూ.1కే ఏకంగా వెయ్యి ఎకరాల భూమిని పవర్ ప్లాంట్ కోసం 25 ఏళ్లకు ప్రభుత్వం లీజుకు ఇచ్చిందని ఆరోపించారు. ఈప్లాంట్ విద్యుత్‌ను యూనిట్ రూ.7 చొప్పున 25 ఏళ్ల కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుందన్నారు.

న్యూయార్క్ టైమ్స్‌పై ట్రంప్ పరువు నష్టం దావా

ఆ పత్రిక తనను అవమానిస్తోందని మండిపాటు



వాషింగ్టన్: 'ద న్యూయార్క్ టైమ్' పత్రిక తనను అవమానించడమే పనిగా పెట్టుకుందని అమెరికా అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. అంతేకాకుండా విపక్ష డెమొక్రటిక్ పార్టీకి కరపత్రికగా మారిపోయిందని ఆరోపించారు. తనకు, తన కుటుంబానికి, వ్యాపారానికి వ్యతిరేకంగా తప్పుడు స్టేట్‌మెంట్లు ప్రచురిస్తోందని ధ్వజమెత్తారు. ఆ పత్రికపై కోర్టులో పరువు నష్టం దావా వేసినట్లు తెలిపారు. తనకు జరిగిన నష్టానికి గాను ఆ పత్రిక 15 బిలియన్ డాలర్ల (రూ.1.32 లక్షల కోట్లు) పరిహారం చెల్లించేలా ఆదేశాలివ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ ఈ మేరకు సోమవారం రాత్రి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే, ట్రంప్ డిమాండ్ చేస్తున్న సొమ్ము ద న్యూయార్క్ టైమ్స్ పత్రిక మార్కెట్ విలువ కంటే అధికం కావడం గమనార్హం. పాత్రికేయ రంగంలో ప్రమాణాలను పునరుద్ధరించడం, సమగ్రతను కాపాడడం తన ఉద్దేశమని ట్రంప్ చెబుతుండడం విశేషం. అయితే, నిపుణుల వాదన మరోలా ఉంది. న్యూయార్క్ టైమ్స్‌పై పరువు నష్టం దావా వేయడం ద్వారా పత్రికా స్వేచ్ఛను హరించాలని, వ్యతిరేక గళాలను అణచివేయాలని ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోందని అంటున్నారు. ట్రంప్ వ్యవహారశైలిని తప్పుపడితే కోర్టుకు లాగడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, ట్రంప్ వేసిన పరువు నష్టం దావాలో పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్ రాండమ్ హౌస్‌తోపాటు న్యూయార్క్ టైమ్స్‌లో పనిచేసే నలుగురు జర్నలిస్టుల పేర్లు కూడా చేర్చారు. వీరిలో ఇద్దరు ట్రంప్‌పై ఒక పుస్తకం రచించారు. ఈ పుస్తకాన్ని పెంగ్విన్ సంస్థ ప్రచురించింది.

ఆ దావాలో పస లేదు

కోర్టులో ట్రంప్ దాఖలు చేసిన పరువునష్టం దావాపై న్యూయార్క్ టైమ్స్ పత్రిక యాజమాన్యం స్పందించింది. ఆ దావాలో ఏమాత్రం పస లేదని, అది చెల్లదని, న్యాయ పరీక్షకు నిలవదని తేల్చిచెప్పింది. మీడియా స్వతంత్రను దెబ్బతీయడమే ట్రంప్ ఉద్దేశమని విమర్శించింది. ప్రసార మాధ్యమాలను అణచివేయడం మానుకోవాలని సూచించింది. ఇలాంటి చిల్లర బెదిరింపులకు తాము లొంగబోమని స్పష్టంచేసింది. నిజాలు నిర్భయంగా బహిర్గతం చేస్తూనే ఉంటామని, తమను ఎవరూ అడ్డుకోలేరని పేర్కొంది. న్యాయం తమవైపే ఉందని ఉద్ఘాటించింది.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



స్వేచ్ఛా వెలుగులు!

నిజాం రాచరిక పాలన నుంచి దాస్యవిముక్తి లభించిన రోజు. హైదరాబాద్ సంస్థానం భారత్‌లో అంతర్భాగమైన రోజు. స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న రోజు. సెప్టెంబరు 17ను పురస్కరించుకుని నగరంలోని సచివాలయం, అసెంబ్లీ తదితర ప్రభుత్వ భవనాలను విద్యుద్దీపాలతో ఇలా సుందరంగా అలంకరించారు.




తన అనుచరులతో ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్

నిజాం రాజు.. తలొగ్గిన రోజు

అవిగవిగో మోహరించిన యుద్ధ ట్యాంకులు

- భారత సైనికుల కవాతు అల్లదిగో..
- స్వేచ్ఛా వాయువులు వీచిన క్షణాలవిగో
- నీలాకాశంలో రెపరెపలాడిన త్రివర్ణ పతాకం
- నిజాం నిరంకుశ పాలనకు చరమ గీతం



పోలీస్ యాక్షన్ సందర్భంగా నిర్మానుష్యంగా మారిన చార్మినార్ పరిసరాలు

ఇదీ హైదరాబాద్ సంస్థానం..

- ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటకలోని హైదరాబాద్ సంస్థానం విస్తీర్ణం సుమారు 1,41,133 చదరపు కిలోమీటర్లు.
- చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్. ఆయన కింద 975 మంది జాగీర్దార్లు ఉండేవారు. వీరి అధీనంలో సాగుకు అనుకూలమైన 53,106 చదరపు కిలోమీటర్ల భూమి ఉండేది.
- 1921 నవంబర్‌లో ఆంధ్ర మహాసభ ఏర్పాటైంది. రాజకీయ సంబంధమైన ఒక సంస్థ నిజాం సంస్థానంలో ఏర్పడడం ఇదే మొదటిసారి. 1923లో ఆర్య సమాజ్ హైదరాబాద్ శాఖ ఏర్పాటు చేశారు.
- గవర్నమెంట్ ఆఫ్ ఇండియా యాక్ట్ 1935 ప్రకారం 1937లో అనేక ప్రావిన్స్‌లలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల ప్రభావం హైదరాబాద్ సంస్థానంపై పడింది. 'బాధ్యతాయుతమైన ప్రభుత్వం కావాలని' ఆంధ్ర మహాసభ మొదటిసారిగా రాజకీయ డిమాండ్‌ను బాహాటంగా ప్రకటించింది. ఆంధ్ర మహాసభ స్ఫూర్తితో కన్నడ పరిషత్, మహారాష్ట్ర పరిషత్ కూడా ఏర్పడ్డాయి. హైదరాబాద్ సంస్థానంలో కాంగ్రెస్ ప్రారంభమైంది.



లొంగిపోయిన అనంతరం సర్దార్ పటేల్‌తో నిజాం

1948 సెప్టెంబరు 17న దేశంలో భాగమైన హైదరాబాద్ సంస్థానం

సాక్షి, సిటీబ్యూరో

అదిగో సుశిక్షితులైన సైనికుల కవాతు.. వినీలాకాశంలో సమున్నతంగా రెపరెపలాడిన త్రివర్ణ పతాక దృశ్యం అదిగో.. హైదరాబాద్ నగరంలోకి ప్రవేశించిన భారత సైనికులకు నీరాజనాలు పలుకుతున్న జనుల జయజయ ధ్వానాలవిగో.. 1948 సెప్టెంబరు 17న భాగ్యనగరంలో కనువిందు చేసిన దృశ్యం ఇది. నిజాం నిరంకుశ, రాచరిక పాలనకు చరమగీతం పాడిన రోజు ఇది. రజాకారుల అకృత్యాలతో నలిగిపోయిన ప్రజలు ఈ రోజు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. ఆనందోత్సాహాలతో వేడుకలు చేసుకున్నారు. భారత యూనియన్ బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ పోలో' విజయవంతమై నిజాం నిరంకుశ పాలన అంతమైన ఆ రోజుపై భిన్నాభిప్రాయాలు, విభిన్న దృక్పథాలు ఉన్నప్పటికీ హైదరాబాద్ సంస్థానం సువిశాలమైన భారత యూనియన్‌లో భాగమైంది. ఒక నవ శకం ప్రారంభమైంది.

ఆ రోజు ఏం జరిగిందంటే..


ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిణామాలు వేగంగా జరిగాయి. భారత సైన్యం అన్ని వైపుల నుంచి నగరానికి చేరువైంది. హైదరాబాద్ ప్రధాని లియాఖత్ ఉదయమే తన పదవికి రాజీనామా చేశారు. ఓటమి అనివార్యమని నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు తెలిసిపోయింది. కేఎం మున్షీని కింగ్‌కోఠికి పిలిపించాడు. 'పోలీసు చర్యను ఆహ్వానిస్తూ భద్రతా సమితికి ఇచ్చిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని' మున్షీ సూచించారు. ఈ మేరకు రేడియోలో ప్రసంగించాలని కోరారు. అందుకు నిజాం అంగీకరించాడు. కానీ.. అప్పటి వరకు రేడియోలో ప్రసంగించిన అనుభవం లేని నిజాం నవాబు దక్కన్ రేడియో స్టేషన్‌కు వెళ్లి తన లొంగుబాటును ప్రకటించాడు. అదే రోజు నిజాం సైన్యాధ్యక్షుడు ఇద్రూస్, భారత సైనిక బలగాల కమాండర్ జేఎన్ చౌధురి ఒక నిర్దిష్ట ప్రదేశంలో కలుసుకున్నారు. 'బేషరతుగా లొంగిపోతున్నట్లు' ఇద్రూస్ ప్రకటించాడు. ఆ తర్వాత ఇద్దరూ పరస్పరం కరచాలనం చేసుకున్నారు. చౌధురి జట్కా బండి నగరంలోకి పరుగులు తీసింది.

జనం జేజేలు..

నిజాం నవాబు భారత ప్రభుత్వానికి లొంగిపోతున్నట్లు ఉదయం నుంచే వార్తలు వెలువడ్డాయి. అప్పటి వరకు ఏ క్షణంలో ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందో తెలియని భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ ఇళ్లలో గడిపిన నగరవాసులు.. నెమ్మదిగా వీధుల్లోకి వచ్చారు. సికింద్రాబాద్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లోని రహదారులన్నీ జనంతో నిండిపోయాయి. భారత సైనికులకు స్వాగతం పలుకుతూ జేజేలు పలికారు. తరలి వచ్చిన జనంతో పరేడ్ గ్రౌండ్స్ జనసంద్రమైంది. త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. 'మహాత్మా గాంధీ కి జై', పండిట్ నెహ్రూ జిందాబాద్, సర్దార్ పటేల్ జిందాబాద్, భారత్‌మాతాకీ జై' అంటూ జనం పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'రజాకార్ ముర్దాబాద్' అనే నినాదాలు ప్రతిధ్వనించాయి. బొల్లారం నుంచి భారత సైనిక బలగాలు పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకున్నాయి. మీర్ ఉస్మాన్ అలీఖాన్ రాచరిక పాలన 1948 సెప్టెంబరు 17వ తేదీతో అంతమైంది.

ఐదు రోజుల పోలీసుచర్య...

హైదరాబాద్ సంస్థానంపై భారత ప్రభుత్వం చేపట్టిన సైనిక చర్య సెప్టెంబరు 13వ తేదీ సోమవారం తెల్లవారుజామున ప్రారంభమైంది. లెఫ్టినెంట్ జనరల్ మేజర్ రాజేంద్రసింగ్ నేతృత్వంలో మేజర్ జనల్ జె.ఎన్.చౌధురి దీనికి సారథ్యం వహించారు. భారత సైన్యం నలు వైపుల నుంచి హైదరాబాద్ భూభాగంలోకి చొచ్చుకొచ్చింది. షోలాపూర్ నుంచి బయలుదేరిన సైన్యం నల్‌దుర్గ్ కోటను స్వాధీనం చేసుకొని తల్ముడి, తుల్జాపూర్ మీదుగా హైదరాబాద్ వైపునకు వచ్చింది. మేజర్ జనరల్ డీఎస్ బ్రార్ ముంబై నుంచి, ఆపరేషన్ కమాండర్ మేజర్ జనరల్ ఎ.ఎ. రుద్ర విజయవాడ వైపు నుంచి బ్రిగేడియర్ శివదత్త బేరార్ నుంచి బయలుదేరారు. అన్ని వైపుల నుంచి భారత సైన్యం హైదరాబాద్‌ను ముట్టడించింది. భారత వైమానిక ఎయిర్ మార్షల్ ముఖర్జీ సైతం తన సేవలను అందజేసేందుకు సన్నద్ధమయ్యారు. దీంతో నిజాం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. 1948 సెప్టెంబరు 14న దౌలతాబాద్, జల్నా, ఔరంగాబాద్, ఉస్మానాబాద్, నిర్మల్, సూర్యాపేట్, వరంగల్, ఖమ్మం ప్రాంతాలను సైన్యం తన స్వాధీనంలోకి తీసుకుంది. లాతూర్, జహీరాబాద్ ప్రాంతాల్లో నిజాం సైనికులపై భారత సేనలు బాంబుల వర్షం కురిపించాయి. సెప్టెంబరు 16న రాంసింగ్ నేతృత్వంలోని సైనికులు జహీరాబాద్‌ను ఆక్రమించుకున్నారు. షోలాపూర్ నుంచి హైదరాబాద్ వరకు యూనియన్ సైనికుల పాదాక్రాంతమైంది. నిజాం సైనికులు బీబీనగర్, పటాన్‌చెరు, గచ్చిబౌలి, లింగంపల్లి, మల్కాపూర్ తదితర ప్రాంతాల్లో మందుపాతరలు పేల్చి సైన్యాన్ని అడ్డుకొనేందుకు విఫలయత్నం చేశారు. సైన్యం మరింత ముందుకు చొచ్చుకొని వచ్చింది. నిజాం సైన్యాధికారి ఎల్ ఇద్రూస్ చేతులెత్తేశారు. సెప్టెంబరు 17 సాయంత్రం 5 గంటలకు భారత బలగాలు హైదరాబాద్‌లోకి ప్రవేశించాయి.



అప్పట్లో గుమిగూడిన నగర పౌరులు

నిద్దరోయిన నిఘా నేత్రం!



సైబరాబాద్‌లో పని చేయని సీసీ కెమెరాలు

- ఒక్క మాదాపూర్ జోన్‌లోనే 644 కెమెరాలు నో వర్క్
- రోడ్ల విస్తరణలో 300 సీసీ టీవీలు మాయం
- సరైన నిర్వహణ లేక మిగిలినవీ మొరాయింపు
- అక్రమ కేబుళ్ల తొలగింపులో కెమెరాల వైర్లూ కత్తిరింపు
- శాంతిభద్రతల నిర్వహణ, నేరాల దర్యాప్తులపై ప్రభావం

సాక్షి, సిటీబ్యూరో: దొంగలను గుర్తించాలన్నా, దోపిడీ ముఠాల ఆటకట్టించాలన్నా.. ఏమూలలో ఏం జరుగుతోందో తెలుసుకోవాలన్నా సీసీటీవీ కెమెరాల పాత్ర అత్యంత కీలకం. కానీ.. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో సీసీ కెమెరాల నిర్వహణ డొల్లతనంగా మారింది. రోడ్ల విస్తరణ, అక్రమ కేబుల్ వైర్ల తొలగింపు సమయంలో కెమెరాల వైర్లూ తొలగించడం, వార్షిక నిర్వహణ సరిగా లేకపోవడం తదితర కారణాలతో నిఘా నేత్రాలు నిద్దరోయాయి. సైబరాబాద్‌లో అత్యంత కీలకమైన మాదాపూర్ జోన్‌లో ఏకంగా 644 సీసీటీవీ కెమెరాలు పని చేయడం లేదు.



రోడ్ల విస్తీర్ణం, వైర్ల కత్తిరింపు..

రోడ్డు ప్రమాదాలు, చెయిన్ స్నాచింగ్‌లు, దాడులు, హత్యోదంతాలు ఇతరత్రా కేసుల్లో నేరస్తులను పట్టుకునేందుకు సీసీటీవీ కెమెరాలు కీలకం. కేసుల దర్యాప్తు, పోలీసుల పరిశోధనకు ఆయువుపట్టు లాంటి కెమెరాల నిర్వహణపై నిర్లక్ష్యం అలుముకుంటోంది. వార్షిక నిర్వహణ సరిగా లేక, విద్యుత్ స్తంభాలపై ఉన్న అక్రమ తీగలను తొలగించే సమయంలో సీసీటీవీ కెమెరాల వైర్ల తొలగింపు తదితర కారణాలతో కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో పోలీసులకు నేరాల దర్యాప్తులో ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2.14 లక్షల సీసీటీవీ కెమెరాలున్నాయి. వీటిలో 'నేను సైతం' కింద 1.87 లక్షల కెమెరాలు, 'నిర్భయ, సేఫ్ సిటీ' ప్రాజెక్ట్‌ల కింద 27 వేల కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిలో సుమారు 41 శాతం కెమెరాలు పని చేయడం లేదని అధికారులు గుర్తించారు.

ప్రత్యేక వ్యవస్థే లేదు..

సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణ కోసం ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రత్యేక వ్యవస్థే లేకుండాపోయింది. అంతేకాకుండా ప్రత్యేకంగా నిధుల కేటాయింపులూ లేవు. హైవేలతో పాటు నగరాలు పట్టణాల్లోని రోడ్లపై వీటిని ఏర్పాటు చేస్తున్న పోలీసు శాఖ కూడా సొంత నిధులు వినియోగించడం లేదు. సామాజిక బాధ్యతగా కార్పొరేట్ సంస్థలు, ఇతర సంఘాలు, సంస్థలు ఇచ్చే విరాళాలు, నిధులతో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. కెమెరాల ఏర్పాటే కష్టసాధ్యంగా ఉన్న పరిస్థితుల్లో, ఏర్పాటైన కెమెరాల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాంకేతికంగా ప్రపంచదేశాలతో పోటీ పడుతున్న సైబరాబాద్‌లో కెమెరాలు పని చేయకపోవడం విచారకరం.

నిర్వహణ చేయకపోయినా బిల్లుల చెల్లింపు

మాదాపూర్ జోన్‌లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతలను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. సదరు సంస్థ కెమెరాల నిర్వహణ పేలవంగా ఉన్నట్లు గుర్తించిన ఓ ఉన్నతాధికారి ఆ సంస్థ యజమానిని కార్యాలయానికి పిలిపించి ప్రశ్నించారు. రోడ్ల విస్తరణ సమయంలో సుమారు 300 కెమెరాలు ఎటో పోయాయని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఒప్పందంలో కెమెరాలు పోయినా కూడా కొత్తవి ఏర్పాటు చేసే బాధ్యత నిర్వహణ సంస్థదే కదా అని సదరు అధికారి ప్రశ్నించగా.. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు తెలిసింది. పైగా సదరు అధికారి తనను వేధిస్తున్నాడంటూ ఆపై ఉన్నతాధికారులకు, పలుకుబడి ఉన్న వాళ్లతో చెప్పడంతో సదరు అధికారి షాక్‌కు గురయ్యారు. అయితే 2020 నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకూ అదే నిర్వహణ సంస్థకు కెమెరాల నిర్వహణ బిల్లులు పేరిట రూ.5.75 కోట్లు ప్రభుత్వం నుంచి చెల్లించడం గమనార్హం. నిర్లక్ష్యం, నిర్వహణ చేయకపోవడంపై సదరు ఏఎంసీ కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సంబంధిత అధికారి లేఖ రాసినట్లు సమాచారం.

'జూబ్లీహిల్స్'కు సన్నద్ధంగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వీ కర్ణన్

లక్డీకాపూల్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సజావుగా, సమర్థంగా నిర్వహించడానికి నోడల్ అధికారులు సన్నద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నిర్వహణపై నోడల్ అధికారులతో నిర్వహించిన ప్రాథమిక సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్ల అవగాహన కార్యక్రమాల కోసం ఈవీఎం, వీవీపీఏటీ లను సిద్ధం చేయాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రాథమిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, శ్రీనివాస్ రెడ్డి, హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ బోర్ఖడే, రవి కిరణ్, అదనపు కమిషనర్లు అలివేలు మంగతాయారు, వేణు గోపాల్, గీతా రాధిక, విజిలెన్స్ ఏఎస్పీ సుదర్శన్, సీవీవో డాక్టర్ అబ్దుల్ వకీల్, పీఆర్ఎం దశరథం తదితరులు పాల్గొన్నారు.

25న బతుకమ్మకుంటలో బతుకమ్మ

- పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు



బతుకమ్మ కుంట వద్ద నేతలు, అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: అంబర్‌పేటలోని బతుకమ్మకుంట ఈసారి బతుకమ్మ వేడుకలకు సిద్ధమవుతోంది. ఈ నెల 25న ఇక్కడ నిర్వహించనున్న కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. హైడ్రా అధీనంలో పునరుజ్జీవం పొందిన ఈ కుంటను అదే రోజు ప్రజలకు అంకితం చేయనున్నారు. ఆ ఏర్పాట్లను ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. బతుకమ్మ కుంటకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా బతుకమ్మ ఉత్సవాలు జరగాలని వేంనరేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 'ఆక్రమణలకు గురై నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి, పిచ్చి మొక్కలు పెరిగి అటువైపు వెళ్లాలంటే కాదు.. కనీసం చూడాలంటే భయపడే విధంగా బతుకమ్మ కుంట మారిపోయింది. కబ్జాల చెర నుంచి దీనికి విముక్తి కల్పించి సర్వాంగ సుందరంగా తీర్చడంలో హైడ్రా కృషి అభినందనీయం' అని మేయర్ విజయలక్ష్మి, మాజీ ఎంపీ వీహెచ్ అన్నారు.

జూబ్లీహిల్స్‌లో మనదే విజయం

- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి
- పార్టీ నేతలంతా కలిసికట్టుగా పని చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. గత 22 నెలలుగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. మంగళవారం నగరంలో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత పదేళ్ల తమ ప్రభుత్వ పాలనకు భిన్నంగా, కాంగ్రెస్ పార్టీ విధానాలు నగరాన్ని పూర్తిగా కుప్పకూలేలా ఉన్నాయని, ఈ విషయాన్ని నగర ప్రజలు గమనిస్తున్నారని స్పష్టం చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాల్సిందేనని ప్రజలు భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన భయం కారణంగా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందన్నారు. కాంగ్రెస్ అసమర్థ విధానాలతో ప్రతికూల ప్రభావం తీవ్రంగా ఉందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ సీనియర్ నేతలు, ఇన్‌చార్జిలతో కేటీఆర్‌తో చర్చించారు. పార్టీ నేతలంతా కలిసికట్టుగా పనిచేసి, జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ విజయయాత్రను తిరిగి ప్రారంభించాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

లక్డీకాపూల్: గ్రేటర్ పరిధిలో చేపడుతున్న ఇంజినీరింగ్ ప్రాజెక్టులు, ఎస్ఎన్‌డీపీ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఎస్ఎన్‌డీపీ పనులపై జోనల్ కమిషనర్లు, ప్రాజెక్టు ఇంజినీర్లు, ప్లానింగ్, భూసేకరణ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు పనుల వేగవంతానికి కమిషనర్ దిశానిర్దేశం చేశారు. యుటిలిటీ షిఫ్టింగ్, పెండింగ్ భూసేకరణ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. హై సిటీ కింద చేపడుతున్న పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో జోనల్ కమిషనరుల అనురాగ్ జయంతి, బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, హేమంత్ కేశవ్ పాటిల్, శ్రీనివాస్ రెడ్డి, రవి కిరణ్, ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ జోతిర్మయి (ఎస్ఎన్‌డీపీ లేక్స్), చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, ప్రత్యేక ఉప కలెక్టర్ రాములు నాయక్ పాల్గొన్నారు.

మరో 5 చోట్ల.. జంక్షన్ ఫ్రీ

- ఆరాంఘర్ వద్ద ఆర్‌యూబీలు, మిగతా నాలుగుచోట్ల ఫ్లై ఓవర్లు
- నిర్మాణాలకు సిద్ధమవుతోన్న జీహెచ్ఎంసీ



టీకేఆర్ కాలేజీ, ఒమర్ హోటల్, బండ్లగూడ, మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్ ప్రాంతాల్లో..

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటికే గ్రేటర్‌లోని పలు జంక్షన్లలో సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కోసం ఫ్లై ఓవర్లు వచ్చాయి. కొత్తగా మరిన్ని ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ల కోసం టెండర్ల దశలో ఉన్నాయి. వాటిలో కొన్ని టెండర్లు పూర్తయ్యాయి. అవి అలా ఉండగానే.. నాగార్జునసాగర్ రింగ్ రోడ్ -శంషాబాద్ ఎయిర్ పోర్ట్ రాకపోకలు సాగించే వారికి సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కోసం మరో ఐదు ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు, ఆర్‌యూబీ (రోడ్ అండర్‌బ్రిడ్జి)ల నిర్మాణాలకు జీహెచ్ఎంసీ సిద్ధమవుతోంది. ఇవన్నీ కూడా భవిష్యత్‌లో రానున్న ఎయిర్‌పోర్ట్ మెట్రో రైలు మార్గంలో ఉండటంతో మెట్రో వర్గాలతో సమన్వయంతో సదరు ప్రాజెక్టుల డిజైన్లు తదితరాలకు జీహెచ్ఎంసీ సిద్ధమవుతోంది. త్వరలోనే ఫీజిబిలిటీ స్టడీ, డీపీఆర్‌లు పూర్తి చేసి పనులు చేపట్టనున్నట్లు సంబంధిత ఇంజినీర్లు తెలిపారు. దాదాపు మూడునెలల్లో ఇవి పూర్తయ్యాక టెండర్లు పిలవనున్నట్లు పేర్కొన్నారు.

పనులు ఇవీ..

1. టీకేఆర్ కాలేజీ జంక్షన్ ఫ్లై ఓవర్: టీకేర్ కాలేజీ జంక్షన్, గాయత్రినగర్ జంక్షన్, మందమల్లమ్మ జంక్షన్‌ల మీదుగా ఆరు లేన్లతో ఫ్లై ఓవర్.
2. ఒమర్ హోటల్ జంక్షన్ ఫ్లై ఓవర్: హఫీజ్‌బాబానగర్ జంక్షన్- బాలాపూర్- చర్చిరోడ్ జంక్షన్ (ఒమర్ హోటల్ నుంచి మెట్రో ఫంక్షన్ హాల్ మీదుగా షోయబ్ హోటల్) వరకు ఆరులేన్ల ఫ్లై ఓవర్.
3. బండ్లగూడ జంక్షన్ ఫ్లై ఓవర్: బండ్లగూడ- ఎర్రకుంట జంక్షన్ వద్ద ఆరులేన్ల ఫ్లై ఓవర్.
4. మైలార్‌దేవ్‌పల్లి జంక్షన్ ఫ్లై ఓవర్: మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్ రోడ్, కాటేదాన్ జంక్షన్‌ల వద్ద ఆరులేన్ల ఫ్లై ఓవర్.
5. ఆరాంఘర్ జంక్షన్ ఆర్‌యూబీలు: ఆరాంఘర్ జంక్షన్ వద్ద ప్రస్తుతమున్న ఆర్‌యూబీకి రెండు వైపులా రెండు లేన్లతో మరో రెండు ఆర్‌యూబీలు.

- ఈ పనులను వేటికవి విడివిడిగానే చేయనున్నారు.
- పనులు పూర్తయితే సికింద్రాబాద్, ఉప్పల్ సహా వివిధ మార్గాల నుంచి ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సాగించే వారికి ట్రాఫిక్ చిక్కులు లేని సాఫీ ప్రయాణంతో ఎంతో సమయం కలిసి వస్తుందని, వ్యయ ప్రయాసలు తగ్గుతాయని అధికారులు చెబుతున్నారు.
- డీపీఆర్‌లో భాగంగా టోపోగ్రాఫికల్ సర్వే, ట్రాఫిక్ సర్వే నిర్వహించడంతో పాటు రద్దీ సమయాల్లో సదరు మార్గాల్లో ప్రయాణించే వాహనాలు, కారిడార్‌లో రానున్న మెట్రోరైలు, సీటీఎస్ (కాంప్రహెన్సివ్ ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్ట్‌స్టడీ) మాస్టర్‌ప్లాన్, బీఆర్‌టీఎస్ (బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్)లో రాబోయే ప్రాజెక్టులు తదితర అంశాలు పరిగణనలోకి తీసుకోనున్నారు.
- హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)ప్రాజెక్ట్ కింద ఎల్‌బీనగర్–ఆరాంఘర్ కారిడార్ పనుల్లో భాగంగా వీటిని చేపట్టనున్నారు.
- ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూర్, చెన్నైల కంటే హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా పెద్దది కావడం, టీసీయూఆర్ (తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్) వరకు నగరంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యల్లేకుండా చేయాలనే తలంపుతో ప్రభుత్వం ఉన్నందున ఈ ఫ్లై ఓవర్లు ఎంతో అవసరమని భావిస్తున్నారు. అదే మార్గంలో డీఆర్‌డీఎల్, డీఆర్‌డీఓ, మిధాని వంటి పరిశోధన సంస్థలు, లేబొరేటరీలు ఉండటం తెలిసిందే. ఇప్పటికే గ్రేటర్ జనాభా కోటికి పైగా ఉండటమే కాక భవిష్యత్‌లో మరింత పెరగనుండటంతో ట్రాఫిక్ సమస్యలు పెరగకుండే ఉండేందుకు ఇవి అవసరం కానున్నాయి.

నవరాత్రికి శక్తి స్వరూప్ కాంటెస్ట్..

- సోషల్ మీడియాలో ఎక్కువ లైక్స్ పొందిన వారే విజేత
- పోస్టర్ ఆవిష్కరించిన వైడీఐ ఈవెంట్స్–వెడ్డింగ్స్..



సాక్షి, సిటీబ్యూరో: ఈ సారి నవరాత్రి వేడుకల్లో భాగంగా నగరంలో 'శక్తి స్వరూప్–2025' అనే వినూత్న వేడుకలకు వేదికగా నిలువనుంది. ప్రతి ఏడాదీ ఘనంగా నిర్వహించే గర్బా, డాండియాలే కాకుండా 9 రోజుల పాటు దుర్గామాత అవతారాలను ప్రతిబింబించేలా వేషధారణతో శక్తి స్వరూప్–2025 ఆన్‌లైన్ ఫొటో కాంటెస్ట్ వైడీఐ ఈవెంట్స్–వెడ్డింగ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దీని పోస్టర్‌ను బంజారాహిల్స్‌లో మంగళవారం ఆవిష్కరించారు. నవరాత్రి సారాంశంతో ఈ తరాన్ని తిరిగి అనుసంధానించేలా సాంస్కృతిక పోటీ ఉంటుందని, ఆన్‌లైన్ లైక్స్ ద్వారా విజేతలను ఎంపిక చేస్తామని వ్యవస్థాపకులు యశ్ జోషి తెలిపారు. అన్ని వయస్సుల వారూ తమ ఫొటోలను అధికారిక ఇన్‌స్టా పేజీ @ydieventsweddings లో పంచుకోవచ్చని, విజేతలకు నగదు బహుమతులుంటాయని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్లకు సెప్టెంబర్ 18 చివరి తేదీ అని పేర్కొన్నారు.

నేటి నుంచి స్పెషల్ మెడికల్ క్యాంపులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 46 లక్షల మంది బాలికలు, మహిళల హెల్త్ స్క్రీనింగ్ కోసం ప్రత్యేకంగా డ్రైవ్ చేపడుతున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వెంకటి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 91 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ఆసుపత్రుల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో గాంధీ, ఉస్మానియా, నిమ్స్, సరోజినీదేవి నేత్రాలయం, ఈఎన్‌టీ, ఇతర ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, ప్రైవేటు ఆసుపత్రుల బృందాలు సైతం ఈ స్క్రీనింగ్‌లో భాగస్వామ్యులవుతారని తెలిపారు. బీపీ, షుగర్, కేన్సర్, అనీమియా, సికిల్ సెల్, గైనిగ్, ఇతర స్పెషలిస్టు వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిలుకూరులో కృష్ణాష్టమి వేడుకలు



మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయంలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని మంగళవారం ఉట్ల పండుగను ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రంగరాజన్ మాట్లాడుతూ.. ఉట్ల పండుగ అంటే కేవలం హాండీ పగలగొట్టడం కాదని.. అది వర్ణ, కుల, తరగతుల మధ్య ఉన్న భిన్నతలను తొలగించడం అన్నారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని నిర్వహించే ఈ వార్షిక పండుగ ఐక్యతను ప్రతిబింబిస్తుందన్నారు. వేడుకల్లో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణ స్వామి, అర్చకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రెండో రోజూ దొరకని ఆచూకీ

- నాలాల్లో కొట్టుకుపోయిన వారికోసం ముమ్మర గాలింపు
- బంధువుల్లో తొలగని విషాదం



ఆచూకీ కోసం నాలా వెంబడి గాలిస్తున్న దృశ్యం

నాంపల్లి: అఫ్జల్‌సాగర్ నాలాలో పడి కొట్టుకుని పోయిన మాన్గార్ బస్తీ యువకుల ఆచూకీ కోసం రెండవ రోజూ గాలింపు ప్రక్రియ కొనసాగింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి హబీబ్‌నగర్ మాన్గార్ బస్తీకి చెందిన అర్జున్(26), రామా(25) అనే ఇద్దరు యువకులు అఫ్జల్‌సాగర్ నాలాలో పడి కొట్టుకుని పోయిన విషయం తెలిసిందే. అయితే వీరి ఆచూకీ కోసం డీఆర్‌ఎఫ్, జీహెచ్‌ఎంసీ రెస్క్యూ టీమ్‌లు సంయుక్తంగా మంగళవారం గౌలిగూడ చమన్ వద్ద వెతుకులాట ప్రారంభించారు. మొదటి రోజు అఫ్జల్‌సాగర్ నుండి గౌలిగూడ చమన్ వరకు గాలించారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. రెండవ రోజు ఉదయాన్నే గౌలిగూడ చమన్ వద్ద ఆపరేషన్‌ను షురూ చేశారు. సాయంత్రం వరకు వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇక్కడే చెత్త పేరుకుందని, ఈ చెత్తలోనే శవాలు ఇరుక్కుని ఉంటాయనే భావనతో గాలిస్తున్నారు. హైడ్రా కూడా డ్రోన్ సహాయంతో మూసీ పరివాహకమంతా పరిశీలించింది. రెండవ రోజు ఎక్కడా ఆనవాళ్లు, ఆచూకీ లభించలేదు. బుధవారం గౌలిగూడ చమన్ వద్దే గాలింపు జరుగనుంది.

బంధువుల ఆందోళన

అబిడ్స్: అఫ్జల్‌సాగర్ నాలాలో ఇద్దరు యువకులు కొట్టుకుపోయి రెండురోజులు గడుస్తున్నా ఆచూకీ లభించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. అఫ్జల్‌సాగర్ సాగర్ నుంచి వెళ్లే నాలా ఆగాపురా దారుసలాం, గోషామహల్, ఉస్మాన్‌గంజ్, కిషన్‌గంజ్, గౌలిగూడ మీదుగా మూసీలో కలుస్తుంది. గౌలిగూడ ప్రాంతంలో నాలాలో చెత్తా చెదారం పెరిగిపోవడం, డీసిల్టింగ్ చేపట్టకపోవడంతో స్థానిక ప్రజలు, గల్లంతైన యువకుల కుటుంబాలు జీహెచ్‌ఎంసీ తీరుపట్ల ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం రాత్రి అర్జున్, రామ కుటుంబాల సభ్యులు గౌలిగూడ నాలా వద్ద ఆందోళనకు దిగారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాత్రి 9 గంటల సమయంలో హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు గౌలిగూడ నాలా పైకప్పు తొలగించే కార్యక్రమం చేపట్టారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు.



గౌలిగూడ నాలా పైకప్పు తొలగిస్తున్న హైడ్రా, జీహెచ్‌ఎంసీ సిబ్బంది



గౌలిగూడ నాలా వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

వినోభానగర్‌లో..



వినోభానగర్‌లో నాలాలో కొట్టుకు వచ్చిన వాహనాన్ని బయటకు తీసిన హైడ్రా సిబ్బంది

ముషీరాబాద్: గత మూడు రోజుల క్రితం భారీ వర్షం వల్ల ముషీరాబాద్ వినోభానగర్ నాలాలో ప్రమాదవశాత్తు కొట్టుకుపోయిన దినేష్ (సన్నీ) ఆచూకీ మంగళవారం రాత్రి వరకు కూడా లభించలేదు. దీంతో కుటుంబసభ్యుల రోదనలు అందరిని కలచివేస్తున్నాయి. హైడ్రా, జీహెచ్‌ఎంసీ సిబ్బంది వినోభానగర్ నాలాలో దినేష్ పడ్డ చోటు నుంచి 9 మంది బృందంతో మళ్లీ గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఫలితం కన్పించలేదు. హైడ్రా ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ దత్తూ పర్యవేక్షణలో వినోభానగర్, ప్రేయర్‌పవర్ చర్చి, పార్శిగుట్ట, ఆశీర్వాద్ అపార్టుమెంట్, అడిక్‌మెట్ వరకు నాలాలో మ్యాన్‌హోల్ మూతలు తెరిచి దినేష్ కోసం గాలించారు. ప్రేయర్‌పవర్ చర్చి వద్ద నాలాలో కొట్టుకు వచ్చిన దినేష్ ద్విచక్రవాహనాన్ని హైడ్రా సిబ్బంది బయటకు తీశారు. వాహనం చోటే చిక్కుకున్నాడేమోనని అనుమానంతో నాలా చుట్టూ స్లాబ్‌ను పగులగొట్టి గాలించినా అతని ఆచూకీ లభించలేదు.

'రియల్' వ్యాపారి హత్య కేసులో ముగ్గురి అరెస్టు

కుషాయిగూడ: కుషాయిగూడ పరిధి మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, మంగాపురం కాలనీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మొగుళ్ల శ్రీకాంత్‌రెడ్డి (42) హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు రిమాండ్‌కు తరలించినట్లు మంగళవారం కుషాయిగూడ ఏసీపీ వై.వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వచ్చిన విభేదాల కారణంగానే ఈ హత్య చోటుచేసుకుందని తెలిపారు. ఈ క్రమంలోనే శ్రీకాంత్‌రెడ్డి వద్ద పనిచేస్తున్న ధన్‌రాజ్ గుడ్‌విల్ ఇవ్వలేదనే కక్షతో..మరికొందరి సహకారంతో శ్రీకాంత్‌రెడ్డిని హతమార్చినట్లు వెల్లడించారు.

సంతోష్‌ను తప్పుదోవ పట్టించి..

ధన్‌రాజ్ మొదట హత్యకు పథకం వేసి..శ్రీకాంత్‌రెడ్డితో వివాదాలున్న లాలాగూడకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సంతోష్‌ను ఆశ్రయించాడు. శ్రీకాంత్‌రెడ్డి నిన్ను చంపేందుకు ప్లాన్ చేస్తున్నాడంటూ అతన్ని తప్పుదోవ పట్టించాడు. దీంతో ఇద్దరు కలిసి శ్రీకాంత్‌రెడ్డిని హతమార్చేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు ఓ సెలూన్‌లో పరిచయమైన డేనియల్ సహకారం కూడా తీసుకుని ఈ నెల 12న శ్రీకాంత్‌రెడ్డిని హతమార్చినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ధన్‌రాజ్, సంతోష్, డేనియల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



సేవియా నాయక్ (ఫైల్)

రామంతాపూర్ : విద్యుత్ స్తంభంపై ఉన్న పాత సర్వీస్ వైర్‌ను తొలగించే క్రమంలో షాక్‌కు గురై కాంట్రాక్టు విద్యుత్ కార్మికుడు మృతి చెందిన సంఘటన రామంతాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యానగర్ నరసింహ బస్తీలో నివసించే బానోత్ సేవియా నాయక్ (47) రామంతాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లింగానాయక్ అనే కాంట్రాక్టర్ వద్ద రోజు వారికూలీగా పని చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో మంగళవారం పనిలో భాగంగా గణేష్‌నగర్ విద్యుత్ స్తంభంపై ఉన్న పాత సర్వీస్ వైర్‌ను తొలగిస్తుండగా..అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై పైనుంచి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా సేవియా నాయక్ కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో కాంట్రాక్టర్ మృతుని కుటుంబానికి రూ.7.5 లక్షల నష్ట పరిహారాన్ని అందించేందుకు అంగీకరించడంతో బంధువులు ఆందోళన విరమించారు. ఉప్పల్ పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పిన ట్యాంకర్

- ఉప్పల్ ఆలయం వద్ద ప్రహరీని ఢీకొన్న వాహనం
- ఇద్దరికి గాయాలు



ఆలయ ప్రహరీని ఢీకొట్టి నుజ్జయిన ట్యాంకర్

ఉప్పల్: నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఉప్పల్ అభయాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణం వద్ద మంగళవారం పెను ప్రమాదం తప్పింది. హబ్సిగూడ నుంచి ఉప్పల్ వైపు వస్తున్న సెప్టిక్ ట్యాంక్ ట్యాంకర్ అదుపుతప్పి ఆలయ ప్రహరీని ఢీకొట్టడంతో అది పూర్తిగా కుప్పకూలింది. దీంతో ఆ రూట్లో వెళ్తున్న వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో ప్రహరీ సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇక వాహన డ్రైవర్ కుమార్ నాయక్, క్లీనర్ శివలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. గతంలో కూడా ఇలాగే ఆలయ ప్రహరీని లారీ ఢీకొట్టడంతో ఒకరు మృత్యువాత పడిన సంగతి విదితమే. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా చేసి క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు తొలగించారు.

మూడేళ్ల కుమారుడిని చంపిన తండ్రి అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న చాంద్రాయణగుట్ట ఏసీపీ సుధాకర్

చాంద్రాయణగుట్ట: మూడేళ్ల కుమారుడిని కర్కశంగా హత్య చేసి మూసీ నదిలో పడేసిన తండ్రిని బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసీపీ ఎ.సుధాకర్, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్‌తో కలిసి విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. నూరీనగర్‌కు చెందిన కూరగాయలు విక్రయించే మహ్మద్ అక్బర్ చిన్న కుమారుడు మహ్మద్ అనాస్(3)కు గుండె సంబంధించి సమస్య ఉండడంతో చికిత్స విషయంలో భార్య సనా బేగంతో తరచూ గొడవ జరుగుతుంది. ఈ క్రమంలోనే కుమారుడిని అడ్డు తొలగించుకోవాలనుకున్న అక్బర్ ఈ నెల 13వ తేదీన తెల్లవారుజామున ముఖంపై దిండుతో అదిమిపట్టి కుమారుడిని హత్య చేశాడు. ఎలాంటి సాక్ష్యం ఉండొద్దని మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి బండిపై తీసుకెళ్లి నయాపూల్ బ్రిడ్జి పైనుంచి మూసీ నదిలో పడేసి...ఏమి తెలియనట్లుగా ఇంటికి చేరుకున్నాడు. ఉదయాన్నే నిద్రలేచిన సనా బేగం కుమారుడు కనిపించకపోవడంతో స్థానికంగా వెతికారు. అనంతరం అదేరోజు ఉదయం బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్న అక్బర్ నేర చరిత్రను తెలుసుకున్న పోలీసులు అనుమానంతో అతన్ని గట్టిగా ప్రశ్నించడంతో నేరం అంగీకరించాడు. గోనె సంచికి తాడు కట్టి తీసుకెళుతున్న దృశ్యాలను కూడా పోలీసులు సీసీ కెమెరాలో గుర్తించారు. హత్య కేసు నమోదు చేసుకొని నిందితుడిని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. కాగా బాలుడి మృతదేహం కోసం మూసీ నదిలో పోలీసులు డీఆర్‌ఎఫ్, హైడ్రా సిబ్బందితో కలిసి గాలిస్తున్నారు. ఇప్పటికీ మృతదేహం లభ్యం కాలేదు. సమావేశంలో డీఐ బి.శ్రీనివాసారావు, ఎస్సై బి.సుభాష్ పాల్గొన్నారు.

విధులకు హాజరై..వాష్‌రూంలో కుప్పకూలి..

మియాపూర్ డిపోలో గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి



మృతిచెందిన పండరి

మియాపూర్: ఓ ఆర్టీసీ కండక్టర్ విధుల్లో ఉండి..వాష్ రూమ్‌కు వెళ్లగా గుండెపోటు రావడంతో కుప్పకూలి మృతిచెందిన సంఘటన ఆర్టీసీ మియాపూర్–2 డిపోలో చోటుచేసుకుంది. డిపో అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని దామరగిద్ద గ్రామానికి చెందిన దరుకు పండరి(44) మియాపూర్–2 డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పటాన్‌చెరు నుండి కోఠీ వెళ్లే మెట్రో డీలక్స్ బస్సులో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రతిరోజు మాదిరిగానే ఉదయం 6:30 గంటలకు విధులకు హాజరయ్యాడు. రిజిస్టర్‌లో సంతకం పెట్టి అక్కడ ఉన్న తోటి ఉద్యోగులతో మాట్లాడి వాష్‌రూమ్‌కి వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. పండరి వాష్‌రూమ్‌లోనే ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. తోటి ఉద్యోగులు గమనించి 108కు సమాచారం అందించి ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం కొండాపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే పండరి గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంటి పెద్దదిక్కు కోల్పోవడంతో భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. విధులకు వచ్చిన ఉద్యోగి కళ్ల ముందే కుప్పకూలిన ఘటనతో తోటి ఉద్యోగులు, సిబ్బంది తీవ్రంగా కలత చెందారు.

'హత్యా'చారం జరిగిందా?

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతదేహం లభ్యం



సంఘటన స్థలంలో పోలీసులు

రాజేంద్రనగర్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం..కిస్మత్‌పూర్ బ్రిడ్జి పక్కనే ఉన్న కల్లు కంపౌండ్ సమీపంలోని పొదల్లో ఓ మహిళ మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా ఒంటిపై ఎలాంటి దుస్తులు లేకుండా పడి ఉంది. సంఘటన జరిగి రెండు, మూడు రోజులు కావస్తుండటంతో పాటు రెండు రోజులుగా వర్షాలు పడటంతో మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించింది. క్లూస్ టీమ్, డాగ్స్ టీమ్‌ను రప్పించిన పోలీసులు ఆధారాలు సేకరించారు. మృతదేహానికి కొద్ది దూరంలో నల్లటి స్కార్ప్, నల్లటి పైజామా కనిపించింది. మృతురాలు వయస్సు 25–30 సంవత్సరాలు ఉంటుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మహిళను ఇక్కడికి తీసుకొచ్చి లైంగిక దాడికి పాల్పడి చంపారా..లేదా ఇతర ప్రాంతంలో హత్య చేసి ఇక్కడ పడేశారా అన్నది దర్యాప్తులో తేలనుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించామన్నారు. మృతురాలికి సంబంధించిన ఫొటోలను అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించామన్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిస్తే రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఔటర్‌పై ఘోర ప్రమాదం

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన లారీ

- ఒకరు మృతి.. నలుగురి పరిస్థితి విషమం



శివకోటి మృతదేహం



ఘటనా స్థలిలో నుజ్జునుజ్జయిన వాహనం

ఇబ్రహీంపట్నం రూరల్: రోజు వారీ పనుల్లో అలసిన కార్మికులు సేదతీరుదామనుకున్నారు. సరదాగా వెళ్లిన వారి ప్రయాణాన్ని మృత్యువు వెంటాడింది. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి ఆదిబట్ల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రవి కుమార్, ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం పొందూరు గ్రామానికి చెందిన రాజేంద్ర కీసర మండలం బోగారంలో బిల్డర్. అతని వద్ద వినుకొండకు చెందిన శివకోటి(27), పొందూరుకు చెందిన కాంత్రికుమార్, శ్రీహరి, మహేశ్‌వర్మ, రామకృష్ణ కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం వారంతా కలిసి రోజు పనుల్లో అలసిపోతున్నాం.. సరదాగా ఎయిర్‌పోర్టు చూసొద్దామని నిర్ణయించుకున్నారు. రాత్రి భోజనం పూర్తి చేసుకుని కారులో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఓఆర్‌ఆర్‌పై బొంగ్లూరు జంక్షన్ సమీపంలో ఎగ్జిట్ 13–12 మధ్య శ్రీశ్రీ ఎరోసిటీ సమీపంలో మూత్ర విసర్జన కోసం పార్కింగ్ లైట్లు వేసి కారు నిలిపారు. ఇద్దరు కా రులో కూర్చోగా మరో నలుగురు కారు ఎదుట ఉన్నారు. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ వీరి కారును ఢీకొట్టి ముందు మూత్రవిసర్జన చేస్తున్న వారిపైకి ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో శివకోటి అక్కడికక్కడే మృతి చెందగా బిల్డర్ పరిస్థితి విషమంగా ఉంది. రామకృష్ణ, శ్రీహరి, క్రాంతికుమార్ పరిస్థితి 24గంటలు గడిస్తేనే చెప్పగలమన్నారు. మహేశ్‌వర్మకు స్వల్పగాయాలయ్యాయి. మృతుడు, క్షతగాత్రులంతా దగ్గరి బంధువులు. శివకోటి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాద సమయంలో లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సైబర్ బాధితులకు రూ.9.29 కోట్లు రిఫండ్

లోక్ అదాలత్‌లో అనేక కేసుల పరిష్కారం: అదనపు సీపీ

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాలైన సైబర్ నేరాల్లో బాధితులుగా మారిన వారికి జాతీయ లోక్ అదాలత్ ద్వారా రూ.9.29 కోట్లు రిఫండ్ చేశామని అదనపు సీపీ (నేరాలు) పి.విశ్వప్రసాద్ మంగళవారం ప్రకటించారు. ఇది బాధితుల ఫిర్యాదుతో తక్షణం స్పందించి వివిధ బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేసిన మొత్తమని పేర్కొన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి 941, శాంతిభద్రతల విభాగానికి సంబంధించి 1977 కేసులతో పాటు 21,394 ఈ–పెట్టీ కేసులు, 3803 ట్రాఫిక్ ఉల్లంఘనల కేసులు సైతం పరిష్కారమైనట్లు ఆయన పేర్కొన్నారు.

నవ వధువు ఆత్మహత్య



రమ్య (ఫైల్)

మూసాపేట: నవ వధువు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మూసాపేట యాదవ బస్తీలో నివాసముండే సూరవరపు రమ్య (18)కు మూడు నెలల క్రితం అశోక్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. వివాహం జరిగినప్పటి నుంచి కూతురు, అల్లుడు అత్తింట్లోనే ఉంటున్నారు. సోమవారం రాత్రి అందరు కలిసి భోజనం చేసిన అనంతరం..రమ్య ముందుగా తన రూమ్‌కు వెళ్లి ఫ్యాన్ రాడ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త భోజనం ముగించి రూముకు వెళ్లగా డోర్ తెరుచుకోలేదు. దీంతో అందరూ కలిసి తలుపులు తెరవగా రమ్య ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

165 మెడికల్ షాపుల లైసెన్స్‌లు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మెడికల్ దుకాణాలపై తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఉక్కుపాదం మోపుతోంది. గత నెల 22 నుంచి ఈ నెల 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. మొత్తం 809 దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో అనధికారికంగా జరుగుతున్న వ్యవహారాలను గుర్తించారు. మిఫెప్రిస్టోన్, మిసోప్రోస్టోల్ మాత్రలు, అబార్షన్ కిట్ల అక్రమ అమ్మకాలను అరికట్టాలని ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ షానవాజ్ ఖాసిం తెలిపారు. తనిఖీల సమయంలో 234 దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ కిట్లు అమ్ముతున్నట్లు గుర్తించామని, ఆయా యాజమాన్యాలకు షోకాజు నోటీసులు జారీ చేశామన్నారు. ఇప్పటి వరకు 165 మెడికల్ దుకాణాల లైసెన్సులు రద్దు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



ఘటనా స్థలంలో...

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఎంబీబీఎస్ విద్యార్థినితో పాటు మరో యువకుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హన్మకొండ జిల్లాకు చెందిన ఇస్లావత్ అనూష (20) ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్‌లోని మెడిసిటీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడవ సంవత్సరం చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటుంది. కాగా మంగళవారం మధ్యాహ్నం తన స్నేహితుడు మహేశ్వర్‌రెడ్డితో కలిసి మేడ్చల్ నుండి నగరం వైపు ద్విచక్ర వాహనంపై 44వ జాతీయ రహదారిపై వెళ్తుండగా మార్గమధ్యలో ఆక్సిజన్ పార్క్ సమీపంలో వెనుక నుండి వేగంగా వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు కిందపడిపోగా అనూష శరీరంపై నుండి లారీ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన మహేశ్వర్‌రెడ్డిని మేడ్చల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం 5 గంటల సమయంలో మరణించాడు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ అక్కడి నుండి పరారయ్యాడు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రశేఖర్

నగర వ్యాప్తంగా 47 మంది అధికారుల బదిలీ



సాక్షి, సిటీబ్యూరో: తూర్పు మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా యు.చంద్రశేఖర్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన నారాయణగూడ ఠాణా స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నగర కమిషనరేట్‌లో పనిచేస్తున్న 47 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కొత్వాల్ సీపీ ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరో ముగ్గురిని రేంజ్‌కు సరెండర్ చేశారు. ఇన్‌స్పెక్టర్ బదిలీల్లో కీలకమైనవి ఇలా.. మహ్మద్ అంజద్ అలీని దోమలగూడ, కె.మారుతి ప్రసాద్‌ను నల్లకుంట, ఎం.సైదేశ్వర్‌ను నారాయణగూడ, కె.రమేష్ గౌడ్‌ను మహంకాళి, కె.రవి కుమార్‌ను బొల్లారం, ఎ.రమేష్‌ను చార్మినార్, బి.సురేష్‌కుమార్‌ను మీర్‌చౌక్, కె.ఆదిరెడ్డిని సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్, ఎ.సీతయ్యను ఫలక్‌నుమ ఠాణాలకు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా నియమించారు. వీరితో పాటు పలువురు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సైతం బదిలీ అయ్యారు. కె.రఘుకుమార్, జి.శేఖర్‌రెడ్డి, బి.భూపాల్ గౌడ్‌లను రేంజ్‌కు సరెండర్ చేశారు.

సమస్యలను మా దృష్టికి తీసుకురండి


నూతనంగా ఎన్నికైన యూనియన్ నేతలు

వెంగళరావునగర్: యూనియన్ పరంగా ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణమే యూనియన్ కార్యాలయంలో తెలియజేయాలని తెలుగు సినీ స్టూడియో వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గ నేతలు తెలియజేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని వెంకటగిరిలో యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా జి.ఈశ్వర్‌రావు తన సమీప ప్రత్యర్థి పి.శంకర నారాయణపై 71 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా ఎం.వీరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఆర్.పెద్ద ఉపేందర్ తన ప్రత్యర్థులు ఏ.రాముడు, ఎస్.నాగేశ్వరరావుపై 315 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

ఆకృతి ఎగ్జిబిషన్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హోటల్ తాజ్ డక్కెన్ వేదికగా 3 రోజుల పాటు కొనసాగనున్న ఆకృతి ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభమైంది. ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వాహకులు శశినాథ ప్రారంభించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 70 స్టాల్స్ తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

వక్ఫ్ బోర్డుపై సుప్రీంకోర్టు తీర్పు నిరాశాజనకం

ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు



మాట్లాడుతున్న బోర్డు ప్రతినిధులు

హిమాయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డుపై తీసుకువచ్చిన చట్టంపై సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర తీర్పు నిరాశాజనకంగా ఉందని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు(ఎఐఎంపీఎల్‌బీ) పేర్కొంది. ఈ మధ్యంతర తీర్పు పాక్షికంగా ఉపశమనం కల్పించినప్పటికీ మొత్తం చట్టాన్ని రద్దు చేయాలని బోర్డు డిమాండ్ చేసింది. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బోర్డు ప్రతినిధులు డా.ఎస్.క్యూ.ఆర్.ఇలియాస్, డా.మతీన్ ఖాద్రి, డా.ఎండీ ముస్తాక్ అలీ, ప్రొ.ఖుద్సియా సుల్తానా, జలీసా సుల్తానా మాట్లాడారు. సుప్రీంకోర్టు కొన్ని నవరణలపై స్టే విధించినప్పటికీ ముస్లిం సమాజం, ముస్లిం పర్సనల్ లా బోర్డు, న్యాయం కోరుతున్న పౌరులు రాజ్యాంగంలోని ప్రాథమిక నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అన్ని క్లాజులపై స్టే విధించాలని కోరిందన్నారు. అయితే కోర్టు పాక్షికంగా ఉపశమనం ఇచ్చినా విస్తృత రాజ్యాంగపరమైన ఆందోళనలను పరిష్కరించలేదని, దీంతో తమకు నిరాశ కలిగిందన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులు ఉండరాదని డిమాండ్ చేశారు. సమావేశంలో వక్ఫ్ యాక్ట్ ప్రొటెస్ట్ కమిటీ ఫర్ తెలంగాణ కన్వీనర్లు ముఫ్తీ ఒమర్ అబిదీన్, మౌలానా షఫీక్ ఆలం ఖాన్, మౌలానా గయాజ్ అహ్మద్ రషీది పాల్గొన్నారు.

జిగేల్.. సిగ్నేచర్ జువెల్లరీ షో..



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆభరణాల బ్రాండ్ జోస్ అలుక్కాస్ 'సిగ్నేచర్ జువెల్లరీ షో'ను నిర్వహిస్తోంది. బేగంపేటలోని గ్రీన్‌ల్యాండ్స్ రోడ్ షోరూమ్‌లో ఈ ఎక్స్‌పోను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జాన్ అలుక్కాస్ ప్రారంభించారు. ప్రపంచ స్థాయి వజ్రాలను కలిగి ఉన్న ఈ ప్రదర్శన అక్టోబర్ 5 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వజ్రాలలో లేటెస్ట్ డిజైన్లు, సంక్లిష్టంగా రూపకల్పన చేసిన నెక్లెస్‌లు, స్టేట్‌మెంట్ చెవిపోగులు, ప్రత్యేక బెస్పోక్ బ్రైడల్ సెట్స్‌ను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు.

మహిళ ఆత్మహత్య

రహమత్‌నగర్: మానసిక అనారోగ్యంతో బాధపడుతూ ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం వెంగళరావునగర్‌లో నివాసం ఉండే సౌజన్య కమల్(55) మానసికంగా ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలోనే ఆమె సోమవారం తన నివాసంలో ఉరి వేసుకుంది. కూమారుడు సందీప్‌కూమార్ ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

స్వచ్ఛం.. నిత్యం.. సుందరం


పచ్చదనంతో రాజ్‌భవన్ హైస్కూల్

- స్వచ్ఛ పాఠశాలలకు పురస్కారం
- జాతీయ స్థాయిలో ఎంపికైతే రూ.లక్ష
- జిల్లాస్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ
- ప్రారంభమైన శిక్షణ తరగతులు


శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పరిశీలించే వివరాలు..

అంశాలు	పాయింట్లు
నీటి సంరక్షణ, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ	22
మౌలిక సౌకర్యాలు	27
వ్యక్తిగత, చేతుల శుభ్రత	14
వ్యర్థాలు, చెత్తా చెదారం తొలగింపు	21
విద్యార్థుల నడవడిక, ఆరోగ్య పరిరక్షణ	20
మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిర్మూలన	21

బంజారాహిల్స్: కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయ రేటింగ్(ఎస్‌హెచ్‌వీఆర్) 2025–26 పేరిట ప్రోత్సాహకాలను అందించేందుకు సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టి పాఠశాలల్లో స్వచ్ఛతపై పోటీతత్వాన్ని కల్పించింది. ఇందు కోసం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, గురుకులాలు తదితర విద్యాలయాల్లో ఆరు ప్రధాన అంశాలను పరిగణలోనికి తీసుకుని స్వచ్ఛ బడులకు ర్యాంకింగ్‌లు ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట, సోమాజిగూడ, ఖైరతాబాద్, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత, 4 గురుకులాలు, 245 ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి స్వచ్ఛ బడుల కోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు మొదటి దశలో ఒక్కో మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఇచ్చారు. వీరు నేర్చుకున్న అంశాలను మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

- ఖైరతాబాద్ జోన్ పరిధిలో 17 ప్రభుత్వ ఉన్నత, 43 ప్రభుత్వ ప్రాథమిక, 2 ఎయిడెడ్, 4 గురుకులాలు, 245 ప్రైవేటు పాఠశాలలు రేటింగ్‌లో పాల్గొననున్నాయి.
- జాతీయ స్థాయిలో స్వచ్ఛ బడులకు ఎంపికైతే సంబంధిత పాఠశాలకు రూ.లక్ష పురస్కారం లభిస్తోంది.
- పాఠశాలల్లో పచ్చదనం–పరిశుభ్రత మెరుగుపర్చడంతో పాటు పిల్లల్లో ఆహ్లాదకర, స్నేహపూరిత వాతావరణం పెంపొందించడం దీని ముఖ్య ఉద్దేశ్యం.
- తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడం.. విద్యార్థుల్లో వ్యక్తిగత శుభ్రత గురించి అవగాహన కలిగిస్తూ సామాజిక మార్పునకు శ్రీకారం చుట్టడం స్వచ్ఛ బడుల పురస్కారం ముఖ్య ఉద్దేశ్యం.

ఎంపికకు కమిటీలు..

పాఠశాలలకు వచ్చిన రేటింగ్‌ను ఆధారంగా జిల్లాస్థాయిలో కలెక్టర్, డీఈఓ ముగ్గురు పాధ్యాయులతో కూడిన కమిటీ, రాష్ట్ర స్థాయిలో విద్యా, వైద్య, పంచాయతీరాజ్ ఉన్నతస్థాయి అధికారులతో కూడిన కమిటీలు ఎంపిక చేసి జాతీయ స్థాయికి పంపిస్తారు. జాతీయ స్థాయిలో ఎంపికైతే రూ.లక్ష ప్రోత్సాహకం, పురస్కారం లభిస్తుండటంతో దాదాపు అన్ని పాఠశాలలు ఈ పోటీలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపించనున్నాయి. స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయ రేటింగ్ కార్యక్రమానికి సంబంధించి మండల స్థాయిలో అన్ని పాఠశాలల సిబ్బందికి శిక్షణ ఇచ్చిన అనంతరం ఈ నెల 30వ తేదీలోపు యాప్‌లో పూర్తి వివరాలు నమోదు చేసుకునే విధంగా చర్యలు చేపట్టనున్నారు. విద్యాశాఖ అధికారులచే పర్యవేక్షణ ఉంటుంది.

ఇలా నమోదు చేసుకోవాలి

పురస్కారాల నమోదుకు మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఎస్‌హెచ్‌వీఆర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో యూ–డైస్ కోడ్, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయ్యి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సంబంధిత పాఠశాల పూర్తి వివరాలు నమోదు చేయాలి. అక్కడ సూచించిన 60 ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ వాటికి సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. మొత్తంగా 125 పాయింట్లు ఉంటాయి. మొత్తం ప్రశ్నలకు 125 పాయింట్లు సాధిస్తే ఫైవ్‌స్టార్ రేటింగ్ ఇస్తారు. 1 నుంచి 8వ తరగతి వరకు మొదటి కేటగిరీ, 9 నుంచి 12వ తరగతి వరకు రెండో కేటగిరిగా విభజిస్తారు. 30వ తేదీలోగా పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అన్ని పాఠశాలలకు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అవగాహన కల్పించడమే కాకుండా ఎలా నమోదు చేసుకోవాలో తెలియజేస్తారు.

నవంబర్ 1 నుంచి ఎన్ఎస్ఎన్ కరాటే లీగ్


పోస్టర్ ఆవిష్కరణలో సినీ నటుడు ఇంద్రసేన్, చైర్మన్ సిద్దురెడ్డి తదితరులు

బంజారాహిల్స్: నవంబర్ 1, 2 తేదీల్లో జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఎన్ కరాటే చైర్మన్ సిద్దురెడ్డి తెలిపారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సినీ నటుడు ఇంద్రసేన్, నేషనల్ టీం కరాటే కోచ్ కీర్తన్‌తో కలిసి పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఎన్ఎస్ఎన్ కరాటే లీగ్ 2025లో దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. 21 కేటగిరిలలో జరిగే ఈ పోటీల్లో సుమారు 2 వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని వెల్లడించారు. నేషనల్ కరాటే టీమ్ కోచ్ కీర్తన్ మాట్లాడుతూ రాష్ట్రంలో సైతం మారుమూల ప్రాంతాల నుంచి వచ్చి జాతీయ స్థాయిలో ఎంతో మంది క్రీడాకారుల పతకాలు సాధించారని ప్రోత్సహిస్తే ప్రతిభగల క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారన్నారు. అలాంటి వారందరికీ ఇదో చక్కని వేదిక అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎన్ కరాటే లీగ్ ప్రెసిడెంట్ నరేష్, కార్యదర్శి నాని, కోశాధికారి శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సింగిల్‌వైర్ లైన్‌కు త్రీ ఫేజ్ ద్వారా విద్యుత్ సరఫరా


విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేపట్టిన సిబ్బందితో ఏడీఈ అధికారులు

వెంగళరావునగర్: దసరా నవరాత్రి ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు సింగిల్ వైర్ లైన్‌కు త్రీ ఫేజ్ విద్యుత్‌ను ఏర్పాటు చేశామని విద్యుత్ శాఖ ఏడీఈ బాలకృష్ణ తెలిపారు. గతంలో లక్ష్మీనరసింహనగర్, యూసుఫ్‌గూడ బస్తీ ప్రజలకు సింగిల్ వైర్ ఉండటంతో అనేక విద్యుత్ సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. దాంతో ఈ సమస్యను స్థానిక నాయకులు రాగుల సాయికృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్‌శాఖ అధికారులకు సమస్యను తెలియజేసి పరిష్కరించాలని ఆయన కోరారు. విద్యుత్‌శాఖ ఏడీఈతో పాటు ఏఈ జాన్ పీటర్, లైన్‌మెన్ నవీన్, సుదర్శన్, శ్రీకాంత్, కిశోర్‌తో పాటు పలువురు టీఎస్ఎస్‌పీడీసీఎల్ టీమ్ ఆయా ప్రాంతాలను సందర్శించి విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా ఉండేందుకు త్రీ ఫేజ్‌లను ఏర్పాటు చేశారు.

విద్యను సామాజిక బాధ్యతగా తీసుకోవాలి

మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్


సీడీని ఆవిష్కరిస్తున్న మధుయాష్కీగౌడ్ తదితరులు

హిమాయత్‌నగర్: విద్యను వ్యాపారంగా కాకుండా సామాజిక బాధ్యతగా ప్రభుత్వాలు తీసుకున్నప్పుడే మార్పు వస్తుందని మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మించబడుతుందని, కానీ నేడు విద్య అనేది వ్యాపారంగా మారిందని అన్నారు. ఎస్‌బీఎస్ చారి(బాలు) రచించిన చదువులమ్మ చైతన్య యాత్ర పాటల సీడీని మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు అన్ని దానాలకంటే విద్యాదానం గొప్పదని అనేవారని, నేడు అన్ని వ్యాపారాల కంటే విద్య వ్యాపారం గొప్పగా మారిందని విమర్శించారు. ఈ పాట విద్య వ్యవస్థలో మార్పునకు నాంది కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. చిరంజీవులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలనే చిత్తశుద్ధి పాలకుల్లో లేదని విమర్శించారు. ప్రైవేటు స్కూల్స్ కంటే ప్రభుత్వ స్కూళ్లలో ప్రావీణ్యం ఉన్న ఉపాధ్యాయులు ఉంటారని, వారు అంకిత భావంతో పనిచేస్తే ప్రభుత్వ స్కూళ్లకు పూర్వ వైభవం వస్తుందన్నారు. సామాజికవేత్త నక్క శ్రీనివాస్ యాదవ్, చైతన్య రాజు, పవన్ కుమార్, జెల్ల శ్రీనివాస్, విష్ణు కిషోర్, బీవీఆర్ రావు, ఏఎస్.రెడ్డి, కదారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదాలకు ఆస్కారం లేని ప్రాంతాల్లోనే మండపాలు


కరెంటు స్తంభాన్ని ఆనుకుని ఏర్పాటు చేసిన మండపాన్ని పక్కకు తరలిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: కరెంటు వైర్లు తగిలి ఇటీవల ఉప్పల్‌లో ఆరుగురు యువకులు చనిపోవడంతో మేల్కొన్న విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు. కరెంటు వైర్ల కింద, కరెంటు స్తంభాన్ని ఆనుకుని ఏర్పాటు చేస్తున్న మండపాల విషయంలో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–1లోని నవీన్‌నగర్‌లో కరెంటు స్తంభాన్ని ఆనుకుని ఏర్పాటు చేసిన మండపాన్ని అక్కడి నుంచి తొలగించి పక్కకు జరిపారు. ఇలా కరెంటు స్తంభాలు, కరెంటు వైర్ల కింద ఏర్పాటు చేస్తున్న మండపాలను తొలగించాలని, ప్రమాదానికి ఆస్కారం లేని ప్రాంతంలో నిర్మించుకోవాలని సూచిస్తున్నారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు పర్యటిస్తూ గొడవలకు తావులేకుండా ప్రశాంతంగా మండపాలను నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పక్కపక్కనే మండపాలు ఏర్పాటు చేస్తుండటంతో గొడవలు జరుగుతున్నాయని, శాంతియుత వాతావరణానికి భంగం కలుగుతోందని, మొన్నటి వినాయక మండపాల విషయంలో పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని దేవీమాత విగ్రహాలను ఏర్పాటు చేసుకునే వారు ప్రమాదాలకు తావులేకుండా ఉండేలా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇందు కోసం పలుశాఖల అధికారులు పకడ్బందీగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ పిలుపునిచ్చారు. డివిజన్‌లోని బంజారానగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బూత్ కమిటీల సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రతి బస్తీ నాయకుడు పర్యటించి, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి పథకాలను వివరించాలని సూచించారు. కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌బాబు, కాంగ్రెస్ నాయకుడు కాసుల మహేష్‌గౌడ్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అశోక్, నాయకులు వెంకటేశ్, వైజయంతి, సత్తార్, సుధాకర్‌రెడ్డి, బాలరాజ్‌గౌడ్, దేవేందర్, యోహాన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

గోపీనాథ్ ఆశయాలను కొనసాగిస్తాం


మహిళలతో మాట్లాడుతున్న మాగంటి సునీత


చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మాగంటి అక్షర

రహమత్‌నగర్: దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతిమణి సునీత మంగళవారం బోరబండ డివిజన్‌లోని పలు బస్తీల్లో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ తన భర్త మాగంటి గోపీనాథ్ జీవించినంత కాలం పేదల అభ్యున్నతికి పరితపించారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలు కొనసాగించాలంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నాన్నగారి ఆశయాలు నిలబెడతాం

వెంగళరావునగర్: మా నాన్నకు నియోజకవర్గ ప్రజలంటే అమితమైన ప్రేమ ఉండేదని, ప్రతి ఒక్కరూ మమ్మల్ని అంతే ప్రేమగా చూస్తున్నారని దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పెద్ద కుమార్తె అక్షర అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌కాలనీలో మంగళవారం ఆమె పర్యటించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ పాదయాత్ర చేపట్టారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా తన తల్లి సునీత పోటీకి సిద్ధంగా ఉన్నారని, నాన్నగారి ఆశయాలను తాము నిలబెడతామని పేర్కొన్నారు. స్థానిక చర్చిలో ప్రార్థనలు చేశారు. పలువురు బీఆర్ఎస్ మహిళా నేతలు పాల్గొన్నారు.

ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్ల కోసం కృషిచేయాలి


ప్రసంగిస్తున్న బక్కి వెంకటయ్య

హిమాయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణ అంశం ముగిసినందున దళితులంతా ఐక్యంగా ఎస్సీ రిజర్వేషన్లు 18 శాతం పెంపునకు కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య కోరారు. ఈ విషయంపై ఇప్పటికే ప్రభుత్వంలోని పెద్దలందరికీ విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. మంగళవారం రాత్రి బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బొజ్జా తారకం ట్రస్ట్, డా.బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత ఉద్యమ బహుజన శిఖరం, హక్కుల దిక్సూచి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి దివంగత బొజ్జా తారకం 9వ వర్ధంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీలకు ప్రభుత్వం రిజర్వేషన్ల శాతాన్ని 42 శాతానికి పెంచిన నేపథ్యంలో ఎస్సీలకు రిజర్వేషన్లు 18 శాతానికి పెంచాలన్నారు. దళితుల హక్కుల సాధన, న్యాయం కోసం బొజ్జా తారకం అనేక ఉద్యమాలు చేశారని తెలిపారు. అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డా.కె.లింగయ్య, ప్రధాన కార్యదర్శి గనుమల జ్ఞానేశ్వర్, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, ప్రముఖులు నందిగం కృష్ణారావు, చిక్కుడు ప్రభాకర్, జీవీ సూర్యకిరణ్, డా.నాళేశ్వరం శంకర్, ఎస్.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పట్టు ఉత్పత్తులకు వేదిక

- హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్
- ఈనెల 23 వరకు అందుబాటులో ఎగ్జిబిషన్


వస్త్రాలను తిలకిస్తున్న శైలజా రామయ్యార్

శ్రీనగర్‌కాలనీ: భారతీయ సంస్కృతిలో చేనేత కళలు ప్రధానమైనవని, కళాత్మక నైపుణ్యం, నాణ్యమైన పట్టు ఉత్పత్తులకు వేదికగా ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిలుస్తుందని తెలంగాణ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట మంగళవారం ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను ఆమె నగర సోషలైట్, ఎంటర్‌ప్రెన్యూర్ శైలజారెడ్డితో కలిసి ప్రారంభించారు. తెలంగాణ చేనేత కళాకారులకు పాదుపు, బీమాతో పాటు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ చేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీలో నాణ్యమైన పట్టు, కాటన్ వస్త్రాలు లభిస్తాయని, దేశంలోని అన్నిప్రాంతాల చేనేత కళాకారులను ఒకచోట చేర్చి వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందిస్తున్న నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్‌కుమార్‌ను అభినందించారు. చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను 80 స్టాల్స్‌లో ఏర్పాటు చేశారని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్ కుమార్ తెలిపారు. ఈ నెల 23 వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందన్నారు.

హైమాస్ట్ లైట్లు వెలగవు.. వాకర్లకు తిప్పలు తప్పవు

- కేబీఆర్ పార్కు వద్ద అంధకారం
- ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు
- అయినా స్పందించని అధికారులు


కేబీఆర్ పార్కు వద్ద వెలగని హైమాస్ట్ లైట్లు

బంజారాహిల్స్: నిత్యం వేలాది మంది సందర్శకులు, వాకర్లతో కిటకిటలాడే బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ప్రధాన గేటు వద్ద అంధకారం నెలకొంది. అధికారుల నిర్లక్ష్యంతో ఏడాది కాలంగా కేబీఆర్ పార్కు వద్ద హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. పార్కు ఎదుట అలంకరణ కోసం ఏర్పాటు చేసిన ఆర్నమెంట్ లైట్లు కూడా నెల రోజులుగా వెలగడం లేదు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ సర్కిల్–18 వీధి దీపాల ఏఈకి సందర్శకులు, వాకర్లు రెండు నెలల నుంచి 200లకు పైగా ఫిర్యాదులు చేశారు. అయినా నిర్లక్ష్యం వీడటం లేదు. వాక్‌వేలో రాత్రిపూట వాకింగ్ చేసేవారు సెల్‌ఫోన్లలో లైట్ పెట్టుకుని నడవాల్సిన దుస్థితి దాపురించింది. ఆర్నమెంట్ లైట్లు కూడా వెలగడం లేదు. ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారని వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ప్రపంచ ఓజోన్ దినోత్సవం

జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో నిర్వహణ



సాక్షి, సిటీబ్యూరో: అత్తాపూర్‌లోని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం, హిందీ సప్తాహ్ కార్యక్రమం ఘనంగా జరిగాయి. కోల్‌కతాలోని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ ధృతి బెనర్జీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధృతి బెనర్జీ మాట్లాడుతూ వ్యక్తులు, సంఘాలు, ప్రభుత్వాలు ఓజోన్ క్షీణతను నిరోధించే స్థిరమైన పద్ధతులను అవలంబించాలని సూచించారు. హిందీ సప్తాహ్ సందర్భంగా జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా 'చేతన' పేరుతో పుస్తకాన్ని విడుదల చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల, సెయింట్ జార్జెస్ డిగ్రీ కళాశాల, ఏవీ కళాశాల, ఝాన్వి డిగ్రీ కళాశాల విద్యార్థులు వక్తృత్వ పోటీలో చురుకుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.ఉమాపతి, జయశంకర్ ప్రసాద్ తివారీ తదితరులు పాల్గొన్నారు.

అండమాన్ దీవుల్లో తీర శుభ్రతా కార్యక్రమాలు



ప్లాస్టిక్‌ను తొలగించేందుకు సముద్రంలోకి వెళ్తున్న దృశ్యం

నిజాంపేట్: అంతర్జాతీయ తీర శుభ్రతా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవల కేంద్రం ఆధ్వర్యంలో అండమాన్ దీవుల్లో రెండు ప్రత్యేక శుభ్రతా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 20న జరగబోయే తీర శుభ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని సముద్ర కాలుష్యాన్ని తగ్గించడం, సముద్ర జీవవైవిధ్యం రక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. మొదటి శుభ్రతా కార్యక్రమాన్ని బుధవారం(నేడు) హేవ్‌లాక్ దీవి (స్వరాజ్ ద్వీప్)లో జరగనుంది. ఇక్కడ ఐఎన్‌సీఓఐఎస్ శాస్త్రవేత్తలు, స్థానిక స్వచ్ఛంద కార్యకర్తలతో కలిసి సముద్రపు అడుగున ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించనున్నట్లు తెలిపారు. రెండో కార్యక్రమం పోర్ట్‌బ్లెయిర్‌లో పాండిచ్చేరి యూనివర్సిటీ సహకారంతో జరగనుంది. ఈ కార్యక్రమంలో బీచ్‌లు, తీరం శుభ్రపరిచే పనులు జరుగుతాయి. ఇందులో ఐఎన్‌సీఓఐఎస్ సిబ్బంది, పాండిచ్చేరి యూనివర్సిటీ, స్థానిక సంస్థల ప్రతినిధులు, వాలంటీర్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ డక్కన్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో డిజైర్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్కల్ప్చర్స్, స్టైకిడ్ స్టోరీస్, డీప్ ఇంటీరియర్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6 గంటలకు త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'నా తెలంగాణ కోటి రతనాల వీణ'పై నృత్య రూపక ప్రదర్శన జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ఏ భవనం ఏ క్షణాన కూలేనో?

- ప్రజలను భయపెడుతున్న శిథిల భవనాలు
- కొన్నిచోట్ల ప్రమాదకరంగా ఉన్న నాలాలు
- ప్రకటనలే తప్ప చర్యలు చేపట్టని యంత్రాంగం



సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని శిథిల భవనాలు, నాలాలు ప్రజలను భయపెడుతున్నాయి. ఏ నాలా ఎప్పుడు ఎవరిని కబళిస్తుందోనని బెంబేలెత్తుతున్నారు. వేల సంఖ్యలోని శిథిల భవనాల్లో ఏ భవనం ఏ క్షణాన నేలకొరుగుతుందో తెలియదు. అయినా వర్షాకాలానికి ముందుస్తుగా తీసుకోవాల్సిన చర్యల్లో జీహెచ్‌ఎంసీ, సంబంధిత ఇతర విభాగాలు పూర్తిగా విఫలమవుతున్నాయి. నాలాల్లో పూడికతీత నుంచి మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్లు, సెల్లార్ల తవ్వకాలు, అక్రమ నిర్మాణాలు, శిథిల భవనాల దాకా ఇదే తంతు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉండగా మాన్సూన్ యాక్షన్ ప్లాన్ అంటూ ఆర్భాటపు ప్రకటనలే తప్ప ఆచరణ శూన్యం. అందుకు ఉదాహరణలు పసిపిల్లలు మ్యాన్‌హోళ్లలో, ప్రజలు నాలాల్లో పడుతుండటమే. ఇటీవలి వర్షాలకు ముగ్గురు గల్లంతయ్యారు. గోడకూలిన ఘటనలో ఒకరు మృతి చెందారు. గల్లంతైన వారు నాలాల్లో పడి కొట్టుకుపోయినట్లు ఆయా ప్రాంతాల ప్రజలు భావిస్తున్నారు.

శిథిల భవనాలపై నిర్లక్ష్యం

ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనాల్లో ప్రజలు నివాసం ఉండకుండా చూడాల్సిన అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. వేసవిలోనే శిథిల భవనాల సర్వే నిర్వహించి మరమ్మతులు.. పునరుద్ధరణలకు అవసరమైన చర్యలు తీసుకోవడం.. పూర్తిగా కూలే దుస్థితిలో ఉంటే ప్రజలను ఖాళీ చేయించడం వంటి పనులు చేయాలి. తీరా వేసవి ముగిశాక శిథిల భవనాలంటూ అధికారులు మొక్కుబడిగా లెక్కలు చెబుతున్నారు. వాటిల్లో చర్యలు తీసుకున్నవి.. ఇంకా తీసుకోవాల్సినవి అంటూ పేర్కొంటున్నప్పటికీ, వర్షాకాలం ముగిసే దాకా ఆ దిశగా అడుగులు పడటంలేదు. అధికారులు ప్రకటిస్తున్న శిథిల భవనాల సంఖ్యే తప్పులతడకగా ఉంటోంది. ప్రజల కళ్ల ముందే పాతబస్తీసహా కోర్‌సిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న శిథిల భవనాలు ఏ క్షణాన కూలతాయో అన్నట్లుగా ఉన్నాయి. సరిగ్గా సర్వే చేస్తే వేల సంఖ్యలో అవి ఉంటాయి. చార్మినార్ నుంచి మొదలు పెడితే సికింద్రాబాద్ దాకా లెక్కలేనన్ని పురాతన, శిథిల భవనాలు దర్శనమిస్తాయి. నివాస భవనాలే కాదు పలు వ్యాపార సముదాయాలు సైతం శిథిల భవనాల్లోనే నడుస్తుండటం గమనార్హం. అధికారుల లెక్కల్లో మాత్రం శిథిల భవనాలు వందల్లోనే ఉన్నాయి. దాదాపు సగం శిథిల భవనాలకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

లేనిదెక్కడ..?

కోర్‌సిటీ పరిధిలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, బార్కాస్, బహదూర్‌పురా, మలక్‌పేట, గోషామహల్, నాంపల్లి, అబిడ్స్, అఫ్జల్‌గంజ్, బేగంబజార్, కోఠి, సికింద్రాబాద్, ముషీరాబాద్, సీతాఫల్‌మండీ, వారాసిగూడ, పార్సీగుట్ట, అంబర్‌పేట.. ఇలా అన్ని ప్రాంతాల్లోనూ లెక్కలేనని శిథిల భవనాలున్నాయి. అవి కూలేవిధంగా ఉన్నా అధికారుల కళ్లకు మాత్రం కనిపించడం లేదు.

చర్యలేవీ ?

ఇటీవలి వరుస వర్షాల నేపథ్యంలో గత నెల్లో జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీప్లానర్ శ్రీనివాస్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ శిథిల భవనాలతోపాటు సెల్లార్లలోనూ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆదేశాలు ఏ మేరకు అమలయ్యాయో సంబంధిత అధికారులకే తెలియాలి. అధికారుల లెక్కల మేరకు గుర్తించిన శిథిల భవనాలు 685 మాత్రమే. గతంలో సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్ల పైకప్పులు, గోడలు మీద కూలి పలువురు మరణించారు.

నాలాలదీ అదే తీరు

రక్షణ చర్యలు లేని పురాతన నాలాలనూ పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో నగర నాలాల్లో పడి పలువురు మృతి చెందడం తెలిసిందే.

21 జిల్లాల సమగ్ర చరిత్రపై గ్రంథాల ముద్రణ

- తెలంగాణ సారస్వత పరిషత్ మూడేళ్ల కృషి
- త్వరలో మరో 12 జిల్లాలపై చారిత్రక గ్రంథాలు



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ జిల్లాల సమగ్ర స్వరూపం, చారిత్రక అంశాలపై తెలంగాణ సారస్వత పరిషత్ ప్రత్యేక గ్రంథాలను ముద్రించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. మూడేళ్ల క్రితం చేపట్టిన ఈ పుస్తక యజ్ఞంలో ఇప్పటి వరకు 21 జిల్లాల పుస్తకాలను ముద్రించినట్లు తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య తెలిపారు. ఇప్పటి వరకు జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వనపర్తి, హనుమకొండ, ఆదిలాబాద్, మంచిర్యాల, సిద్దిపేట ,పెద్దపల్లి, మహబూబాబాద్, నిర్మల్, కామారెడ్డి, వికారాబాద్, కరీంనగర్, నారాయణపేట, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ, జగిత్యాల జిల్లాల సమగ్ర స్వరూప గ్రంథాలు వెలువడ్డాయని చెప్పారు. వివిధ జిల్లాల భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక అంశాలపై, సాహిత్యంలోని వివిధ ప్రక్రియలు, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, శిల్ప కళలు తదితర అనేక అంశాలపై ఈ పుస్తకాల్లో సమగ్రమైన వివరాలను అందజేశారు. ''ప్రతి జిల్లాపై ఒక సమగ్రమైన గ్రంథాన్ని తీసుకురావాలనే ఆలోచనతో మూడేళ్ల క్రితం ఉద్యమ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. బహుశా చరిత్రలో ఇదే మొట్టమొదటి ప్రయోగం''అని చెన్నయ్య అభిప్రాయపడ్డారు. ఈ పుస్తకాల కోసమే వివిధ అంశాలపైన సంపూర్ణమైన అవగాహన కలిగిన రచయితలను ఎంపిక చేసి ప్రత్యేక వ్యాసాలను రాయించినట్లు చెప్పారు. ౦ తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి సారథ్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ప్రతి జిల్లా చరిత్రపై విస్తృతంగా చర్చించి గ్రంథాల రూపకల్పనకు శ్రీకారం చుట్టినట్లు చెన్నయ్య పేర్కొన్నారు. త్వరలోనే మిగతా 12 జిల్లాల గ్రంథాలను కూడా వెలువరించనున్నట్లు చెప్పారు.

కేంద్రమంత్రి ఫొటోతో ప్రకటన.. నగరవాసికి బురిడీ

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫొటోతో కూడిన ప్రకటనతో ఎర వేసిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన ఓ వృద్ధుడి నుంచి రూ.14.35 లక్షలు స్వాహా చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సంతోష్‌నగర్‌కు చెందిన వృద్ధుడు (68) ఈ ఏడాది జూన్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫొటోతో ఫేస్‌బుక్‌లో ఓ ప్రకటన చూశారు. పెట్టుబడులు పెడితే భారీ లాభాలంటూ ఉన్న ఆ యాడ్‌లోని లింక్‌ను క్లిక్ చేసిన బాధితుడితో అమెరికాకు చెందిన ఏఐ క్వాంటమ్ కంపెనీ ఉద్యోగిగా పేర్కొన్న వ్యక్తి వాట్సాప్ ద్వారా మాట్లాడాడు. మెటల్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టాలని ప్రోత్సహించాడు. తొలుత బాధితుడు రూ.12,600 పెట్టుబడి పెట్టాడు. ఆపై వారి మాటలు నమ్ముతూ దఫదఫాలుగా మొత్తం రూ.14,35,461 పెట్టుబడి పెట్టాడు. ఆ కంపెనీ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అధికారిణి నియా శర్మని అంటూ బాధితుడికి మరో ఫోన్ వచ్చింది. ఆయన పెట్టిన పెట్టుబడి లాభాలతో కలిపి రూ.36 లక్షలు అయిందని, ఆ మొత్తం తిరిగి ఇవ్వడానికి ఆదాయపు పన్ను కింద రూ.8.2 లక్షలు చెల్లించాలని షరతు విధించింది. అతడిని పూర్తిగా నమ్మించడానికి నకిలీ పాస్‌పోర్ట్ కూడా పంపింది. చివరకు తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

వరద నీటి కాలువల నిర్మాణానికి శంకుస్థాపన



వరద నీటి కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్. చిత్రంలో గద్వాల్ విజయలక్ష్మి

నాంపల్లి: పౌర సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా గ్రేటర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం లక్డీకాపూల్ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు రూ.17.93 కోట్ల అంచనా వ్యయంతో జీహెచ్‌ఎంసీ నిర్మించనున్న వరద నీటి కాలువల శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని రెడ్‌హిల్స్ డివిజన్‌లోని ఫెడరేషన్ హౌస్ ఎదుట మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి మంత్రి పొన్నం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదారాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడానికి నగరంలో రోడ్లు, నాలాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. వరద నీటి కాలువల పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్ , జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

హజ్ కమిటీ ఈవోగా మహ్మద్ షఫీవుల్లా బాధ్యతల స్వీకరణ



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారిని నియమించింది. ఈ మేరకు మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.షఫీవుల్లా ఉత్తర్వులు జారీ చేశారు. ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మహ్మద్ షఫీవుల్లాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన ఈ బాధ్యతలు నిర్వహిస్తారు. మహ్మద్ షఫీవుల్లా మంగళవారం హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ బియబానీ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. గత రెండేళ్ల నుంచి ఈ పోస్టులో పూర్తిస్థాయి అధికారులు లేరు. షఫీవుల్లా మాట్లాడుతూ 2026 హజ్ యాత్ర ఏర్పాట్లు ప్రక్రియ కొనసాగుతోందని, యాత్రికులకు ఎలాంటి లోటు రాకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.

ఇంటింటా విమోచన ఉత్సవం జరుపుకోవాలి

– బండారు దత్తాత్రేయ పిలుపు



మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవం చారిత్రాత్మకమైందని, ఇంటింట ప్రతి ఒక్కరూ ఈ ఉత్సవాన్ని జరుపుకోవాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దత్తాత్రేయ ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన దినోత్సవంపై సీనియర్ నేత పాదూరి కరుణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున హైదరాబాద్‌లో జాతీయ జెండాను కూడా ఎగురవేయలేదని అన్నారు. సర్దార్ వల్లాభాయ్ పటేల్ నిజాం సంస్థానాన్ని విలీనం చేశారని అన్నారు. తెలంగాణ ప్రజలు బానిసత్వం నుంచి సెప్టెంబర్ 17న బయటికి వచ్చారని, ఈ రోజును విమోచన దినోత్సవంగా భావించాలని అన్నారు. ప్రభుత్వం కూడా విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యా సాగర్ రావు మాట్లాడుతూ నిజాం అరాచకాలు చెప్పాలంటే గంటలు కూడా చాలవని అన్నారు.చరిత్ర రూపంలో విమోచన దినాన్ని పాఠ్యపుస్తకాలలో చేర్చాలన్నారు. దళిత, గిరిజనుల అభివృద్ధిపై దృష్టిని సారించాలన్నారు. గిరిజనులకు అనేక చట్టాలు ఉన్నా అవి అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, మాజీ వీసీ ప్రొఫెసర్ తిరుపతిరావు, ప్రొఫెసర్ మురళీమనోహర్, ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీజేపీ నాయకులు డాక్టర్ మనోహర్‌రెడ్డి, స్వాతంత్ర సమర యోధుడు విట్టల్ రావు ఆర్య, పాశం యాదగిరి, జాతీయ సాఫాయి కర్మచారి కమిషన్ మాజీ సభ్యులు చింత సాంబమూర్తి, జర్నలిస్ట్ కప్పర ప్రసాద్, ఉప్పల శారద తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌గా రాజిరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌గా ఎం.రాజిరెడ్డి నియమితులయ్యారు. ఇప్పటి వరకు సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆయనను ని డిప్యుటేషన్‌పై సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌లో జనరల్ మేనేజర్‌గా బదిలీ చేసి హైదరాబాద్‌లోని చీఫ్ రేషన్ ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగించా రు. ఈ మేరకు మంగళవారం ఆదేశాలు జారీ అయ్యా యి. సీఆర్వోగా పనిచేస్తున్న జెండాగే హనుమంత్ కొండిబాను అదనపు బాధ్యతల నుంచి తప్పించారు.

విద్యార్థులను తీర్చిదిద్దే శిల్పులుగా కావాలి

– ఉపాధ్యాయులకు మంత్రి పొన్నం పిలుపు



సాక్షి, సిటీబ్యూరో: ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులుగా మారాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. మంగళవారం అబిడ్స్‌లోని ఒక కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం-2025 కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులకే దక్కుతుందన్నారు. ప్రతి విద్యార్థికి గుణాత్మకమైన విద్య అందించే దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల్లో జ్ఞానాన్ని, నైతిక విలువలు, క్రమశిక్షణ నింపి వారిని ఉత్తమ పౌరులుగా మార్చే మహోన్నతమైన బాధ్యత ఉపాధ్యాయులకే ఉంటుందన్నారు.

విద్యావ్యవస సమూలంగా ప్రక్షాళన

ప్రజాపాలన ప్రభుత్వంలో విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు కంకణం కట్టుకున్నామని మంత్రి పొన్నం అన్నారు. హైదరాబాద్ నగరం ఐటీ, ఫార్మా రంగాలకే కాదని, విద్యరంగానికి కూడా రాజధానిగా విలసిల్లుతుందని పేర్కొన్నారు. విద్యాబోధన డిజిటలైజ్ అవుతుందని అన్నారు. కలెక్టర్ హరిచందన దాసరి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు, ఉత్తమ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 108 మందికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు.

మరో పాస్‌పోర్టు సేవా కేంద్రం కావాలి

- నగరానికి దక్షిణ భాగంలో ఏర్పాటును పరిశీలించండి
- ఎంఈఏ అధికారులతో మంత్రి శ్రీధర్‌బాబు
- స్లాట్స్ సంఖ్య పెంచాలన్న పొన్నం ప్రభాకర్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నగరం నలుదిక్కులా విస్తరిస్తున్న నేపథ్యంలో ఇక్కడ మరో పాస్‌పోర్టు సేవా కేంద్రం (పీఎస్‌కే) అవసరమని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నగరానికి దక్షిణ భాగంలో దాన్ని ఏర్పాటు చేయాలని విదేశీ వ్యవహారాలు మంత్రిత్వ శాఖ (ఎంఈఏ)కు చెందిన సంయుక్త సెక్రటరీ డాక్టర్ కేజే శ్రీనివాసను కోరారు. టోలిచౌకి నుంచి రాయదుర్గానికి తరలించిన పీఎస్‌కేను మంత్రి మంగళవారం ప్రారంభించారు. అమీర్‌పేట నుంచి ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ మొదటి అంతస్తులోకి మార్చిన మరో పీఎస్‌కే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఏటా దేశ వ్యాప్తంగా కొత్త పాస్‌పోర్టుల కోసం కోటి దరఖాస్తులు వస్తుండగా అందులో తెలంగాణ నుంచే 11 లక్షలు ఉన్నాయని చెప్పారు. 'గతంలో పాస్‌పోర్ట్ కోసం నెలల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చేది. సాంకేతికతను ఉపయోగించుకుంటూ పౌరసేవలను సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజల ముంగిటకే తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది' అని అన్నారు. ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లోని పీఎస్‌కేలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'ఎంజీబీఎస్ పీఎస్‌కేలో రోజుకు 1,200 ఇచ్చేలా తక్షణం ఆదేశాలు జారీ చేయాలి. తెలంగాణలో ఉన్న ప్రతి పౌరుడు కచ్చితంగా పాస్‌పోర్టు తీసుకోవాలి. చాలా మంది అత్యవసరమైనప్పుడే దరఖాస్తు చేస్తూ ఇబ్బంది పడుతున్నారు'అని పేర్కొన్నారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ 'ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో పాస్‌పోర్టు సేవా కేంద్రం ఏర్పాటు చేయడంతో పాతబస్తీ నుంచి ఇతర దేశాలకు వెళ్లేవారికి ప్రయోజనం చేకూరుతుంది'అని అన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్లలో ఇదే మొదటిది..

ఇతర ఏ నగరాల్లోనూ లేని విధంగా, దేశంలోనే తొలిసారిగా మెట్రో స్టేషన్‌లో పాస్‌పోర్టు సేవా కేంద్రం ఏర్పాటు చేశాం. బస్టాండు, మెట్రో ద్వారా వచ్చే వారికి ఉపయుక్తంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. ఈ పీఎస్‌కే ఇతర నగరాలకు రోల్ మోడల్ అవుతుంది. – స్నేహజ జోన్నలగడ్డ, రీజనల్ పాస్‌పోర్టు ఆఫీసర్

పాస్‌పోర్టు స్లాట్స్‌ను పెంచుతాం

హైదరాబాద్‌లో తొలి పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని 2012లో ఏర్పాటు చేశాం. ఇప్పుడు వాటి సంఖ్య మూడుకు చేరింది. రెండు పీఎస్‌కేలు రీలొకేట్ అయిన నేపథ్యంలో స్లాట్స్ సంఖ్యను త్వరలో గణనీయంగా పెంచనున్నాం. – కేజే శ్రీనివాస, సంయుక్త సెక్రటరీ, ఎంఈఏ

'ఐఎస్‌బీ'కి ప్రపంచంలోనే టాప్‌-5లో స్థానం



గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ క్యాంపస్

లింక్డ్‌ఇన్ ర్యాంకింగ్‌లో 6వ స్థానం నుంచి ఒక స్థానం పైకి..

రాయదుర్గం: 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్'అంతర్జాతీయంగా మరింత గుర్తింపును సాధించింది. తాజాగా లింక్డ్‌ఇన్ తమ సర్వే ద్వారా ర్యాంకింగ్స్‌ను మంగళవారం ప్రకటించింది. వాటిలో టాప్ ఎంబీఏ ప్రోగ్రామ్స్-2025 వార్షిక జాబితాలో గచ్చిబౌలిలోని 'ఐఎస్‌బీ'ప్రపంచంలోనే 5వ స్థానం పొందడం విశేషం. గత ఏడాది ఈ లింక్డ్‌ఇన్ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానంలో ఐఎస్‌బీ ఒక స్థానం పైకి ఎగబాకింది. ఉద్యోగ నియామక రేట్లు, కార్మిక మార్కెట్, ప్రమోషన్ రేట్లు, నెట్‌వర్క్ పనితీరు, నాయకత్వ సామర్థ్యం, లింగ వైవిధ్యం వంటి అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బిజినెస్ స్కూళ్ల పనితీరును విశ్లేషించి వాటి పనితీరు ఆధారంగా చేసుకొని తాజాగా ర్యాంకింగ్స్‌ను ప్రకటించడం విశేషం. ఈ జాబితా ప్రపంచవ్యాప్తంగా తమ పూర్వ విద్యార్థులను కెరీర్ విజయానికి ఉత్తమంగా సిద్ధం చేసే 100 వ్యాపార పాఠశాలలకు ర్యాంకింగ్స్‌ను ఈ లింక్డ్‌ఇన్ సంస్థ ప్రతియేటా అందిస్తోంది. గ్లోబల్‌గా టాప్-5 లో స్థానం పొందడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

అత్యుత్తమ విజయాలను ప్రతిబింబించేలా ర్యాంకింగ్స్



మా పూర్వ విద్యార్థుల అత్యుత్తమ విజయాలను ప్రతిబింబించేలా ఈ లింక్డ్‌ఇన్ ర్యాంకింగ్ వచ్చాయి. ఎంబీఏ ప్రోగ్రామ్స్ ర్యాంకింగ్-2025లో మాకు గ్లోబల్‌గా టాప్-5లో స్థానంలో ఉండటం సమిష్టి కృషికి నిదర్శనం. సంక్లిష్టతను నావిగేట్ చేయడానికి, ఆవిష్కరణలను నడిపించడానికి, వేగంగా మారుతున్న ప్రపంచంలో గణనీయమైన ప్రభావాన్ని సృష్టించడానికి, సన్నద్ధమైన నాయకులను అభివృద్ధి చేయడానికి ఐఎస్‌బీ అంకితమైంది. –ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల– 'ఐఎస్‌బీ'డీన్

66 జానపద కళలను ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రవణ్

పంజగుట్ట: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ రాష్ట్రంలోని జానపద కళాకారులను అందరినీ ఒకేలా చూడాలని, కొన్ని కళారూపాలను ప్రోత్సహిస్తూ, మరికొన్నింటిని తక్కువగా చూడటం సరికాదని తెలంగాణ జానపద కళాకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మహంకాళి శ్రవణ్ కుమార్ అన్నారు. తెలంగాణలో 66కుపైగా కళలు ఉన్నాయని అందులో కేవలం 10 నుంచి 15 కళారూపాలకు మాత్రమే ప్రాధాన్యం కల్పిస్తూ, మిగిలినవి అంతరించి పోయేలా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం హిమగిరి, ప్రధాన కార్యదర్శి కనక సుదర్శన్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. ఆదివాసీ కళారూపాల్లో గుస్సాడి నృత్యానికి ఎంతో ప్రాధాన్యముందని, సాంస్కృతిక శాఖ ఇటీవల గచ్చిబౌలి నోవాటెల్ హోటల్‌లో ఇతరులతో డూప్లికేట్ గుస్సాడి ప్రదర్శించారని అన్నారు. కళలను ప్రదర్శించే జానపద కళాకారులకు రోజుకు ఐదు వేల రూపాయలు చెల్లించాలని కోరారు. చనిపోయిన కళాకారుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలన్నారు. అంతరించి పోయిన జానపద కళాకారులకు పూర్వవైభవం తీసుకుని రావాలని, శిక్షణ తరగతులు ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు. ప్రదర్శన ఇచ్చిన 15 రోజుల్లో పారితోషికం చెల్లించాలని, నిజమైన కళారూపానికి ఐడీ కార్డు, పెన్షన్, ఇన్సూరెన్స్, ట్రావెలింగ్, ఉచిత బస్‌పాస్ కేటాయించాలన్నారు. సమావేశంలో వేదిక నాయకుడు రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో నిజాం పాలన కొనసాగుతోంది'

- బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్
- విద్యార్థి సంఘాల సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద పలువురు విద్యార్థి నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో నిజాం పాలన కొనసాగుతోందని, పేరుకే ప్రజాపాలన తప్ప పోలీసుల రాజ్యం నడుస్తోందని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో వివిధ విద్యార్థి సంఘాలతో 'గ్రూప్-1పై హైకోర్టు తీర్పు – భవిష్యత్ కార్యాచరణ'అనే అంశంపై తలపెట్టిన రౌండ్ టేబుల్ సమావేశాన్ని పోలీసులు అడ్డుకున్నారు. శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు నాయకులను అరెస్ట్ చేసి అబిడ్స్, గాంధీనగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. చిక్కడపల్లి ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో సీఐ రాజు నాయక్, ఎస్ఐ అభిలాష్‌తోపాటు పెద్ద ఎత్తున పోలీసులు మోహరించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ అనుమతి తీసుకొని సమావేశాలు నిర్వహించే హక్కును కూడా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. విద్యార్థులకు సమావేశం పెట్టుకునే హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని దేశమంతా ఊరేగుతున్నారని, ఇక్కడ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం దానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. గ్రూప్ 1లో జరిగిన అవకతవకల వల్ల నష్టపోయిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు రేవంత్‌రెడ్డి ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. హైకోర్టు తీర్పును గౌరవించి మళ్లీ గ్రూప్ 1 పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాబు, కడారి స్వామి యాదవ్, దశరథ్, జంగయ్య, శ్రీను నాయక్ శ్రీకాంత్ ముదిరాజ్, నాగేందర్, నాగరం ప్రశాంత్, నాగరాజు,సాయిగౌడ్ తదితరులు ఉన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 17 సెప్టెంబర్ 2025



మాన్సూన్ ఎండ్.. ట్రెక్కింగ్ ట్రెండ్..

పర్వతాలు, జలపాతాలకు ఔత్సాహికుల పయనం

- సుదూర ప్రాంతాలకు సై అంటున్న నగర యువత
- ట్రెక్కింగ్‌కు అనుకూలమైన వాతావరణంతో జోష్
- కనువిందు చేస్తున్న అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు
- ట్రెక్ పాయింట్లలో నగర పర్యాటకుల సందడి
- రెట్టించిన ఉత్సాహంతో యువత హడావుడి
- మార్గదర్శకాలు పాటించాలంటున్న విశ్లేషకులు

ఓ వైపు మాన్సూన్ సీజన్ ముగింపు దశకు చేరుకొంది. దీంతో పాటు ట్రెక్కింగ్ సీజన్ మొదలవుతోంది.. ప్రస్తుత వాతావరణం ట్రెక్కింగ్‌కు అనుకూలంగా ఉండడంతో నగరంలోని ఔత్సాహికుల్లో జోష్ నెలకొంది. దీంతో రెట్టించిన ఉత్సాహంతో యువత ట్రెక్ పాయింట్లలో, పలు పర్యాటక ప్రాంతాల్లో సందడి చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో కనువిందు చేసే అద్భుతమైన ప్రకృతి దృశ్యాలను ఆస్వాదించేందుకు పర్వతాలు, లోయలు, జలపాతాలకు బ్యాక్‌ప్యాక్‌తో పయనమవుతున్నారు. రుతుపవనాలు ముగింపు సీజన్‌లో ట్రెక్కింగ్ ట్రెండ్ పీక్స్‌కు చేరుతుంది. దీంతో నగరం నుంచి మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోని ట్రెక్ పాయింట్లకు నగర పర్యాటకుల సందడి మొదలైంది.

- సాక్షి, సిటీ బ్యూరో





వర్షాలు పర్వతాలపై అద్భుతమైన పచ్చదనాన్ని పరుస్తాయి. మరోవైపు పర్వతాలపై నుంచి ఎగసిపడే జలపాతాలు ప్రకృతి సోయగాన్ని రెట్టింపు చేస్తాయి. పచ్చని లోయలు, కొండ ఉపరితలాలపై పొగమంచు దృశ్యాలు పర్యాటకులను, ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తాయి. పచ్చికబయళ్ళు, పూలతో నిండిన గుట్టలు ట్రెక్కింగ్‌కి కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయి. వీటన్నింటి మధ్య నడుస్తూ చిరు చినుకుల్లో తడుస్తూ మధురానుభూతులను పోగు చేసుకోడానికి ట్రెక్కర్స్ ఉత్సాహం చూపుతుంటారు.

మన సిటీకి.. 'మహా' ఇష్టం..

మహారాష్ట్రలోని పలు ట్రెక్ పాయింట్స్ నగరవాసులకు ఇష్టమైన జాబితాలో చోటు దక్కించుకుంటున్నాయి. ఇందులో ముఖ్యంగా లోనావాలాలోని రాజ్మాచీ ట్రెక్ ఒకటి. మబ్బులు, లోయలు, జలపాతాలతో ఈ ట్రెక్ ఆద్యంతం అలరిస్తుంది. అలాగే అహ్మద్‌నగర్ జిల్లాలోని హరిశ్చంద్ర ఘడ్ ట్రెక్ కూడా నగర ట్రెక్ కమ్యూనిటీలో బాగా పాపులర్. పశ్చిమ కనుమల్లోని పురాతన కొండపై కోటకు నడకమార్గం ప్రకృతి ప్రేమికులతో పాటు సాహసికులకు కూడా ఇష్టమైన రూట్. గుహలు, కోట అవశేషాలతో చారిత్రక ప్రాధాన్యం కూడా దీని సొంతం. ప్రారంభకులకు అనుకూలమైనది. అదే విధంగా టోర్నా.. ఫోర్ట్ ట్రెక్ కూడా మరో క్రేజీ ట్రెక్. టోర్నా ఫోర్ట్ ట్రెక్ లేదా ప్రచండగడ్, పుణె సమీపంలో ఒక రోజు ట్రెక్, ఇది 4,603 అడుగుల ఎత్తులో ఉన్న శిఖరానికి 2–3 కి.మీ (ఒక వైపు) ట్రైల్‌తో సవాలుతో కూడుకున్న ట్రెక్. ఛత్రపతి శివాజీ మహరాజ్ మొదటి కోటగా చారిత్రక ప్రాముఖ్యతకు ప్రసిద్ధి చెందింది. సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ సీజన్‌లో ఫ్లవర్ బెడ్స్‌తో చక్కని దృశ్యాలను అందిస్తుంది.

ట్రెక్ చకచకా..గో కర్ణాటక..

ట్రెక్కర్స్‌కు కలల ప్రదేశం కర్నాటకలోని చిక్ మగళూరులోని కుద్రేముఖ్ ట్రెక్. సుమారుగా 19–21 కి.మీ (రౌండ్ ట్రిప్) దూరం ఉండే ఈ ట్రెక్, కాస్తంత అనుభవం ఉన్న ట్రెక్కర్స్‌కు బెస్ట్. ఈ ట్రెక్ 1,892 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఈ ప్రాంతం దట్టమైన గడ్డి భూములు, షోలా అడవులకు ప్రసిద్ధి. ఈ ట్రెక్‌లో ప్రవాహాలను దాటుతూ, 'ఒంటరి చెట్టు' (ఒంటి మార) వంటి ప్రదేశాల గుండా ప్రయాణించి, శిఖరాన్ని చేరుకోవాలి. ఈ ట్రెక్‌కు రోజూ పరిమిత సంఖ్యలో మాత్రమే ట్రెక్కర్స్‌కు అనుమతిస్తారు. సాధారణంగా జూలై నుంచి నవంబర్ వరకు సీజన్. దీనికి సమీపంలోనే నేత్రావతి ట్రెక్ కూడా ఉంది.



స్కందగిరి హిల్స్ : బెంగళూరు నుంచి 60–65 కి.మీ దూరంలో ఉన్న స్కందగిరి హిల్స్ కూడా కాసింత కఠినమైన సవాలుతో కూడిన ట్రెక్ పాయింట్. కర్ణాటక అటవీ శాఖ పోర్టల్ ద్వారా ట్రెక్‌ను ముందస్తు బుక్ చేసుకోవాలి. ముల్లయనగిరి ట్రెక్ కర్ణాటకలోని ఎత్తయిన శిఖరం వరకూ హైకింగ్. ఇది కూడా కాస్తంత కఠినమైనదే. ఈ కాలిబాట సర్పధారి నుంచి ప్రారంభమవుతుంది. ఒక వైపు ట్రెక్‌కి దాదాపు గంటన్నర నుంచి రెండున్నర గంటలు పడుతుంది. ప్రత్యేకమైన భౌగోళిక నిర్మాణాలు, చిన్న గుహలను కలిగి ఉంటుంది. ఆహ్లాదకరమైన వాతావరణం కోసం సందర్శకులు సెప్టెంబర్ నుంచి మార్చి వరకు ఎంచుకోవచ్చు. ఇవే కాక మిగతా రాష్ట్రాల్లోని ప్రాంతాలైన కూర్గ్, మున్నార్, వాయనాడ్ వంటి ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాల్లోనూ ప్రత్యేకంగా ట్రెక్స్ నిర్వహిస్తున్నారు.

తమిళనాట.. ట్రెక్ బాట..

అందరికీ తెలిసిన ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలైన కోడైకెనాల్, ఊటీ ట్రెక్కింగ్‌కు పేరొందాయి. ముఖ్యంగా ఊటీలోని దొడ్డబెట్ట పీక్స్ ట్రెక్ బాగా ఫేమస్. అలాగే యెలగిరి హిల్స్‌లోని స్వామి మలాయ్ హిల్స్ ట్రెక్ సైతం మాన్సూన్‌లో సిటీ ట్రెక్కర్స్‌ను ఆకట్టుకుంటోంది.



మార్గదర్శకాలు తప్పనిసరి..

మాన్సూన్ ట్రెక్కింగ్ అనేది సాహసాలను ఇష్టపడుతూ.. ప్రకృతి అందాలను దగ్గరగా ఆస్వాదించే అరుదైన అవకాశం. వర్షపు వాతావరణంలో ఇది మరిచిపోలేని అనుభవంగా నిలుస్తుంది. ట్రెక్కింగ్‌లో సాధారణంగా రాత్రిపూట బసలు ఉంటాయి. స్థానిక నిర్వాహకుల ద్వారా బుక్ చేసుకోవచ్చు. లేదా స్వతంత్రంగానూ నిర్వహించవచ్చు. నగరం నుంచి అనేక సంస్థలు ఈ ట్రెక్స్ నిర్వహిస్తున్నాయి. రూ.3వేల నుంచి మొదలుకుని ట్రెక్స్ ఏర్పాటు చేస్తున్నాయి. సరైన సంస్థను, పర్యవేక్షణలో నిపుణులైన ట్రెక్కర్స్ మార్గదర్శకత్వంలో మాత్రమే ట్రెక్కింగ్ సురక్షితం.





రండి.. ఫొటో దిగుదాం!

నాల్గో తరగతి సిబ్బందితో చీఫ్ పాస్‌పోర్ట్ ఆఫీసర్

- ఎంజీబీఎస్ పీఎస్‌కే ప్రారంభోత్సవం సందర్భంగా ఇలా
- ఈ చర్యతో పలువురిని ఆకట్టుకున్న డాక్టర్ కేజే శ్రీనివాస



సాక్షి, సిటీబ్యూరో : అది ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లోని మొదటి అంతస్తు.. మంగళవారం ఉదయం 11.30 గంటల ప్రాంతం.. అమీర్‌పేట నుంచి అక్కడకు రీలోకేట్ అయిన పాస్‌పోర్టు సేవా కేంద్రం (పీఎస్‌కే) ప్రారంభమైంది. కేంద్ర విదేశీ వ్యవహార మంత్రిత్వ శాఖలో (ఎంఈఏ) సంయుక్త కార్యదర్శి హోదాలో ఉన్న చీఫ్ పాస్‌పోర్టు ఆఫీసర్ డాక్టర్ కేజే శ్రీనివాస ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత ఫొటో సెషన్ నడిచింది. పాస్‌పోర్టు కార్యాలయం, పీఎస్‌కే ఉద్యోగులు, అతిథులు ఆయనతో ఫొటోలు దిగారు. టోలిచౌకి నుంచి రాయదుర్గానికి రీలోకేట్ అయిన పీఎస్‌కేను ప్రారంభించాల్సి ఉంది. అందరూ అక్కడకు వెళ్లే హడావుడిలో ఉండగా.. 'రండి ఫొటో దిగుదాం' అనే మాట శ్రీనివాస నోటి వెంట వచ్చింది. అక్కడ ఉన్న నాల్గో తరగతి ఉద్యోగులను ప్రత్యేకంగా ఆహ్వానించిన ఆయన రీజనల్ పాస్‌పోర్టు ఆఫీసర్ స్నేహజ జోన్నలగడ్డతో కలిసి ఫొటోలు దిగారు. 'మా కేంద్రాలు సజావుగా నిర్వహించడానికి మీరూ కీలకమే' అంటూ ఆ పారిశుద్ధ్య, సెక్యూరిటీ ఉద్యోగులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆయన విలక్షణ వ్యక్తిత్వాన్ని చూసి అక్కడి వాళ్లంతా అవాక్కయ్యారు.

ఎవరీ శ్రీనివాస?

బెంగళూరుకు చెందిన కోటీహాల్ జయదేవప్ప శ్రీనివాస మైసూర్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యనభ్యసించారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారి. బెంగళూరులోని రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం నుంచి పాస్‌పోర్టు పొందడానికి శ్రీనివాస 1997లో దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో దాని కోసం ఉదయం 5 గంటలకే ఆర్‌పీఓ కార్యాలయానికి వెళ్లి గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సి వచ్చింది. అన్ని వెరిఫికేషన్లు పూర్తయి, పాస్‌పోర్టు పొందడానికి 60 రోజులు వేచి ఉన్నారు.



ఈ అనుభవాలను దృష్టిలో పెట్టుకున్న శ్రీనివాస తాను ఐఎఫ్ఎస్ అధికారి అయిన తర్వాత పాస్‌పోర్టు జారీలో సంస్కరణలపై దృష్టి పెట్టారు. ఈశాన్య రాష్ట్రాల్లో మారుమూల ప్రాంతాలకీ మొబైల్ పాస్‌పోర్టు సేవా వ్యాన్లు మొదలు చిఫ్ బేస్ట్ ఈ–పాస్‌పోర్టుకు రూపం ఇవ్వడంలోనూ పాత్ర కీలక పాత్ర వహించారు..



ఒలింపిక్స్ లక్ష్యంగా

స్పోర్ట్స్ పాలసీ

నగర వేదికగా నవంబర్ 9న అతిపెద్ద సైక్లోథాన్

సాక్షి, సిటీబ్యూరో: 2036లో భారత్‌లో జరగనున్న ఒలింపిక్స్ లక్ష్యంగా దేశంలో సైక్లింగ్ వృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని భారత సైక్లింగ్ ఫెడరేషన్ వెల్లడించింది. దేశవ్యాప్తంగా మరో అతిపెద్ద సైక్లోథాన్‌కు హైదరాబాద్ వేదిక కానుంది. తెలంగాణ ప్రభుత్వం, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రముఖ అంతర్జాతీయ సంస్థ హెచ్‌సీఎల్ గ్రూప్ నవంబర్ 9వ తేదీన ఈ 'హెచ్‌సీఎల్ సైక్లోథాన్' నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన జెర్సీని నగరంలోని ఐటీసీ కాకతీయ వేదికగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ రేస్‌లో ప్రొఫెషనల్స్, అమెచ్యూర్స్, గ్రీన్ రైడ్ అనే విభాగాల్లో 50కి.మీ, 24కి.మీల రోడ్ రేస్ ఉంటుంది.

సైక్లిస్టులకు జాతీయ ర్యాంకింగ్..

హైదరాబాద్‌తో పాటు నోయిడా, చెన్నై, ఢిల్లీలో ఈ సైక్లోథాన్ 2వ ఎడిషన్ జరుగనుందని హెచ్‌సీఎల్ గ్రూప్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రజత్ చందోలియా తెలిపారు. ఈ సారి 2 వేలకు పైగా సైక్లిస్టులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. రిజిస్ట్రేషన్లు www.hclcyclothon.com లో అక్టోబర్ 26 వరకూ అందుబాటులో ఉంటాయి. దేశంలోని సైక్లిస్టులకు ర్యాంకింగ్ స్థానాలనిస్తూ, భవిష్యత్ ఒలింపిక్స్‌లో భారత సైక్లింగ్‌కు ప్రత్యేక స్థానం ఉంటుందని ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ మణీందర్ పాల్ సింగ్ తెలిపారు.

సిటీలో సైక్లింగ్‌కు అద్భుత అవకాశాలు..

దేశంలో 2036లో జరుగనున్న ఒలింపిక్స్ నేపథ్యంలో 15 నుంచి 17 క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ వాటి వృద్ధికి కృషి చేస్తున్నాం. ఇందులో సైక్లింగ్ కూడా ఒకటి. సిటీలోని ఉస్మానియాలో సైక్లింగ్ వెల్లోడ్రోమ్ కూడా ఉంది. ఈ వేదికగా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి సైక్లింగ్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఈ సైక్లోథాన్‌లో మంచి టైమింగ్, ర్యాంకింగ్ ఉన్నవారిని జాతీయ సైక్లింగ్ బృందంలో నేరుగా తీసుకునేలా, ఒలింపిక్స్ వంటి క్రీడల్లో ప్రాతినిధ్యం వహించేలా ప్రోత్సాహం అందిస్తోంది సైక్లింగ్ ఫెడరేషన్. రాష్ట్ర స్పోర్ట్స్ పాలసీలు, హెచ్‌సీఎల్ వంటి సంస్థ సహకారం ఇందులో కీలకంగా పనిచేస్తుంది.

– జయేష్ రంజన్, ప్రభుత్వ పర్యాటక, క్రీడల ప్రధాన కార్యదర్శి

అభినయ వాణి..

ఓవైపు అసిస్టెంట్ కమిషనర్ విధులు..

మరోవైపు కళాకారిణిగా రాణింపు



నృత్యం ఓ తపస్సు.. ఇందులో రాణించాలంటే.. ఏదో నేర్చుకున్నామంటే సరిపోదు.. ఓ యజ్ఞంలా నిత్యం సాధన చేయాలి.. అలాంటి ఓ గొప్ప కళపై ఆమె ప్రాణం పెట్టేశారు. ఎంతలా అంటే.. ఏకంగా 160 కిలోమీటర్లు ప్రయాణించి అభ్యసించేంతలా. ఆమె ఎవరో కాదు.. తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంట్రప్రగడ వాణి భవాని. ఓ వైపు అధికారిగా, మరోవైపు కళాకారిణిగా, గృహిణిగా తన బాధ్యతలను నిర్వర్తిస్తూ.. పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అంతేకాకుండా తన అడుగుజాడలనే అనుసరిస్తూ చిన్న వయసులోనే నృత్యంలో ప్రతిభ చూపుతున్న తన కుమార్తెకు కూడా మార్గదర్శిగా నిలుస్తున్నారు.. - గన్‌ఫౌండ్రీ

వివిధ కళారూపాల సమాహారం నృత్యం. సంగీతం, సాహిత్యం, మానసిక శాస్త్రం ఇలా అనేక కళలు కలిస్తేనే నృత్యం. అలాంటి కళతో నాకు బాల్యంలోనే పరిచయం ఏర్పడింది. క్రమంగా నా జీవితంతో పెనవేసుకుపోయింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విద్యాభ్యాసం సమయంలో డాన్స్ క్లాస్ ఉండేది. టీచర్లు కూడా ప్రోత్సహించేవారు. అప్పటినుంచే నృత్యం పట్ల మక్కువ ఏర్పడింది. భక్తి శ్రద్ధలతో ఎలాగైనా ఈ కళలో మాస్టర్ కావాలని సంకల్పించా. దీనికి కళాతపస్వి కె.విశ్వనాథ్ 'స్వర్ణ కమలం' మరింత స్ఫూర్తినిచ్చింది. చివరికి ఆయన సమక్షంలోనే అరంగేట్రం పూర్తిచేశా.

ఆరంభం ఇలా..

ఇంటర్ కోసం హైదరాబాద్ వచ్చాం. నల్లకుంటలోని అమ్మమ్మ ఇంట్లో ఉండే వాళ్లం. అక్కడ సుప్రసిద్ధ నాట్య గురువు మద్దాలి ఉషా గాయత్రి దగ్గర చేరాను. రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న నాన్నగారు హఠాత్తుగా మరణించారు. దీంతో కారుణ్య నియామకంలో ఆయన ఉద్యోగం ఇచ్చారు. కరీంనగర్‌లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. దీంతో నృత్యాభ్యాసం ఆగిపోయే పరిస్థితి. ఎలాగైనా కొనసాగించాలన్న నా సంకల్పానికి అమ్మ, సోదరి అండగా నిలిచారు. నాట్య గురువు ప్రోత్సాహంతో వారంతాల్లో 160 కిలో మీటర్లు ప్రయాణించి అభ్యాసం పూర్తి చేశా. ఇప్పటి వరకూ 75 కి పైగా ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకుల మన్ననలు పొందా. నా భర్త భరణి, అత్తగారింటి సభ్యుల ప్రోత్సాహం మరువలేనిది. నా కుమార్తె అనన్య సైతం నాట్య గురువు మద్దాలి ఉషా గాయత్రి దగ్గరే శిక్షణ పొందుతోంది.



ఏకాగ్రత పెరుగుతుంది..



ఓ వైపు విధులు నిర్వహిస్తూనే.. పర్యావరణ పరిరక్షణ, నాట్యం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నా. నృత్యం వల్ల అపారమైన ప్రయోజనాలు ఉన్నాయి.. ఇది కదలికల ద్వారా చేసే ధ్యానం లాంటిది. అర్థంతో, లయతో కదలికలను సమన్వయం చేసుకోవాలి. అదే సమయంలో భంగిమలను సరిగ్గా ప్రదర్శించగలగాలి. దీనివల్ల ఏకాగ్రత పెరుగుతుంది. సంప్రదాయ నృత్యం రూపకల్పనలో కుడివైపు, ఎడమవైపు కదలికలు ఉంటాయి. దీనివల్ల మెదడులోని ఇరు భాగాలనూ సమానంగా ఉపయోగించే సామర్థ్యం కలుగుతుంది. దుస్తులు, ఆభరణాలు, మేకప్, రంగాలంకరణతో సహా నృత్యంలో అనేక అంశాలుంటాయి. దీనికి ఎంతో ఓపిక అవసరం. నేటి తరం పిల్లల్లోని అసహనాన్ని నృత్యాభ్యాసం నివారిస్తుంది. గురువులకు ఇచ్చే గౌరవం ద్వారా క్రమశిక్షణ పెరుగుతుంది. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ, ప్రకృతిని, పక్షులను కాపాడటం వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నా.

చేర్యాల కళపై.. వర్క్‌షాపు



- ఉత్సాహంగా బొమ్మలపై రంగులద్దిన ఔత్సాహికులు

బంజారాహిల్స్: కనుమరుగవుతున్న హస్తకళలను బతికించుకోవడంతో పాటు వాటిని నేటి తరానికి పరిచయం చేసే లక్ష్యంతో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ (సీసీటీ)లో చేర్యాల పెయింటింగ్ వర్క్‌షాప్ ఏర్పాటుచేశారు. రెండు రోజుల పాటు జరుగుతున్న ఈ వర్క్‌షాపులో నగరానికి చెందిన ఔత్సాహిక యువత చిన్నా పెద్దా తేడా లేకుండా భాగస్వాములయ్యారు.

సహజ వనరులతో..

సహజ వనరులు, ప్రకృతిలో లభించే రంగులతో అందమైన బొమ్మలను తీర్చిదిద్దారు. ప్రముఖ కళాకారులు ధనాలకోట సాయికిరణ్, సోదరుడు శ్రావణ్‌కుమార్ ఇద్దరూ చేర్యాల పెయింటింగ్స్‌పై వర్క్‌షాప్‌కు హాజరై మెళకువలు నేర్పారు. బొమ్మలపై రంగులు ఎలా అద్దాలో నేర్పించారు. చేర్యాల పేరుతో ఈ కళ 400 ఏళ్ల క్రితం నుంచి పరిచయం ఉండగా, మారుతున్న కాలంలో అంతరించిపోవడాన్ని గమనించి, చేర్యాల కళను బతికించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే సీసీటీతో కలిసి పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌లు ఏర్పాటుచేస్తూ ఈ బొమ్మలు తయారు చేసే విధానాలను నేర్పిస్తున్నారు.



కళను బతికించేందుకు..

ప్రస్తుతం ఈ కళకు సంబంధించి ఏడు కుటుంబాలు మాత్రమే మిగిలి ఉండగా.. వీరంతా కళను బతికించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. చింతగింజల పొడి, చెక్కపొట్టుతో తయారుచేసిన మాస్క్‌లపై సహజ రంగులతో వేస్తున్న ఈ పెయింటింగ్ ముచ్చటగొల్పేదిగా ఉంది. ప్రకృతిలో లభిస్తున్న వనరులతో ఈ కళకు కొత్త రూపు తీసుకుకొస్తున్న తీరును పలువురు అభినందించారు. రసాయనాలు, కాలుష్యానికి తావులేకుండా ప్రకృతిసిద్ధ వనరులతో ఈ బొమ్మలు వేస్తున్నారు.

● మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును కలిసేందుకు వచ్చిన మధుయాష్కీ ఛాతీనొప్పితో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే అక్కడి సిబ్బంది గుర్తించి సచివాలయంలో ఉన్న డిస్పెన్సరీలో తక్షణ వైద్య సహాయం అందించారు. అనంతరం అక్కడి నుంచి చికిత్స కోసం ఏఐజీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

చార్జిషీట్లు వేసిన తరువాత మళ్లీ దర్యాప్తు ఏంటి?

▶ మొదటి పేజీ తరువాయి

వాదనలను విచారణ సందర్భంగా సీబీఐ కోర్టు దృష్టికి ఎందుకు తీసుకువెళ్లలేదని నిలదీసింది. ఇదే సమయంలో వివేకా హత్య కేసులో వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులకిచ్చిన బెయిల్‌ను రద్దు చేసే విషయంలో ఏ విధంగానూ జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ విషయంలో తాము ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయబోమంది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

బెయిల్ రద్దు, తదుపరి దర్యాప్తు కోసం సునీత పిటిషన్లు...

వివేకా హత్య కేసులో నిందితులుగా ఉన్న వైఎస్ అవినాష్ రెడ్డి, శివశంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులకు హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్, బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సునీతరెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అలాగే తదుపరి దర్యాప్తు జరిపేలా సీబీఐని ఆదేశించాలంటూ కూడా ఆమె పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై మంగళవారం జస్టిస్ సుందరేష్ ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా సునీత తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపించారు. వివేకానంద రెడ్డి హత్య వెనుక ఉన్న కుట్రను బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందన్నారు ఈ విషయాన్ని సీబీఐ పట్టించుకోవడం లేదన్నారు. తదుపరి దర్యాప్తు చేసేలా సీబీఐని ఆదేశించాలని కోరుతూ సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. దానిని కోర్టు పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఎస్.వి. రాజు స్పందిస్తూ, ఈ కేసులో సీబీఐ దర్యాప్తు ముగిసిందని తెలిపారు. కోర్టు ఆదేశిస్తేనే తప్ప తదుపరి దర్యాప్తు చేయపట్టబోమన్నారు.

13 లక్షల డాక్యుమెంట్లను కోర్టు ముందుంచింది...

వైఎస్ అవినాష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరుల తరఫున సీనియర్ న్యాయవాదులు రంజిత్ కుమార్, నాగముత్తు వాదనలు వినిపించారు. సీబీఐ ఇప్పటికే దర్యాప్తును పూర్తి చేసిందని తెలిపారు. భారీ స్థాయిలో చార్జిషీట్‌లు కూడా దాఖలు చేసిందన్నారు. 13 లక్షల పేజీల డాక్యుమెంట్లను కోర్టు ముందు ఉంచిందని తెలిపారు. ఇప్పుడు తదుపరి దర్యాప్తు అంటే కింది కోర్టు విచారణ ముందుకెళ్లే అవకాశం ఉండదన్నారు.

ఇలా అయితే దశాబ్ద కాలం పడుతుంది...

ఈ సమయంలో లూథ్రా ఏదో చెప్పబోతుండగా, ధర్మాసనం జోక్యం చేసుకుంటూ, చార్జిషీట్లు దాఖలైన తరువాత ఈ కేసును తాము పర్యవేక్షించడం ఏమిటంటూ ప్రశ్నించింది. ఇలా ఒక దాని వెంట మరొక పిటిషన్ దాఖలు చేసుకుంటూ వెళుతుంటే అసలు ట్రయల్ పూర్తి కావడానికే దశాబ్ద కాలం పడుతుందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇప్పుడు మీరు చెబుతున్న వాదనను దర్యాప్తు సమయంలోనే సీబీఐ కోర్టు దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించింది. నిందితుల పై ఇప్పటికే సీబీఐ చార్జిషీట్లు దాఖలు చేసిందని గుర్తు చేసింది. ఇంతకన్నా చేసేది ఏముంటుందని ప్రశ్నించింది. 'దర్యాప్తు పూర్తి చేసిన తరువాతనే కదా చార్జి షీట్లు వేసేది. మరి అలాంటప్పుడు తదుపరి దర్యాప్తు కోరడం ద్వారా మీరు ఏం సాధిద్దామని అనుకుంటున్నారు' అంటూ సునీతను ప్రశ్నించింది. తదుపరి దర్యాప్తు కోసం పిటిషన్ దాఖలు చేసి దానిని ఓ తార్కిక ముగింపునివ్వాలంది. తదుపరి దర్యాప్తు విషయాన్ని సీబీఐ కోర్టులోనే తేల్చుకోవాలని స్పష్టం చేసింది. తాము ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయ బోమంది. అలాగే నిందితుల బెయిల్ రద్దు విషయంలో కూడా జోక్యం చేసుకునేది లేదని ధర్మాసనం తేల్చి చెప్పింది. బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను డిస్టర్బ్ చేయబోమంది. తదుపరి దర్యా ప్తు కోసం సీబీఐ కోర్టునే ఆశ్రయించాలని సునీతను ధర్మాసనం ఆదేశించింది. రెండువారాల్లోగా తాజా పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని, ఒకవేళ పిటిషన్ దాఖ లు చేస్తే దానిని 8 వారాల్లోపు తేల్చాలని సీబీఐ కోర్టుకు తేల్చిచెప్పింది. సీబీఐ తనంతట తానుగా కాకుండా సీబీఐ కోర్టు ఆదేశాలు ఇస్తేనే తదుపరి దర్యాప్తు చేపట్టాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు తెలిపింది.

నేడు పరేడ్‌గ్రౌండ్స్‌లో 'హైదరాబాద్ లిబరేషన్ డే'

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- కంటోన్మెంట్ పార్క్‌లో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ


ఐటీసీ కాకతీయ హోటల్‌లో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన బండి సంజయ్, కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్ : సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో బుధవారం 'హైదరాబాద్ లిబరేషన్ డే'జరగనుంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఉదయం 8.55 గంటలకు పరేడ్ గ్రౌండ్‌కు ఆయన చేరుకుంటారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. సీఆర్‌పీఎఫ్, ఇతర బలగాలు నిర్వహించే పరేడ్‌ను వీక్షిస్తారు. పారామిలటరీ దళాల ప్రత్యేక పరేడ్ కూడా ఉంటుంది. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక (పూర్వ హైదరాబాద్ స్టేట్)లకు చెందిన సాంస్కృతిక బృందాల ప్రదర్శన, థీమ్ ఆధారిత బ్యాలె, దేశభక్తితో కూడిన ప్రదర్శనలు ఉంటాయి. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు గజేంద్ర చౌహాన్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు పాల్గొంటారు. ఈ కార్యక్రమం పూర్తయ్యాక జూబ్లీ బస్టాండ్‌కు సమీపంలోని కంటోన్మెంట్ పార్క్‌లో ఏర్పాటు చేసిన భారతరత్న, మాజీ ప్రధాని ఏబీ వాజ్‌పేయి విగ్రహాన్ని రాజ్‌నాథ్‌సింగ్ ఆవిష్కరిస్తారు. అనంతరం బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీకి వెళతారు.

● హైదరాబాద్ లిబరేషన్‌డేను పురస్కరించుకొని ఉదయం 6.30 గంటలకు అసెంబ్లీ వద్దనున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అంజలి ఘటిస్తారు. ఆ తర్వాత పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు.

నగరానికి చేరిన రాజ్‌నాథ్‌సింగ్

హైదరాబాద్ లిబరేషన్ డేలో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు మంగళవారం సాయంత్రం బేగంపేట విమానాశ్రయంలో బీజేపీ నేతలు స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎం.రఘునందన్‌రావు తదితరులు కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

➤ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు మెంబర్‌గా ఉన్న తన అనుచరుడికి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఆహ్వానం పలికే పార్టీ నాయకుల లైనప్ పాస్ ఇవ్వకపోవడంపై ఈటల అలిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో అప్పటికప్పుడు లైనప్ పాస్ అందజేసినట్టు సమాచారం.

మోసమే కాంగ్రెస్ నైజం

భద్రాచలం నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్


సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్ : ప్రజలను మోసగించడమే కాంగ్రెస్ నైజమని, అబద్ధాలతో అధికారంలోకి వచ్చి హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పాత రోజులను తిరిగి తెచ్చి పాలనా సామర్థ్యం లేక గత ప్రభుత్వంపై నెపం నెడుతోందని విమర్శించారు. పదేళ్లలో చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకపోయామన్నారు. తెలంగాణభవన్‌లో మంగళవారం జరిగిన భద్రాచలం నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు, ఇతర నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఈ సమావేశంలో కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.

దమ్ముంటే ఉప ఎన్నికలకు రావాలి

పార్టీ మారిన ఎమ్మెల్యేలు పిరికివాళ్లగా మారారని, కాంగ్రెస్‌కు దమ్ముంటే ఉప ఎన్నికలకు రావాలని కేటీఆర్ సవాల్ విసిరారు. మంత్రి పొంగులేటి లక్కీలాటరీలో మంత్రి పదవి దక్కించుకొని అహంకారంతో మాట్లాడుతున్నారు..పాలేరులో ఎలా గెలుస్తారో చూద్దాం అని సవాల్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ కుట్రలను ఎదుర్కొంటున్న బీఆర్‌ఎస్, తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో బలంగా నిలబడుతుందని, కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

రాజ్యాంగంపై బీజేపీకి గౌరవం లేదు

వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను తమ పార్టీ స్వాగతించడాన్ని విమర్శిస్తున్న బీజేపీ నేతలకు భారత రాజ్యాంగం, సుప్రీంకోర్టు పట్ల ఏ మాత్రం గౌరవం లేదని కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. పాక్ ప్రేరేపిత ఉగ్రదాడిలో చిందిన 26 మంది అమాయకుల నెత్తురు తడి ఇంకా ఆరకముందే ఆ దేశంతో క్రికెట్ ఆడేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒప్పుకోవడం ఆ పార్టీ నకిలీ జాతీయవాదం, కపట దేశభక్తికి తిరుగులేని సాక్ష్యంగా పేర్కొన్నారు. హైదరాబాద్ నాలాలో కొట్టుకుపోయిన ముగ్గురి దేహాలను మూడు రోజులైనా గుర్తించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని కేటీఆర్ విమర్శించారు.

బలహీనవర్గాల కోసం కృషి చేసిన గొప్పవ్యక్తి

నారాయణగురు శతజయంతి ఉత్సవాల్లో శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలోని గుల్బర్గాలో నారాయణ గురు శతజయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నారాయణగురు బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేశారని తెలిపారు. సమాజంలో అసమానత లు తొలగిపోయి ఆర్థిక సమానత్వం రావాలంటే రిజర్వేషన్లు కీలకమన్నారు. జ్యోతిబా పూలే, పెరియార్‌లతో పాటు నారాయణగురు స్ఫూర్తితోనే రిజర్వేషన్లు అమలవుతున్నాయని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కర్ణాటకలో కులగణన శాస్త్రీయంగా జరిగి, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, తెలంగాణలో అసంబద్ధ రిజర్వేషన్‌ను సరిచేయాలని సూచించారు.

'అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు వెంటనే ప్రయోజనాలివ్వాలి'

సాక్షి, హైదరాబాద్: పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్లు కల్పించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మంగళవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ శ్రీజను కలిసి సంఘం తరఫున వినతిపత్రం అందించారు.

కాంగ్రెస్‌లో ఆదిలాబాద్ నేతల పునఃప్రవేశం


మహేశ్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరిన ఆదిలాబాద్ నేతలు

సాక్షి, హైదరాబాద్: పలు కారణాలతో పార్టీని వీడి వెళ్లిన వారు మళ్లీ రావాలని ఇటీవల టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గం చేసిన తీర్మానం మేరకు కాంగ్రెస్ పార్టీలోకి ఘర్ వాపసీ మొదలైంది. ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రారంభమైన ఘర్‌వాపసీ కార్యక్రమంలో భాగంగా.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించిన పలువురు నేతలు తిరిగి పార్టీలోకి వచ్చారు. ఆదిలాబాద్ డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవరెడ్డిలతో పాటు పలువురు నేతలు మంగళవారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ సమక్షంలో మళ్లీ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువాలు కప్పిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ తిరిగి పార్టీలోకి ఆహ్వానించారు.

మహిళలు అద్భుతాలు సృష్టిస్తున్నారు

● త్వరలో వారికోసం పాలసీ ప్రకటిస్తాం: మంత్రులు సీతక్క, సురేఖ




సాక్షి, హైదరాబాద్: ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ విధి నిర్వహణలో మహిళలు అద్భుతంగా రాణిస్తున్నారని, మహిళల కోసం త్వరలో పాలసీ ప్రకటిస్తామని మంత్రులు సీతక్క, కొండా సురేఖ తెలిపారు. మంగళవారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ సెక్రటేరియట్ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం లోగోను ఆవిష్కరించారు. సభ్యులుగా ఎన్నికైన మహిళా ఉద్యోగులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను చర్చించేందుకు మహిళా ఉద్యోగులందరితో ఈనెల 22న రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి వారిచ్చే సూచనలు, సలహాల మేరకు ఒక నూతన మహిళా పాలసీని తేవాలని పరిశీలిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు చేరువ చేసేలా పని చేయాలని మంత్రులు ఆకాంక్షించారు. సమావేశంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రమాదేవి పాల్గొన్నారు.

ప్రజలను గందరగోళానికి గురిచేసేందుకు బీజేపీ ప్రయత్నం

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన రోజును కూడా రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించాలనుకునే కుయుక్తితో బీజేపీ నేతలు రాష్ట్ర ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. అసలు ఆ విలీనం జరిగిన రోజున బీజేపీ ఎక్కడుందని, ఆ పార్టీకి సెప్టెంబర్ 17 గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని మంగళవారం మీడియాతో మాట్లాడుతూ మండిపడ్డారు. నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆదేశాల మేరకు హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆపరేషన్ పోలో నిర్వహించి నిజాం రాజ్యాన్ని భారతదేశంలో కలిపారని, ఆ రోజును విలీన దినోత్సవంగా గర్వంగా జరుపుకుంటామన్నారు. ఎప్పటిలాగే విలీన దినోత్సవాన్ని గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహిస్తామని, అన్ని జిల్లా కేంద్రాల్లో కూడా ఉత్సవాలు చేస్తామని మహేశ్‌గౌడ్ చెప్పారు. బీజేపీ ఎన్ని కుయుక్తులు పన్నినా తెలంగాణ ప్రజలు నమ్మబోరని తెలిపారు.

బీఆర్‌ఎస్ కబ్జాకు ట్రబుల్ షూటర్ కుట్ర

టీపీసీసీ నేత రామ్మోహన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌ను కబ్జా చేసేందుకు ఆ పార్టీకి చెందిన ట్రబుల్ షూటర్, టాల్‌మ్యాన్ కుట్ర చేస్తున్నారని టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. కేటీఆర్‌ను పాత కేసులో ఇరికించి జైలుకు పంపేందుకు తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. రామ్మోహన్‌రెడ్డి మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఈడీ ముందు ఒక హీరోయిన్ ఇచ్చిన ప్రకటన ఆధా రంగా.. ఆ కేసును తెరపైకి తెచ్చి కర్ణాటకలోని నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో జోనల్ కార్యాలయానికి విచారణకు పంపించి, అరెస్టు చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా యని వెల్లడించారు. కేసీఆర్ కుటుంబం నుంచి ఇప్పటికే ఒకరు బయటికి వెళ్లిపోయారని గుర్తు చేశారు. బిగ్ వికెట్ కేటీఆర్‌ను కూడా బయటకు పంపితే ఎదురుండదని టాల్‌మ్యాన్ ఆలోచనని చెప్పారు. బీజేపీ తాడును పట్టుకుని హరీశ్‌రావు ఆయన్ను ఇరికించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు.

ఎంపీల ఓట్లు అమ్ముకున్న సీఎం

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమ్మక్కై.. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఓట్లు అమ్ముకున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు మాత్రమే పోల్ అయ్యాయన్నారు. ఎన్‌డీఏ అభ్యర్థికి ఇండియా కూటమి నుంచి క్రాస్ అయిన 15 ఓట్లలో.. ఎనిమిది ఓట్లు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలే వేశారని స్పష్టం చేశారు. బీజేపీ అభ్యర్థికి ఓట్లు వేసిన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు.. పోలింగ్ తర్వాత కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీని, లోక్‌సభ స్పీకర్‌ను కలిశారని చెప్పారు. ఆయన తెలంగాణ భవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రతిపాదించిన ఉపరాష్ట్రపతి అభ్యర్థికి ఓటు వేశామని తనకు ముగ్గురు కాంగ్రెస్ ఎంపీలు చెప్పారన్నారు. తెలంగాణలో ఓట్ చోరీకి పాల్పడిన కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి.. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి వెన్నుపోటు పొడిచి చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించాడన్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛపై దాడే

'ఇండియా టుడే' గ్రూప్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్

- ప్రభుత్వ తప్పిదాలను ఎండగడుతున్న 'సాక్షి'పై వరుసగా అక్రమ కేసులు పత్రికా స్వేచ్ఛపై దాడే
- 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై క్రిమినల్ కేసుల నమోదు చట్టాన్ని దుర్వినియోగం చేయడమే
- ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పరిస్థితి దేశంలో మరెక్కడా లేదు
- పత్రికా స్వేచ్ఛను కాపాడుకునేందుకు 'సాక్షి'కి అండగా నిలబడతాం



సాక్షి, అమరావతి: ప్రభుత్వ తప్పిదాలు, వైఫల్యాలను ప్రజల పక్షాన ఎండగడుతున్న 'సాక్షి' దినపత్రికపై ఆంధ్రప్రదేశ్ సర్కారు వరుసగా కేసులు బనాయించడం భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి చేయడమేనని 'ఇండియా టుడే' గ్రూప్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ తీవ్రంగా ఖండించారు. విలేకరుల సమావేశంలో వెల్లడించిన అంశాలపై వార్తను ప్రచురించినందుకు 'సాక్షి'పై కేసులు నమోదు చేయడం, అదే వార్తను ప్రచురించిన మిగతా పత్రికలు, చానళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని బట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'సాక్షి'పై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ కోసం 'సాక్షి'కి అండగా నిలబడతామని ప్రకటించారు.

అది ప్రాథమిక హక్కు..

రాష్ట్రంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తూ రాజ్‌దీప్ సర్దేశాయ్ 'సాక్షి'తో మాట్లాడారు. భావ ప్రకటన స్వేచ్ఛ వర్ధిల్లితేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని విశ్వసిస్తూ రాజ్యాంగ నిర్మాతలు ఆర్టికల్ 19(1)ఏ ద్వారా ప్రాథమిక హక్కుగా కల్పించారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడానికి పత్రికా రంగం అవిరళ కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల పక్షాన 'సాక్షి' నిలదీస్తూ కథనాలు ప్రచురిస్తోందన్నారు. 'సాక్షి' ప్రచురించే వార్తా కథనాలపై ప్రభుత్వానికి ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని ఖండిస్తూ వివరణ ఇవ్వాలని, అప్పటికీ సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టుల్లో పరువు నష్టం దావా వేయవచ్చన్నారు. అంతేగానీ 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం, విచారణ పేరుతో ఆయన ఇంట్లో సోదాలు చేయడం, పోలీసు స్టేషన్లకు రప్పించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా ఈ రీతిలో పత్రికా స్వేచ్ఛపై దాడి చేస్తున్న దాఖలాలు లేవన్నారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, పాత్రికేయులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను పరిశీలిస్తే క్రిమినల్ చట్టాలను పోలీసులు దుర్వినియోగం చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. చట్టాన్ని పరిరక్షించాల్సిన పోలీసులు తమ బాధ్యతకు కట్టుబడి ఉండాలని హితవు పలికారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం, పత్రికా స్వేచ్ఛ వికాసానికి 'సాక్షి'కి అండగా నిలుస్తామని ప్రకటించారు.

క్లుప్తంగా...

శ్రీశైలంలో నాలుగు గేట్ల ఎత్తివేత



దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి మరోసారి వరద ప్రవాహం పెరగడంతో.. మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టు వద్ద నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. జూరాల ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 69,590, విద్యుదుత్పత్తి చేస్తూ 35,832, సుంకేసుల నుంచి 35,832, హంద్రీ నుంచి 1,125 మొత్తం 1,44,362 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తోంది. దీంతో శ్రీశైలం ఆనకట్ట వద్ద రాత్రి 10 గంటల సమయంలో నాలుగు గేట్లు.. ఒక్కొక్కటి పది అడుగుల మేర పైకెత్తారు. స్పిల్‌వే ద్వారా 1,11,200 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 66,059 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.4 అడుగుల వద్ద 211.9572 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి కొండపైన అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఈవో వెంకట్రావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే దంపతులు రూ.1,116, ఒక్క రోజు సప్తశతి పారాయణానికి రూ.116, లక్ష కుంకుమార్చనకు రూ.116 రుసుము చెల్లించాలని సూచించారు. శివాలయంలో నిర్వహించే రుద్ర హోమాన్ని 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

'ఉస్మానియా ఆస్పత్రికి పూర్వ వైభవం తెద్దాం'



సాక్షి, హైదరాబాద్: ఘన చరిత్ర ఉన్న ఉస్మానియా ఆస్పత్రికి పూర్వ వైభవం తీసుకొద్దామని, ఇందు కోసం అందరం కలిసి పని చేద్దామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న టీచింగ్ హాస్పిటళ్ల పనితీరు, ఆయా ఆస్పత్రుల్లో ఆధునిక వసతుల కల్పన తదితర అంశాలపై మంత్రి దామోదర మంగళవారం సచివాలయంలో సమీక్ష జరిపారు. ఈ సమీక్షలో ఆ శాఖ ఉన్నతాధికారులు క్రిస్టినా చోంగ్తూ, ఫణీంద్రరెడ్డి, ఉదయ్‌కుమార్, నరేంద్రకుమార్, అజయ్‌కుమార్‌లతో పాటు ఉస్మానియాకు అనుబంధంగా ఉన్న అన్ని మెడికల్ కళాశాలల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉస్మానియాకు అనుబంధంగా ఉన్న ఒక్కో హాస్పిటల్‌కు వంద సంవత్సరాలకు పైగా చరిత్ర ఉందన్నారు. వీటిని ఆధునీకరించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు.

అటవీ అధికారులపై దాడులకు దిగితే పీడీ యాక్ట్



సాక్షి, హైదరాబాద్: అటవీ అధికారులపై దాడులకు పాల్పడితే పీడీ యాక్ట్ పెడతామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. మంగళవారం సచివాలయంలో అటవీ అధికారులకు సంబంధించిన మూడు సంఘాలతో సమావేశం జరిగింది. ఈ సంఘాల నాయకులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి, అధికారులకు తెలియజేశారు. అటవీ భూములను అన్యాక్రాంతం చేసేవాళ్లను మహారాష్ట్రలో మా దిరిగా కఠిన చట్టాలతో శిక్షించాలని కోరారు.

'మర్రి'కి అటూ ఇటూ రోడ్డు!

చేవెళ్ల హైవే విస్తరణకు కొత్త డిజైన్
- 915 మర్రి వృక్షాలను కాపాడేందుకు మధ్యేమార్గం
- హరిత ట్రిబ్యునల్‌కు డిజైన్ సమర్పించిన ఎన్‌హెచ్ఏఐ
- సెంట్రల్ మీడియన్ స్థలాన్ని కుదించి చెట్లను కాపాడే యత్నం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిలో భాగంగా హైదరాబాద్ శివారులోని అప్పా కూడలి నుంచి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక్కడ 916 మర్రి వృక్షాలను తొలగించాల్సి రావటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పర్యావరణ ప్రేమికులు జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించటంతో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. మర్రి వృక్షాల పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళిక సమర్పించాలని హరిత ట్రిబ్యునల్ ఆదేశించిన నేపథ్యంలో తాజాగా ఎన్‌హెచ్ఏఐ సరికొత్త ఆలోచనతో మధ్యేమార్గాన్ని రూపొందించింది. గతంలో రూపొందించిన డిజైన్‌ను సవరించి రూపొందించిన కొత్త డిజైన్‌ను తాజాగా ట్రిబ్యునల్‌కు ఎన్‌హెచ్ఏఐ సమర్పించింది. మరోవైపు కేసు దాఖలు చేసిన పర్యావరణ ప్రేమికులు, ఆ డిజైన్ ప్రకారం వృక్షాల భద్రతపై ఈ వారంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి ట్రిబ్యునల్ ముందు తమ వాదనను వినిపించనున్నారు.

ఇదీ చిక్కు...
హైదరాబాద్ నుంచి బీజాపూర్ వరకు ఉన్న 163 నంబర్ జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు ఉన్న 46.405 కి.మీ. సర్వీసు రోడ్లతోపాటు నాలుగు వరసలుగా విస్తరించే బాధ్యతను ఎన్‌హెచ్ఏఐకి కేంద్ర ఉపరితల రవాణాశాఖ అప్పగించింది. మన్నెగూడ నుంచి పరిగి మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు ఉన్న భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని ఎన్‌హెచ్ విభాగానికి అప్పగించింది. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డుకిరువైపులా 60 నుంచి 85 ఏళ్ల వయసు ఉన్న 915 మర్రి వృక్షాలను తొలగించాల్సి రావటంతో పర్యావరణ ప్రేమికులు అభ్యంతరం తెలిపారు. ఆ రోడ్డును అలాగే ఉంచి ప్రత్యామ్నాయ రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేస్తూ జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసు దాఖలు చేశారు.

తాజా పరిష్కారం ఇలా: రోడ్డును రెండు వైపులా కలిపి 60 మీటర్లకు విస్తరించాల్సి ఉంది. దీంతో అక్కడ ఉన్న అన్ని మర్రి వృక్షాలను తొలగించాలని గతంలో నిర్ణయించారు. ఇప్పుడు ఆ డిజైన్‌ను మార్చారు. తొలుత 5 మీటర్లుగా ప్రతిపాదించిన సెంట్రల్ మీడియన్‌ను ఇప్పుడు 1.5 మీటర్లకు తగ్గించారు. దీంతో కలిసి వచ్చే మూడున్నర మీటర్ల భాగాన్ని ప్రధాన కారేజ్‌వేలో కలిపేయటం ద్వారా వృక్షాలకు చేరువ వరకు మాత్రమే రోడ్డును విస్తరిస్తారు. వృక్షాల ఆవల సర్వీసు రోడ్డును నిర్మిస్తారు. అంటే.. సర్వీసు రోడ్డుకు, ప్రధాన క్యారేజ్‌వేకు మధ్యలో ఆ వృక్షాలుంటాయి. రోడ్డు మీదకు వచ్చి వాహనాలకు ఇబ్బందిగా మారే కొమ్మలను తొలగిస్తారు. 150 వృక్షాలు మాత్రం ఈ డిజైన్‌కు అనుకూలంగా లేవు. దీంతో వాటిని ఉన్న చోట నుంచి ట్రాన్స్‌లొకేట్ పద్ధతిలో కాస్త పక్కకు మార్చి తిరిగి నాటుతారు. ఆ 150 వృక్షాలకు ఇప్పటికే రెడ్ మార్క్ వేశారు. అయితే, ఈ డిజైన్ ప్రకారం మర్రి వృక్షాల కొమ్మలు తొలగించనుండటంతో పర్యావరణ ప్రేమికులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

అలిపిరి పాదాల చెంత ఘోర అపచారం

మల మూత్రాలు, మద్యం బాటిళ్ల మధ్య మహా విష్ణువు విగ్రహం.. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా టీటీడీ తీరు



అలిపిరి వద్ద పడేసి ఉన్న మహావిష్ణువు విగ్రహానికి మొక్కుతున్న భూమన

తిరుపతి మంగళం: సాక్షాత్తు కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి పాదాల చెంత మల మూత్రాలు, మద్యం బాటిళ్ల మధ్య మహా విష్ణువు విగ్రహాన్ని పడవేసి టీటీడీ పాలక మండలి, విజిలెన్స్ అధికారులు ఘోర అపచారం చేశారని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలిపిరి గరుడ విగ్రహానికి కూత వేటు దూరంలో మల మూత్ర విసర్జనం చేసే చోట మహా విష్ణువు విగ్రహాన్ని పడేశారని తెలుసుకుని మంగళవారం ఆయన అక్కడికి చేరుకుని చలించిపోయారు. టీటీడీలో జరుగుతున్న అపచారాలను తాను ఎత్తి చూపుతుంటే తాను నాస్తికుడినని, క్రిస్టియన్ అని నోటికి వచ్చినట్లు టీటీడీ చైర్మన్ బొల్లి రాజగోపాల్ నాయుడు (బీఆర్ నాయుడు) ఆరోపించారని ఆయన గుర్తు చేశారు. టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి టీటీడీలో వరుసగా ఘోర అపచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహావిష్ణువు విగ్రహం చుట్టూ పడిన గంపెడు మద్యం బాటిళ్లను టీటీడీ పారిశుద్ధ్య కార్మికులు ఎత్తిపోయడాన్ని అక్కడున్న వారికి చూపించారు. అనంతరం శ్రీ మహావిష్ణువు విగ్రహం వద్ద కొబ్బరికాయ కొట్టి కర్పూర హారతులు పట్టి 'తప్పులు మన్నించు స్వామీ..'అంటూ వేడుకున్నారు.

భూమన కరుణాకరరెడ్డిపై అక్రమ కేసు

భూమన కరుణాకర రెడ్డిపై తిరుపతి అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి అక్రమ కేసు నమోదు చేశారు. హిందూ మత మనోభావాలు దెబ్బతీయడానికి, టీటీడీని కించపరచడానికి, ప్రజల్లో అల్లర్లు రేపడానికి దుష్ప్రచార వీడియోలు పోస్ట్ చేశారంటూ ఆయనపై టీటీడీ డిప్యూటీ ఇంజనీర్ గోవిందరాజులు అలిపిరి పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు 196(1)(ఎ), 197(1), 299, 352, 353(3), 356(2), రెడ్ విత్ 356(1) బీఎంఎస్ చట్టం కింద భూమనపై కేసు నమోదు చేశారు. కాగా, రాజకీయాల కంటే హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా పోరాడుతానని భూమన స్పష్టం చేశారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా భయపడే ప్రసక్తే లేదన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్లానింగ్ ఎలా?



- కమిటీ ముందుంచాల్సిన మార్గదర్శకాలేంటి.. ఎవరికి ఏ బాధ్యత అప్పగించాలి?
- కాలేజీల వారీగా డేటా సేకరణ.. విద్యార్థుల ఖాతాల్లోకి వేయడంపై తర్జనభర్జన
- ప్రత్యేక బ్యాంక్ ఖాతా సాధ్యమేనా.. ఫీజు రీయింబర్స్‌మెంట్ హేతుబద్ధీకరణపై కసరత్తు

సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ హేతుబద్ధీకరణపై ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఈ దిశగా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. సంక్షేమ, విద్యాశాఖ అధికారులతోపాటు కాలేజీ యాజమాన్య ప్రతినిధులను ఇందులో చేర్చాలని నిర్ణయించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హేతుబద్ధీకరణపై దృష్టి పెట్టారు. విద్యాశాఖ అధికారులతో ఆయన సంప్రదింపులు చేపట్టారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్ల మేర పేరుకుపోయాయి. ఇక నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కొత్త మార్గదర్శకాలు ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది.

డేటా సేకరణ
ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సమగ్ర సమాచారం సేకరించాలని ముఖ్యమంత్రి కార్యాలయం విద్య, సంక్షేమ శాఖలను ఆదేశించింది. దీంతో పాటే కాలేజీల నాణ్యత ప్రమాణాలపైనా నివేదిక కోరుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే కాలేజీల్లో హాజరు శాతం ఎలా ఉంది? కొన్నేళ్లుగా ఆయా కాలేజీల్లో ఫలితాలు ఎలా ఉన్నాయి? ఎంతమంది ఉద్యోగాలు పొందారు? ఆ కాలేజీలు ఎన్నిసార్లు జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు పొందాయి? ఇలాంటి అనేక వివరాలను ప్రభుత్వం కోరినట్టు తెలిసింది. నాణ్యత లేని కాలేజీలను దృష్టిలో ఉంచుకొని మార్గదర్శకాలు రూపొందించే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కాలేజీలో కనీస స్థాయి ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, ఉద్యోగ అవకాశాలను కొలమానంగా తీసుకునే వీలుంది. దీంతో పాటు యూజీసీ, ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం ఫ్యాకల్టీ, లేబొరేటరీలు ఉన్న కాలేజీలకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందనే నిబంధన తీసుకొచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం.

నేరుగా ఇస్తే సమస్యలేంటి?

విద్యార్థికి వారి బ్యాంకు ఖాతాలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే వచ్చే సమస్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారుల ద్వారా వాకబు చేసినట్టు తెలిసింది. దీనిపై విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం ఆలస్యమైతే, కాలేజీల నుంచి విద్యార్థులకు ఒత్తిడి పెరుగుతుందనే భావన విద్యార్థి వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ఖాతాల్లో డబ్బులు వేసినా, అవి వాడుకుంటే సమస్యలు వస్తాయనే ఆలోచన కొంతమంది అధికారులు వ్యక్తం చేస్తున్నారు. కాలేజీ యాజమాన్యాలు మాత్రం ప్రత్యేక బ్యాంకు ఖాతా పెట్టాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని, కాలేజీ నిర్వహణ వ్యయాన్ని ఈ ఖాతాలో ఉంచాలన్న ప్రతిపాదన తీసుకొచ్చాయి. దీనికి బ్యాంకులు ఏమేర ముందుకొస్తాయనేది ఉన్నతాధికారులు పరిశీలించే పనిలో ఉన్నారు.

వైద్యులు రోగుల నమ్మకాన్ని నిలబెట్టాలి

మెడికవర్ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఆస్పత్రిలోని వైద్య పరికరాలను పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పొన్నం ప్రభాకర్

రాంగోపాల్‌పేట్: రోగులు వైద్యులపై ఎంతో నమ్మకంతో ఆస్పత్రులకు వస్తారని, ఆ నమ్మకాన్ని నిలుపుకునేలా వైద్యాన్ని అందించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సంగీత్ థియేటర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మెడికవర్ ఆస్పత్రిని మరో కేంద్రమంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ మెడికల్ హబ్‌గా మారిందని ఆఫ్రికన్ దేశాల నుంచి నగరానికి వైద్యం కోసం వస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వాల ప్రాథమిక విధి అని అందుకే ఆయుష్మాన్ భారత్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి కార్పొరేట్ ఆస్పత్రి రీసెర్చ్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి పరిశోధనలు పెంచాలని, మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయాలని సూచించారు. బండి సంజయ్ మాట్లాడుతూ గతంలో తాను గుండెపోటుతో అపస్మారక స్థితిలోకి వెళ్లగా వైద్యులు నమ్మకం లేదని చెబితే మెడికవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శరత్ రెడ్డి స్థానికంగా ఉండే వైద్యుడితో 4 గంటలు వీడియో కాల్ మాట్లాడుతూ చికిత్స అందించి ప్రాణాలు నిలిపారని గుర్తుచేశారు. ఆస్పత్రి చైర్మన్, ఎండీ అనిల్‌కృష్ణ మాట్లాడుతూ మెడికవర్ 12 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోందని, 24వ ఆస్పత్రిని సికింద్రాబాద్‌లో 300 పడకలతో ఏర్పాటు చేశామన్నారు.

'శాస్త్ర సాంకేతిక రంగాల హబ్‌గా హైదరాబాద్'

రాయదుర్గం: సృజనాత్మకత, శాస్త్ర, సాంకేతిక రంగాలకు హబ్‌గా హైదరాబాద్ నగరం మారిందని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌లో భాగంగా.. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో సెమినార్, ఒప్పందాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పరిశోధనలు, ఆంట్రప్రెన్యూర్‌షిప్‌లకు అనువైన వాతావరణానికి హైదరాబాద్ నిలయంగా రూపొందిందని గుర్తు చేశారు. పదకొండేళ్లుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రతి రంగంలోనూ శాస్త్రీయ దృక్పథం పెరిగిందన్నారు. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ (ఎన్‌సీఎంఎం) కూడా అదే శాస్త్రీయ దృక్పథంతో ఏర్పాటైందన్నారు. 2030 నాటికి ఈవీ బ్యాటరీల పునరుత్పాదక శక్తి సాంకేతికతకు మూడు రెట్లు డిమాండ్ పెరుగుతుందన్నారు. దీంతో క్రిటికల్ మినరల్స్ అవసరం మరింతగా పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ కింద.. ఇప్పటికే దేశంలో నాలుగు ఐఐటీలు, మూడు రీసెర్చ్ ల్యాబొరేటరీలను సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లుగా తీర్చిదిద్దామన్నారు. 2047 నాటికి భారతదేశం ఆత్మనిర్భర దేశంగా రూపుదిద్దుకొని ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడంలో క్రిటికల్ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. చరిత్రలోనే తొలిసారిగా బొగ్గు ఉత్పత్తి రవాణాలో బిలియన్ టన్నుల లక్ష్యాన్ని ఛేదించడం సంతోషంగా ఉందన్నారు. అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌పై ప్రస్తుతం దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. త్వరలోనే దీనికి సంబంధించి తొలి బ్లాక్ వేలం వేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమం లో గనుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు ఘనంగా జరగాలి: మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై బేగంపేట టూరిజం ప్లాజా హోటల్‌లో అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక-చారిత్రక ప్రాంతాలను ముస్తాబు చేయాలన్నారు. ఈనెల 21 నుంచి 30 వరకు వేడుకల సందర్భంగా.. ఆయా ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. బతుకమ్మ ప్రత్యేక గీతాలు, ఇతివృత్తాన్ని రూపొందించి వాట్సాప్ స్టేటస్‌గా, కాలర్ ట్యూన్స్‌గా వినియోగించేలా చూడాలని సూచించారు. వేడుకల్లో వాడిన పూలను వృథాగా పడేయకుండా, వాటితో పర్యావరణ హిత వస్తువులు రూపొందించేలా చూడాలన్నారు. 21న వరంగల్‌లోని వేయి స్తంభాల దేవాలయం వద్ద వేడుకల ప్రారంభ కార్యక్రమాలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎంపిక చేసిన కూడళ్లు, పర్యాటక హోటళ్లు, విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, యూనివర్సిటీల్లో బతుకమ్మ చిహ్నాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 22న శిల్పారామం, మహబూబ్‌నగర్ పిల్లల మర్రి, 23న బుద్ధవనం, 24న కాళేశ్వర దేవాలయం, కరీంనగర్ సిటీ సెంటర్, 25న భద్రాచలం దేవాలయం, జోగులాంబ దేవాలయం, హైదరాబాద్ సిటీ ఆర్ట్ గ్యాలరీ (25 నుంచి 29 వరకు ఆర్ట్ క్యాంప్), 26న నిజామాబాద్ అలీ సాగర్ రిజర్వాయర్, నెక్లెస్ రోడ్డులో సైకిల్ ర్యాలీ, 27న నెక్లెస్ రోడ్డులో మహిళల బైక్ ర్యాలీ, ఐటీ కారిడార్‌లో బతుకమ్మ కార్నివాల్, 28న ఎల్బీ స్టేడియంలో 10 వేల మంది మహిళలతో వేడుక, 29న పీపుల్స్ ప్లాజాలో బతుకమ్మ పోటీలు, 30న ట్యాంక్‌బండ్‌పై ముగింపు కార్యక్రమాలు, వింటేజ్ కార్ ర్యాలీ, ఇకెబెనా ప్రదర్శన, సచివాలయంపై బతుకమ్మ 3డీ మ్యాపింగ్ లేజర్‌షో కార్యక్రమాలు ఉంటాయని మంత్రి జూపల్లి వివరించారు.

'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ చాలెంజ్' పోటీలు: దిల్‌రాజు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పండుగలు, చరిత్ర, సంస్కృతి నేపథ్యంగా 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ చాలెంజ్' పోటీలు నిర్వహించనున్నట్టు ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. షార్ట్ ఫిలిమ్ నిడివి 3 నిమిషాలకు, పాటల వ్యవధి 5 నిమిషాలకు మించరాదన్నారు. రూ.3 లక్షలు, రూ.2 లక్షలు, రూ.లక్ష చొప్పున ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద అందిస్తామన్నారు. కన్సోలేషన్ బహుమతి రూ.20 వేలు (ఐదుగురికి) ఇస్తామని తెలిపారు. ఎంట్రీలను youngfilmmaker schallenge@gmail.comకి, లేదా 8125834009 వాట్సాప్ నంబర్‌కు పంపాలన్నారు.

పట్టువిడుపులుంటేనే పరిష్కారం..

▶ మొదటి పేజీ తరువాయి

ఇదే పద్ధతిలో సాదా బైనామాలు క్లియర్ చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కొన్న వారితో పాటు అమ్మిన వ్యక్తి కూడా అఫిడవిట్ ఇవ్వాలంటే సమస్యను సృష్టించడమేనంటూ, ఆ నిబంధనను తొలగించాలనే డిమాండ్ వినిపిస్తోంది. అయితే ప్రభుత్వం కూడా ఈ విషయంలో సానుకూలంగానే ఉన్నట్టు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అవసరమైతే రైతుల నుంచి రాతపూర్వక అభ్యంతరాలు తీసుకోవడంతో పాటు చుట్టు పక్కల రైతులను విచారించాలనేది నిబంధనగా చేర్చాలనే యోచనలో ఉన్నట్టు సమాచారం.

ఆ దరఖాస్తుల సంగతేంటి?
సాదా బైనామాల పరిష్కారానికి 2020 అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10 వరకు దరఖాస్తులు స్వీకరించారు. 9.84 లక్షల దరఖాస్తులు రాగా కొన్నింటిని అప్పట్లోనే పరిష్కరించినట్టు తెలుస్తోంది. అప్పట్లో వచ్చిన ధరణి చట్టంలో సాదా బైనామాల పరిష్కార అంశం లేనప్పటికీ ఆన్‌లైన్‌లో వచ్చిన దాదాపు 4 లక్షల దరఖాస్తులపై అప్పుడే నిర్ణయం తీసుకున్నారని, అందులో ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులను తిరస్కరించారని తెలుస్తోంది. అయితే కొత్తగా వచ్చిన భూ భారతి చట్టంలో సాదా బైనామాల పరిష్కారం కోసం 2020లో దరఖాస్తు చేసి ఉండాలని మాత్రమే ఉంది కానీ, అప్పట్లో తిరస్కారానికి గురైతే మళ్లీ పరిశీలించకూడదని లేదు. ఈ చట్టం నిబంధనల్లోనూ దరఖాస్తుల తిరస్కరణ, ఆమోదం గురించిన ప్రస్తావన లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్దేశించిన సమయం మధ్యలో ఉన్న దరఖాస్తులన్నింటినీ పరిశీలించి పరిష్కరించాల్సిందేనని నిపుణులు చెపుతున్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా చట్టం, నిబంధనలపైనే ఆధారపడకుండా సమస్యలన్నింటికీ పరిష్కార మార్గం చూపిస్తూ ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించుకుని ముందుకెళ్లాలని సూచిస్తున్నారు. సాదా బైనామాలను ఉదారంగా పరిష్కరించకపోతే మరోమారు పరిష్కారానికి అవకాశం లేదు కాబట్టి రైతులు నష్టపోతారని, మళ్లీ సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి ఉంటుందని వారు చెపుతున్నారు. చెక్‌లిస్టు, ఎంక్వైరీ ఫార్మాట్, ప్రాసెస్ విషయంలో ప్రత్యేక మార్గదర్శకాలివ్వాలని అంటున్నారు.

ఉదారంగా వెళ్లడమే మేలు



సాదా బైనామా అనేది తెలంగాణలో పెద్ద భూసమస్య. 1989 నుంచి నలుగుతున్న సమస్య. అది కూడా చిన్న, సన్నకారు రైతులకు సంబంధించింది. కొన్న మాట వాస్తవమా?.. కాదా?, సాగులో ఉన్నారా?.. లేదా? అన్నది క్షుణ్ణంగా పరిశీలించుకుని మిగిలిన అంశాల్లో పట్టుదలకు పోకుండా ప్రభుత్వం కొంత ఉదారంగా వ్యవహరించాలి. అదే సమయంలో అవకతవకలు జరగకుండా కూడా జాగ్రత్త తీసుకోవాలి. - భూమి సునీల్, భూచట్టాల నిపుణుడు

సాదాబైనామా క్లియరెన్స్ కోసం ఏముండాలంటే...



- భూమి రైతు అధీనంలో కొనసాగుతుండాలి
- 12 సంవత్సరాలుగా సదరు వ్యక్తి అనుభవంలో ఉండాలి
- కొనుగోలు చేసినట్టుగా పత్రం లేదా పహాణీలోని సాగుదారు కాలమ్‌లో పేరు ఉండాలి.

సాదాబైనామా.. కథా కమామిషు

తెల్ల కాగితం లేదా స్టాంపు పేపర్ మీద (అన్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్) జరిగిన వ్యవసాయ భూముల క్రయ విక్రయ లావాదేవీలను సాదాబైనామాలంటారు. తెలంగాణ రైతాంగానికి సుపరిచితమైన ఈ సాదాబైనామాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. నిజాం రాజ్యం నుంచి నిన్న మొన్నటి వరకు కూడా తెలంగాణ రైతాంగం తెల్ల కాగితాలపై వ్యవసాయ భూముల క్రయ విక్రయాలు జరిపింది. నిరక్షరాస్యత కారణంగా, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ కావాలంటే ప్రభుత్వానికి ఫీజు చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతో రైతులు కొందరు తెల్ల కాగితాలపై, ఇతర కాగితాలపై రాసుకుని నోటి మాటలతోనే భూముల యాజమాన్య హక్కును మార్చుకునే వారు. నిజాం పాలన నుంచి ఆంధ్రప్రదేశ్‌లో రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్–1971) చట్టం అమల్లోకి వచ్చిన 1989 వరకు అసలు సాదాబైనామాలు సమస్య కాలేదు. జమాబందీ జరిగినప్పుడు రైతు దరఖాస్తు చేసుకుంటే సాదాబైనామా ప్రకారం పట్టా మార్పిడి జరిగిపోయేది. అంతకుముందు సాదాబైనామాల ద్వారా జరిగిన లావాదేవీలను మార్పుల రిజిస్టర్‌లో నమోదు చేసేవారు. తెలంగాణలో ఆర్‌వోఆర్ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కాగితపు లావాదేవీల ద్వారా పట్టా మార్పిడికి అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే సాదాబైనామాల క్రమబద్ధీకరణ అంశం తెరపైకి వచ్చింది. తొలిసారిగా 1989లో సాదాబైనామాలను క్రమబద్ధీకరించే ప్రక్రియ మొదలైంది. ఆ తర్వాత 1996, 97.. ఇలా ఇప్పటికి 13 సార్లు క్రమబద్ధీకరించారు. కాగితపు లావాదేవీలను పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్న భూములపై కొన్నవారికి హక్కులు కల్పించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత కూడా 2016, 2017లో క్రమబద్ధీకరణ జరిగింది. చివరిసారిగా 2020లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పుడు ఈ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియకే శ్రీకారం చుట్టారు. అయితే గతంలో సాదా బైనామాలను ఉచితంగా క్రమబద్ధీకరించేవారు. కానీ ప్రస్తుతం భూభారతి చట్టంలో చేసిన మార్పుల ప్రకారం ప్రభుత్వానికి స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుంది. భూభారతి చట్టంలో పేర్కొన్న ప్రకారం సాదాబైనామాల క్రమబద్ధీకరణ ఇదే ఆఖరుసారి. మళ్లీ చేయాలంటే భూభారతి చట్టానికి సవరణలు చేయాలి.

14
సాక్షి
స్పోర్ట్స్
బుధవారం
17-9-2025



మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌లో స్మృతి మంధాన

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంది. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో అర్ధ సెంచరీ సాధించడంతో స్మృతి ర్యాంక్ మెరుగైంది. గత ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న స్మృతి తాజా ప్రదర్శనతో ఆమె ఖాతాలో ఏడు రేటింగ్ పాయింట్లు చేరాయి. గత ర్యాంకింగ్స్‌లో 731 రేటింగ్ పాయింట్లతో నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న ఇంగ్లండ్ స్టార్ నటాలియా సివర్ బ్రంట్ రెండో స్థానానికి చేరుకోగా... 735 రేటింగ్ పాయింట్లతో స్మృతి టాప్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలవడం స్మృతికి మూడోసారి. 2019 జనవరిలో తొలిసారి టాప్ ర్యాంక్‌ను పొందిన ఆమె... ఈ ఏడాది జూలైలో రెండోసారి నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకొని వారం రోజులపాటు ఆ స్థానంలో ఉంది. ఆ తర్వాత రెండో స్థానానికి పడిపోయిన స్మృతి ఆస్ట్రేలియాతో తొలి వన్డేలో రాణించి మళ్లీ టాప్ ర్యాంక్‌ను అందుకుంది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 12వ స్థానంలో, జెమీమా రోడ్రిగ్స్ 15వ స్థానంలో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో సోఫీ ఎకిల్‌స్టోన్ నంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకోగా... దీప్తి శర్మ మూడు స్థానాలు పడిపోయి ఏడో ర్యాంక్‌లో నిలిచింది. స్నేహ్ రాణా ఐదు స్థానాలు ఎగబాకి 16వ ర్యాంక్‌ను అందుకుంది.

టీమిండియా ప్రధాన స్పాన్సర్‌గా అపోలో టైర్స్

ఒప్పందం విలువ రూ. 579 కోట్లు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు ప్రధాన స్పాన్సర్‌గా 'అపోలో టైర్స్' ఎంపికైంది. ఒప్పందంలో భాగంగా రెండున్నరేళ్లకు గానూ ఆ సంస్థ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కు రూ. 579 కోట్లు చెల్లిస్తుంది. ఈ మేరకు బీసీసీఐ మంగళవారం బిడ్డింగ్ వివరాలు వెల్లడించింది. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడంతో... గతంలో టీమిండియా స్పాన్సర్‌గా వ్యవహరించిన 'డ్రీమ్ 11' ఒప్పందం రద్దు అయింది. దీంతో ప్రస్తుతం భారత జట్టు స్పాన్సర్ లేకుండానే ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌లో పాల్గొంటోంది. 'ప్రపంచ టైర్ల పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న అపోలో టైర్స్‌తో బీసీసీఐ ఒప్పందం కుదుర్చుకుంది. ఇకపై అపోలో టైర్స్ భారత ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తుంది. ఈ సంస్థ క్రికెట్‌లోకి అడుగుపెట్టడం ఇదే తొలిసారి' అని బీసీసీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. బిడ్డింగ్ ప్రక్రియ అనంతరమే స్పాన్సర్‌ను ఎంపిక చేసినట్లు బోర్డు తెలిపింది. గతంతో పోల్చుకుంటే ఈసారి భారీ మొత్తానికి స్పాన్సర్‌షిప్ హక్కులు దక్కించుకోవడం... దేశంలో పెరుగుతున్న క్రికెట్ విలువకు నిదర్శనమని వెల్లడించింది. అపోలో టైర్లతో ఒప్పంద కాలంలో భారత జట్టు 121 అంతర్జాతీయ మ్యాచ్‌లు, 21 ఐసీసీ మ్యాచ్‌లు ఆడనుంది. గతంలో 'డ్రీమ్ 11'తో రూ. 358 కోట్లకు ఒప్పందం చేసుకున్న బీసీసీఐ... ఇప్పుడు స్పాన్సర్‌షిప్ ద్వారా 579 కోట్లు సాధించింది. 'ఈ ఒప్పందం 2028 మార్చి వరకు సాగుతుంది. అప్పటి వరకు భారత ఆటగాళ్ల జెర్సీపై అపోలో టైర్స్ లోగో ఉంటుంది. అన్నీ ఫార్మాట్లలో పురుషుల, మహిళల జాతీయ జట్లకు ఇది వర్తిస్తుంది' అని బోర్డు ప్రకటనలో పేర్కొంది. ఆన్‌లైన్ గేమింగ్ చట్టం-2025 ప్రకారం ఆన్‌లైన్ మనీ గేమింగ్ సేవలను అందించడం, సహాయం చేయడం, ప్రోత్సహించడం, ప్రేరేపించడం వంటివి శిక్షార్హమైన నేరాలు. ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఆన్‌లైన్ మనీ గేమ్ ఆడటానికి ప్రోత్సహించే ఏ ప్రకటనలకు కూడా మద్దతు ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త స్పాన్సర్ కోసం బీసీసీఐ ఈ నెల ఆరంభంలో దరఖాస్తులు ఆహ్వానించింది. పొగాకు ఉత్పత్తులు, మద్యం కంపెనీలు, ఆన్‌లైన్ గేమింగ్, క్రిప్టో కరెన్సీకి సంబంధించిన కంపెనీలు ఇందులో పాల్గొన కూడదని ముందే ప్రకటించగా... బిడ్డింగ్‌లో మొత్తం మూడు సంస్థలు పాల్గొన్నాయి. అపోలో టైర్స్ రూ. 579 కోట్లు, కాన్వా కంపెనీ రూ. 544 కోట్లు, జేకే సిమెంట్స్ రూ. 477 కోట్లు చెల్లిస్తామని ప్రతిపాదించాయి. చివరకు అత్యధిక మొత్తం వెచ్చించేందుకు సిద్ధమైన అపోలో టైర్స్ స్పాన్సర్‌షిప్ దక్కించుకుంది. 'ఇది రెండు సంస్థల మధ్య కేవలం వాణిజ్య ఒప్పందం మాత్రమే కాదు. కోట్లాది మంది నమ్మకం, విశ్వాసం, గౌరవానికి సంబంధించింది' అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు.

27 నిమిషాల్లోనే...

తొలి రౌండ్‌లో సింధు విజయం



షెన్‌జెన్: చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ సింధు 21-5, 21-10తో ప్రపంచ 44వ ర్యాంకర్ జూలీ దవాల్ జేకబ్సన్ (డెన్మార్క్)పై గెలిచింది. కేవలం 27 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో సింధుకు ఏ దశలోనూ ప్రత్యర్థి నుంచి ఇబ్బంది ఎదురుకాలేదు. తొలి గేమ్ ఆరంభంలో సింధు చెలరేగి వరుసగా 12 పాయింట్లు నెగ్గడం విశేషం. ఈ గెలుపుతో ఈ సీజన్‌లో స్విస్ ఓపెన్ తొలి రౌండ్‌లో జూలీ చేతిలో ఎదురైన ఓటమికి సింధు బదులు తీర్చుకుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ పోర్న్‌పవీ చోచువోంగ్ (థాయ్‌లాండ్)తో సింధు ఆడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 6-5తో ఆధిక్యంలో ఉంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత రైజింగ్ స్టార్ ఆయుశ్ శెట్టికి నిరాశ ఎదురైంది. తొలి రౌండ్‌లో ఆయుశ్ 19-21, 21-12, 16-21తో ప్రపంచ ఐదో ర్యాంకర్ చౌ టియెన్ చౌ (చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో గద్దె రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) జోడీ 17-21, 11-21తో యుచి షిమోగామి-సయాక హొబారా (జపాన్) జంట చేతిలో పరాజయం పాలైంది.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో...

గతవారం హాంకాంగ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన ఆయుశ్ మంగళవారం విడుదలైన ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. నాలుగు స్థానాలు ఎగబాకిన ఆయుశ్ 27వ ర్యాంక్‌లో నిలిచాడు. హాంకాంగ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన లక్ష్య సేన్ మూడు స్థానాలు మెరుగుపర్చుకొని 17వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

స్ప్రింట్ క్వీన్ పరుగు ఆగింది	అథ్లెటిక్స్‌కు గుడ్‌బై చెప్పిన షెల్లీ ఆన్ ఫ్రేజర్
మరిన్ని క్రీడా వార్తలు	సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పీసీబీ డిమాండ్‌ను తిరస్కరించిన ఐసీసీ

దుబాయ్: 'షేక్‌హ్యాండ్' వివాదం రాజేయాలనుకున్న పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పాచికలు పారడం లేదు. తమ డిమాండ్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి ఎలాంటి ఊరట లభించలేదు. భారత్, పాక్ మ్యాచ్‌కు రిఫరీగా వ్యవహరించిన ఆండీ పైక్రాఫ్ట్‌ను తక్షణం ఆసియా కప్ నుంచి తప్పించాలని పీసీబీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ), ఐసీసీలకు ఫిర్యాదు కూడా చేసింది. మ్యాచ్ రిఫరీ పైక్రాఫ్ట్ షేక్‌హ్యాండ్ ఇవ్వొద్దని తమ కెప్టెన్ సల్మాన్ ఆగాకు చెప్పాడని, ఈ వివాదానికి ఆయనే బాధ్యుడని ఫిర్యాదులో ప్రముఖంగా పేర్కొంది. మంగళవారం దీనిపై స్పందించిన ఐసీసీ పాక్ బోర్డు ఫిర్యాదును తోసిపుచ్చింది. 'సోమవారం రాత్రే ఐసీసీ తమ నిర్ణయాన్ని వెలువరించింది. రిఫరీగా ఆండీ పైక్రాఫ్ట్‌ను తప్పించలేమని పాక్ బోర్డు ఫిర్యాదును తిరస్కరిస్తున్నట్లు స్పష్టం చేశాం' అని ఐసీసీ వర్గాలు వెల్లడించాయి. జింబాబ్వేకు చెందిన పైక్రాఫ్ట్‌కు అంతర్జాతీయ క్రికెట్‌లో విశేషానుభవం వుంది. ఐసీసీ ఎలైట్ ప్యానెల్‌లో సీనియర్ రిఫరీ అయిన ఆయన మూడు ఫార్మాట్లలో కలిసి 695 మ్యాచ్‌లకు రిఫరీగా వ్యవహరించారు. పురుషులు, మహిళల మ్యాచ్‌లు కలిపి ఉన్నాయి. ఈ నేపథ్యంలో కనీసం తమ మ్యాచ్‌ల వరకైనా అయన్ని దూరం పెట్టి రిచీ రిచర్డ్‌సన్‌కు రిఫరీ బాధ్యతలు ఇవ్వాలని కోరుతోంది. ఈరోజు పాకిస్తాన్, యూఏఈ మధ్య జరిగే మ్యాచ్‌కూ పైక్రాఫ్ట్ రిఫరీగా ఉన్నారు.



సర్వేశ్‌కు ఆరో స్థానం

నేడు నీరజ్ చోప్రా క్వాలిఫయింగ్ ఈవెంట్



టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత హైజంపర్ సర్వేశ్ కుశారే తన అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. ఫైనల్లో 30 ఏళ్ల సర్వేశ్ ఆరో ప్రయత్నంలో 2.28 మీటర్ల ఎత్తును అధిగమించాడు. ఈ క్రమంలో 2.27 మీటర్లతో 2022లో నమోదు చేసిన తన అత్యుత్తమ ప్రదర్శనను సవరించాడు. అనంతరం 2.31 మీటర్ల ఎత్తును అధిగమించేందుకు సర్వేశ్ మూడుసార్లు యత్నించి విఫలమవ్వడంతో అతనికి ఆరో స్థానం దక్కింది. హమీష్ కెర్ (న్యూజిలాండ్; 2.36 మీటర్లు)... సాంగ్‌హైక్ వూ (దక్షిణ కొరియా; 2.34 మీటర్లు), జాన్ స్టెఫెలా (చెక్ రిపబ్లిక్; 2.31 మీటర్లు) వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు గెలిచారు. భారత అభిమానులందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్న పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్‌లో ఈరోజు క్వాలిఫయింగ్ రౌండ్ జరగనుంది. గ్రూప్ 'ఎ'లో డిఫెండింగ్ చాంపియన్ నీరజ్ చోప్రా (భారత్), సచిన్ యాదవ్ (భారత్) ... గ్రూప్ 'బి'లో భారత్ నుంచి మరో ఇద్దరు (రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్) జావెలిన్ త్రోయర్లు బరిలో ఉన్నారు. ఫైనల్లో చోటు సంపాదించేందుకు 84.50 మీటర్లను కనీస అర్హత ప్రమాణంగా నిర్ణయించారు.

గట్టెక్కిన బంగ్లాదేశ్

8 పరుగులతో అఫ్గానిస్తాన్‌పై గెలుపు

అబుదాబి: ఆసియా కప్ టి20 టోర్నీలో బంగ్లాదేశ్ కీలక విజయాన్ని అందుకుంది. 'సూపర్-4' రేసులో తమకు పోటీగా వచ్చే అవకాశం ఉన్న అఫ్గానిస్తాన్‌పై పైచేయి సాధించింది. మంగళవారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో బంగ్లా 8 పరుగుల తేడాతో అఫ్గానిస్తాన్‌ను ఓడించింది. ముందుగా బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. ఓపెనర్ తన్‌జీద్ హసన్ (31 బంతుల్లో 52; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తన్‌జీద్, మరో ఓపెనర్ సైఫ్ హసన్ (28 బంతుల్లో 30; 2 ఫోర్లు, 1 సిక్స్) కలిసి తొలి వికెట్‌కు 40 బంతుల్లో 63 పరుగులు జోడించారు. అయితే ఆ తర్వాత అఫ్గాన్ స్పిన్నర్లు నూర్ అహ్మద్ (2/23), రషీద్ ఖాన్ (2/26) బంగ్లా బ్యాటర్లను కట్టి పడేసి తొలి నాలుగు వికెట్లు పడగొట్టారు. ఈ దశలో తౌహీద్ హృదయ్ (20 బంతుల్లో 26; 1 ఫోర్, 1 సిక్స్) కొంత పోరాడటంతో స్కోరు 150 పరుగులు దాటింది. అనంతరం అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. గుర్బాజ్ (31 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఒమర్జాయ్ (16 బంతుల్లో 30; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించగా...ఇతర బ్యాటర్లంతా విఫలమయ్యారు. చివర్లో రషీద్ ఖాన్ (11 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్) గెలిపించేందుకు ప్రయత్నించినా ... 11 బంతుల్లో 23 పరుగులు చేయాల్సిన దశలో అతను అవుట్ కావడంతో అఫ్గాన్ ఓటమి ఖాయమైంది. ముస్తఫిజుర్ రహమాన్ 3 వికెట్లు పడగొట్టగా... నసుమ్ అహ్మద్, రిషాద్ హుస్సేన్ చెరో 2 వికెట్లు తీశారు. నేడు జరిగే మ్యాచ్‌లో యూఏఈతో పాకిస్తాన్ ఆడుతుంది.

సాక్షి సినిమా



● లారా విలియమ్స్, ఎన్టీఆర్

యూఎస్ కాన్సులేట్‌కి ఎన్టీఆర్

హీరో ఎన్టీఆర్ హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్‌కి వెళ్లారు. ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ మంగళవారం 'ఎక్స్' వేదికగా ఫొటోలు షేర్ చేసి.. 'కాన్సులేట్‌లోకి ఎన్టీఆర్‌ను స్వాగతించడం హ్యాపీగా ఉంది. ఇది అమెరికా-ఇండియా భాగస్వామ్య శక్తిని, ఉద్యోగాలు సృష్టించడాన్ని, భారతదేశం-యునైటెడ్ స్టేట్స్ మధ్య సంబంధాలను బలోపేతం చేయడాన్ని తెలియజేస్తోంది'' అని క్యాప్షన్ ఇచ్చారు. ఇదిలా ఉంటే... ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'ఎన్టీఆర్-నీల్' (వర్కింగ్ టైటిల్) సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టి. సిరీస్ ఫిల్మ్ సమర్పణలో కల్యాణ్ రామ్, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ చిత్రం కొత్త షెడ్యూల్ అమెరికాలో మొదలు కానుంది. ఈ నేపథ్యంలోనే ఎన్టీఆర్ అమెరికా కాన్సులేట్‌కి వెళ్లారని టాక్. ఇక... మంగళవారం ఎన్టీఆర్ జిమ్‌లో వర్కౌట్స్ చేస్తున్న ఓ వీడియో వైరల్‌గా మారింది. 'ఎన్టీఆర్-నీల్' మూవీ కోసం స్లిమ్ లుక్‌లోకి మారడానికే ఆయన కసరత్తులు చేస్తున్నారని సమాచారం. ఈ సినిమా 2026 జూన్ 25న విడుదల కానుంది.



● నీరజ్ ఘైవాన్

టీఐఎఫ్ఎఫ్‌లో హోమ్ బౌండ్‌కు అవార్డు

టొరంటో ఫిల్మ్ ఫెస్టివల్ (టీఐఎఫ్ఎఫ్) గోల్డెన్ ఎడిషన్ (50వ ఎడిషన్) అవార్డ్స్ వేడుకలో భారతీయ చిత్రాలు 'హోమ్ బౌండ్, ఇన్ సెర్చ్ ఆఫ్ ది స్కై'లకు అవార్డులు దక్కాయి. హైదరాబాదీ ఫిల్మ్‌మేకర్ నీరజ్ ఘైవాన్ దర్శకత్వంలో ఇషాన్ కట్టర్, విశాల్ జైత్వా, జాన్వీ కపూర్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'హోమ్ బౌండ్'. కరణ్ జోహార్, అదార్ పూనావాలా, అపూర్వా మెహతా, సోమెన్ మిశ్రా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. కాగా ఈ సినిమాకు టొరంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఇంటర్‌నేషనల్ పీపుల్ చాయిస్ రెండో అవార్డు లభించింది. సౌత్ కొరియన్ సెటైరికల్ బ్లాక్ కామెడీ థ్రిల్లర్ మూవీ 'నో అదర్ చాయిస్' సినిమాకు 'ఇంటర్‌నేషనల్ పీపుల్ చాయిస్' మొదటి అవార్డు దక్కింది. మరో భారతీయ చిత్రం 'ఇన్ సెర్చ్ ఆఫ్ ది స్కై'కి జ్యూరీకి చెందిన ఎన్ఈటీపీఏసీ అవార్డు దక్కింది. ఈ చిత్రానికి జితాంగ్ సింగ్ గుర్జార్ దర్శకత్వం వహించగా మేఘనా అగర్వాల్, రాఘవేంద్ర భదోరియా, నిఖిల్ ఎస్. యాద్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇక ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రధాన అవార్డుగా భావించే 'పీపుల్ చాయిస్ అవార్డు' హిస్టారికల్ డ్రామా 'హామ్నెట్' చిత్రానికి దక్కింది. ఈ బ్రిటిష్ అమెరికన్ చిత్రానికి క్లోయ్ జావో దర్శకత్వం వహించగా, జెస్సీ బక్లీ, పాల్ మెస్కల్, ఎమిలీ వాట్సన్ ప్రధాన పాత్రల్లో నటించారు. అలాగే ఈ ఫెస్టివల్‌లో మరో ప్రతిష్ఠాత్మకమైన ప్లాట్‌ఫామ్ ప్రైజ్ అవార్డు ఉక్రెయిన్ ఫిల్మ్ 'టు ది విక్టరీ'కి దక్కింది. ఈ చిత్రంలో వాలెంటైన్ వాస్యనోవిచ్ ప్రధాన పాత్రలో నటించి, దర్శకత్వం వహించారు.



● వాసుకి, నరేశ్

ఆ ఎమోషనే బ్యూటీ

- వీకే నరేశ్

''వినోదం, భావోద్వేగం... ఈ రెండూ కలిసి ఉన్న సినిమా 'బ్యూటీ'. ఈ సినిమాలో ప్రతి జనరేషన్ తమను తాము చూసుకుంటారు. 'బ్యూటీ' చిత్రం చూసిన అమ్మాయిలకు వాళ్ల నాన్న గుర్తొచ్చి కంట్లో నీళ్లు రాకపోతే నన్ను అడగండి. ఇంట్లో అన్నీ అమ్మ అయితే, నాన్న ఆ ఇంటికి కాంపౌండ్ వాల్‌లాంటివాడు. ఆ ఎమోషనే ఈ 'బ్యూటీ' సినిమా'' అని వీకే నరేశ్ అన్నారు. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా జేఎస్ఎస్ వర్ధన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బ్యూటీ'. ఈ చిత్రంలో వీకే నరేశ్, వాసుకి కీలక పాత్రల్లో నటించారు. జీ స్టూడియోస్, మారుతీ టీమ్ ప్రొడక్ట్స్, వానర సెల్యూలాయిడ్ పతాకాలపై విజయ్‌పాల్ రెడ్డి అడిదల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వీకే నరేశ్ మాట్లాడుతూ- ''అంకిత్‌తోపాటు ఈ సినిమాలోని అందరి పెర్ఫార్మెన్స్ అద్భుతంగా ఉంటుంది. నిర్మాతలు ఈ సినిమాను పర్ఫెక్ట్‌గా తీశారు. ఫ్యామిలీతో కలిసి ఈ సినిమాను చూడొచ్చు'' అని అన్నారు. ''నాకో కూతురు ఉంది. ఈ చిత్రం చూస్తే అమ్మాయిలకు - వాళ్ల తండ్రులకు మధ్య ఏమైనా సమస్యలు ఉంటే అవి తీరిపోతాయి'' అని పేర్కొన్నారు వాసుకి.

ప్రేమకు నమస్కారం



● షణ్ముఖ్ జస్వంత్

యూ ట్యూబ్‌లో ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న షణ్ముఖ్ జస్వంత్ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. వి. భీమశంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఉల్కా గుప్తా హీరోయిన్‌గా, శివాజీ, భూమిక కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిల్ కుమార్ రావాడ, భార్గవ్ మన్నె నిర్మిస్తున్నారు. మంగళవారం (సెప్టెంబరు 16) షణ్ముఖ్ జస్వంత్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రానికి 'ప్రేమకు నమస్కారం' టైటిల్‌ని ఖరారు చేసి, గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా వి. భీమ శంకర్ మాట్లాడుతూ- ''యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'ప్రేమకు నమస్కారం'. ఈ సినిమాలో యువతతో పాటు అందరికీ కనెక్ట్ అయ్యే అంశాలున్నాయి. నేటి యువత బాగా కనెక్ట్ అయ్యే కథ'' అన్నారు. ''వైవిధ్యమైన కథతో రానున్న చిత్రమిది. కొత్తదనం, హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రంలోని ప్రత్యేకతలు'' అని అనిల్ కుమార్ రావాడ, భార్గవ్ మన్నె పేర్కొన్నారు.

ఇక నటనపైనే ఫోకస్

- శాండీ



''లియో, లోక, కిష్కింధపురి'... ఇలా వరుసగా నేను నటించిన చిత్రాలు హిట్ అయినందుకు హ్యాపీగా ఉంది. నా చిన్నప్పుడు అందరూ నా కళ్లను చూసి, 'డెత్ గోట్ ఐస్' అని ఆటపట్టించేవారు. ఆ కళ్లు నచ్చే 'లియో'కు లోకేశ్‌గారు నన్ను నటుడిగా ఎంపిక చేసుకున్నారు'' అన్నారు కొరియోగ్రాఫర్-యాక్టర్ శాండీ. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ హీరో హీరోయిన్లుగా, శాండీ మాస్టర్ విలన్‌గా నటించిన చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలైంది. ఈ సందర్భంగా శాండీ మాస్టర్ మాట్లాడుతూ- ''కిష్కింధపురి' సినిమా కోసం లుక్ టెస్ట్ చేసి, ఫైనల్‌గా దివ్యాంగుడు లుక్‌ను ఓకే చేశాం. ఓ సీన్‌లో డమ్మీ సిలిండర్‌తో హీరో నన్ను కొట్టాలి. కానీ అనుకోకుండా నిజమైన సిలిండర్‌తో కొట్టడంతో నా తలకు దెబ్బతగిలింది. ఎమ్ఆర్ఐ స్కానింగ్ తీశారు. ఇప్పుడు బాగానే ఉంది. ఇక 'కూలీ'లోని 'మోనికా..' పాట, 'విక్రమ్'లోని 'పాతల... పాతల', 'ఓజీ' సినిమాలోని ఓ ప్రమోషనల్ సాంగ్‌కు కొరియోగ్రఫీ చేశాను. ఇప్పుడు నా ఫోకస్ అంతా యాక్టింగ్‌పైనే. ప్రస్తుతం పా. రంజిత్ నిర్మాణంలో హీరోగా ఓ సినిమా, మలయాళ 'కథనార్'లో విలన్ రోల్ చేస్తున్నాను'' అని చెప్పారు.

'కిష్కింధపురి'ని అందరూ చూడాలి: చిరంజీవి

'కిష్కింధపురి'ని హీరో చిరంజీవి ప్రత్యేకంగా వీక్షించి, ఓ వీడియో విడుదల చేశారు. ''నా రాబోయే చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' నిర్మాత సాహు గారపాటిగారు నిర్మించిన 'కిష్కింధపురి' మంచి విజయాన్ని సాధించింది. హారర్ సినిమాలంటే భయాన్ని ఎలివేట్ చేస్తూ దెయ్యం కథ చెబుతుంటారు. కానీ, ఈ సినిమాలో హారర్‌తో పాటు మంచి సైకలాజికల్ పాయింట్‌ని యాడ్ చేసి చెప్పడం చాలా బాగుంది. శారీరక వైకల్యం కంటే మానసిక వైకల్యం ప్రమాదకరమని చెప్పారు డైరెక్టర్ కౌశిక్. ఈ సినిమా ద్వారా సాయి శ్రీనివాస్, అనుపమ మంచి హిట్‌ని తమ ఖాతాలో వేసుకున్నారు. చేతన్ మ్యూజిక్ బాగుంది. ఈ సినిమాని అందరూ చూడాల్సిన అవసరం ఉంది'' అని చిరంజీవి పేర్కొన్నారు.

అందుకే ఆ ట్యాగ్‌లైన్ పెట్టాం

- దర్శకుడు నరసింహా నంది



● శ్రీలు, విక్రమ్ జిత్, నరేశ్ గౌడ, నరసింహా నంది, స్రవంతి మల్లిక్

''ప్రభుత్వ సారాయి దుకాణం' సినిమాలోని ప్రతి పాత్ర పురాణాల నుంచి ఏదో ఒక పాత్రను, వ్యక్తిత్వాన్ని గుర్తు చేస్తుంది. మనుషుల వ్యక్తిత్వాలు, ఇతర ఆలోచనలన్నింటినీ మా చిత్రంలోని పాత్రలు ప్రతిబింబిస్తాయి. అందుకే జంతువు లక్షణాలు కలిగిన మనుషుల కథ అనే ట్యాగ్‌లైన్ పెట్టాం. నాకు చాన్స్ ఇచ్చిన నిర్మాతలకు థ్యాంక్స్'' అని డైరెక్టర్ నరసింహా నంది చెప్పారు. సదన్ హాసన్, విక్రమ్ జిత్, నరేశ్ రాజు, వినయ్ బాబు హీరోలుగా శ్రీలు దాసరి, అదితీ మైకేల్, మోహనా సిద్ధి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. జాతీయ అవార్డుగ్రహీత నరసింహా నంది రచన, దర్శకత్వంలో ఎస్వీఎస్ ప్రొడక్షన్స్, శ్రీనిధి సినిమాస్ బ్యానర్స్‌పై దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నరసింహా నంది మాట్లాడుతూ- ''గ్రామీణ రాజకీయాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తే ఎలా ఉంటుందో మా చిత్రంలో సరికొత్తగా చూపించాం'' అని తెలిపారు. ''తొలి ప్రాజెక్ట్‌గా ఇటువంటి మంచి సినిమా తీయడం అదృష్టంగా భావిస్తున్నాను. మా బ్యానర్లో మరో మూడు సినిమాలు రానున్నాయి'' అన్నారు దైవ నరేశ్ గౌడ. ''ఒక గ్రామంలో జరిగే వాస్తవ ఘటనలకు మహిళా శక్తిని జోడించి, తీసిన సినిమా ఇది'' అని పరిగి స్రవంతి మల్లిక్ పేర్కొన్నారు. ''ప్రభుత్వ సారాయి దుకాణం' లాంటి మంచి సినిమాలో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది'' అని సంగీత దర్శకుడు సిద్ధార్థ్, నటీనటులు శ్రీలు, మోహనా సిద్ధి, విక్రమ్ జిత్ పేర్కొన్నారు.



కథ నచ్చి ఓజీ ఒప్పుకున్నాను

- ప్రియాంక మోహన్

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ చిత్రం 'ఓజీ'. ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి ప్రధాన పాత్ర చేశారు. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. మంగళవారం విలేకరుల సమావేశంలో ప్రియాంక అరుళ్ మోహన్ మాట్లాడుతూ- ''1980-1990లలో జరిగే కథ 'ఓజీ'. ఈ చిత్రంలో ఓజాస్ గంభీర పాత్రలో పవన్‌గారు, కణ్మణిగా నేను నటించాం. గంభీర జీవితాన్ని మలుపు తిప్పే పాత్ర కణ్మణిది. కథ, అందులోని నా పాత్ర నచ్చితేనే సినిమా ఒప్పుకుంటాను. ఈ సినిమా కథ, కణ్మణి పాత్ర నచ్చినందుకే ఒప్పుకున్నాను... పవన్ కల్యాణ్‌గారు హీరో అని కాదు. ఇమ్రాన్ హష్మితో నాకు కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. ఈ సన్నివేశాలు సర్‌ప్రైజింగ్‌గా ఉంటాయి. ఇక ధనుష్‌గారి డైరెక్షన్‌లోని 'జాబిలమ్మా నీకు అంత కోపమా'లో 'గోల్డెన్ స్పారో' అనే స్పెషల్ సాంగ్ చేశాను. జస్ట్ ఒక్క రోజులో ఈ పాట పూర్తయింది. తెలుగులో కథలు వింటున్నాను. ఇతర భాషల్లో కొన్ని సినిమాలు కమిట్ అయ్యాను. రజనీకాంత్‌గారి 'జైలర్ 2' సినిమాలో నటించ లేదు. అవకాశం వస్తే చేయాలని ఉంది. ఈ మధ్య కొంతమంది దర్శక-నిర్మాతలు ఉమెన్ సెంట్రిక్ సినిమాలు తీస్తున్నారు. ఇందుకు హ్యాపీగా ఉంది. నాకు కామెడీ పాత్రలూ చేయాలని ఉంది'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ - ''సోషల్ మీడియాలో నా హ్యాండిల్స్‌ను నా టీమ్ చూసుకుంటుంది. సోషల్ మీడియా వల్ల టైమ్ వేస్ట్ అవుతుందని నా ఫీలింగ్. నా ఫొటోలు షేర్ చేయడానికి సోషల్ మీడియాను వినియోగించుకుంటాను... అంతే. పెయిడ్ నెగటివ్ క్యాంపైన్స్ ఉంటాయని విన్నాను. ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసుకుని, సోషల్ మీడియాలో ఏం జరుగుతుందో తెలుసుకోవాల్సిన అవసరం నాకు లేదు. బాక్సాఫీస్ నంబర్స్‌ను పట్టించుకోను. ఒకప్పుడు సినిమా బాగుందా? లేదా అని మాట్లాడుకునే వాళ్ళం. ఇప్పుడు ఫలానా సినిమా ఇంత కలెక్ట్ చేసింది, ఫలానా సినిమా అంత కలెక్ట్ చేసిందని చెప్పుకుంటున్నాం. కొందరు ఫేక్ కలెక్షన్స్ చూపించి, సినిమా సూపర్ హిట్ అని చెబుతుంటారు. కానీ సినిమాలో సరైన కంటెంట్, క్వాలిటీ ఉండవు. మనీ గురించి మాట్లాడుతూ సినిమా సోల్‌ను మర్చిపోతున్నాం'' అన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
17-9-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
595	170
82,381	25,239

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,346	▽	2
డోజోన్స్	45,782	▽	102
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,198	▽	79
డాక్స్	23,319	▽	430
షాంఘై	3,862	▲	1
నికాయ్	44,902	▲	134

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		87.65	88.67
£	బ్రిటన్ పౌండ్		118.40	121.35
€	యూరో		102.30	105.05
¥	జపాన్ యెన్ (100)		59.17	59.12
AU$	ఆస్ట్రేలియా డాలర్		57.25	59.51
S$	సింగపూర్ డాలర్		66.43	70.09
SAR	సౌదీ రియాల్		22.63	24.13
UAE D	యూఏఈ దిర్హామ్		23.13	24.38
¥	చైనా యువాన్		11.51	13.34

మూడు కేటగిరీలుగా పేమెంట్ అగ్రిగేటర్లు

నాన్ బ్యాంక్‌లకు కనీస నెట్‌వర్త్ • కొత్త మార్గదర్శకాలు విడుదల



ముంబై: చెల్లింపుల సేవలకు మధ్యవర్తులుగా వ్యవహరించే అగ్రిగేటర్లను (పేమెంట్ అగ్రిగేటర్లు) మూడు కేటగిరీలుగా వర్గీకరిస్తూ, ఆర్‌బీఐ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రకటించింది. ఇందులో భౌతికంగా సేవలు అందించే (పీవోఎస్ మెషీన్ల ద్వారా) వాటిని పీఏ–పీగా, సీమాంతర చెల్లింపుల్లోని వాటిని పీఏ–సీబీలుగా, ఆన్‌లైన్ చెల్లింపుల సేవల అగ్రిగేటర్లను ఆన్‌లైన్ పీఏలుగా వర్గీకరించింది. పేమెంట్ అగ్రిగేటర్ వ్యాపార నిర్వహణ విషయమై బ్యాంక్‌లకు ఎలాంటి అనుమతి అక్కర్లేదు. నాన్ బ్యాంక్‌లకు మాత్రం నిర్ణీత మూలధనం అవసరమని ఈ మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. ''పేమెంట్ అగ్రిగేటర్ వ్యాపారం ప్రారంభించాలనుకునే సంస్థ దరఖాస్తు చేసుకునే నాటికి కనీసం రూ.15 కోట్ల నెట్‌వర్త్ (నికర విలువ) కలిగి ఉండాలి. అనుమతి పొందిన మూడో ఏడాదికి రూ.25 కోట్ల నెట్‌వర్త్‌ను సాధించాల్సి ఉంటుంది'' అని ఆర్‌బీఐ పేర్కొంది.

సైయెంట్ సెమీకండక్టర్స్, ఎనోరా జట్టు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటెలిజెంట్ పవర్ సొల్యూషన్స్ సంస్థ సైయెంట్ సెమీకండక్టర్స్ తాజాగా సెమీకండక్టర్ టెస్టింగ్ సర్వీసుల సంస్థ ఎనోరాతో జట్టు కట్టింది. సెమీకండక్టర్ ఉత్పత్తుల అభివృద్ధికి సంబంధించి ఆర్కిటెక్చర్ నుంచి డిజైన్, టెస్టింగ్ వరకు సమగ్ర సేవలను అందించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా బెంగళూరులో అధునాతన వేలిడేషన్, ప్రొడక్షన్ టెస్ట్ ఫ్లోర్‌ను ఇరు కంపెనీలు ఏర్పాటు చేయనున్నాయి. భారత సెమీకండక్టర్ మిషన్ విజన్‌కు దన్నుగా నిలుస్తూనే అంతర్జాతీయ వ్యవస్థలోనూ దేశాన్ని కీలక స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని సైయెంట్ సెమీకండక్టర్స్ సీఈవో సుమన్ నారాయణ్ తెలిపారు.

నథింగ్‌లో 'జిరోధా' కామత్ పెట్టుబడులు

రూ. 1,762 కోట్లు సమీకరించిన సంస్థ



న్యూఢిల్లీ: ఏఐ ఆధారిత ప్లాట్‌ఫాంను రూపొందించే దిశగా 20 కోట్ల డాలర్లు (సుమారు రూ. 1,762 కోట్లు) సమీకరించినట్లు కన్జూమర్ టెక్నాలజీ సంస్థ నథింగ్ తెలిపింది. 1.3 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ఈ మొత్తాన్ని సమకూర్చుకున్నట్లు వివరించింది. టైగర్ గ్లోబల్ సారథ్యంలో ప్రస్తుత షేర్‌హోల్డర్లు జీవీ, హైల్యాండ్ యూరప్, ఈక్యూటీ మొదలైనవి పెట్టుబడులు పెట్టగా, జిరోధా సహ–వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్, క్వాల్‌కామ్ వెంచర్స్ కొత్తగా ఇన్వెస్ట్ చేసినట్లు నథింగ్ తెలిపింది. కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలకు, డి్స్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరించేందుకు ఈ నిధులను ఉపయోగించుకోనున్నట్లు వివరించింది. ఈ ఏడాది ప్రారంభంలో మొత్తం 1 బిలియన్ డాలర్ల అమ్మకాల మైలురాయిని అధిగమించినట్లు నథింగ్ తెలిపింది. వచ్చే ఏడాది ప్రాథమికంగా ఏఐ సాంకేతికతతో పనిచేసే డివైజ్‌లను ప్రవేశపెట్టనున్నట్లు వివరించింది. లండన్ ప్రధాన కేంద్రంగా పని చేసే నథింగ్ తమ తొలి ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ఈ ఏడాది భారత్‌లో ప్రారంభించనుంది.

సరికొత్త శిఖరాలకు పసిడి..

- ఢిల్లీలో రూ. 1,15,000
- ఒక్క రోజులో రూ. 1,800 పెరుగుదల



న్యూఢిల్లీ: దేశీయంగా పసిడి ధరలు మంగళవారం సరికొత్త రికార్డును సృష్టించాయి. 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.1,800 పెరిగి రూ.1,15,100 స్థాయికి చేరింది. ఇదొక సరికొత్త జీవితకాల గరిష్ట స్థాయి. డాలర్ బలహీనత, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల కోత అంచనాలతో ఇన్వెస్టర్లు సురక్షిత సాధనమైన బంగారంలో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తుండడంతో ఎప్పటికప్పుడు కొత్త గరిష్టాలు నమోదవుతున్నాయి. మరో వైపు వెండి ధర సైతం కొత్త గరిష్టానికి చేరింది. కిలోకి రూ.570 పెరిగి రూ.1,32,870 స్థాయిని నమోదు చేసింది. యూఎస్ ఫెడ్ సెప్టెంబర్ భేటీలో భారీ రేట్ల కోత దిశగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒత్తిడికి తీసుకురావడం బంగారం ధరల పెరుగుదలకు దారితీసినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. యూఎస్ డాలర్ బలహీనతకు తోడు, ఫెడ్ ఒకటికి మించిన రేట్ల కోతను చేపడుతుందన్న అంచనాలతో మంగళవారం బంగారం ధర సరికొత్త గరిష్టానికి చేరినట్టు చెప్పారు. పది వారాల కనిష్టానికి డాలర్ ఇండెక్స్ బలహీనపడినట్టు తెలిపారు. రేట్ల కోత దిశగా ఫెడ్ సానుకూల వైఖరి, భారత్, చైనాతో అమెరికా వాణిజ్య ఒప్పందాలకు సంబంధించిన పరిణామాలతో ట్రేడర్లు బంగారంలో లాంగ్ పొజిషన్లను కొనసాగిస్తున్నట్టు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం లాభాలతో కొనసాగుతూ 3,739 డాలర్ల వద్ద సరికొత్త గరిష్ట స్థాయి నమోదు చేసింది.

గృహ నిర్మాణ పరిశ్రమ @ రూ. 31 లక్షల కోట్లు!



2030 నాటికి చేరుకుంటుంది

- పట్టణీకరణ, ఆదాయ వృద్ధి అనుకూలిస్తాయ్
- డెలాయిట్ ఇండియా నివేదిక అంచనా

న్యూఢిల్లీ: గృహ నిర్మాణ పరిశ్రమ 2030 నాటికి 350 బిలియన్ డాలర్ల స్థాయికి (సుమారు రూ.31 లక్షల కోట్లు) చేరుకుంటుందని డెలాయిట్ ఇండియా అంచనా వేసింది. ఇందులో ఒక్క బిల్డింగ్ మెటీరియల్స్ (నిర్మాణంలోని వినియోగించే ముడి పదార్థాలు) విభాగమే ప్రస్తుతమున్న 105 బిలియన్ డాలర్ల నుంచి ఏటా 9.6 శాతం వృద్ధితో 2030 నాటికి 166 బిలియన్ డాలర్ల స్థాయికి విస్తరిస్తుందని పేర్కొంది. ఆదాయం పెరుగుతుండడం, పట్టణీకర వేగాన్ని అందుకోవడం, ప్రభుత్వ విధాన నిర్ణయాలు ఇందుకు దోహదం చేస్తాయని తెలిపింది. భారత దేశ నిర్మాణ రంగం, నిర్మాణ రంగ మెటీరియల్స్ పరిశ్రమ కీలక మలుపు వద్ద ఉన్నట్టు డెలాయిట్ నివేదిక పేర్కొంది.

కన్జ్యూమర్ ఎలక్ట్రికల్స్ 18.5 బిలియన్ డాలర్లు

''వైర్లు, కేబుళ్లు, ఫ్యాన్లు, లైట్లు, స్విచ్‌లు, ఫ్యూజ్‌లు, స్విచ్‌గేర్లతో కూడిన కన్జ్యూమర్ ఎలక్ట్రికల్స్ పరిశ్రమ పరిమాణం 2030 మార్చి నాటికి 18.5 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటుంది. మౌలిక వసతుల అభివృద్ధి, పట్టణీకరణ అనుకూలిస్తుంది. ఇంధన ఆదా ఉత్పత్తులకు ఆదరణ పెరుగుతుండడం, విధాన పరమైన మద్దతు ఈ విభాగాన్ని ముందుకు నడిపిస్తాయి. 2023 నాటికి కన్జ్యూమర్ ఎలక్ట్రికల్స్ అమ్మకాల్లో బ్రాండెడ్ ఉత్పత్తుల వాటా 76 శాతంగా ఉండగా, 2027 నాటికి 82 శాతానికి చేరుకుంటుంది''అని ఈ నివేదిక వెల్లడించింది.

గృహ రక్షణ ఉత్పత్తులకూ డిమాండ్

సెక్యూరిటీ కెమెరాలు, స్మార్ట్ లాక్‌లు, డోర్ ఫోన్లు, డోర్‌బెల్ కెమెరాలు, మోషన్ సెన్సార్లు, ప్రమాదాలను నివారించే డివైజ్‌లతో కూడిన హోమ్ సెక్యూరిటీ మార్కెట్ ఏటా 18 శాతం చొప్పున వృద్ధి చెందనుంది. 2030 నాటికి 4.4 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని డెలాయిట్ ఇండియా అంచనా వేసింది. ఇక పెయింట్స్, కన్‌స్ట్రక్షన్ కెమికల్స్ పరిశ్రమ 2030 మార్చి నాటికి 15.3 బిలియన్ డాలర్ల స్థాయికి వృద్ధి చెందుతుందని తెలిపింది. ఫ్లోరింగ్ మార్కెట్ (సిరామిక్ టైల్స్, వినైల్ ఫ్లోరింగ్, మార్బుల్ తదితర) పరిమాణం ప్రస్తుతమున్న 10.7 బిలియన్ డాలర్ల నుంచి 2030 మార్చి నాటికి 16.2 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని డెలాయిట్ తెలిపింది.

62 బిలియన్ డాలర్లకు హోమ్ ఫర్నిచర్

ఇళ్లలో వినియోగించే ఫర్నిచర్, డెకరేటివ్స్ మార్కెట్ విలువ ప్రస్తుతమున్న 38 బిలియన్ డాలర్ల నుంచి 62 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతుందనేది డెలాయిట్ ఇండియా అంచనా. ''ఈ విభాగం బలమైన వృద్ధి క్రమంలో ఉంది. పట్టణీకరణకు తోడు ఆదాయాలు పెరుగుతుండడంతో ఆధునికత, వినూత్నతకు వినియోగదారులు ప్రాధాన్యం ఇస్తున్నారు'' అని డెలాయిట్ తెలిపింది.

రెండు నెలల గరిష్టానికి నిఫ్టీ

- సెన్సెక్స్ లాభం 595 పాయింట్లు
- యూఎస్‌తో వాణిజ్య ఒప్పందంపై ఆశలు
- ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాల ప్రభావం
- ఎఫ్‌ఎంసీజీ మినహా అన్ని రంగాల షేర్లకు డిమాండ్



ముంబై: అమెరికాతో వాణిజ్య చర్చలు సఫలం కావొచ్చనే ఆశలు, ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలతో స్టాక్ సూచీలు మంగళవారం అరశాతానికి పైగా లాభపడ్డాయి. డాలర్ మారకంలో రూపాయి బలోపేతం, అధిక వెయిటేజీ షేర్ల ర్యాలీ సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. ఫలితంగా సెన్సెక్స్ 595 పాయింట్లు పెరిగి 82,381 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 170 పాయింట్లు బలపడి 25,239 వద్ద నిలిచింది. ముగింపు స్థాయి సూచీలకి రెండు నెలల గరిష్టం. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. ఎఫ్‌ఎంసీజీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా జీఎస్‌టీ సంస్కరణలు, పండుగ డిమాండ్ రికవరీపై ఆశలతో ఆటో షేర్లు దూసుకెళ్లాయి. అమెరికాతో వాణిజ్య చర్చలు సఫలమవ్వొచ్చనే ఆశలతో ఐటీ షేర్లు రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 658 పాయింట్లు బలపడి 82,443 వద్ద, నిఫ్టీ 192 పాయింట్లు ఎగసి 25,261 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. ఆసియాలో సింగపూర్, హాంగ్‌కాంగ్ మినహా అన్ని దేశాల మార్కెట్లు 1% పెరిగాయి. యూరప్ మార్కెట్లు అరశాతం నష్టపోయాయి. అమెరికా స్టాక్ సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- అధిక వెయిటేజీ ఎల్‌అండ్‌టీ(2%), కోటక్ మహీంద్రా(2.50%), మహీంద్రా (2.2%), మారుతీ (2%), టీసీఎస్ (1%) రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఆర్జించిన మొత్తం పాయింట్లలో ఈ షేర్ల వాటాయే 352 పాయింట్లు కావడ విశేషం.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
బాలాజీ వేఫర్స్‌లో వాటాపై దిగ్గజాల కన్ను | 2026లో వేదాంతా విభజన పూర్తి

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–సైన్స్ మెథడాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–భౌతిక శాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–రీజనింగ్



స్కాలర్‌షిప్‌లు

ఉన్నత విద్యకు ఊతం.. ఉపకార వేతనం

కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల చదువులకు చేయూతనిస్తున్నాయి. 9వ తరగతి నుంచి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ వరకూ ఈ ఉపకార వేతనాలను అందుకునే అవకాశముంది. తాజాగా యూజీసీ పీజీ మెరిట్ స్కాలర్‌షిప్‌తోపాటు, దివ్యాంగ విద్యార్థుల కోసం, ఎస్టీ విద్యార్థులకు ఉన్నత విద్య కోసం స్కాలర్‌షిప్‌లకు నోటిఫికేషన్లు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో.. వివిధ కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌ల వివరాలు..

యూజీసీ పీజీ మెరిట్ స్కాలర్‌షిప్-2025

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) దేశంలో పీజీ చదివే ప్రతిభ కలిగిన విద్యార్థుల కోసం పోస్ట్ గ్రాడ్యుయేట్ మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేస్తుంది. పీజీ ప్రవేశ పరీక్షలలో మొదటి, రెండు ర్యాంకులు పొందిన అభ్యర్థులను ఎంపికచేస్తారు.

- **స్కాలర్‌షిప్ వివరాలు:** మెరిట్ బేస్ట్ నేషనల్ స్కాలర్‌షిప్. నెలకు రూ.15,000 చొప్పున రెండు సంవత్సరాల పాటు అందజేస్తారు.
- **అర్హత:** మొదటి సంవత్సరం పీజీ కోర్సు చదువుతున్న వారికి మాత్రమే ఈ స్కాలర్‌షిప్ లభిస్తుంది. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి రెగ్యులర్‌గా బీఏ/బీకాం/బీఎస్సీ డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి.
- ఒక్కసారికి ఒకే స్కాలర్‌షిప్ మాత్రమే పొందవచ్చు.
- కోర్సు లేదా సంస్థ మార్చితే ఉపకార వేతనం రద్దు అవుతుంది.
- మహిళలకు 30% రిజర్వేషన్ వర్తిస్తుంది.
- **వయసు:** 30 ఏళ్ల లోపు ఉండాలి.
- **అవసరమైన సర్టిఫికేట్లు:** ఆధార్ కార్డు(బ్యాంక్ ఖాతా ఆధార్ లింక్ అయి ఉండాలి), విద్యార్హత సర్టిఫికేట్లు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, సంస్థ నుంచి ధ్రువీకరణ సర్టిఫికేట్ తదితరాలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2025.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://scholarships.gov.in

దివ్యాంగ విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్

కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం,సాధికారిత మంత్రిత్వ శాఖకు చెందిన దివ్యాంగుల సాధికారిత విభాగం(డీఈపీడబ్ల్యూడీ).. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ గుర్తింపు పొందిన వైకల్యం కలిగిన విద్యార్థుల విద్యా పురోగతికి సహాయం చేయడానికి(స్కాలర్‌షిప్ ఫర్ స్టూడెంట్స్ విత్ డిజేబిలిటీస్) ఆరు విభిన్న స్కాలర్‌షిప్ పథకాలు అందిస్తోంది. వీటిలో పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు, దేశీయ, విదేశీ చదువులు, అలాగే పోటీ పరీక్షల కోచింగ్‌కు అవసరమయ్యే ఆర్థిక సాయాన్ని పొందవచ్చు.

- **స్కాలర్‌షిప్ మొత్తం:** స్కాలర్‌షిప్ పథకం ఆధారంగా నెలకు రూ.500 నుంచి రూ.42,000 వరకు అందుకోవచ్చు.
- **ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్:** 9,10 తరగతులు.
- **పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్:** 11వ తరగతి నుంచి పీజీ డిగ్రీ/డిప్లొమా వరకు
- **టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్:** ప్రముఖ విద్యా సంస్థల్లో గ్రాడ్యుయేట్,పీజీ చదువులకు ..
- **నేషనల్ ఫెలోషిప్:** భారతీయ యూనివర్సిటీల్లో ఎంఫిల్, పీహెచ్‌డీ కోసం..
- **నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్:** విదేశాలల్లో మాస్టర్స్, పీహెచ్‌డీలో చేరిన వారు పొందొచ్చు.
- **ఫ్రీ కోచింగ్ స్కాలర్‌షిప్:** ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రొఫెషనల్ కోర్సుల ప్రవేశ పరీక్షల కోచింగ్ కోసం.
- **అర్హత:** భారతీయ పౌరులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు, బెంచ్‌మార్క్ డిజేబిలిటీ(40% లేదా అంతకంటే ఎక్కువ), చెల్లుబాటు అయ్యే వికలాంగత సర్టిఫికేట్, యూడీఐడీ కార్డు/నమోదు అయి ఉండాలి. వార్షిక కుటుంబ ఆదాయ పరిమితి రూ.2.5 లక్షలు(ప్రీ, పోస్ట్ మెట్రిక్), రూ.8 లక్షలు(టాప్ క్లాస్,నేషనల్ ఓవర్సీస్,ఫ్రీ కోచింగ్), ఆదాయం పరిమితి లేదు (నేషనల్ ఫెలోషిప్).
- ఒకేసారి ఒకే స్కాలర్‌షిప్ మాత్రమే పొందాలి.
- ఎంపిక వికలాంగత శాతం, వయస్సు ఆధారంగా ఉంటుంది.
- నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు టాప్ ర్యాంక్ ఉన్న యూనివర్సిటీలు లేదా వికలాంగత స్టడీస్‌లో ప్రఖ్యాత సంస్థలు మాత్రమే.

వయసు

- ప్రీ,పోస్ట్ మెట్రిక్‌కు పాఠశాల/కాలేజీ నిబంధనల ప్రకారం ఉంటుంది.
- నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు 35 ఏళ్ల లోపు, మిగతా పథకాల కోసం ఆయా కోర్సు అర్హత ప్రకారం ఉంటుంది.
- **అవసరమైన సర్టిఫికేట్లు:** పాస్‌పోర్ట్ సైజు ఫోటో, పుట్టిన తేది సర్టిఫికేట్, డిజేబిలిటీ సర్టిఫికేట్, ఆదాయం ధ్రువపత్రం, ఆధార్, ట్యూషన్ ఫీజు రసీదు, చివరి విద్యార్హత సర్టిఫికేట్, ఆధార్‌తో లింక్ అయిన బ్యాంక్ ఖాతా వివరాలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 31.10.2025.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://scholarships.gov.in

ఎస్టీ విద్యార్థులకు ఉన్నత విద్యా స్కాలర్‌షిప్

భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్కాలర్‌షిప్ పథకం(నేషనల్ ఫెలోషిప్ అండ్ స్కాలర్‌షిప్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆఫ్ షెడ్యూల్ ట్రైబ్ స్టూడెంట్స్) ద్వారా.. ప్రతిభావంతులైన గిరిజన(ఎస్టీ) విద్యార్థులకు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్యా సంస్థల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చదివేందుకు స్కాలర్‌షిప్ అందజేస్తుంది.

- **అర్హత:** అభ్యర్థి గిరిజన(ఎస్టీ) వర్గానికి చెందిన వారై ఉండాలి. మంత్రిత్వ శాఖ ప్రకటించిన ప్రముఖ విద్యా సంస్థల్లో డిగ్రీ, పీజీ ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉండాలి. ఒకే కోర్సుకు మరో కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్ పొందరాదు.
- **అవసరమైన సర్టిఫికేట్‌లు:** గిరిజన/పీవీటీజీ సర్టిఫికేట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం(గత ఆర్థిక సంవత్సరం), అడ్మిషన్/ఫీజు రసీదు, ఆధార్ లింక్ చేసిన బ్యాంక్ పాస్‌బుక్, అర్హత పరీక్ష సర్టిఫికేట్/మార్క్‌షీట్, బోనఫైడ్ సర్టిఫికేట్.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2025.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://scholarships.gov.in



ఏపీ సీఆర్‌డీఏలో 132 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపీసీఆర్‌డీఏ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఏఈ /ఏఈఈ /డీఈఈ /ఈఈ/ఎస్ఈ/సీఈ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 132.
- » **పోస్టుల వివరాలు:** చీఫ్ ఇంజనీర్–04, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్–08, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్–15, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్–25, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/అసిస్టెంట్ ఇంజనీర్–50, సీనియర్ ఫైర్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్–02, జూనియర్ ఫైర్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్–04, సీనియర్ ఎలక్ట్రికల్/ఈఎల్‌యూ ఎక్స్‌పర్ట్–02, జూనియర్ ఎలక్ట్రికల్/ఈఎల్‌యూ ఎక్స్‌పర్ట్–06, సీనియర్ ప్లంబింగ్ ఎక్స్‌పర్ట్–02, జూనియర్ ప్లంబింగ్ ఎక్స్‌పర్ట్–06, సీనియర్ హెచ్‌వీఏసీ ఎక్స్‌పర్ట్–02, జూనియర్ హెచ్‌వీఏసీ ఎక్స్‌పర్ట్–06.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/డిప్లొమా, బీటెక్(సివిల్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.09.2025
- » **వెబ్‌సైట్:** https://crda.ap.gov.in

ఐవోబీలో 127 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో వివిధ విభాగాల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 127.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా డిగ్రీ, బీఆర్క్, బీటెక్/బీఈ, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ/పీజీడీఎం, పీజీడీబీఏలో ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 01.09.2025 నాటికి వివిధ విభాగాల్లో పోస్టును అనుసరించి అభ్యర్థులకు 25 ఏళ్ల నుంచి 40 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు ఎంఎంజీఎస్–2 పోస్టులకు రూ. 64,820, ఎంఎంజీఎస్–3 పోస్టులకు 85,920.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.10.2025
- » **వెబ్‌సైట్:** https://www.iob.bank.in

ఐవోసీఎల్‌లో 523 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్)లో గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 523.
- » **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, సివిల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డేటా ఎంట్రీ ఆపరేటర్.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ,డిప్లొమా,ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 30.09.2025 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.10.2025
- » **వెబ్‌సైట్:** https://iocl.com

ఐఐపీఎస్‌లో 24 జూనియర్ రీసెర్చ్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని గ్లోబల్ అడల్ట్ టొబాకో సర్వే–ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్(ఐఐపీఎస్) ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఆఫీసర్(ఫీల్డ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 24.
- » **అర్హత:** స్టాటిస్టిక్స్/మ్యాథమేటిక్స్/పాపులేషన్ స్టడీస్/జాగ్రఫీ/సోషియాలజీ/ఎకనామిక్స్/బయోస్టాటిస్టిక్స్/సోషల్ వర్క్/పబ్లిక్ హెల్త్ విభాగాల్లో పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. లోకల్ లాంగ్వేజెస్, ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితరాలు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.45,000.
- » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.09.2025
- » **వెబ్‌సైట్:** www.iipsindia.ac.in

యూపీఎస్సీలో 213 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 213.
- » **పోస్టుల వివరాలు:** అడిషనల్ గవర్నమెంట్ అడ్వకేట్–05, అసిస్టెంట్ లీగల్ అడ్వైజర్–16, అడిషనల్ లీగల్ అడ్వైజర్–02, అసిస్టెంట్ గవర్నమెంట్ అడ్వకేట్–01,డిప్యూటీ గవర్నమెంట్ అడ్వకేట్–02,డిప్యూటీ లీగల్ అడ్వైజర్–12, లెక్చరర్(ఉర్దూ)–15, మెడికల్ ఆఫీసర్–125, అకౌంట్స్ ఆఫీసర్–32, అసిస్టెంట్ డైరెక్టర్–03.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, డిగ్రీ(లా), పీజీ(ఉర్దూ), బీఈడీ, ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** జనరల్ అభ్యర్థులకు 50ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 53ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55ఏళ్లు,పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 56ఏళ్లు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 40 ఏళ్లు.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 13.09.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.10.2025
- » **వెబ్‌సైట్:** https://upsc.gov.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 140 అప్రెంటిస్‌లు

కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన గ్రాడ్యుయేట్, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 140.
- » **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–70,టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌లు–70.
- » **విభాగాలు:** మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫైర్ అండ్ సేఫ్టీ ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్,నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్‌బిల్డింగ్, కమర్షియల్ ప్రాక్టీస్,కంప్యూటర్ ఇంజనీరింగ్.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 20.09.2025 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి.
- » **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.12,000,టెక్నీషియన్ అప్రెంటిస్‌కు 10,200
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.09.2025.
- » **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

ఐఐపీఎస్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్(ఐఐపీఎస్) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఆఫీసర్–ఐటీ(ఫీల్డ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ లేదాఎంసీఏ, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం, తదితర స్కిల్స్ ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.50,000.
- » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.09.2025.
- » **వెబ్‌సైట్:** www.iipsindia.ac.in

బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో టాప్-30 సంస్థలలో.. గతేడాది లైంగిక వేధింపుల ఫిర్యాదుల సంఖ్య స్వల్పంగా పెరిగింది. మహిళా ఉద్యోగులు తమ సమస్యల గురించి గొంతు విప్పేందుకు ధైర్యంగా ముందుకు వస్తున్నారనడానికి ఇది సంకేతం అని నిపుణులు చెబుతున్నారు. మరోపక్క సంస్థలు కూడా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్నాయి. 2023-24లో వచ్చిన ఫిర్యాదుల్లో 88 శాతం పరిష్కారం కావడమే ఇందుకు నిదర్శనం.

- సాక్షి, స్పెషల్ డెస్క్



అతివకు.. పాష్‌పతాస్త్రం!



బీఎస్ఈలోని టాప్-30 కంపెనీలకు.. తమ మహిళా ఉద్యోగుల నుంచి గత ఆర్థిక సంవత్సరంలో లైంగిక వేధింపులకు సంబంధించి మొత్తం 958 ఫిర్యాదులు అందాయి. 2023-24లో వీటి సంఖ్య 902. అంటే ఏడాదిలో ఫిర్యాదుల సంఖ్య 6.2 శాతం పెరిగింది. ఫిర్యాదుల్లో పెరుగుదలకు 'పాష్' చట్టమే ప్రధాన కారణమని నిపుణులు అంటున్నారు.

అవగాహన పెరిగింది


పాష్ ఫిర్యాదులు పెరగడం అంటే.. పని ప్రదేశాల్లో సమస్యల పట్ల బాధితులు తమ గొంతు వినిపించడానికి ధైర్యంగా ముందుకు రావడమేనని హెచ్ఆర్ నిపుణులు అంటున్నారు. 'సంవత్సరాలుగా బాధితులు నిశ్శబ్దంగానే ఉన్నారు. పాష్ పట్ల మహిళల్లో అవగాహన పెరిగింది. తాము ఎదుర్కొంటున్న వేధింపులకు పరిష్కారం దొరుకుతుందన్న విశ్వాసం పెరుగుతోంది. అందుకే ధైర్యంగా ఎక్కువ మంది ఈ దిశగా అడుగులు ముందుకు వేస్తున్నారు' అని వారు చెబుతున్నారు.

బ్యాంకుల నుంచే ఎక్కువ

ఆసక్తికర విషయం ఏమంటే బీఎస్ఈ టాప్-30 కంపెనీల్లో గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ఫిర్యాదులలో బ్యాంకు ఉద్యోగుల నుంచి 34% ఫిర్యాదులు వస్తే, ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న సిబ్బంది నుంచి 31.5% వచ్చాయి. మూడింట రెండు వంతులు లేదా 627 ఫిర్యాదులు ఈ రెండు రంగాల నుంచే అందాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) గరిష్ఠంగా 125 ఫిర్యాదులను అందుకుంది. 2023-24లో ఈ సంస్థలో 110 కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఐసీఐసీఐ బ్యాంక్ 117 కేసులతో రెండో స్థానంలో ఉంది. ఫిర్యాదుల పరంగా ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ఏమిటీ పాష్ చట్టం?

ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్ (పాష్) యాక్ట్‌ను అధికారికంగా 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం మరియు పరిష్కారం) చట్టం-2013' అని పిలుస్తారు. మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించి ఫిర్యాదుల స్వీకారానికి వ్యవస్థలను ఏర్పాటుచేసి కంపెనీలు ఊరుకోవడం లేదు. ఫిర్యాదుల పట్ల కూడా సీరియస్‌గానే వ్యవహరిస్తున్నాయి. వాటి పరిష్కారం కోసమూ చర్యలు చేపడుతున్నాయి. 2023-24లో టాప్-30 బీఎస్ఈ కంపెనీలలో పాష్ కింద నమోదైన 902 కేసుల్లో 88% పరిష్కారం అయ్యాయని లైంగిక వేధింపుల నివారణపై కంపెనీలకు సలహాలు ఇస్తున్న 'కంప్లైకరో' అనే సంస్థ తెలిపింది. 'ఇది గొప్ప మార్పునకు సూచిక' అని మహిళా ఉద్యోగులు చెబుతున్నారు.



ప్రభుత్వ పర్యవేక్షణ

భారత ప్రభుత్వ షీ-బాక్స్ పోర్టల్‌లో అన్ని కంపెనీలు (పెద్దవి లేదా చిన్నవి) తమ అంతర్గత ఫిర్యాదుల కమిటీలను నమోదు చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పనిసరి చేసింది. అలాగే నిబంధనల అమలును పర్యవేక్షించడానికి ప్రతి జిల్లాలో కార్మిక కమిషనర్లు సర్వేలు చేయాలని ఆదేశించింది. అన్ని కంపెనీలు ఒకేచోట నమోదు కావడంతో షీ-బాక్స్ పోర్టల్‌లో బాధితులు తమ పాష్ ఫిర్యాదును దాఖలు చేయడం సులభతరమైంది. విచారణ ప్రక్రియను ప్రభుత్వం పర్యవేక్షిస్తుందనే విషయం ఉద్యోగికి మరింత ధైర్యం, ఊరటనిస్తుందని నిపుణులు అంటున్నారు. పాష్ ఫిర్యాదులు, నిబంధనల అమలులో ప్రస్తుత సంవత్సరం ఒక విప్లవాత్మక మార్పునకు నాంది పలుకుతుందని విశ్వసిస్తున్నట్టు కంప్లైకరో వెల్లడించింది. పాష్ చట్టాన్ని పాటించడానికి పెద్ద కంపెనీలే కాదు, ఎంఎస్ఎంఈలు కూడా ముందుకు వచ్చాయి. ఈ కంపెనీల నుంచి రోజుకు సగటున 7-8 ఫిర్యాదులు వస్తున్నాయని వివరించింది.

విజయనగరం ఐసిస్ కేసులో కదలిక

తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లోని 16 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు

సాక్షి హైదరాబాద్/కొత్తగూడెం టౌన్: ఐఈడీ (ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్)ల ద్వారా విధ్వంసాలకు పాల్పడడానికి కుట్రపన్నిన విజయనగరం ఐసిస్ కేసులో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) దర్యాప్తు ముమ్మరం చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, ఢిల్లీలోని 16 ప్రాంతాల్లో మంగళవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ మేరకు ఎన్ఐఏ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. విజయనగరం కేంద్రంగా ఐసిస్ ఉగ్రవాది సిరాజ్-ఉర్-రెహమాన్‌ను జులైలో ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. ఐఈడీల తయారీకి ఉపయోగించే రసాయన పదార్థాలను సిరాజ్ కలిగి ఉండటంతో ఉగ్రవాద నెట్‌వర్క్‌పై ఎన్ఐఏ స్పెషల్ ఆపరేషన్లు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆగస్టు 27న సౌదీ అరేబియాలోని రియాద్‌కు పారిపోవడానికి ప్రయత్నించిన ఆరిఫ్ హుస్సేన్ అలియాస్ అబూ తాలిబ్‌ను అరెస్ట్ చేసింది. సిరాజ్‌తో కలిసి నేపాల్ సరిహద్దు ద్వారా ఆయుధాల సరఫరాకు ఏర్పాట్లు చేయడానికి కుట్ర చేసినట్లు గుర్తించింది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం చేయడానికి కుట్ర పన్నినట్లు సిరాజ్ విచారణలో వెల్లడించాడు. దీని ఫలితంగా మరో నిందితుడు సయ్యద్ సమీర్‌ను కూడా ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఈ సోదాల్లో డిజిటల్ పరికరాలు, డాక్యుమెంట్లు, నగదు సహా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఉగ్రవాదం వైపు యువత రిక్రూట్‌మెంటుకు సంబంధించిన ఆధారాలు సేకరించింది. కాగా, ఈ కేసుకు సంబంధించిన కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో ఐదు నెలల క్రితం పెట్టిన మతపరమైన పోస్టులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొందరు లైక్ కొట్టిన నేపథ్యంలో ఎన్ఐఏ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. కొత్తగూడెం బస్టాండ్ సమీపాన మధురబస్తీలోని ఓ ఇంటికి తెల్లవారుజామున 4 గంటలకు దాదాపు పది వాహనాలతో వచ్చిన అధికారులు ఉదయం 6 గంటల వరకు సోదాలు నిర్వహించి వివరాలు సేకరించారు. అనంతరం కొత్తగూడెం పాలకేంద్రం సమీపాన మరొకరి ఇంట్లోనూ చేపట్టిన తనిఖీలు సాయంత్రం 4 గంటల వరకు కొనసాగాయి.

తెలంగాణ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్‌గా వీణాకుమారి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా డాక్టర్ వీణా కుమారి డెర్మల్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఢిల్లీలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన ఆమె పదోన్నతితో తెలంగాణ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఇండియన్ పోస్టల్ సర్వీస్ 1998 బ్యాచ్ అధికారి అయిన వీణాకుమారి ఆ శాఖలో వివిధ స్థాయిల్లో పనిచేశారు. తపాలా శాఖ ఇటీవలే ప్రారంభించిన అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0 తయారీలో కీలక పాత్ర పోషించారు. కేంద్ర గనుల శాఖ జాయింట్ సెక్రటరీగా కూడా పనిచేసి ఆ శాఖలో పలు సంస్కరణలు ప్రారంభించటంలో కీలకంగా వ్యవహరించారు. తమిళనాడు సెంట్రల్ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్‌గా, ఢిల్లీ ఢాక్ భవన్ పీఎంయూ డైరెక్టర్‌గా, మైసూరు పోస్టల్ శిక్షణ కేంద్రం డైరెక్టర్‌గా, ధార్వాడ్ రీజియన్ డైరెక్టర్‌గా కూడా ఆమె విధులు నిర్వర్తించారు.

రామగుండం ఎన్టీపీసీకి రాజ్‌భాషా విశిష్ట అవార్డు

జ్యోతినగర్ (రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ ప్రాజెక్టు రాజ్‌భాషా విశిష్ట అవార్డు సాధించింది. గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్‌లో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ఎన్టీపీసీ అధికారులు అవార్డు అందుకున్నారు. 2024-25 సంవత్సరానికి కేంద్ర అధికారిక భాషా విధానాన్ని విజయవంతంగా అమలు చేయడంలో రామగుండం ఎన్టీపీసీ అత్యుత్తమ పనితీరు కనబరిచింది. దీంతో భాషా అమలు కమిటీని ప్రశంసిస్తూ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు అవార్డును ప్రాజెక్టు ఏజీఎం (హెచ్ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్ అందుకున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తిరుమలగిరిపై పొగ మంచు సోయగం



వేంకటేశ్వరుడు కొలువైన తిరుమల శేషాచలం కొండలు పైపైన తేలియాడే పొగమంచుతో మంగళవారం కొత్త అందాలను సింగారించుకున్నాయి. పచ్చని తివాచీ చుట్టుకున్న శేషాచలం కొండలు, పైన అలలు అలలుగా పొగమంచు కనువిందు చేసింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ముసురు పట్టింది.. వేట ముగిసింది



వాతావరణం ఒక్కసారిగా మారిపోయి గాలుల తీవ్రత పెరగడంతో మంగళవారం సముద్రంలో వేటకు వెళ్లిన విశాఖ జాలర్లు వేట ముగించుకుని తీరానికి చేరుకున్నారు. ఒకవైపు మబ్బు పట్టిన ఆకాశం నుంచి చిరుజల్లులు కురుస్తుండగా మరోవైపు రంగురంగుల తెరచాపలతో నావలు సీతాకోక చిలుకల్లా తీరం వైపు వస్తున్న దృశ్యం ఆహ్లాదకరంగా కనిపించింది
- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చిరు వ్యాపారుల ఇక్కట్లు



అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలతో మంగళవారం విజయనగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకుని పొట్ట నింపుకునే చిరు వ్యాపారులు అమ్మకాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని పాతబస్టాండ్ ప్రాంతం వర్షపు నీటిలో చిక్కుకోవడంతో చిరు వ్యాపారులు అమ్మకాలు లేక ఇబ్బంది పడుతున్న దృశ్యం
- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

క్లుప్తంగా...

సింగపూర్‌లో బాబు సభకు రూ.50.19 లక్షలు

బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్‌కు చెల్లింపు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల జరిపిన సింగపూర్ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన 'తెలుగు డయాస్పోరా' కార్యక్రమానికి రూ.50.19 లక్షలు ఖర్చు అయినట్లు ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ ముఖ్య కార్యనిర్వాహక అధికారి ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ఆ ఏర్పాట్లు చేసిన బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్‌కు రూ.50.19 లక్షలు చెల్లించేందుకు అనుమతి ఇస్తూ సాధారణ పరిపాలన శాఖ(రాజకీయ) ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్రిబ్కో చైర్మన్‌గా సుధాకర్ చౌదరి

సాక్షి, అమరావతి: సహకార రంగంలోని రెండో అతిపెద్ద ఎరువుల కంపెనీ క్రిబ్కో చైర్మన్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వల్లభనేని సుధాకర్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడకు చెందిన ఈయన గత ఐదేళ్లు క్రిబ్కో వైస్ చైర్మన్‌గా వ్యవహరించారు.

అపరేషన్ బుడమేరు ఇంకెప్పుడు?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సాక్షి, అమరావతి: బుడమేరు ముంపుతో ప్రతిసారి లక్షలాది ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, ఆపరేషన్ బుడమేరు ఇంకెప్పుడు చేపడతావ్ చంద్రబాబు అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నిలదీశారు. ఆపరేషన్ బుడమేరు అమలు చేయాలని, వరద ముంపు నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ ముంపు బాధితులతో విజయవాడ ధర్నా చౌక్ వద్ద సీపీఐ మంగళవారం ధర్నా చేపట్టింది. ఇందులో రామకృష్ణ మాట్లాడుతూ.. గతేడాది వచ్చిన బుడమేరు వరదలకు రూ.800కోట్లు నష్టం వాటిల్లిందని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసినప్పటికీ ఒక్క రూపాయి రాలేదన్నారు. నిధులు కొరత వల్ల బుడమేరు ఆధునీకరణ పనులు చేపట్టలేకపోతున్నామని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటన్నారు. అలాగే, అనంతపురం జిల్లాలో దశాబ్దాలుగా ప్రజలకు సేవలు అందిస్తోన్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) స్వచ్ఛంద సంస్థకు నిధులు రాకుండా కేంద్రం అడ్డుకుంటోందని, కేంద్రంతో మాట్లాడి తక్షణమే సమస్య పరిష్కరించాలని సీఎం చంద్రబాబును కె.రామకృష్ణ కోరారు.

శ్రీవారి క్షేత్రంలో 'ఉట్టి' ఉత్సవం



క్షేత్ర పురవీధుల్లో రాజాధిరాజ వాహనంపై ఉభయ దేవేరులతో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఉట్ల పండుగ, శ్రీవారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రాజాధిరాజ వాహనంపై ఉంచి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. తొలుత స్వామివారి కల్యాణ మండపం వద్ద, ఆ తరువాత తూర్పు వీధి, పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తూర్పు వీధిలో పలువురు చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేశారు.

'పుణ్యక్షేత్రం' ఆడపడుచులు!

పక్షులంటే ఒప్పుకోని ప్రజలు | ఏటా తగ్గుతున్న వలస పక్షుల సంఖ్య

పైసా ఖర్చుచేయని అటవీ శాఖ | మృత్యుపాశాలుగా హెచ్‌టీ లైన్లు



రాజానగరం

ఏటా వలస పక్షుల ప్రస్తావన వచ్చినపుడల్లా ఠక్కున గుర్తొచ్చేవి స్థానిక 'పుణ్యక్షేత్రం' ఆడపడుచులే. అవునండీ.. తూర్పు గోదావరి జిల్లాలోని ఈ 'పుణ్యక్షేత్రం' గ్రామానికి వచ్చే పక్షులను ఆ ఊరి ప్రజలు తమ ఆడపడుచుల్లా ఆదరిస్తారు. రాజమహేంద్రవరం సమీపంలోని ఈ గ్రామానికి విహంగాల వల్లే 'పుణ్యక్షేత్రం' అనే పేరు వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. అయితే గతంతో పోలిస్తే ఇక్కడకు వచ్చే పక్షుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇందుకు ఊళ్లో ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్లూ ఓ కారణమే. ఈ పక్షులు ఆవాసంగా ఎంచుకున్న కంచి విత్తనం చెట్లను ఆనుకున్న 33 కేవీ విద్యుత్ లైన్లు వాటి పాలిట మృత్యుపాశాలుగా మారాయి. అవి గాల్లోకి ఎగిరే సమయంలో రెక్కలు ఆ తీగలకు తగిలి అంతలోనే నేలరాలుతున్నాయి.



కంచి విత్తనం చెట్లపై పక్షుల ఆవాసం

ఖండాంతరాలు దాటి..

ఆసియా ఖండపు ఉత్తర ప్రాంతం రష్యాలోని సైబీరియా నుంచి ఏటా క్రమం తప్పకుండా వచ్చే ఈ పక్షులను 'సైబీరియన్ క్రేన్స్' అంటారు. రష్యాలోని ఆర్కిటిక్ టండ్రాలో తూర్పు, పశ్చిమ జాతులుగా ఉన్న ఈ పక్షులు సంతానోత్పత్తి కోసం తూర్పు జాతులు చైనాకు, పశ్చిమ జాతులు భారత్ వైపు వలస వెళతాయి.



మృగశిర కార్తెలో రాక

తొలకరి పడే సమయంలో (మృగశిర కార్తె) వలస వచ్చి, మాఘమాసంలో స్వస్థలాలకు తిరిగి వెళ్లే ఈ పక్షులను స్థానికులు చిల్లు ముక్కు కొంగలు, నత్తకొట్లు, ఓపెన్ బిల్ బర్డ్స్ అని పిలుస్తారు. వీటి రాకతో తొలకరి పనులు ప్రారంభిస్తుంటారు. అవి రాకుంటే తొలకరి సాగదేమోనని ఆందోళన చెందుతారంటే వాటితో అనుబంధాన్ని అర్థం చేసుకోవచ్చు.

ఆడపడుచుల్లా ఆదరణ

తాతముత్తాతల కాలం నుంచి వలస వచ్చే ఈ పక్షులను పుణ్యక్షేత్రం వాసులు పుట్టింటికి వచ్చే ఆడపడచుల్లా ఆదరిస్తారు. ఇక్కడే సంతానోత్పత్తి చేస్తాయి కాబట్టి అవి తమ ఆడపడుచులని అక్కడి వారంతా అంటుంటారు. పొలాల్లో నత్తలను, పురుగులను తింటూ తమకు సాయపడుతుంటాయని రైతులు చెబుతున్నారు. అందుకే వాటిని 'నత్తకొట్లు' అని, వీటి ముక్కులకు చిల్లులు ఉంటాయి కాబట్టి 'చిల్లుముక్కు కొంగలు', 'ఓపెన్ బిల్ బర్డ్స్'గా పిలుస్తుంటారు.

ఊరి చెరువు గట్టే ఆవాసం

గ్రామంలోని ఊరి చెరువు గట్టే వీటికి ఆవాసం. ఈ గట్టు చుట్టూ విస్తారంగా పెరిగిన కంచి చెట్లపై గూళ్లు పెట్టుకుని, సంతానోత్పత్తి చేసుకుంటాయి.

కానరాని ప్రభుత్వ చర్యలు



ఈ పక్షులు ఎంతకాలం నుంచి ఇక్కడకు వస్తున్నాయో ఎవరికీ తెలియదు. వీటి సంరక్షణకు అటవీ శాఖ ఏ విధమైన చర్యలూ తీసుకోలేదు. టూరిజం స్పాట్ అంటూ బోర్డులైతే పెట్టారు కానీ ఒక్క రూపాయి ఖర్చు చేసింది లేదు. నాయకులు, అధికారులు ఎందరో వస్తుంటారు. కోట్లు కేటాయించి, సంరక్షణకు ఏర్పాట్లు చేస్తామంటూ ప్రగల్భాలు పలికేవారే గానీ పనులు చేసేవారు మాత్రం లేరు. దీంతో వీటి సంరక్షణ కాగితాలకే పరిమితమైంది.

- ఎం. వెంకటేశ్వరరావు, సర్పంచ్, పుణ్యక్షేత్రం

రేటే బంగారమాయెనే..





- రోజురోజుకీ పెరుగుతున్న పుత్తడి ధర
- 10 గ్రాముల ధర రూ.1.11 లక్షల పైమాటే..
- ఇప్పట్లో రూ.లక్ష దిగువకు వచ్చే సూచనలు లేవంటున్న వ్యాపారులు
- అదే బాటలో దూసుకుపోతున్న వెండి



సాక్షి, విశాఖపట్నం : పసిడితో భారతీయులకు ఉన్న అనుబంధం మరే దేశంలోనూ కనిపించదు. చేతిలో కొద్దిగా డబ్బులు కనిపిస్తే.. వెంటనే కొనుగోలు చేసేది బంగారాన్నే. ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా.. పుత్తడి కొంటే.. శుభసూచకమని అంటుంటారు. అందుకే స్వర్ణం.. సమస్తమయమైపోయింది. ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, డిమాండ్ నేపథ్యంలో రోజురోజుకీ పసిడి ధర పైపైకి ఎగబాకుతూ.. ఆల్‌టైమ్ హై రేట్‌ని నమోదు చేస్తోంది. ఒకప్పుడు 10 గ్రాముల ధరతో ఇప్పుడు గ్రాము కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి. వారం రోజులుగా ఎగబాకుతున్న బంగారాన్ని చూసి.. వెండి కూడా అదే బాటలో దూసుకుపోతోంది. లక్ష రూపాయల కంటే దిగువకు బంగారం ధర దిగే రోజులు ఇప్పట్లో కనిపించడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

తగ్గేదేలే అంటున్న పుత్తడి

గత వారం రోజులుగా బంగారం ధర తగ్గేదేలే అన్నట్లుగా దూసుకుపోతోంది. ఈ నెల 8వ తేదీన 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,08, 380 ఉండగా.. 9వ తేదీన రూ.1,10,290కి చేరుకుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.1.10 లక్షలకు తక్కువ కాలేదు. వెండి కూడా ధగధగ మెరిసిపోతోంది. ఈ నెల 8న కిలో వెండి ధర రూ.1.37 లక్షలు ఉండగా.. 15వ తేదీ నాటికి రూ.6 వేలు పెరిగి రూ.1.43 లక్షలకు చేరుకుంది. అంటే రోజుకు దాదాపు రూ.1000 చొప్పున పెరుగుతూ వస్తోంది.

పెట్టుబడి విషయంలోనూ బంగారమే..!

రోజు రోజుకీ ధర పెరుగుతూ వస్తున్నా బంగారం కొనుగోలు విషయంలో మాత్రం ప్రజలు అస్సలు తగ్గేదే..లే అంటున్నారు. ఎందుకంటే ఇంట్లో పసిడి ఎంత ఉంటే అంత ఎక్కువ సొమ్ము ఉన్నట్లుగా భావిస్తారు. వాస్తవానికి బంగారం నిరర్థక ఆస్తి. ఎంతో కష్టించి సంపాదించిన సొమ్ము బంగారంగా మార్చితే బీరువాల్లోనూ, బ్యాంకు లాకర్లలోనూ భద్రంగా ఉంచడం తప్ప... మరో ప్రయోజనం ఏంటి..? భవిష్యత్తులో ధర పెరిగి, పెరిగిన ధరకు దాన్ని విక్రయిస్తేనే లాభం. మనకు తెలిసినంత వరకూ బంగారం కొనడమే కానీ.. విక్రయించడమన్నది అరుదు. దీని బదులు వాటిని ఉత్పత్తి కార్యకలాపాలకు వెచ్చిస్తే సంపద సృష్టి జరుగుతుంది. మన దేశంలో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయడంలో బంగారం మూడో స్థానాన్ని ఆక్రమించింది. ముడిచమురు, క్యాపిటల్ గూడ్స్ తర్వాత అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న సరకు బంగారమేనన్నది విస్మయపరిచే అంశం. ఇటీవల కాలంలో మనదేశంలో బంగారం కొనుగోళ్లు అధికమై.. నగదు పొదుపు మొత్తాలు తగ్గిపోతున్నాయి. గృహస్తులు ఇతర వాటిపై ఒక్క శాతం పెట్టుబడులు పెడుతుండగా బంగారంపై మాత్రం ఆరున్నర రెట్లు ఎక్కువ మొగ్గు చూపుతుండటం విశేషం.


గత వారం రోజులుగా విశాఖ నగరంలో 10 గ్రాముల బంగారం, కిలో వెండి ధరలు

తేదీ	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కిలో వెండి
ఈనెల 8	1,08,380	99,350	1,37,000
9	1,10,290	1,01,100	1,40,000
10	1.10.510	1,01,300	1,40,000
11	1,10,510	1,01,300	1,40,000
12	1,11,280	1,02,000	1,42,000
13	1,11,170	1,01,900	1,43,000
14	1,11,170	1,01,900	1,43,000
15	1,11,060	1,01,800	1,43,000

బంగారానికి ఇంత వన్నె ఎందుకో..?

పుత్తడి ఎంత ఉన్నా సగటు వ్యక్తికి మోజు తీరడం లేదు. తన శక్తి మేరకు బంగారాన్ని సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. అసలు బంగారానికి ఇంత వన్నె ఉండటానికి కారణం అంతర్జాతీయ కరెన్సీకి ప్రత్యామ్నాయం కావడమే. ఒక దేశం జారీ చేసిన నోట్లు చెల్లకపోవడం. వాటి విలువ క్షీణించడం ఉంటుంది. కానీ బంగారానికి అలాంటి బేధాలేమీ లేవు. ఎప్పుడైనా ఎక్కడైనా ఎంతో కొంత ధరకు చెలామణి అవుతుంది. అందుకే స్వర్ణానికి అంత కళ. ధర తగ్గినా పెరిగినా కొనుగోళ్లు మాత్రం తగ్గడం లేదు. ప్రపంచ స్వర్ణమండలి(డబ్ల్యూజీసీ) అంచనాల ప్రకారం ప్రస్తుతం దేశంలోని సంస్థలు, గృహస్తులు, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా వద్ద 25 వేల టన్నుల బంగారం ఉంది. భారత్‌లో మొత్తం ఇళ్లల్లోనూ, ఇతర అవసరాలకు ఈ బంగారం వివిధ రూపాల్లో నిల్వ ఉంది. ఇందులో విశాఖ నగర జనాభా ప్రకారం 80 నుంచి 100 టన్నుల వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కల ప్రకారం సగటున విశాఖ నగరంలో ప్రతి ఇంటిలోనూ 15 నుంచి 25 గ్రాములు వరకూ బంగారం ఉంటుదని నివేదికలు చెబుతున్నాయి.

కొనుగోళ్లు తగ్గినా.. మార్కెట్ దూసుకుపోతోంది



టెక్స్‌టైల్స్ మార్కెట్ 15 నుంచి 20 శాతం పడిపోయింది. బంగారం మార్కెట్ కూడా 15 నుంచి 20 శాతం పడిపోయింది. మార్కెట్ విలువ మాత్రం బంగారం విషయంలో ఏమాత్రం తగ్గలేదు. చైనా, భారత్ వంటి దేశాలు బంగారాన్ని కొనుగోలు చేసేందుకు పోటీ పడుతున్నాయి. గతంలో పసిడి ధర మూడు నాలుగు రోజులకోసారి మారేది. ఇప్పుడు ఒక పూట ఉన్న రేటు మరో పూటకు ఉండటం లేదు. బులియన్ మార్కెట్ కూడా అంచనా వేయలేకపోతోంది. పెట్టుబడుల విషయంలోనూ బంగారానికి మంచి డిమాండ్ ఉంది. బంగారంతో వెండి పోటీ పడుతోంది. బ్యాటరీ కార్లలో వెండి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ధరల పెరుగుదలకు ఓ కారణమని చెప్పవచ్చు.


- కంకటాల మల్లికార్జునరావు, ఫ్యాప్సీ పాస్ట్ ప్రెసిడెంట్

మద్యం కంటే యూరియా ప్రమాదకరమా?

ప్రభుత్వంపై ఏపీ కౌలు రైతుల సంఘం మండిపాటు

సాక్షి, అమరావతి: యూరియా వాడటం వల్ల కేన్సర్ వస్తుందని సీఎం చంద్రబాబు దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం వారు ప్రకటన విడుదల చేశారు. ఓపక్క ఏటా రూ.30 వేల కోట్ల విలువైన మద్యాన్ని కూటమి ప్రభుత్వం బలవంతంగా అమ్ముతూ ప్రజలను అనారోగ్యాలకు గురిచేస్తూ మరోపక్క యూరియా వల్ల కేన్సర్ వస్తుందని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముందుగా మద్యం అమ్మకాలను నిషేధించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగానే యూరియా వినియోగం తగ్గించిన రైతులకు బస్తాకు రూ.800 ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందన్నారు. కూటమి సర్కారు వచ్చిన రోజు నుంచి ఇప్పటివరకు భూ పరీక్షలు చేయలేదని, నామమాత్రంగా పచ్చిరొట్ట విత్తనాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళా వర్సిటీని సందర్శించిన థాయిలాండ్ బృందం



తిరుపతి రూరల్: శ్రీపద్మావతీ మహిళా యూనివర్సిటీని థాయిలాండ్‌లోని ప్రిన్స్ ఆఫ్ సాంగ్‌క్లా యూనివర్సిటీ పట్టాని క్యాంపస్ ప్రతినిధి బృందం మంగళవారం సందర్శించింది. యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ వి.ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజని, అంతర్జాతీయ సంబంధాల విభాగం డీన్ ప్రొఫెసర్ పి.విజయలక్ష్మి, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఆర్.ఉష విదేశీ బృందానికి స్వాగతం పలికారు. అనంతరం ధృతి సెమినార్ హాల్లో రెండు విశ్వ విద్యాలయాల అధ్యాపకుల మధ్య సమగ్ర చర్చలు జరిగాయి. ఇందులో సంయుక్త పరిశోధన, సామూహిక ప్రచురణలు (జాయింట్ పబ్లికేషన్స్), విద్యార్థుల మరియు అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలుపై చర్చించారు. ముఖ్యంగా ఇంటర్న్‌షిప్ అవకాశాలు, అనువర్తిత శాస్త్రాలు, హెల్త్ సైన్సెస్, సామాజిక కార్యక్రమాలలో భాగస్వామ్యం అనే అంశాలపై దృష్టి సారించారు. రెండు విశ్వవిద్యాలయాల మధ్య విద్యా, పరిశోధన సహకారాన్ని అభివృద్ధి చేయడమే ప్రధాన ఉద్దేశంగా ఆ సమావేశం సాగింది. ఆ తరువాత క్యాంపస్‌ను పూర్తిగా పరిశీలించిన బృందం మహిళా పారిశ్రామికవేత్తలతో ముచ్చటించారు.

సాగుబడి

ఉత్తర కార్తె:
సెప్టెంబర్ 14 నుంచి

వరి, మొక్కజొన్న, వేరుశనగ, మినుము, కంది, పత్తి పంటలను ప్రస్తుత సీజన్‌లో అనేక చీడపీడలు ఆశించే నష్టం చేస్తున్నాయి. పంటల వారీగా ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణకు రైతులు ఏమేమి మందులను పిచికారీ చేసుకోవాలి? వివిధ పంటల్లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు ఏమిటి? వంటి అనేక అంశాలపై ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (లాం, గుంటూరు) విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. శివ నారాయణ రైతాంగానికి అనేక సూచనలు చేస్తున్నారు.

- సాక్షి, అమరావతి

6 పంటల్లో చీడపీడలు యాజమాన్య పద్ధతులేమిటి?





1. వరి

సార్వాలో ముందుగా ఊడ్చిన పొలాల్లో కాండం తొలిచే పురుగు, ఆకు ముడత ఆశించే అవకాశం ఉంది. కాబట్టి ఈ కింద తెలిపిన విధంగా సస్యరక్షణ చేపట్టాలి.

కాండం తొలిచే పురుగు నివారణకు పిలకలు వేసే దశలో క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి. 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 75 ఎస్.పి. 1.5 గ్రా. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి. 2.0 గ్రా. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 18.5 యస్.సి. 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. చిరుపొట్ట దశలో ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి. 8 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3 శాతం సి.జి. గుళికలు 10 కిలోలు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.4 శాతం గుళికలు 4 కిలోలు 20 కిలోల ఇసుకలో కలిపి పొలంలో సమానంగా చల్లాలి.

ఆకుముడత నివారణకు పిలక దశలో క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి. 2.5 మి.లీ. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 20 యస్.సి. 0.3 మి.లీ. /లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. చిరుపొట్ట దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి. 2.0 గ్రా. లేదా ఎసిఫేట్ 75 యస్.పి. 1.5 గ్రా. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 18.5 యస్.సి. 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దోమ ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో ఈ పురుగుల నివారణకు ప్రొఫెనోఫాస్, ట్రై జోఫాస్, క్లోరిపైరిఫాస్, సింథటిక్ పైరిత్రాయిడ్ వంటి మందులు పిచికారీ చేయకూడదు.

ఎండు తెగులు నిర్ధారణ ఎలా?

అధిక, ఎడతెరిపిలేని వర్షాలు కురిసే ప్రాంతాలలో బాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించే అవకాశం ఉన్నది. తెగులు నిర్ధారణ కోసం ఎండిన ఆకులను ముక్కలుగా కత్తిరించి మంచినీటితో ఉన్న గాజు గ్లాసులో వేయాలి. అర గంట తరువాత నీటిని గమనించినట్లైతే, తెగులు ఆశించిన భాగాల నుంచి బాక్టీరియా నీటిలోకి ప్రవేశించడం వల్ల నీటి గాఢత పెరిగి పసుపు రంగుకు మారుతుంది. ఈ లక్షణాలను బట్టి ఆ పంటను బాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించినట్లుగా గుర్తించాలి.

తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పొలంలో నిలిచిన నీటిని 2-3 సార్లు మురుగు నీటి కాలువల ద్వారా బయటకు తీసివేసి, కొత్త నీరు పెడితే ఉధృతి తగ్గుతుంది. సిఫారసు చేసిన పొటాష్‌ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లు వేసే సమయంలోనూ, చిరుపొట్ట దశలోనూ వేయాలి. ఈ తెగులు సోకిన పొలానికి నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలి.

ఆకు నల్లి నివారణకు నీటిలో కరిగే గంధకపు పొడి 50 శాతం 3 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 50 ఇ.సి. 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

పొడ తెగులు లేదా మాగుడు తెగులు యాజమాన్యానికి సిఫారసు చేసిన దూరంలోనే నాట్లు వేసుకోవాలి. సిఫారసు చేసిన నత్రజనిని 3-4 సార్లు వేయాలి. గట్లపైన, చేనులో కలుపు లేకుండా చూడాలి. హెక్సాకొనజోల్ 5 ఎస్.సి. 2 మి.లీ. లేదా వాలిడామైసిన్ 3 ఎల్. 2 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 25 ఇ.సి. 1 మి.లీ. లేదా ట్రై ఫ్లోక్సీస్ట్రోబిన్ + టెబ్యుకొనజోల్ 75 డబ్ల్యుజి 0.4 గ్రా. లేదా అజాక్సీస్ట్రోబిన్ 23 ఎస్.సి. 1 మి.లీ. లేదా అజాక్సీస్ట్రోబిన్ 11 శాతం + టెబ్యుకొనజోల్ 18.3 శాతం ఎస్.సి. 1.5 మి.లీ. లేదా అజాక్సీస్ట్రోబిన్ 18.2 శాతం + డైఫెన్‌కొనజోల్ 11.4 శాతం ఎస్.సి. 1.25 మి.లీ. లేదా అజాక్సీస్ట్రోబిన్ 5.6 శాతం + టెబ్యుకొనజోల్ 10 శాతం + ప్రోక్లోరజ్ 20 శాతం ఇ.సి. 3.5 మి.లీ. లీటరు నీటికి కలిపి 15 రోజులకొకసారి 2 సార్లు మందు మార్చి పిచికారీ చేయాలి.

***

2. పత్తి

పంట గూడ దశ (45-55 రోజులు) నుంచి గులాబి రంగు పురుగు ఉధృతి గమనించడానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలి. రోజుకు ఎనిమిది తల్లి పురుగుల చొప్పున వరుసగా మూడు రోజులు బుట్టల్లో పడితే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. లేదా పది పువ్వులకు ఒక గుడ్డిపువ్వు ఉన్నా లేదా 20 లేత కాయలను కోసి చూస్తే రెండు లార్వాలు గమనించినట్లైతే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి.

ఎకరానికి 5 శాతం వేపగింజల కషాయంతో మొదలుపెట్టి తరువాత ప్రొఫెనోఫాస్ 50 ఇ.సి. 2 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 25 ఇ.సి. 2.0 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి. 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండు లేదా మూడు సార్లు మందులను మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి. సింథటిక్ పైరిత్రాయిడ్స్ మందులు పంట వంద రోజులు దాటిన తర్వాత వాడుకోవాలి.

***

3. మినుము, కంది

చిత్తపురుగులు : ఈ పురుగులు పైరుపై రెండు ఆకుల దశలో ఎక్కువగా ఆశించి గుండ్రటి చిన్న చిన్న రంధ్రాలు చేస్తాయి. వీటి బెడద ఎక్కువగా ఉన్నపుడు నివారించకపోతే 80 శాతం మొక్కలు ఈ దశలోనే చనిపోయే అవకాశం ఉంది. వీటి నివారణకు 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేక 1 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కొరినోస్పొరా ఆకు మచ్చ తెగులు : ఈ తెగులు సోకిన ఆకులపై చిన్న చిన్న గుండ్రని గోధుమ రంగు మచ్చలు ఏర్పడి అనుకూల వాతావరణ పరిస్థితుల్లో పెద్దమచ్చలు వలయాకారంగా ఏర్పడి ఆకులు ఎండి రాలిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌లను లేదా 2.0 మి.లీ. హెక్సాకొనజోల్ లేదా 1.0 మి.లీ. ప్రొపికొనజోల్ 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు మందులు మార్చి పిచికారీ చేయాలి. గట్ల మీద వున్న పైరుకు ముందుగా మందును పిచికారీ చేయాలి.

***

4. సీతాఫలం తెగులు (బొబ్బర తెగులు)

ఈ వైరస్ తెగులు పేనుబంక, ఇతర రసం పీల్చు పురుగుల ద్వారా ఒక మొక్క నుంచి వేరొక మొక్కకు వ్యాప్తి చెందుతుంది. ఈ తెగులు ఆశించిన మొక్కలలో ఆకుల కాడలు, ఆకులు పెద్దవిగా అయ్యి ఆకుపై ఉబ్బెత్తుగా అయ్యి ముడుతలు పడి సీతాఫలం కాయలాగా కనబడుతుంది. ఆకులు ముదురు ఆకుపచ్చ రంగుకు మారతాయి. ఈ తెగులు సోకిన మొక్కల్లో పూత, పిందె అభివృద్ధి చెందక కాయలు ఏర్పడవు. ఈ తెగులు 70 శాతం వరకు విత్తనం ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది. కాబట్టి, తెగులు సోకని పంట నుండి విత్తనం సేకరించుకోవాలి. తెగులు వ్యాప్తికి కారణమైన పేనుబంక పురుగులను నివారించుకోవాలి. పేనుబంక పురుగు నివారణకు ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పేనుబంక ఉధృతిని బట్టి వారం నుంచి పది రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారీ చేయాలి.

***

5. వేరుశనగ

వేరుకుళ్ళు తెగులు నివారణకు తెగులు సోకని పొలం నుంచి విత్తనాలను సేకరించి తప్పని సరిగా విత్తన శుద్ధి చేయాలి. కాండం కుళ్ళు నివారణకు పైన తెలిపిన విధంగా ట్రై కోడెర్మా విరిడి ఫార్ములేషన్‌ను (2 కిలోలు), పశువులఎరువు (90 కిలోలు), వేపపిండి (10 కిలోల)ను కలుపుకొని 15 రోజుల తరువాత వాడుకోవాలి. విత్తే ముందు పొలంలో వేసుకోవాలి. విత్తిన 30 రోజులకు మరోసారి, 60 రోజులప్పుడు ఇంకోసారి వేసుకోవాలి. పొలంలో తెగులు ఆశించిన మొక్కలను పీకి కాల్చివేయాలి. పంట పీకిన తరువాత పంట అవశేషాలను తీసి కాల్చి వేయాలి. పంట మార్పిడి పద్ధతిని అవలంభించాలి.

***

6. మొక్కజొన్న

కత్తెర పురుగు ఉధృతి పంట శాఖీయ దశలో ఎక్కువగానే ఉంటుంది. గొంగళి పురుగులు ఆకులపై పత్ర హరితాన్ని గోకి తింటూ ఆకులపై రంధ్రాలు చేస్తుంది. ఇటువంటి రంధ్రాలు ఆకులపై నిలువుగా కనిపిస్తాయి. గొంగళి పురుగు పెరిగే కొద్ది ఆకుల చివరల నుండి తింటూ ఆకు సుడులను, కాండాన్ని తొలిచి రంధ్రాలను చేసి పంటను నష్టపరుస్తుంది. నివారణకు ఎమామేక్టిన్ బెంజోయేట్ 5 శాతం ఎస్.జి. మందును 0.4 గ్రా.లేదా స్పైనోసాడ్ 45 శాతం ఎస్.సి. 0.3 మి.లీ. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 18.5 ఎస్.సి. 0.4 మి.లీ. లీటరు నీటికి కలిపి ఆకుల సుడులు బాగా తడిచేలా పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి పై మందులను పది రోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారీ చేయాలి.

- నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్

వరి, చిరుధాన్యాలు పండించే రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాలను అయినకాడికి అమ్మేసుకుంటే మిగిలేది అరకొర లాభాలు లేదా నికర నష్టాలే! అవే ధాన్యాలను కొని, మరపట్టించి అమ్ముకునే వ్యాపారులు బాగుపడతారు. రైతే ఈ పని కూడా చేసుకుంటే నికరంగా లాభాలు పొందడానికి అవకాశం ఉందని రుజువు చేసే విజయగాథలు ఎక్కడ వెతికినా కనిపిస్తాయి. అయితే, మన దేశంలో వ్యవసాయం చేసే వారిలో 80-90 శాతం మంది చిన్న, సన్నకారు రైతులు లేదా కౌలు రైతులే. ధాన్యాలను పండించి అలాగే అమ్మేసుకోవటం వల్ల రావాల్సినంత ఆదాయం రావటం లేదు. ఇటువంటి రైతుల నికరాదాయం పెరగాలంటే ధాన్యాన్ని బియ్యంగా మార్చి అమ్మాలి. పెద్ద రైస్ మిల్లులు చాలా దూరంలో ఉంటాయి. రవాణా ఖర్చు ఎక్కువ అవుతుంది. కాబట్టి అంత లాభదాయకం కాదు. వారికి కావాల్సింది చిన్న రైస్ మిల్లు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే చిన్న మిల్లులు కావాలి. విద్యుత్తు కట్ ఎక్కువగా ఉంటుంది ఆ ప్రాంతాల్లో. అందుకే వారికి కావాల్సింది సౌర విద్యుత్తుతో నడిచే చిన్న/మధ్య తరహా రైస్ మిల్లు!

సౌర విద్యుత్తుతో నడిచే రైస్ మిల్లు!






- పాత మిల్లులతో పోల్చితే 30% పెరిగిన బియ్యం రికవరీ
- 500 కిలోల ధాన్యం ఆడితే బియ్యం రికవరీ 320-350 కిలోలకు పెరిగింది.
- వరి ధాన్యంతో పాటు చిరుధాన్యాలు, మొక్కజొన్నలు, గోధుమలను కూడా సౌర రైస్ మిల్లుల్లో మరపట్టవచ్చు

చిన్న, సన్నకారు రైతుల ఆదాయం పెంచడానికి ఇదొక్కటే మార్గమని సరిగ్గా గుర్తించిన బెంగళూరుకు చెందిన 'సెమా ఆల్టో' అనే వ్యాపార సంస్థ సౌర విద్యుత్తుతో నడిచే చిన్న రైస్ మిల్లును, ఇతర అనుబంధ యంత్రాలను రూపొందించింది. సెల్కో ఫౌండేషన్ సహకారంతో రైతులకు అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే 150 సౌర విద్యుత్తుతో నడిచే చిన్న రైస్ మిల్లులను దక్షిణాది రాష్ట్రాల్లో నెలకొల్పి సత్ఫలితాలు సాధిస్తోంది. సౌరశక్తితో పని చేసే ఆవిష్కరణలతో వ్యవసాయోత్పత్తుల వ్యాపార చిత్రంలో గుణాత్మక మార్పునకు దోహదం చేస్తోందీ సంస్థ. సోలార్ మినీ రైస్ మిల్లుల ద్వారా రైతులకు (ధాన్యం: బియ్యం నిష్పత్తి) నికర బియ్యం దిగుబడి 30 శాతం పెరిగింది. ఆదాయం రెట్టింపైందని సెమ ఆల్టో చెబుతోంది. ప్రకృతిని కలుషితం చేయని సౌర విద్యుత్తు ద్వారా ఈ సంస్థ గ్రామీణ జీవనోపాధిని విజయవంతంగా పునర్నిర్మిస్తోంది.

2017లో ప్రారంభం

'సెమ(ఎస్ఈఎంఏ)' అంటే 'సోలార్ పవర్డ్ ఎఫిషియంట్ మెషినరీ ఫర్ అగ్రికల్చర్'. వరి ధాన్యం, చిరుధాన్యాలను మరపట్టటం, బియ్యాన్ని మార్కెట్‌కు అందించడానికి అవసరమైన అనేక పనులు చెయ్యటం ఒక్క యంత్రంతో అవ్వదు. ధాన్యాలను శుభ్రపరచటం, మర పట్టటం, పాలిష్ చెయ్యటం, గ్రేడింగ్ వరకు మొత్తం 4 వేర్వేరు యంత్రాలు అందుకు కావాలి. వీటన్నిటినీ సెమ ఆల్టో సంస్థ రూపొందించింది. సౌరశక్తితో పనిచేసే మల్టీ-స్టేజ్ మినీ మిల్లు ఎండ్-టు-ఎండ్ బియ్యం ప్రాసెసింగ్‌ను నిర్వహిస్తోంది. 3.7-5 కిలోవాట్ల విద్యుత్తుతో ఇది నడుస్తుంది. 2017లో బెంగళూరులో అసద్ జాఫర్ ఈ కంపెనీని ప్రారంభించారు. తక్కువ ఖర్చుతో గ్రామీణులు తమ వ్యవసాయోత్పత్తులను రూపం మార్చి అధిక ధరకు విక్రయించుకునే మార్గాన్ని సుగమం చెయ్యటమే ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఇప్పటికే సెమ రైస్ మిల్లులు 150 యూనిట్ల వరకు ఏర్పాటయ్యాయి.



65% రికవరీ రేటు

'పాతకాలపు డీజిల్‌తో నడిచే పెద్ద రైస్ మిల్లుల్లో 500 కిలోల ధాన్యాన్ని మరపట్టిస్తే 275-300 కిలోల బియ్యం వస్తే, ఇప్పుడు అది 320-350 కిలోలకు పెరిగింది. ఈ సోలార్ మినీ రైస్ మిల్లు ఏర్పాటు చేసుకోవటం ద్వారా నికర బియ్యం దిగుబడి 30% పెరిగింది. రవాణా ఖర్చులు తగ్గాయి. ఆదాయం రెట్టింపైంది. పదెకరాల్లో వరి పండించినా అప్పట్లో నా కుటుంబాన్ని పోషించుకోవటానికి కూడా ఆదాయం సరిపోయేది కాదు. ఇప్పుడు ఈ మిల్లుతో బియ్యం నాణ్యత, రికవరీ రేటు, ఆదాయం పెరిగింది..' అని తమిళనాడుకు చెందిన సేంద్రియ వరి రైతు గోపి చెబుతున్నారు.

సోలార్ మినీ రైస్ మిల్లులో 100 కిలోల ధాన్యాన్ని మరపట్టిస్తే 65 కిలోల బియ్యం రైతుల చేతికి వస్తున్నాయి. మిల్లు సామర్థ్యం మెరుగ్గా ఉండటం వల్ల రైతులకు ఎక్కువ బియ్యం వస్తున్నాయి, వృథా తగ్గింది. ధాన్యాన్ని కిలో రూ. 45-50కి అమ్మే రైతు గోపి ఇప్పుడు సోలార్ రైస్ మిల్లులో మరపట్టి బియ్యాన్ని రూ. 80-100లకు కిలో అమ్ముతున్నారు. తద్వారా ఆదాయం రెట్టింపైందని గోపి తెలిపారు. వరి ధాన్యంతో పాటు చిరుధాన్యాలు, మొక్కజొన్నలు, గోధుమలను కూడా సౌర రైస్ మిల్లుల్లో మరపట్టే అవకాశం ఉండటం విశేషం.

సోలార్ రైస్ మిల్లులను రైతుల దగ్గరకు తీసుకెళ్లే కృషిలో సీఈఈడబ్ల్యు, విల్‌గ్రో సంస్థలతో కలసి సెమ ఆల్టో పనిచేస్తోంది. ఆస్తిపాస్తులు లేని పేద రైతులకు రుణ సదుపాయం కల్పించడం ద్వారా అందుబాటు బడ్జెట్‌లో ఈ మిల్లులను అందిస్తున్నారు. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్ వంటి ప్రభుత్వ పథకాలతో ఇటువంటి యంత్రాలను అనుసంధానం చేయగలిగితే రుణ సంబంధిత సబ్సిడీలను గ్రామీణ చిరువ్యాపారులకు అందించటం సాధ్యమవుతుందని ఆశిస్తున్నారు.

బిజినెస్ రీల్

ఎల్అండ్‌టీ సెమీకండక్టర్, సీ-డాక్ జట్టు



న్యూఢిల్లీ: దేశీయంగా సురక్షితమైన చిప్‌లను డిజైన్ చేసే దిశగా ఎల్అండ్‌టీ సెమీకండక్టర్ టెక్నాలజీస్ (ఎల్‌టీఎస్‌సీటీ), సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డాక్), ఐఐటీ గాంధీనగర్ జట్టు కట్టాయి. ప్రాథమికంగా ఎలక్ట్రానిక్ పాస్‌పోర్టుల కోసం చిప్‌లపై (ఐసీ) పరిశోధనలు జరపడం, వాటిని అభివృద్ధి, తయారు చేయడంపై ఈ మూడూ కలిసి పని చేస్తాయి. ఇందుకోసం ప్రత్యేకంగా పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు ప్రోడక్ట్ డెవలప్‌మెంట్, వినియోగాన్ని వేగవంతం చేసేందుకు నిర్దిష్టంగా ఇన్వెస్ట్ చేయనున్నాయి. సున్నితమైన విభాగాల్లో విదేశీ టెక్నాలజీ ప్రొవైడర్లపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడనుంది. కొత్త తరం క్రిప్టో ప్రోడక్టులకు కూడా సెక్యూర్ ఐసీ సొల్యూషన్ పునాదులు వేస్తుందని ఎల్‌టీఎస్‌సీటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సందీప్ కుమార్ తెలిపారు.

బ్లూ క్లౌడ్ సాఫ్టెక్ చేతికి 3పీ విజన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిఫెన్స్ టెక్నాలజీ కంపెనీ 3పీ విజన్‌ను కొనుగోలు చేయనున్నట్లు హైదరాబాద్‌కి చెందిన ఏఐ, సైబర్ సెక్యూరిటీ సంస్థ బ్లూ క్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ (బీసీఎస్ఎస్ఎల్) తెలిపింది. ఇందుకు సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణ పత్రంపై (ఎల్ఓఐ) సంతకాలు చేసినట్లు వివరించింది. 3పీకి చెందిన అధునాతన నిఘా కెమెరాలు, అటానమస్ డ్రోన్ రెస్పాన్స్ సిస్టమ్‌లు, ఏఐ ఆధారిత మానిటరింగ్ ప్లాట్‌ఫాంలు మొదలైనవి తమ పోర్ట్‌ఫోలియోలో చేరతాయని సంస్థ చైర్‌పర్సన్ జానకి యార్లగడ్డ తెలిపారు. భారత రక్షణ రంగంలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ డీల్ తోడ్పడుతుందని వివరించారు.

డాక్టర్ రెడ్డీస్ నుంచి గ్యాస్ట్రిక్ అల్సర్ ఔషధం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ కొత్తగా పీసీఏబీ బ్రాండ్ పేరిట టెగోప్రాజాన్ (50 మి.గ్రా) ఔషధాన్ని ప్రవేశపెట్టింది. గ్యాస్ట్రిక్ అల్సర్లలాంటి యాసిడ్ పెప్టిక్ వ్యాధుల (ఏపీడీ) చికిత్సలో దీన్ని ఉపయోగిస్తారు. దేశీయంగా 38 శాతం జనాభా ఏపీడీతో బాధపడుతున్నట్లు సంస్థ తెలిపింది. దీన్ని భారత్‌తో పాటు నిర్దిష్ట వర్ధమాన మార్కెట్లలో విక్రయించేందుకు 2022లో దక్షిణ కొరియాకు చెందిన హెచ్‌కే ఇన్నో ఎన్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-9-2025

విశాఖ	555-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	560-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
KOTAKBANK	2,023.50	2.67
LT	3,670.00	2.34
M&M	3,612.00	2.31
EICHERMOT	6,951.00	2.21
MARUTI	15,592.00	2.14

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	618.5	-0.83
ASIANPAINT	2,482.00	-0.82
NESTLEIND	1,204.00	-0.7
TATACONSUM	1,095.80	-0.62
HDFCLIFE	773.05	-0.53

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,680
ఎన్ఎస్ఈ	91,048
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,34,821
ఎఫ్ఐఐ	+ 308
డీఐఐ	+ 1,519

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.45	$ 63.03
బ్రెంట్	68.36	$ 67.44

ఓలా ఎలక్ట్రిక్... 10 లక్షల మైలురాయి

రోడ్‌స్టర్ ఎక్స్‌ప్లస్ ప్రత్యేక ఎడిషన్ విడుదల



న్యూఢిల్లీ: ఓలా ఎలక్ట్రిక్ తమిళనాడు కృష్ణగిరిలో ఉన్న ఫ్యూచర్‌ఫ్యాక్టరీలో 10 లక్షల వాహనాలను(ఒక మిలియన్) ఉత్పత్తి చేసినట్లు తెలిపింది. 2021 ఈ ప్లాంటులో తయారీ ప్రారంభించినప్పటి నుంచి నాలుగేళ్లలో ఈ మైలురాయిని చేరుకున్నట్లు పేర్కొంది. ఎలక్ట్రిక్ స్కూటర్లు ఎస్1 పోర్ట్‌ఫోలియోకు, ఇటీవల విడుదల చేసిన రోడ్‌స్టర్ ఎక్స్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లకు ఆదరణ లభించడంతో తయారీలో వృద్ధి సాధించగలిగామని వివరించింది. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకొని 'రోడ్‌స్టర్ ఎక్స్‌ప్లస్' స్పెషల్ ఎడిషన్‌ను విడుదల చేసింది. మిడ్‌నైట్ బ్లూ రంగులో దీన్ని తీసుకొచ్చారు. ''మాపై నమ్మకం, మా లక్ష్యంపై విశ్వాసం ఉంచిన ప్రతి భారతీయుడు గర్వించదగిన క్షణాలు ఇవి. నాలుగేళ్ల క్రితం ఒక ఆలోచనతో మొదలై నేడు దేశీయ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన మార్కెట్‌లో అగ్రస్థానంలో ఉన్నాము. ఇది కేవలం ప్రారంభం మాత్రమే. శిలాజ ఇంధన వాహనాలకు స్వస్తి పలికి ప్రపంచస్థాయిలో భారత్‌ను ఈవీ హబ్‌గా నిలపడం మా ధ్యేయం'' అని ఓలా అధికార ప్రతినిధి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

న్యూమరోస్ డిప్లోస్ మ్యాక్స్ కొత్త వెర్షన్

అయిదు సరికొత్త అప్‌గ్రేడ్‌లు, డ్యూయల్ కలర్‌తో డిప్లోస్ మ్యాక్స్ సరికొత్త వర్షెన్ తీసుకొచ్చినట్లు న్యూమరోస్ మోటార్స్ వ్యవస్థాపకులు శ్రేయాస్ శిబులాల్ తెలిపారు. 4.0డబ్ల్యూహెచ్ డ్యూయల్ లిక్విడ్ ఇమ్మర్షన్ కూలింగ్ బ్యాటరీ కలిగి ఉంది. వాహన గరిష్ట వేగం 70 కిలో మీటర్లు. ధర రూ.1.15 లక్షలుగా ఉంది.



బాలాజీ వేఫర్స్‌లో వాటాపై దిగ్గజాల కన్ను



10 శాతం వాటా విక్రయానికి ప్రమోటర్లు సై
రేసులో ఐటీసీ ఫుడ్స్‌సహా పలు పీఈ కంపెనీలు

న్యూఢిల్లీ: చిప్స్, మిఠాయిలు(కన్ఫెక్షనరీ ప్రొడక్టులు), విభిన్న స్నాక్స్ తయారీ అన్‌లిస్టెడ్ దిగ్గజం బాలాజీ వేఫర్స్‌లో ప్రమోటర్లు 10 శాతం వాటా విక్రయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే బాలాజీ వేఫర్స్‌లో మైనారిటీ వాటాపై ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ సంస్థ ఐటీసీ ఫుడ్స్‌తోపాటు.. డజనుకుపైగా పీఈ దిగ్గజాలు కన్నేసినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఇతర వివరాలు చూద్దాం..

టిమాసెక్ సైతం

స్నాక్స్, రెస్టారెంట్ల నిర్వాహక లిస్టెడ్ దిగ్గజం హల్దీరామ్‌లో పెట్టుబడులున్న పీఈ దిగ్గజం టిమాసెక్ సైతం బాలాజీ వేఫర్స్‌లో వాటా కోసం చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రేసులో టీపీజీ, అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ(ఏడీఐఏ), కార్లైయిల్, కేదార క్యాపిటల్, బెయిన్ అండ్ కంపెనీ, మోర్గాన్ స్టాన్లీ, గోల్డ్‌మన్ శాక్స్ తదితర దిగ్గజాలు పోటీ పడుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. ఈ వివరాల ప్రకారం గ్లోబల్ పీఈ సంస్థలు బ్లాక్‌స్టోన్, కేకేఆర్ బాలాజీ వేఫర్స్‌లో వాటాపట్ల అనాసక్తిని ప్రదర్శిస్తున్నాయి. కాగా.. ఈ గుజరాత్ కంపెనీ ప్రధానంగా దేశ పశ్చిమ, మధ్య ప్రాంతాలలో కార్యకలాపాలు విస్తరించింది. ప్రమోటర్లు విరానీ బ్రదర్స్ కంపెనీలో 10-15 శాతం వాటా విక్రయించే యోచనలో ఉన్నారు. అయితే కంపెనీ నిర్వహణ లాభం(ఇబిటా)కు 10 రెట్లు అధిక ధరను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు దేశ, విదేశీ దిగ్గజాలతో చర్చలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం కంపెనీ విలువ 3.5-4 బిలియన్ డాలర్లుకాగా.. ప్రమోటర్లు 5 బిలియన్ డాలర్ల(రూ. 44,000 కోట్లు) విలువను ఆశిస్తున్నారు.

1981లో ఏర్పాటు..

విరానీ బ్రదర్స్‌గా పిలిచే చందూభాయ్, కనూభాయ్, భిక్కూభాయ్ 1981లో బాలాజీ వేఫర్స్‌ను ఏర్పాటు చేశారు. తొలుత సినిమా కేంటీన్‌లో ప్యాక్ చేసిన స్నాక్స్ విక్రయించడం ద్వారా కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. తదుపరి దశలో సొంతంగా పొటాటో వేఫర్స్, నమకీన్ స్నాక్స్ తయారీ ప్రారంభించారు. ఆపై దేశీ స్నాక్స్ మార్కెట్లో ప్రధాన కంపెనీగా బాలాజీ అవతరించింది. కంపెనీ పేరును ఇంటికి దగ్గర్లోగల హనుమాన్ గుడి ప్రభావంతో బాలాజీగా నామకరణం చేశారు. 2024కల్లా ఆదాయం రూ. 5,450 కోట్లను అధిగమించింది. దాదాపు రూ. 578 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఐఎంఏఆర్‌సీ గ్రూప్ నివేదిక ప్రకారం దేశీ స్నాక్స్ మార్కెట్ పరిమాణం 2024కల్లా రూ. 46,571 కోట్లకు చేరింది. సగటున 8.6 శాతం వార్షిక వృద్ధితో 2033కల్లా రూ. 1,01,811 కోట్లను అధిగమించనున్నట్లు అంచనా. ఇందుకు ప్రధానంగా పట్టణీకరణ పెరిగిపోతుండటం, వినియోగదారుల జీవన విధానంలో మార్పులు, కుటుంబ ఆదాయాలు పుంజుకోవడం తదితర అంశాలు దోహదపడనున్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఏడాది మార్చిలో హల్దీరామ్స్ సింగపూర్ సంస్థ టిమాసెక్, అల్ఫా వేవ్ గ్లోబల్, ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ(ఐహెచ్‌సీ)లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పుకున్న నేపథ్యంలో బాలాజీ వేఫర్స్ వాటా విక్రయ ఆలోచనకు ప్రాధాన్యత ఏర్పడినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

ఐపీవో స్ట్రీట్

సాత్విక్ గ్రీన్ @ రూ. 442-465

ఈ నెల 19-23 మధ్య ఐపీవో • రూ. 900 కోట్ల సమీకరణకు సై



న్యూఢిల్లీ: సోలార్ ఫొటో వోల్టాయిక్ మాడ్యూళ్ల తయారీ కంపెనీ సాత్విక్ గ్రీన్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూకి రూ. 442-465 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 19న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 700 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 200 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి 23న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 900 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. కంపెనీ లిస్టయితే రూ. 5,910 కోట్ల మార్కెట్ విలువను అందుకునే వీలుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను కేటాయించనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 477 కోట్లు సాత్విక్ సోలార్ ఇండస్ట్రీస్‌లో ఇన్వెస్ట్ చేయనుంది. ఒడిశాలోని గోపాల్‌పూర్ ఇండస్ట్రియల్ పార్క్‌లో 4 గిగావాట్ల సోలార్ పీవీ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. మరో రూ. 166.5 కోట్లు అనుబంధ సంస్థ రుణ చెల్లింపులకు వినియోగించనుంది. 2025 జూన్30కల్లా 3.8 గిగావాట్ల సోలార్ ఫొటోవోల్టాయిక్ మాడ్యూల్ తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. సోలార్ ప్రాజెక్టులకు ఎండ్‌టుఎండ్ ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, నిర్మాణ సంబంధ సర్వీసులను కంపెనీ సమకూర్చుతోంది.

జీకే ఎనర్జీ @ రూ. 145-153

ఈ నెల 19-23 మధ్య ఐపీవో • రూ. 465 కోట్ల సమీకరణకు రెడీ



న్యూఢిల్లీ: సౌర విద్యుత్(సోలార్ పవర్) ఆధారిత వ్యవసాయ నీటి పంప్ సిస్టమ్స్ అందించే జీకే ఎనర్జీ పబ్లిక్ ఇష్యూకి రూ. 145-153 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 19న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 65 కోట్ల విలువైన 42 లక్షల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి 23న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 465 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను విక్రయించనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో దాదాపు రూ. 323 కోట్లు కంపెనీ దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. సోలార్ పవర్ వ్యవసాయ పంప్ సిస్టమ్స్‌కు కంపెనీ పూర్తిస్థాయిలో ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కమిషనింగ్(ఈపీసీ) సేవలు సమకూర్చుతోంది. తద్వారా రైతులకు వీటికి సంబంధించిన సర్వే, డిజైన్, సప్లై, అసెంబ్లీ, ఇన్‌స్టలేషన్, టెస్టింగ్, నిర్వహణ తదితర ఏకీకృత సర్వీసులు అందిస్తోంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 98 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

జేపీ కొనుగోలుకి సీసీఐ ఓకే

పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్‌కు లైన్ క్లియర్



న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో చిక్కుకున్న జైప్రకాష్ అసోసియేట్స్(జేపీ) కొనుగోలుకి తాజాగా కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్‌ను అనుమతించింది. దీంతో దివాలా చట్ట చర్యలలో భాగంగా జేపీని సొంతం చేసుకునేందుకు పీఎన్‌సీ ఇన్‌ఫ్రాకు దారి ఏర్పడనుంది. దివాలా పరిష్కారంకింద దాఖలు చేసిన బిడ్ గెలుపొందే వీలుంది. తద్వారా జేపీలో కనీసం 95 శాతం, గరిష్ఠంగా 100 శాతం వాటా కొనుగోలుకి సీసీఐ.. పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్ లేదా భవిష్యత్‌లో పూర్తి అనుబంధ సంస్థగా ఎస్‌పీవీ ఏర్పాటు ద్వారా జేపీలో వాటాను సొంతం చేసుకునేందుకు అనుమతించింది. వెరసి జేప్రకాష్ అసోసియేట్స్ కొనుగోలుకి పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్ ప్రతిపాదనపై ఆమోదముద్ర వేసినట్లు సీసీఐ తాజాగా ఎక్స్‌లో పోస్ట్ చేసింది. కాగా.. జేపీ రుణ పరిష్కార ప్రణాళికను ప్రతిపాదించే సంస్థకు సీసీఐ అనుమతి తప్పనిసరంటూ ఐబీసీ నిబంధనల సమీక్ష తదుపరి సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో జేపీ రుణ పరిష్కార ప్రణాళికకు బిడ్ దాఖలు చేసే సంస్థ సీసీఐ నుంచి అనుమతి పొందవలసి ఉంటుంది.

జేఎస్‌డబ్ల్యూ చేతికి అక్జో నోబెల్

డీల్‌కు తాజాగా సీసీఐ గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ: అక్జో నోబెల్ ఇండియాలో మెజారిటీ వాటా కొనుగోలుకి తాజాగా జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్‌ను కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) అనుమతించింది. తద్వారా డచ్ దిగ్గజం దేశీ పెయింట్ల బిజినెస్‌లో 74.76 శాతం వాటాను జేఎస్‌డబ్ల్యూ సొంతం చేసుకోనుంది. ఇందుకు రూ. 8,986 కోట్లు చెల్లించనుంది. దీంతోపాటు అక్జో నోబెల్ వాటాదారుల నుంచి మరో 25 శాతం వాటా కొనుగోలుకి ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. ఇందుకు మరో రూ. 3,929 కోట్లు వెచ్చించనుంది. వెరసి అక్జో నోబెల్ ఇండియా కొనుగోలుకి జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ రూ. 12,915 కోట్లు కేటాయించనుంది. వెరసి దేశీ పెయింట్ల రంగంలో నాలుగో పెద్ద కంపెనీగా ఆవిర్భవించనుంది. అక్జో నోబెల్ ఇండియాలో 75 శాతం వాటాను సొంతం చేసుకునేందుకు జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సీసీఐ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. నెదర్లాండ్స్ దిగ్గజం అక్జో నోబెల్‌కు దేశీ అనుబంధ సంస్థ అక్జో నోబెల్ ఇండియా డెకొరేటివ్, ఇండస్ట్రియల్ పెయింట్ల విభాగంలో సుప్రసిద్ధ కంపెనీగా నిలుస్తోంది. పెయింట్ల బిజినెస్‌లో మెజారిటీ వాటాపై డీల్ కుదిరినట్లు ఈ ఏడాది జూన్‌లో ఇటు జేఎస్‌డబ్ల్యూ, అటు అక్జో నోబెల్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే దేశీయంగా పౌడర్ కోటింగ్స్ బిజినెస్‌తోపాటు.. ఇంటర్నేషనల్ రీసెర్చ్ సెంటర్ డచ్ దిగ్గజం అక్జో నోబెల్ వద్దనే కొనసాగనున్నాయి.

స్టార్‌హెల్త్ నుంచి మాడిసన్ ఇండియా క్యాపిటల్ నిష్క్రమణ



న్యూఢిల్లీ: స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ నుంచి ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ మాడిసన్ ఇండియా క్యాపిటల్ నిష్క్రమించింది. కంపెనీలో తనకున్న మొత్తం 1.15 శాతం వాటాను ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా సుమారు రూ. 299 కోట్లకు విక్రయించింది. ఎన్ఎస్ఈ బల్క్ డీల్ డేటా ప్రకారం అనుబంధ సంస్థ ఎంఐవో స్టార్ ద్వారా మాడిసన్ ఇండియా 67.72 లక్షల షేర్లను సగటున రూ.441.01 రేటుకు విక్రయించింది. ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌లో భాగమైన పీఐ ఆపర్చూనిటీస్ ఏఐఎఫ్ 45.35 లక్షల షేర్లను (0.77 శాతం వాటా) రూ. 200 కోట్లకు కొనుగోలు చేసింది. 2024 మే నెలలో మాడిసన్ ఇండియా క్యాపిటల్ సహా మూడు సంస్థలు స్టార్ హెల్త్‌లో సుమారు 7.06 శాతం వాటాను రూ. 2,210 కోట్లకు విక్రయించాయి.

తయారీలో సంస్కరణలు రావాలి

సీఐఐ ప్రెసిడెంట్ శోభనా కామినేని



ముంబై: దీర్ఘకాలిక కోణంలో భారత్‌లో గణనీయంగా వ్యాపార అవకాశాలు ఉన్నాయని అపోలో హెల్త్‌కో చైర్‌పర్సన్, పరిశ్రమల సమాఖ్య సీఐఐ ప్రెసిడెంట్ శోభనా కామినేని తెలిపారు. వీటిని అందిపుచ్చుకునేందుకు వ్యాపారాల నిర్వహణను సులభతరం చేసే దిశగా తయారీ రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అమెరికా విధించిన విపరీతమైన టారిఫ్‌ల వల్ల అనిశ్చితులు తలెత్తాయని ఆమె తెలిపారు. మరింత మెరుగ్గా రాణించేందుకు ఏం చేయాలనేది లోతుగా ఆలోచించేందుకు ఈ పరిస్థితులను ఉపయోగించుకోవాలని వివరించారు. కృత్రిమ మేధ వినియోగం పెరుగుతుండటంతో ఉద్యోగాలు పోతాయనే భయం ప్రజల్లో నెలకొందని మెసేజింగ్ యాప్ వాట్సాప్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె చెప్పారు. మనం 4 లక్షల కోట్ల ఎకానమీగా ఎదిగినా, జీడీపీ మూడింతలు పెరిగినా, అందరికీ ఉద్యోగాలు దొరక్కపోతే సామాన్యుడికి ఏం ప్రయోజనం దక్కుతుందనేది ఆలోచించాల్సిన అవసరం ఉందని శోభన చెప్పారు. ఉద్యోగాలు కల్పించడమనేది ప్రతి చిన్న, పెద్ద వ్యాపారాల బాధ్యత అని తెలిపారు. భారత్‌లో ప్రతిభావంతులకు కొదవలేదని, ఏఐ సొల్యూషన్స్‌ను రూపొందించడంలో మన దేశం ప్రపంచానికి సారథ్యం వహించాలని పేర్కొన్నారు. మరోవైపు, తమ యాప్ ద్వారా ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చే దిశగా ఆంధ్రప్రదేశ్ తర్వాత మరో మూడు రాష్ట్రాల ప్రభుత్వాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వాట్సాప్ మాతృ సంస్థ మెటా కంట్రీ హెడ్ (ఇండియా) అరుణ్ శ్రీనివాస్ తెలిపారు.

జియోథర్మల్ ఎనర్జీపై జాతీయ విధానం

న్యూఢిల్లీ: భూతాపశక్తి (జియోథర్మల్)ని వెలికితీయడాన్ని ప్రోత్సహించే దిశగా జాతీయ విధానాన్ని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ (ఎంఎన్ఆర్ఈ) రూపొందించింది.



భారత పునరుత్పాదక ఇంధన, తటస్థ స్థాయి ఉద్గార లక్ష్యాల సాధనకు అదనంగా మరో వనరును అందిపుచ్చుకునేందుకు ఇది తోడ్పడనుంది. భూమి పొరల్లో నిక్షిప్తమై ఉన్న వేడిమిని ఉపయోగించి ఉత్పత్తయ్యే విద్యుత్తును జియోథర్మల్ ఎనర్జీగా వ్యవహరిస్తారు. నాగా-లూషై, అండమాన్ నికోబర్ దీవులు మొదలైన ప్రాంతాల్లో 10 జియోథర్మల్ సైట్లు ఉన్నాయని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది.

భారత్‌లోకి రూ. 80 లక్షల కోట్ల పెట్టుబడులు

- రాబోయే కొన్నేళ్లలో రూ. 1.5 కోట్ల ఉద్యోగాల కల్పన
- కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ వెల్లడి



న్యూఢిల్లీ: రాబోయే రోజుల్లో భారత్‌లోకి రూ. 80 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. 1.5 కోట్ల పైగా ఉద్యోగాల కల్పన జరగనుందని వివరించారు. దేశీయంగా మారిటైమ్ రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని, భవిష్యత్తులో ప్రపంచ మారిటైమ్ సూపర్‌పవర్‌గా భారత్ ఎదగనుందని పేర్కొన్నారు. కేంద్రం తలపెట్టిన సాగర మాల ప్రోగ్రాంతో 2035 నాటికి రూ. 5.8 లక్షల కోట్ల విలువ చేసే 840 ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయని సోనోవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రూ. 1.41 లక్షల కోట్ల విలువ చేసే 272 ప్రాజెక్టులు పూర్తయినట్లు పేర్కొన్నారు. రూ. 76,000 కోట్లతో మహారాష్ట్రలో ఏర్పాటవుతున్న వాధ్వాన్ పోర్టు అంతర్జాతీయంగా టాప్ 10 కంటైనర్ పోర్టుల్లో ఒకటిగా నిలుస్తుందని సోనోవాల్ వివరించారు. దీనితో 12 లక్షల పైచిలుకు ఉద్యోగాల కల్పన జరుగుతుందని మంత్రి చెప్పారు.

2026లో వేదాంతా విభజన పూర్తి

- వేదాంతా రిసోర్సెస్ సీఈవో వెల్లడి
- విభజనపై నేడు ఎన్‌సీఎల్‌టీ విచారణ



న్యూఢిల్లీ: దేశీ విభాగం వేదాంతా లిమిటెడ్ వ్యాపార విభజన ఈ ఆర్థిక సంవత్సరం(2025-26)లో పూర్తియ్యే వీలున్నట్లు వేదాంతా రిసోర్సెస్ తాజాగా పేర్కొంది. ప్రస్తుతం కంపెనీ పునర్వ్యవస్థీకరణపైనే దృష్టి పెట్టినట్లు కంపెనీ సీఈవో దేశ్నీ నైడూ తెలియజేశారు. కాగా.. వేదాంతా లిమిటెడ్ బిజినెస్‌ల విడదీత ప్రతిపాదనపై జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) నేడు(బుధవారం) విచారణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. దీంతో ఎన్‌సీఎల్‌టీ అనుమతి విషయంలో మరో ముందడుగు పడనున్నట్లు భావిస్తున్నామన్నారు. నిజానికి టాల్వండి శాబో పవర్(టీఎస్‌పీఎల్) అంశం పరిష్కారమైనట్లు పేర్కొన్నారు. వెరసి మాతృ సంస్థ వేదాంతా లిమిటెడ్ నుంచి టీఎస్‌పీఎల్ విడదీతకు దారి ఏర్పడినట్లు తెలియజేశారు. దీనిలో భాగంగా విడదీతను నిలిపిఉంచుతూ దిగువ కోర్టు జారీ చేసిన ఆదేశాలను జాతీయ కంపెనీ చట్ట అప్పిలేట్ ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్ఏటీ) పక్కనపెట్టినట్లు వెల్లడించారు. కాగా.. చైనాకు చెందిన స్పెకో ఎలక్ట్రిక్ పవర్ కన్‌స్ట్రక్షన్ కార్ప్(సెప్కో)తో ఈ నెల 11న సెటిల్‌మెంట్ కుదిరినట్లు టీఎస్‌పీఎల్ కౌన్సిల్ ఎన్‌సీఎల్ఏటీకి తెలియజేసింది. అంతక్రితం టీఎస్‌పీఎల్‌కు రుణాలందించిన సంస్థలలో ఒకటైన సెప్కో రూ. 1,251 కోట్ల రుణ చెల్లింపుల్లో విఫలమైనట్లు ఆరోపిస్తూ విడదీతకు అభ్యంతరం తెలిపింది. వేదాంతా అల్యూమినియం, వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంతా పవర్, వేదాంతా స్టీల్ అండ్ ఫెర్రస్ మెటీరియల్స్, వేదాంతా బేస్ మెటల్స్, వేదాంతా లిమిటెడ్ పేరుతో ఆరు బిజినెస్ విభాగాలుగా సంస్థను విడదీసేందుకు వేదాంతా రిసోర్సెస్ ప్రణాళికలు వేసిన విషయం విదితమే.

అమెరికా టారిఫ్‌లతో సవాళ్లు..

అమెరికా విధించిన టారిఫ్‌ల ప్రభావం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన పరివర్తన ప్రక్రియ వేగం, విస్తృతి నెమ్మదించే అవకాశాలున్నాయని దేశ్నీ తెలిపారు. దేశీయంగా వినియోగం గణనీయంగా ఉన్నందున భారత ఎకానమీపై ఎక్కువగా ప్రభావం పడబోదని వివరించారు. భారత ఎగుమతులపై ముందుగా 25 శాతం, ఆ తర్వాత రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తున్నందుకు గాను మరో 25 శాతం (మొత్తం 50 శాతం) మేర అమెరికా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. మరోవైపు, చౌక ఇంధన వనరులు కూడా అవసరమున్న ప్రస్తుత పరిస్థితుల్లో బొగ్గు వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయరాదని దేశ్నీ తెలిపారు. ప్రభుత్వం మరిన్ని ఖనిజ బ్లాకులు అందుబాటులోకి తెస్తుండటం మంచి పరిణామమేనని, కాకపోతే వాటి వెలికితీతకు కూడా ప్రోత్సాహకాలు ఉండాలని పేర్కొన్నారు.

‘ఈ విజయం ఎంతో ప్రత్యేకం’

గ్రాండ్ స్విస్ టోర్నీ విజేత వైశాలి వ్యాఖ్య

సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): క్లిష్టంగా గడుస్తున్న ఈ సంవత్సరంలో తాజా ఫిడే గ్రాండ్ స్విస్ టైటిల్ కొత్త ఉత్సాహాన్నిచ్చిందని భారత గ్రాండ్ మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు తెలిపింది. తాను మరింత మెరుగయ్యేందుకు, రాణించేందుకు ఇది ఔషధంలా పనిచేస్తుందని చెప్పింది. మహిళల ఎలైట్ ఈవెంట్‌లో వరుసగా రెండుసార్లు విజేతగా నిలిచిన తొలి భారత క్రీడాకారిణిగా ఆమె ఘనత వహించింది. 24 ఏళ్ల ఈ చెన్నై గ్రాండ్‌మాస్టర్ వచ్చే ఏడాది క్యాండిడేట్స్ టోర్నీకి సైతం అర్హత సాధించిన సంగతి తెలిసిందే. ‘గత విజయంతో పోల్చుకుంటే ఇది ముమ్మాటికి కఠినమైంది. 2023లో నేను ఫామ్‌లో ఉన్నాను. నిలకడగా విజయాలు సాధిస్తున్న సమయంలో గ్రాండ్ స్విస్ టైటిల్ గెలవడం ఏమంత కష్టం కాలేదు. కానీ ఇప్పుడు అంతా సులువుగా రాలేదు. నేను ఎప్పట్లాగే కష్టపడుతున్నప్పటికీ ఈ ఏడాది ఫలితాలు మాత్రం తీవ్రంగా నిరాశపరుస్తూనే ఉన్నాయి. ఇలాంటి సమయంలో లభించిన టైటిల్ నన్ను మార్చింది. చాలా టోర్నీల్లో ఆడటం ద్వారా గత రెండేళ్లుగా ఎంతో అనుభవాన్ని గడించా. అయితే గతేడాది క్యాండిడేట్స్ టోర్నీలో వరుసగా నాలుగు గేమ్‌లు ఓడిపోవడం, ఆ తర్వాత మింగుడుపడని ఫలితాలు నాకెన్నో గుణపాఠాలు నేర్పాయి. నేనొక ప్లేయర్‌గా మరింత బాగా ఆడేందుకు, ఓ వ్యక్తిగా దృఢంగా తయారయ్యేందుకు దోహదం చేశాయి’ అని వైశాలి పేర్కొంది. ఈ ఏడాది సొంతగడ్డపై జరిగిన చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ టోర్నమెంట్‌లో తొమ్మిది రౌండ్ల పాటు వరుస వైఫల్యాలతో కేవలం 1.5 పాయింట్లే సాధించడం, మహిళల ప్రపంచకప్‌లో క్వార్టర్ ఫైనల్లో తన్ జొంగ్‌జీ (చైనా) చేతిలో ఓడిపోవడం వైశాలిని కుంగదీసింది. ‘చెన్నై టోర్నీలో ఏకంగా ఏడు గేముల్లో ఓడాను. ఇంకా చెప్పాలంటే ఓ వారమంతా ఓటములతోనే గడిచిపోయింది. అప్పుడు ఏదోలా అనిపించింది. మంచో చెడో కూడా అర్థమయ్యేది కాదు. కానీ గెలిస్తే నన్ను ఎవరు ఆపలేరనే ఆత్మవిశ్వాసం లభిస్తుంది. అదే ఇప్పుడు జరిగింది’ అని వైశాలి వివరించింది.


తల్లి, తమ్ముడుతో వైశాలి

సెంటర్ ఫర్ స్పైన్ స్పోర్ట్స్ హెల్త్‌తో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ ఒప్పందం



సాక్షి, హైదరాబాద్: శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎస్‌డీఎఫ్‌సీ)... సెంటర్ ఫర్ స్పైన్ అండ్ స్పోర్ట్స్ హెల్త్ (సీఎస్‌ఎస్‌హెచ్)తో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. ఇక నుంచి తమ క్లబ్ అధికారిక స్పోర్ట్స్ సైన్స్ భాగస్వామిగా సీఎస్‌ఎస్‌హెచ్ వ్యవహరించనున్నట్లు మంగళవారం వెల్లడించింది. జాతీయ బ్యాడ్మింటన్ కోచ్, సీఎస్‌ఎస్‌హెచ్ కో ఫౌండర్ పుల్లెల గోపీచంద్, ఎస్‌డీఎఫ్‌సీ చీఫ్ ఫుట్‌బాల్ ఆఫీసర్ ఫాబియో ఫెరీరా, సీఎస్‌ఎస్‌హెచ్ సీఈవో నరేశ్ కుమార్ సమక్షంలో ఈ అవగాహన ఒప్పందం కుదిరింది. ప్లేయర్ల సంక్షేమం, వారి ఆటతీరును మరింత మెరుగు పరిచేందుకు ఈ ఒప్పందం ఉపకరిస్తుందని ఎస్‌డీఎఫ్‌సీ వెల్లడించింది. ఈ ఎంఓయు ప్రకారం... శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ క్రీడాకారులు సీఎస్‌ఎస్‌హెచ్‌లోని అత్యుత్తమ సదుపాయాలు, నిపుణుల సేవలను పొందనున్నారు. ప్లేయర్లు గాయాల బారిన పడకుండా చూడటం, గాయపడిన వారిని వీలైనంత త్వరగా కోలుకునే చేయడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది. భారత ఫుట్‌బాల్ చరిత్రలో ఇలాంటి ఒప్పందం తొలిసారి అని దీనివల్ల క్రీడల్లో కొత్త సంస్కృతికి నాంది పలికినట్లు అయిందని శ్రీనిధి క్లబ్ అధికారి ఫాబియో ఫెరీరా అన్నారు.



సమం చేయడమే లక్ష్యంగా...

- నేడు ఆస్ట్రేలియాతో భారత మహిళల రెండో వన్డే
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముల్లాన్‌పూర్: ఆస్ట్రేలియా జట్టుతో సొంతగడ్డపై జరుగుతున్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి వన్డేలో ఓడిన హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని టీమిండియా... బుధవారం రెండో వన్డే ఆడనుంది. తొలి పోరులో టాపార్డర్ రాణించినా... మిడిలార్డర్ భారీ షాట్‌లు ఆడలేకపోవడంతో పాటు బౌలింగ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో టీమిండియా పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో ఆ లోపాలను సరిదిద్దుకొని పూర్తిస్థాయిలో సత్తా చాటాలని హర్మన్‌ప్రీత్ బృందం భావిస్తోంది. స్టార్‌లతో నిండి ఉన్న ఆస్ట్రేలియా బ్యాటింగ్ లైనప్‌ను ఇబ్బందిపెట్టడంలో మన బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. నలుగురు స్పిన్నర్లు ఉన్నా... కంగారూల ఆటకట్టించలేకపోయారు. స్నేహ్ రాణా ఒక్కతే ఒక వికెట్ పడగొట్టగా... దీప్తి శర్మ, శ్రీ చరణి, రాధ యాదవ్ వికెట్లు తీయడంలో విఫలమయ్యారు. ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాతోనే ప్రధాన పోటీ ఎదురుకానున్న నేపథ్యంలో అటు బౌలింగ్ ఇటు ఫీల్డింగ్‌లో మనవాళ్లు మరింత రాణించాలని చూస్తున్నారు.



స్ప్రింట్ క్వీన్ పరుగు ఆగింది

3 ఒలింపిక్ స్వర్ణాలు... 10 ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణాలు... డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో 5 సార్లు విజేత... ‘పాకెట్ రాకెట్’ అథ్లెట్ షెల్లీ ఆన్ ఫ్రేజర్ అసాధారణ ఘనతల్లో ఇవి కొన్ని... సుదీర్ఘ కాలం మహిళల స్ప్రింట్స్‌లో మెరుపులా వెలిగిన షెల్లీ వరల్డ్ చాంపియన్‌షిప్‌తో ఆట నుంచి తప్పుకుంది... రెండు దశాబ్దాల అసాధారణ అథ్లెటిక్స్ కెరీర్‌లో ఎన్నో రికార్డులు సృష్టించి ‘ఆల్‌టైమ్ గ్రేట్’గా నిలిచిన ఆమె టోక్యోలో జరుగుతున్న ప్రపంచ చాంపియన్‌షిప్‌లో చివరిసారి బరిలోకి దిగి ట్రాక్‌కు గుడ్‌బై చెప్పింది... గత పారిస్ ఒలింపిక్స్‌లో గాయం తర్వాతే ట్రాక్‌కు దూరమవ్వాలని భావించినా... అభిమానుల కోసం ఆగిన షెల్లీ చివరకు వీడ్కోలు పలికింది.

- సాక్షి క్రీడా విభాగం

- ట్రాక్‌కు గుడ్‌బై చెప్పిన షెల్లీ ఆన్ ఫ్రేజర్
- మహిళల అథ్లెటిక్స్‌లో ‘ఆల్‌టైమ్ గ్రేట్’గా గుర్తింపు
- ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో కలిపి 24 పతకాలు

సరిగ్గా 18 ఏళ్ల క్రితం జపాన్‌లోనే షెల్లీ ఆన్ విజయ ప్రస్థానం మొదలైంది. ఒసాకాలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో జమైకా 4–100 మీటర్ల రిలే టీమ్ సభ్యురాలిగా రజతం సాధించడంతో ఆమె కెరీర్‌లో తొలి పతకాన్ని అందుకుంది. ఆ తర్వాత శిఖరాలకు చేరిన షెల్లీ ఇప్పుడు తన కెరీర్‌లో ఆఖరి రేసులో పాల్గొని జపాన్‌లోనే ముగించడం విశేషం. తన ప్రధాన ఈవెంట్, ట్రాక్ చరిత్రలో అత్యుత్తమ అథ్లెట్లలో ఒకరిగా గుర్తింపునిచ్చిన 100 మీటర్ల పరుగులో పాల్గొన్న ఆమె ఆరో స్థానంతో ముగించింది. అయితే 38 ఏళ్ల వయసులో ఇలాంటి ప్రదర్శన ఇవ్వడం సాధారణ విషయమేమీ కాదు. ట్రాక్ అండ్ ఫీల్డ్ ప్రపంచంలో రెండు అత్యుత్తమ వేదికలు ఒలింపిక్స్ (మొత్తం 8 పతకాలు), వరల్డ్ చాంపియన్‌షిప్ (మొత్తం 16 పతకాలు) కలిపి ఓవరాల్‌గా 24 పతకాలతో షెల్లీ తనకంటూ ప్రత్యేక చరిత్ర సృష్టించుకుంది.

బోల్ట్‌కు దీటుగా...

దశాబ్ద కాలం పాటు మహిళల విభాగంలో ట్రాక్‌ను షెల్లీ శాసించింది. కరీబియన్ దేశాల తరఫున ఒలింపిక్ స్వర్ణం గెలిచిన తొలి మహిళగా నిలిచిన ఆమె, ప్రపంచ వ్యాప్తంగా అధికారికంగా గుర్తింపు పొందిన 276 రేస్‌లలో పాల్గొని అథ్లెటిక్స్ అభిమానులకు చేరువైంది. కెరీర్‌లో రంగురంగుల హెయిర్ స్టయిల్‌లతో బరిలోకి దిగుతూ ఆటతో పాటు ఇతరత్రా కూడా అనేక ఆకర్షణలు ప్రదర్శించిన ఆమె టోక్యోలో తన ఆఖరి రేసులో కూడా జమైకా జాతీయ రంగులు ఆకుపచ్చ, పసుపు కలగలిపిన జుట్టు, నెయిల్ పాలిష్‌తో బరిలోకి దిగి అలరించింది. అద్భుతమైన ప్రదర్శనల తర్వాత కొన్నిసార్లు వెనుకబడినా... కోలుకొని షెల్లీ మళ్లీ పైకెగసిన తీరు, తాను అనుకున్న విధంగా కెరీర్‌ను ముగించడం యువ మహిళా అథ్లెట్లకు ప్రేరణగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. జమైకాకే చెందిన అథ్లెటిక్స్ దిగ్గజం బోల్ట్ తన పరుగుతో ప్రపంచాన్ని ఊపేస్తున్న సమయంలోనే షెల్లీ అంతర్జాతీయ ప్రస్థానం కూడా సాగింది. బోల్ట్‌కు సమాంతరంగా పతకాలు గెలవడంతో పాటు తనకంటూ జమైకా స్టార్‌గా ప్రత్యేక అధ్యాయాన్ని రచించుకోవడంలో సఫలమైంది.

మూడు సార్లూ పతకాలతో...

కనీస సౌకర్యాలు కూడా కరువైన పేద కుటుంబంతో పుట్టిన షెల్లీ చిన్నతనంలోనే తండ్రి దూరమయ్యాడు. ఇద్దరు సోదరులతో పాటు ఆమె తల్లి వీధిలో చిన్న చిన్న వస్తువులు అమ్మేది. అలాంటి నేపథ్యం నుంచి వచ్చి ఈ స్థాయికి ఎదగడం షెల్లీ ఘనతకు తార్కాణం. కోచ్‌ల మాటల**ో చెప్పాలంటే అథ్లెటిక్స్‌లో సహజ ప్రతిభతో** ఆమె దూసుకుపోగలిగింది. **పాఠశాల స్థాయిలోనే ఆమె** పరుగు అందరి **దృష్టినీ ఆకర్షించిన తర్వాత వేర్వేరు దశల్లో** వరుసగా సత్తా **చాటుతూ తనను తాను రుజువు చేసుకుం**ది. 2008 బీజింగ్ **ఒలింపిక్స్‌లో 100 మీటర్ల పరుగులో** పాల్గొన్నప్పుడు **ఫైనల్‌కు చేరితే చాలని అనుకుంది. ఎలా**ంటి అంచనాలు లేకపోవడమే ఆమెకు మేలు చేసింది. ఎదురు లేకుండా దూసుకుపోయి స్వర్ణం సాధించడంతో షెల్లీ పేరు మారుమ్రోగిపోయింది. 2012 లండన్ ఒలింపిక్స్ వచ్చేసరికి ఆమె అప్పటికే స్టార్‌గా మారిపోయింది. గత కాలపు దిగ్గజం ఫ్లారెన్స్ గ్రిఫిత్ జాయ్‌నర్ సరసన ఆమెను చేర్చి అంతా ఆమె ప్రదర్శన కోసం ఎదురు చూశారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ షెల్లీ మరో పసిడిని గెలుచుకుంది. 2016 రియో ఒలింపిక్స్‌లో సెమీఫైనల్ తర్వాతే కాలి గాయం ఇబ్బంది పెట్టడంతో చివరకు కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే రిలేలో జమైకా జట్టుకు రజతం అందించింది.

పునరాగమనం ఘనంగా...

రియో ఒలింపిక్స్ తర్వాత కెరీర్ మాత్రమే కాకుండా వ్యక్తిగత జీవితంలో కూడా బిజీ అయింది. 2017లో కొడుకు పుట్టిన తర్వాత తన ప్రాధాన్యతలు మారిపోయాయని ఆమె చెప్పుకుంది. ఆమె ఆటకు గుడ్‌బై చెప్పినట్లేనని అంతా భావించారు. అయితే ‘మామీ రాకెట్’గా కొత్త గుర్తింపు తెచ్చుకున్న తర్వాత కూడా ట్రాక్‌పై షెల్లీ జోరు సాగింది. సిజేరియన్ ఆపరేషన్ తర్వాత మూడు నెలల పాటు ప్రత్యేకంగా ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి ఫ్రేజర్ పునరాగమనం చేసింది. అమ్మగా మారిన తర్వాత కూడా వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ఏకంగా 3 స్వర్ణాలు, 3 రజతాలు, మరో కాంస్యం గెలవడం ఆమె సత్తాకు నిదర్శనం. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కూడా 100 మీటర్ల పరుగులో రజతాన్ని సాధించి తనలో పదును తగ్గలేదని నిరూపించింది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో 200 మీటర్లకు దూరంగా ఉంటానని ముందే చెప్పిన ఆమె... 100 మీటర్లలో పతకం గెలిచి తప్పుకోవాలని భావించింది. అయితే అనూహ్యంగా గాయంతో సెమీస్‌కు ముందు తప్పుకోవాల్సి వచ్చింది. దాంతో రిటైర్మెంట్‌ను ఏడాది పాటు వాయిదా వేసి షెల్లీ ఇప్పుడు నిష్క్రమించింది. తాను సంతృప్తిగా తప్పుకుంటున్నానని, ఇన్ని ఘనతల తర్వాత ఎలాంటి చింతా లేదని ఈ జమైకా స్టార్ వ్యాఖ్యానించింది.




‘అమ్మ’గా గెలిచి...

కొన్నాళ్ల క్రితం షెల్లీ కొడుకు, ఎనిమిదేళ్ల జ్యోన్ ఆమె వద్దకు వచ్చి... ‘అమ్మా... మా స్కూల్‌లో స్టూడెంట్స్ తల్లుల కోసం పరుగు పందెం పెడుతున్నారు. నువ్వు తప్పనిసరిగా పాల్గొనాల్సిందే’ అని కోరాడు. తాను ఇందులో పాల్గొనడం ఏమిటి అని సందేహించినా కొడుకు మీద ప్రేమతో కాదనలేకపోయింది. వరల్డ్ చాంపియన్ పోటీలో ఉంటే తిరుగేముంది! రేసు మొదలు కాగానే సహజంగానే ఎవరికీ అందనంత వేగంతో షెల్లీ దూసుకుపోయి విజేతగా నిలిచింది. ఆ గెలుపులో బిడ్డ ఆనందం చూసి మురిసిపోయింది. ‘వాళ్లు నన్ను అనుమతిస్తారనే అసలు అనుకోలేదు. అయినా వారికీ అవకాశం ఉందని ఇతర పిల్లలు తల్లులు భావించడమే నాకు అమితాశ్చర్యం కలిగించింది’ అని ఆమె చెప్పింది.



కొన్‌స్టాస్ సెంచరీ

- ఆస్ట్రేలియా ‘ఎ’ 337/5
- మెరిసిన క్యాంప్‌బెల్, కూపర్
- హర్ష్ దూబేకు 3 వికెట్లు
- భారత ‘ఎ’ జట్టుతో అనధికారిక టెస్టు


కొన్‌స్టాస్

లక్నో: యువ ఓపెనర్ స్యామ్ కొన్‌స్టాస్ (144 బంతుల్లో 109; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగడంతో ఆస్ట్రేలియా ‘ఎ’ జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. భారత ‘ఎ’ జట్టుతో అనధికారిక టెస్టు సిరీస్‌లో భాగంగా మంగళవారం ప్రారంభమైన తొలి మ్యాచ్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా ‘ఎ’ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 73 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. ఒకవైపు సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత క్రికెట్ జట్టు యూఏఈ వేదికగా ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌లో పాల్గొంటుండగా... మరోవైపు యువ ఆటగాళ్లు ఆస్ట్రేలియా ‘ఎ’తో నాలుగు రోజుల టెస్టు మ్యాచ్ ఆడుతున్నారు. ఈ జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా... సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, ప్రసిధ్ కృష్ణ, ఖలీల్ అహ్మద్ వంటి వాళ్లు బరిలో ఉన్నారు. లక్నో వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా ‘ఎ’ జట్టు భారత పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొంది. టీమిండియాపై టెస్టు అరంగేట్రం చేసిన కొన్‌స్టాస్ సెంచరీతో కదంతొక్కగా... క్యాంప్‌బెల్ కెల్లావే (97 బంతుల్లో 88; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), కూపర్ కనొల్లీ (84 బంతుల్లో 70; 12 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. తొలి వికెట్‌కు 198 పరుగులు జోడించిన అనంతరం క్యాంపెబెల్ అవుట్ కాగా.. ఈ దశలో భారత బౌలర్లు కాస్త పోరాటం కనబర్చారు. కెప్టెన్ నాథన్ మెక్‌స్వీనీ (1), ఒలీవర్ పీక్ (2)ను వెంట వెంటనే ఔట్ చేశారు. దీంతో ఆస్ట్రేలియా ‘ఎ’ జట్టు 198/0 నుంచి 224/4కు చేరింది. ఇక పట్టు చేజిక్కించుకోవడమే తరువాయి అనుకుంటుంటే... కూపర్ కనొల్లీ, లియామ్ స్కాట్ (79 బంతుల్లో 47 బ్యాటింగ్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) పట్టుదల కనబర్చారు. ఈ జంట ఐదో వికెట్‌కు 109 పరుగులు జోడించింది. ప్రసిధ్ కృష్ణ (0/47), ఖలీల్ అహ్మద్ (1/46) పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో... ఆసీస్ ప్లేయర్లు స్వేచ్ఛగా పరుగులు రాబట్టారు. భారత బౌలర్లలో హర్ష్ దూబే 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. రంజీ ట్రోఫీ చరిత్రలో ఒకే సీజన్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా రికార్డుల్లోకెక్కిన దూబే... ఒక్కడే ఆసీస్ ప్లేయర్లను ఇబ్బంది పెట్టగలిగాడు. గుర్‌నూర్ బ్రార్ ఒక వికెట్ తీశాడు. తొలి రోజు 4.61 రన్‌రేట్‌తో పరుగులు రాబట్టిన ఆస్ట్రేలియా ‘ఎ’ జట్టును రెండో రోజు మనవాళ్లు ఎలా కట్టడి చేస్తారో చూడాలి. లియామ్ స్కాట్‌తో పాటు జోష్ ఫిలిప్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. వర్షం కారణంగా తొలి రోజు 73 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

వారియర్స్ విక్టరీ

యూపీ యోధాస్‌పై బెంగాల్‌దే పైచేయి



జైపూర్: వైఫల్యాలతో సతమతమవుతున్న మాజీ చాంపియన్ బెంగాల్ వారియర్స్... ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో ఎట్టకేలకు గెలుపుబాట పట్టింది. మంగళవారం జరిగిన పోరులో 41–37తో యూపీ యోధాస్‌పై గెలుపొందింది. 2019 సీజన్ చాంపియన్ వారియర్స్ నాలుగు వరుస పరాజయాల తర్వాత మళ్లీ విజయం సాధించింది. ఆరు మ్యాచ్‌లాడిన బెంగాల్‌కు ఇది రెండో విజయం మాత్రమే! ఈ మ్యాచ్‌లో వారియర్స్ కెప్టెన్ దేవాంక్ (17 పాయింట్లు) తన దైన శైలిలో రాణించాడు. మిగతా వారిలో ఆశిష్ (6), మన్‌ప్రీత్ (5), పార్థిక్ (3) మెరుగ్గా ఆడారు. యూపీ తరఫున రెయిడర్లు గగన్ గౌడ (7), గుమన్ సింగ్ (5), డిఫెండర్లు అశు సింగ్, హితేశ్ చెరో 4 పాయింట్లు స్కోరు చేశారు. రెండో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 35–29తో బెంగళూరు బుల్స్‌పై నెగ్గింది. తమిళ్ తరఫున అర్జున్ (13), నరేందర్ (5), రోనక్ (4) బాగా ఆడారు. నేడు జరిగే పోటీల్లో తెలుగు టైటాన్స్‌తో దబంగ్ ఢిల్లీ, హరియాణా స్టీలర్స్‌తో పట్నా పైరేట్స్ తలపడతాయి.

ప్రణీత్ నందన్‌కు కాంస్యం



సాక్షి, హైదరాబాద్: తైక్వాండో రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో కట్కూరి ప్రణీత్ నందన్ కాంస్య పతకంతో మెరిశాడు. అంతర్ జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్‌లో నందన్ మూడో స్థానంలో నిలిచాడు. జోగుళాంబ గద్వాల్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 8 ఏళ్ల నందన్ సబ్ జూనియర్ బాలుర 25 కేజీల విభాగంలో సత్తా చాటాడు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌కు చెందిన ప్రణీత్ నందన్... బోడుప్పల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ప్రణీత్ ఏడాది కాలంగా తైక్వాండో కోచ్ పితాని చైతన్య వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. గతంలో జిల్లా స్థాయి పోటీల్లో పసిడి పతకం సాధించిన నందన్... ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో కాంస్య పతకం సాధించాడు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో పతకాలు సాధించడమే తన లక్ష్యమని వెల్లడించాడు.

డ్రగ్స్ ముఠాలపై ఉక్కుపాదం

- యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ సదస్సులో హోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ
- డ్రగ్స్ కట్టడికి త్రిముఖ వ్యూహం అనుసరించాలని అధికారులకు దిశానిర్దేశం


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న హోం మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ: విదేశాల్లో దాక్కొని భారత్‌లో మాదకద్రవ్యాల వ్యాపారం సాగిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపి చట్టం ముందుకు తేవాల్సిన అవసరం ముందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. దేశం నుంచి అన్ని రకాల డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రా పాలిత ప్రాంతాలకు చెందిన యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ (ఏఎన్‌టీఎఫ్) అధిపతులతో మంగళవారం ఢిల్లీలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఏర్పాటు చేసిన రెండు రోజుల రెండవ జాతీయ సదస్సును అమిత్ షా ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాన్ షాపులు లేదా కియోస్కుల ద్వారా డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తూ చిన్నచిన్న ప్యాకెట్లలో డ్రగ్స్‌ను విక్రయిస్తున్న ముఠాలపై అత్యంత కఠిన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డ్రగ్స్‌పై పోరాటంలో త్రిముఖ వ్యూహం అనుసరించాలని ఆయన సూచించారు. 'డ్రగ్స్ సరఫరా కట్టడికి అణచివేత వైఖరి అవలంబించాలి. అలాగే డ్రగ్స్‌కు డిమాండ్‌ను తగ్గించేందుకు వ్యూహాత్మక వైఖరిని అనుసరించాలి. డ్రగ్స్ ముప్పును తగ్గించేందుకు మానవీయ వైఖరితో ముందుకెళ్లాలి' అని అమిత్ షా సూచించారు. 2047 నాటికి భారత్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతూ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన, గొప్ప దేశంగా నిలపాలని ప్రధాని మోదీ లక్ష్యం నిర్దేశించుకున్నారు. దీన్ని సాధించేందుకు దేశమంతా భద్రంగా ఉండాలి. డ్రగ్స్ మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టేందుకు మోదీ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందని చెప్పారు. వికసిత్ భారత్ దిశగా ముందడుగు వేసేందుకు యువతే మన ఆశాకిరణమని.. యువత తలుచుకుంటే ఏదీ అసాధ్యం కాదని చెప్పారు. విదేశాల నుంచి డ్రగ్స్ రాకెట్‌ను నడిపిస్తున్న ముఠాలను చట్టం ముందు నిలబెట్టే సమయం ఆసన్నమైందని అమిత్ షా అన్నారు. 'ఈ విషయంలో సీబీఐ ఎంతో మంచిపని చేసింది. ఏఎన్‌టీఎఫ్ అధిపతులకు నేను చేస్తున్న విజ్ఞప్తి ఒక్కటే. సీబీఐ సహకారం తీసుకొని విదేశాల నుంచి డ్రగ్స్ దందాకు పాల్పడుతున్న నేరస్తులను స్వదేశానికి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టండి. ఈ చర్య నార్కోటిక్స్ గ్యాంగ్‌లను నాశనం చేయడంతోపాటు ఉగ్రవాద ముఠాల ధ్వంసానికి సైతం దోహదపడుతుంది' అని అమిత్ షా చెప్పారు. అయితే సంబంధిత అధికారులంతా తీర్మానించుకున్నప్పుడే డ్రగ్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపడం సాధ్యమవుతుందన్నారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో రూ. 40 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంటే తమ ఎన్డీయే ప్రభుత్వం గత పదేళ్లలోనే ఏకంగా రూ. 1.65 లక్షల కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుందన్నారు. కాగా, దేశవ్యాప్తంగా స్వాధీనం చేసుకున్న సుమారు రూ. 4,794 కోట్ల విలువైన 1.37 లక్షల కిలోల మత్తుపదార్థాలను ధ్వంసం చేసే ప్రక్రియను అమిత్ షా ఈ సదస్సు సందర్భంగా లాంఛనంగా ప్రారంభించారు.


రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో సమావేశమైన మారిషస్ ప్రధాని రామ్‌గులామ్

భారత విదేశాంగ విధానంలో మారిషస్‌కు ప్రత్యేక స్థానం

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

న్యూఢిల్లీ: మన దేశంలో పర్యటిస్తున్న మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులామ్ మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. ఇరువురు నేతలు ద్వైపాక్షిక సహకారంపై చర్చించారు. అంతరిక్ష రంగం, డిజిటల్ సాంకేతికత సహా పలు నూతన రంగాలకు సహకారం విస్తరించిందని చెప్పారు. అంతకుముందు, రామ్‌గులామ్‌ను రాష్ట్రపతి భవన్ వద్ద ముర్ము ఆహ్వానించారు. భారత విదేశాంగ విధానంలో మారిషస్‌కు ప్రత్యేక స్థానముందని చెప్పారు. మారిషస్‌లో ఆస్పత్రులు, రహదారులు, నౌకాశ్రయం అభివృద్ధి, రక్షణ ఉత్పత్తులు, ఉమ్మడి నిఘాకు సంబంధించిన ప్రాజెక్టుల అమలుతో విస్తరణ రానున్న రోజుల్లో ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావం చూపిస్తుందని రాష్ట్రపతి ముర్ము చెప్పారు. రెండు దేశాల మధ్య సంబంధాలు ప్రత్యేకం, చారిత్రకమైనవన్నారు. కాగా, ఈ నెల 9వ తేదీన భారత్‌కు వచ్చిన మారిషస్ ప్రధాని రామ్‌గులామ్ ప్రధాని మోదీతో చర్చలు జరిపారు. ముంబైలో వాణిజ్య వేత్తలతో సమావేశమయ్యారు. వారణాసి, తిరుపతి, అయోధ్య పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. ఇలా ఉండగా, మారిషస్ ప్రధాన మంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులామ్ మంగళవారం కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను కలుసుకున్నారు. రెండు దేశాల మధ్య మైత్రి, ద్వైపాక్షిక సంబంధాలు, ఉమ్మడి భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చలు జరిపారు.

హైకోర్టుల్లో జడ్జీల నియామకాలకు సుప్రీం కొలీజియం ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని కొలీజియం మంగళవారం ఐదు హైకోర్టుల్లో జడ్జీల తాజా నియామకానికి ప్రతిపాదనలు పంపింది. కొలీజియంలో సీజేఐతోపాటు జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్ ఉన్నారు. సోమవారం వీరు సమావేశమై ఐదు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ హైకోర్టుకు చెందిన సీనియర్ లాయర్లు జియా లాల్ భరద్వాజ్, రొమేశ్ వర్మలను జడ్జీలుగా నియమించడం ఇందులో ఒకటి. కర్ణాటక హైకోర్టుకు చెందిన ముగ్గురు న్యాయాధికారులు గీతా కదబ భారతరాజా షెట్టి, మురళీధర పాయ్ బొర్కట్టె, త్యాగరాజ నారాయణ్ ఇనవల్లిలకు జడ్జీలుగా పదోన్నతి కల్పించడం. అదేవిధంగా, అదనపు జడ్జిగా కొనసాగుతున్న జస్టిస్ కురుబరహల్లి వెంకటరామిరెడ్డి అరవింద్‌కి, కర్నాటక హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించడం ఇందులో ఉన్నాయి. త్రిపుర హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా ఉన్న బిశ్వజిత్ పాలిత్‌ను శాశ్వత జడ్జిగా నియమించడం, మద్రాస్ హైకోర్టులో అదనపు జడ్జీలుగా ఉన్న సెంథిల్ కుమార్, అరుల్ మురుగన్‌లకు శాశ్వత జడ్జీలుగా పదోన్నతి కల్పించడం కూడా ఉంది.

ఆలయాల్లో భక్తులిచ్చే కానుకలు వివాహ మంటపాల నిర్మాణానికి కాదు

న్యూఢిల్లీ: ఆలయాలకు భక్తులిచ్చే కానుకలు వివాహ మంటపాల నిర్మాణానికి కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆలయ నిధులు ప్రజల, ప్రభుత్వ నిధులు కావని స్పష్టం చేసింది. ఈ విషయంలో మద్రాస్ హైకోర్టులోని మదురై ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. తమిళనాడులోని ఐదు ఆలయాల్లో భక్తులు సమర్పించిన కానుకలతో కల్యాణ మంటపాలను నిర్మించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని కొట్టివేస్తూ మదురై ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. కల్యాణ మంటపాలు మత పరమైన ప్రయోజనం అనే కేటగిరీ కిందికి రాదని పేర్కొంది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం విచారించిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం పైవిధంగా తీర్పు వెలువరించింది. దేవాలయం అభివృద్ధి కోసం, విద్య, వైద్య సంస్థలు కోసం కానుకలను వినియోగించుకోవచ్చని పేర్కొంది. ఈ కేసుపై నవంబర్ 19వ తేదీన తదుపరి విచారణ చేపడతామంది.

మత మార్పిడి వ్యతిరేక చట్టాలపై రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: మత మార్పిడి నిరోధక చట్టాలపై స్టే ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్లపై వైఖరి తెలియజేయాలంటూ సుప్రీంకోర్టు మంగళవారం పలు రాష్ట్రాలను కోరింది. రాష్ట్రాల నుంచి సమాధానాలు అందిన తర్వాత సంబంధిత చట్టాలపై స్టే ఇచ్చే విషయం పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం తెలిపింది. నాలుగు వారాల్లోగా సమాధానం తెలపాలని, ఆ తర్వాత రెండు వారాల్లోగా రీజాయిండర్లను దాఖలు చేయాలని పిటిషనర్లను కోరింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హరియాణా, జార్ఖండ్, కర్నాటక రాష్ట్రాల్లో అమలవుతున్న మత మార్పిడి వ్యతిరేక చట్టాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం పై ఆదేశాలిచ్చింది.

మహారాష్ట్ర ఎన్నికల కమిషన్‌పై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: తమ ఉత్తర్వులను బేఖాతరు చేసిన మహారాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సుప్రీంకోర్టు తలంటింది. 2022 నుంచి స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించకపోవడంపై మండిపడింది. జిల్లా పరిషత్‌లు, పంచాయతీ సమితులు సహా అన్ని స్థానిక సంస్థల ఎన్నికలను 2026 జనవరి 31వ తేదీలోగా ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ విషయంలో ఎటువంటి పొడిగింపులు ఉండబోవని స్పష్టం చేసింది. రాష్ట్రంలో నిలిచిపోయిన స్థానిక సంస్థల ఎన్నికలను నిర్దేశిత కాలపరిమితి లోగా నిర్వహించాలన్న నిబంధనను పాటించనందుకు మండిపడింది. ఏదైనా ఇబ్బంది తలెత్తితే 2025 అక్టోబర్ 31వ తేదీలోగా పిటిషన్ వేయాలని కోరింది. డీలిమిటేషన్ ప్రక్రియను కూడా అక్టోబర్ 31వ తేదీలోపే పూర్తి చేయాలంది. ఆ తర్వాత రవాణాపరమైన అడ్డంకులు, ఈవీఎంల కొరత ఏర్పడిందంటూ సాకులు చెప్పరాదని జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీల ధర్మాసనం తేల్చి చెప్పింది.

ఇది పబ్లిసిటీ ఇంటరెస్ట్ లిటిగేషన్: సుప్రీం

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లోని ఖజురహో గుహల్లో గతంలో ఉన్న మహా విష్ణువు విగ్రహాన్ని తిరిగి అక్కడే ప్రతిష్టించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఖజురహో సముదాయంలోని జవారీ ఆలయంలో గతంలో ఏడడుగుల విగ్రహం ఉండేదని పిటిషన్ పేర్కొన్నారు. విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ 'ఇదో పబ్లిసిటీ ఇంటరెస్ట్ లిటిగేషన్' అని అభివర్ణించారు. విష్ణు భక్తుడని చెప్పుకుంటున్న పిటిషనర్ రాకేశ్ దలాల్ ధ్యానం చేసి ఆ దేవుడినే ఏం చేయాలో అడగాలన్నారు. ఖజురహోలో అతిభారీ శివలింగం కూడా ఉందని, ఇష్టమైతే అక్కడా పూజ చేసుకోవచ్చన్నారు. తలభాగం దెబ్బతిన్న విగ్రహాన్ని పునర్నిర్మాణం చేయించేలా ఆదేశాలివ్వాలని, గతంలో పలుమార్లు కేంద్ర హోం శాఖకు ఏఎస్‌ఐని కోరినా ఫలితం లేదని పిటిషనర్ తరఫు లాయర్ కోరారు. ఆ విషయం తమ పరిధిలోనిది కాదని, పురాతత్వ శాఖ చూసుకుంటుందని సీజేఐ అన్నారు. ఆ శాఖ అనుమతివ్వడం వంటి అనేక అంశాలకు దీనితో సంబంధముందని ఆయన చెప్పారు.

తండ్రి బ్యాంక్ అక్కౌంట్‌లోని రూ.14 లక్షలను ఆన్‌లైన్ గేమ్‌లో కోల్పోయి.. బాలుడి ఆత్మహత్య

లక్నో: ఆన్‌లైన్ గేమ్‌కు బానిసగా మారిన ఓ 13 ఏళ్ల బాలుడు తండ్రి బ్యాంకు ఖాతాలోని మొత్తం రూ.14 లక్షలను పోగొట్టాడు. కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలిసిందని మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. యూపీ రాజధాని లక్నోలో ఘటన చోటుచేసుకుంది. మోహన్‌లాల్‌గంజ్ ప్రాంతానికి చెందిన సురేశ్ యాదవ్ సోమవారం బ్యాంకు వెళ్లి తన అక్కౌంట్ నుంచి రూ.20 వేలు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించారు. అయితే, ఆయన అక్కౌంట్‌లో బ్యాలెన్స్ లేనే లేదని బ్యాంకు సిబ్బంది తెలిపారు. దీంతో, హతాశుడై ఇంటికి చేరుకున్న సురేశ్ యాదవ్..కుటుంబసభ్యులకు ఈ విషయం తెలిపారు. నీ కోసం నేను కష్టపడుతుంటే..నువ్వేమో ఇలాంటి తప్పు చేశావు' అని కుమారుడు యశ్‌తో అన్నారు. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేసేందుకని బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో యశ్ చదువుకునేందుకంటూ పై అంతస్తుకు వెళ్లి ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత అతడి సోదరి చూసి కుటుంబసభ్యులను అప్రమత్తం చేసింది. యశ్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చదువులో ఎప్పుడూ ముందుండే తన కుమారుడు ఇక లేడని తెలిసి సురేశ్ గుండెలవిసేలా రోదిస్తున్నారు. రూ.14 లక్షలు పోగొట్టుకున్నా తనని ఏమీ అనలేదన్నారు.

జెన్ జడ్ నిరసనల మృతులకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

కాఠ్మండు: ఇటీవల జెన్ జడ్ నిరసనల సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో నలుగురికి మంగళవారం నేపాల్ రాజధాని కాఠ్మండులోని పశుపతి ఆర్యఘాట్‌లో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మరో ఆరుగురి మృతదేహాలను సంబంధీకులు తమ సొంత ప్రాంతాలకు తీసుకెళ్లారు. అంత్యక్రియల్లో మృతుల కుటుంబీలతోపాటు మంత్రులు కుల్మాన్ ఘీసింగ్, ఓం ప్రకాశ్ అర్యాల్ పాల్గొన్నారు. కాఠ్మండులోని త్రిభువన్ యూనివర్సిటీ బోధనాస్పత్రి నుంచి ప్రారంభమైన అంతిమయాత్రలో ప్రజలు వేలాదిగా పాలుపంచుకున్నారు. ఈ నెల 8, 9వ తేదీల్లో జెన్ జడ్ నిరసనల సందర్భంగా జరిగిన ఘటనల్లో ప్రాణాలు పోగొట్టుకున్న వారిని మృతవీరులుగా ప్రధాని సుశీలా కర్కి ప్రకటించడం తెల్సిందే. వీరి కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారం అందజేస్తామన్నారు. మృతుల కోసం బుధవారం సంతాపదినంగా ప్రకటించారు. జాతీయ జెండాను అవనతం చేస్తారు. రెండు రోజులపాటు కొనసాగిన తీవ్ర నిరసనల్లో ముగ్గురు పోలీసులు, 10 మంది ఖైదీలు సహా 72 మంది ప్రాణాలు కోల్పోయారు. కేపీ శర్మ ఓలి సారథ్యంలోని ప్రభుత్వం గద్దెదిగింది. కాగా, జెన్ జడ్ ఆందోళనలతో వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసేందుకు పలువురు మంత్రులు సహా యంత్రాంగం రంగంలోకి దిగింది. తగులబడిన కార్లు, దెబ్బతిన్న సామగ్రి, ఇతర ఆస్తుల వివరాలను నమోదు చేసుకుంటున్నారు.

ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ కుటుంబం చిన్నాభిన్నం

జైషే మొహమ్మద్ కమాండర్ మసూద్ ఇల్యాస్ కశ్మీరీ వెల్లడి

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారం భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు చావుదెబ్బ తగిలింది. కరడుగట్టిన ఉగ్రవాద సంస్థ జైషే మొహమ్మద్ అధినేత మసూద్ అజార్‌కు పూడ్చలేని నష్టం వాటిల్లింది. ఈ ఆపరేషన్‌లో ఆయన కుటుంబ సభ్యులు హతమయ్యారు. భారత సైనిక చర్య వల్ల మసూద్ అజార్ కుటుంబం ముక్కలైపోయిందని జైషే మొహమ్మద్ అగ్రశ్రేణి కమాండర్ మసూద్ ఇల్యాస్ కశ్మీరీ వెల్లడించారు. మే 7వ తేదీన బహవల్పూర్‌లోని జైషే ప్రధాన కార్యాలయం 'జామియా మసీద్ సుభాన్ అల్లా'పై భారత సైన్యం నిప్పులు వర్షం కురిపించింది. అక్కడే తలదాచుకుంటున్న మసూద్ అజార్ కుటుంబ సభ్యులు మృతిచెందారని, అన్నింటినీ త్యాగం చేసిన తర్వాత ఆయన కుటుంబం చిన్నాభిన్నమైందని మసూద్ ఇల్యాస్ కశ్మీరీ తాజాగా ఓ వీడియోలో పేర్కొన్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో మసూద్ ఇల్యాస్ కశ్మీరీ చుట్టూ అతడి భద్రతా సిబ్బంది కనిపిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ అజార్‌కు జరిగిన నష్టంపై జైషే మొహమ్మద్ సంస్థ స్పందించడం ఇదే మొదటిసారి.

10 మంది కుటుంబ సభ్యులు మృతి

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్ భూభాగంలోని బహవల్పూర్‌తోపాటు మరో ఎనిమిది చోట్ల ఉగ్రవాద శిబిరాలు, శిక్షణా కేంద్రాలను భారత సైన్యం నేటమట్టం చేసింది. పాక్‌లో 12వ అతిపెద్ద నగరం బహవల్పూర్. ఇది లాహోర్‌కు 400 కిలో మీటర్ల దూరంలో ఉంది. మసూద్ అజార్ తన కార్యకలాపాలు ఇక్కడి నుంచే కొనసాగిస్తున్నాడు. జైషే మొహమ్మద్ ప్రధాన కేంద్రాన్ని బహవల్పూర్‌లోనే ఏర్పాటు చేసుకున్నాడు. ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తుంటాడు. ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ అజార్ కుటుంబంలో 10 మంది మరణించారు. అతడి సోదరి, బావ, మేనల్లుడు, మేనకోడలు సహా మరికొందరు మృతిచెందారు. అంతేకాకుండా నలుగురు సహాయకులు సైతం అంతమయ్యారు. 'జామియా మసీద్ సుభాన్ అల్లా' చాలావరకు ధ్వంసమయ్యింది. అయితే, ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ అజార్‌కు కలిగిన నష్టం గురించి పాకిస్తాన్ ప్రభుత్వం అధికారికంగా స్పందించలేదు. అతడి కుటుంబ సభ్యుల అంత్యక్రియలు మే నెలలో బహవల్పూర్‌లోనే జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు, విదేశీ మీడియా ప్రతినిధులు బయటపెట్టారు. మసూద్ అజార్ బయట జనం మధ్య కనిపించడం చాలా అరుదు. ఎప్పుడైనా కనిపించినా నిమిషాల వ్యవధిలోనే అజ్ఞాతంలోకి వెళ్లిపోతుంటాడు. ప్రాణాలు ముప్పు ఉండడంతో భద్రత కోసం గోప్యత పాటిస్తుంటాడు.


దాడుల్లో నేలమట్టమైన భవనం


మసూద్

మసూద్ అజార్ ఎక్కడున్నాడు?

మసూర్ అజార్‌ను ఐక్యరాజ్యసమితి ఉగ్రవాదిగా గుర్తించింది. భారత్‌లో 2016లో జరిగిన పఠాన్‌కోట్, 2019లో జరిగిన పుల్వామా దాడితోపాటు పలు ఉగ్రవాద దాడుల వెనుక మాస్టర్‌మైండ్ అతడే. ఈ మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది పాకిస్తాన్‌లోనే మకాం వేశాడన్నది బహిరంగ రహస్యమే. చివరిసారిగా పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని గిల్గిత్–బాల్టిస్తాన్‌లో కనిపించాడు. పర్యాటక క్షేత్రమైన స్కర్దూలో జనం ముందుకు వచ్చాడు. అయితే, మసూద్ అజార్ ప్రస్తుతం అఫ్గానిస్తాన్‌లో ఉండొచ్చని పాక్ విదేశాంగ శాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ చెప్పారు. అయితే, పాకిస్తాన్ సైన్యం రక్షణ మధ్య మసూద్ అజార్ నిక్షేపంగా ఉన్నాడని భారత నిఘా సంస్థలు చెబుతున్నాయి. 1999లో డిసెంబర్‌లో భారత విమానాన్ని హైజాక్ చేసి, భారత ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి పాకిస్తాన్ ఉగ్రవాదులు విడిపించుకున్న ముష్కరుల్లో ముఖ్యుడు మసూద్ అజార్.

ఊతప్ప, యువరాజ్, సోనూసూద్‌కు ఈడీ సమన్లు

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో విచారణకు హాజరుకావాలని ఆదేశం

న్యూఢిల్లీ: చట్టవిరుద్ధ ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యవహారంలో మనీలాండరింగ్ కోణంపై చేపట్టిన దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా వన్‌ఎక్స్ బెట్ అనే ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫాం తరఫున ప్రచారం చేపట్టిన మాజీ క్రికెటర్లు రాబిన్ ఊతప్ప, యువరాజ్‌సింగ్, బాలీవుడ్ నటుడు సోనూ సూద్‌కు తాజాగా సమన్లు జారీ చేసింది. ఢిల్లీలోని తమ కేంద్ర కార్యాలయం ఎదుట విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని ఆదేశించింది. ఈ నెల 22న ఊతప్ప, 23న యువరాజ్‌సింగ్ 24న సోనూసూద్ హాజరుకావాలని సమన్లలో పేర్కొంది. ఈ వ్యవహారంలో ఈడీ ఇప్పటికే మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌తోపాటు తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎంపీ, నటి మిమి చక్రబర్తిని ప్రశ్నించింది. మరోవైపు బెంగాలీ నటుడు అంకుష్ హజ్రా మంగళవారం ఈ కేసు విచారణకు హాజరవగా భారత్‌లో వన్‌ఎక్స్ బెట్ ప్లాట్‌ఫామ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా ఇంకా విచారణకు హాజరు కావాల్సి ఉంది. రాబోయే రోజుల్లో మరికొందరు క్రీడాకారులు, సినీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, ప్రముఖులను సైతం ఈడీ ప్రశ్నించే అవకాశం ఉంది. ఈ బెట్టింగ్ సంస్థ ఆయా ప్రముఖులను ప్రచారం కోసం సంప్రదించిన విధానం, వారికి జరిపిన చెల్లింపులు హవాలా ద్వారానా లేదా బ్యాంకుల ద్వారానే అనే విషయాలను విచారణలో ఈడీ తెలుసుకోవాలని భావిస్తోందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అలాగే దేశంలో ఆన్‌లైన్ బెట్టింగ్ చట్టవిరుద్ధమన్న విషయం ఆయా ప్రముఖులకు తెలుసో లేదో అనే విషయాన్ని కూడా ఈడీ తెలుసుకోనుందని పేర్కొన్నాయి. వన్‌ఎక్స్ బెట్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలతోపాటు సంబంధిత ఈ–మెయిల్స్ వివరాలను సమర్పించాలని ఈడీ ఆయా ప్రముఖులను ఆదేశించినట్లు తెలిసింది. పీఎంఎల్ఏ నిబంధనల ప్రకారం నేరం తాలూకు సొమ్ము అంతిమంగా సెలబ్రిటీలకు చేరిందో లేదో తెలుసుకోవాలని ఈడీ భావిస్తున్నట్లు సమాచారం. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌కు సంబంధించిన మరో కేసును దర్యాప్తు చేస్తున్న ఈడీ హైదరాబాద్ విభాగం ఇప్పటికే టాలీవుడ్ నటులు దగ్గుబాటి రాణా, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి తోపాటు మరికొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే చట్టం ద్వారా డబ్బు పెట్టి ఆడే ఆన్‌లైన్ గేమ్స్‌పై నిషేధం విధించడం తెలిసిందే. కేంద్రం నిషేధం విధించక ముందు దేశవ్యాప్తంగా సుమారు 22 కోట్ల మంది యూజర్లు వివిధ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లలో రిజిస్టర్ అయి ఉండగా వారిలో దాదాపు 11 కోట్ల మంది తరచూ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు అంచనా. దేశంలో ఆన్‌లైన్ బెట్టింగ్ మార్కెట్ విలువ సుమారు 100 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని నిపుణులు అంచనా వేశారు.

'మాయా' పునరాగమనం..!

నాలుగేళ్ల అనంతరం.. వచ్చే నెలలో భారీ సభకు బీఎస్పీ ఏర్పాట్లు
- 2027 ఎన్నికల లక్ష్యాలను ప్రకటించనున్న బీఎస్పీ అధినేత్రి మాయావతి
- ఇప్పటికే 95 శాతం బూత్‌కమిటీల ఏర్పాటు పూర్తి
- పలువురు కీలక నేతలు పార్టీలో చేరతారని ప్రచారం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజకీయాలను ప్రభావితం చేయగల సత్తా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో తిరిగి తన బలాన్ని నిరూపించుకునేందుకు బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి సిద్ధమయ్యారు. 2027లో జరిగే ఎన్నికలకు తన పునరాగమనాన్ని ఘనంగా చాటేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ బూత్ కమిటీలను ఏర్పాటు చేసిన ఆమె, వచ్చే నెల 9న కాన్షీరాం వర్ధంతి సందర్భంగా భారీ బహిరంగ సభ ద్వారా ప్రజల్లోకి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దళిత, ముస్లిం, బ్రాహ్మణ వర్గాల్లో తనకున్న పాత ఇమేజ్‌ను తిరిగి పొందడమే లక్ష్యంగా ఈ సభ ఉంటుందని పార్టీ వర్గాలంటున్నాయి.

పాత ఛరిష్మా కోసం పాట్లు...

బహుజన నేత కాన్షీరాం వారసురాలిగా రాజకీయాల్లోకి వచ్చిన మాయావతి 1995, 1997, 2002, 2007లో నాలుగు మార్లు యూపీ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇందులో 2007లో 403 సీట్లకు గాను 206 సీట్లు సాధించి ఆమె సొంతంగానే పూర్తిస్థాయి మెజార్టీతో ముఖ్యమంత్రి అయ్యారు. రాష్ట్రంలో 22 శాతం ఎస్సీలు ఉంటే అందులో అత్యధికంగా 55 శాతం ఉన్న జాతవ్ కులం నుంచి వచ్చిన మాయావతికి ఆ వర్గంలో గట్టిపట్టుంది. 2007లో సోషల్ ఇంజినీరింగ్ పద్ధతిని అమలు చేసి, బ్రాహ్మణులను దళితులతో కలపడం ద్వారా మాయావతి పూర్తి మెజారిటీతో దూసుకు పోయేందుకు సాయపడింది. అనంతరం 2012 ఎన్నికల్లో బీఎస్పీ ఓడినప్పటికీ ఆమె గెలుచుకున్న 80 సీట్లలో 14 మంది దళిత వర్గాల వారు గెలిచారు. 2017 ఎన్నికలకు వచ్చేసరికి ఎస్సీలు ఎక్కువగా బీజేపీకి మొగ్గు చూపినా బీఎస్పీ ఓట్ల శాతం మాత్రం పెద్దగా తగ్గలేదు. గడిచిన నాలుగు ఎన్నికల్లో బీఎస్పీ సగటున 25.42 శాతం ఓట్లను సాధించగా, ఇందులో మెజార్టీ ఓట్లు ఎస్సీ వర్గాల నుంచే ఉన్నాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఎస్పీ 13 శాతం ఓట్లు పడినా కేవలం ఒక్క సీటు మాత్రమే లభించింది. ఈ పరిణామాలన్నీ బీఎస్పీ ఉనికిలో లేవన్న సందేశాన్ని పంపడంతో చాలా మంది నేతలు పార్టీని వీడారు. ఈ నేపథ్యంలో 2027 ఎన్నికలకు ముందే పార్టీని తిరిగి గాడిలో పెట్టాలని, అక్టోబర్ 9న ఐదు లక్షల మందితో నిర్వహించే సభ ద్వారా తన బలాన్ని చూపించాలని మాయావతి పట్టుదలతో ఉన్నారు. దీనికి సంబంధించి సన్నాహాలు క్షేత్ర స్థాయిలో జరుగుతున్నాయి. వార్డు స్థాయి సమావేశాలు జరిగాయి. మొత్తం కేడర్‌ను ఉత్తేజపరిచేలా నేతలు పర్యటనలు సాగుతున్నాయి. అక్టోబర్ 8 నుంచే లక్నోలోని రమాబాయి మైదాన్‌కు సుదూర జిల్లాల నుంచి మద్దతుదారులు రావడం ప్రారంభిస్తారని, చాలా ఏళ్ల తర్వాత మాయావతి ఈ సభలో ప్రసంగించబోతున్నారని బీఎస్పీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ గిరీష్ చంద్ తెలిపారు. తమకు పట్టున్న ఎస్సీ వర్గాలతో పాటు ముస్లిం, బ్రాహ్మణ, ఓబీసీ వర్గాలను ఏకం చేసేలా ఈ సభ ఉంటుందన్నారు. పార్టీలోకి తిరిగి తీసుకొని జాతీయ సమన్వయకర్తగా నియమితులైన ఆకాష్ ఆనంద్ సైతం ఈ సభను హిట్ చేయడం ద్వారా పార్టీకి కొత్త జవసత్వాలను అందించాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఆయన ఇప్పటికే యూపీ అంతా తిరుగుతూ బూత్ స్థాయి కమిటీల ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. ఇప్పటికే 95 శాతం కమిటీలు పూర్తి చేశారు. ఈ సభలోనే సమాజ్‌వాదీ పార్టీ, బీజేపీ, కాంగ్రెస్, నిషాద్ పార్టీతో సహా అనేక పార్టీల సీనియర్ నాయకులు బీఎస్పీలో చేరవచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి. ఎస్పీ నేత ఆజం ఖాన్, బీజేపీకి చెందిన స్వామి ప్రసాద్ మౌర్య రాజ్‌భర్ వర్గానికి చెందిన ఓం ప్రకాష్ రాజ్‌భర్, సంజయ్ నిషాద్, నసీముద్దీన్ సిద్దిఖీ వంటి నాయకులు బీఎస్పీ శిబిరంలో చేరుతారనే చర్చ జరుగుతోంది.

బిహార్‌లో సీట్ల పంపకాలపై 19న కీలక భేటీ?

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్‌లోని ప్రతిపక్ష ఇండియా కూటమిలో నెలకొన్న సీట్ల పంపకాల పంచాయితీని ఓ కొలిక్కి తెచ్చేందుకు కాంగ్రెస్ ఈ నెల 19న కీలక సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. ముఖ్యంగా మిత్రపక్షంగా ఉన్న ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఈ ఎన్నికల్లో మొత్తం 243 స్థానాల్లో పోటీలో ఉంటామన్న ప్రకటన నేపథ్యంలో కూటమిలో గందరగోళం పెరిగిన నేపథ్యంలో ఈ భేటీని తలపెట్టినట్లు తెలుస్తోంది. ఆరోగ్య సమస్యల కారణంగా చాలా కాలంగా దూరంగా ఉన్న ఆర్జేడీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి లాలు ప్రసాద్ ఈ సీట్ల చర్చల బాధ్యతను చేపట్టేందుకు రంగంలోకి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థుల జాబితాను సమర్పించాలని ఆయన కోరారని, ఆ పార్టీకి 50–52 సీట్లు కేటాయించేందుకు ప్రతిపాదనలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ పోటీ చేయాలనుకుంటున్న స్థానాలతో పాటు, పొత్తుల్లో భాగంగా మిత్రపక్షాలకు ఇచ్చే స్థానాలపై ఈ భేటీలో ఓ స్పష్టత తేవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఆర్జేడీ కోరుకుంటున్న ఓ 25 స్థానాలపై కాంగ్రెస్ సైతం పట్టుబడుతుండటంతోనే సమస్య ఉత్పన్నమవుతోందని, దీనిపై ఓ నిర్ణయానికి రావాల్సి ఉందని ఏఐసీసీ నేత ఒకరు తెలిపారు.

ఆర్‌జేడీని ఆహ్వానించిన కాంగ్రెస్

ఇక ప్రస్తుత కూటమిలో వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ)తో పాటు, 2020లో 19 సీట్లలో పోటీ చేసి 12 గెలుచుకున్న సీపీఐ(ఎంఎల్)లు ఇప్పుడు 40–45 సీట్లను అడుగుతున్నాయి. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), పశుపతి కుమార్ పరాస్ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ సైతం ఆర్‌జేడీతో చర్చలు జరుపుతుండగా, ఎంఐఎం సైతం కూటమిలో చేర్చుకోవాలని ఆర్‌జేడీని సంప్రదించినట్లు తెలుస్తోంది. వీటన్నింటి దృష్ట్యా సీట్ల పంపకాలపై ఓ స్పష్టతకు రావాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.


వీరంతా సైంటిస్టులు, పశువైద్యులు. వీరికి చిక్కింది పింక్ డాల్ఫిన్. ఆరోగ్య పరీక్షల కోసమని దాన్నిలా ఒడ్డుకు తీసుకొచ్చారు. కొలంబియాలోని ప్యుర్టో నరినోలో అమెజాన్ తీరంలో తీసిందీ చిత్రం

రాజ్యం నిర్వచనాన్ని ఏ ప్రకరణలో పేర్కొన్నారు?

ప్రభుత్వ గొప్పదనం అనేది అది ప్రజలకు కల్పించే హక్కులపై ఆధారపడి ఉంటుందని ప్రఖ్యాత రాజనీతి శాస్త్రజ్ఞుడు హెచ్.జె. లాస్కీ వ్యాఖ్యానించారు. హక్కు అనేది రాజనీతిశాస్త్ర అధ్యయనంలో ఒక ప్రాథమిక రాజకీయ భావన. ప్రజలు కోరుకునే, ప్రభుత్వం గుర్తించిన అధికారాన్నే హక్కుగా పేర్కొనవచ్చు. హక్కు అంటే అవకాశం, అధికారం కలిగి ఉండటం అని కూడా చెప్పవచ్చు. హక్కులు.. ప్రభుత్వ నిరపేక్ష అధికారాలపై పరిమితులు. ఒక వ్యక్తి తన శక్తి, తెలివితేటల ఆధారంగా ఔన్నత్యం, సంపూర్ణ వికాసం పొందడానికి దోహదపడే పరిస్థితులనే హక్కులుగా అభివర్ణించవచ్చు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగంలోని మూడో భాగంలో ప్రకరణలు 12 నుంచి 35 వరకు ప్రాథమిక హక్కుల గురించి తెలుపుతాయి. ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలోని అత్యంత ముఖ్యమైన లక్షణంగా పేర్కొంటారు. వీటిని అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం నుంచి గ్రహించారు. అమెరికా రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను 'బిల్ ఆఫ్ రైట్స్' రూపంలో పొందుపరిచారు. చట్టబద్ధమైన హక్కులకు రాజ్యాంగంలో స్థానం కల్పించి, ప్రత్యేక ప్రతిపత్తితో గుర్తిస్తే వాటిని 'ప్రాథమిక హక్కులు'గా పేర్కొంటారు. వ్యక్తి వికాసానికి ఇవి కనీస అవసరాలు. దేశ ప్రాథమిక శాసనమైన రాజ్యాంగంలో గుర్తించడం వల్ల వీటిని 'ప్రాథమిక హక్కులు' అని అంటారు.

ప్రాథమిక హక్కుల నేపథ్యం

రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు సుదీర్ఘ చారిత్రక నేపథ్యం ఉంది. లోకమాన్య బాలగంగాధర తిలక్ 1895లో 'స్వరాజ్య బిల్లు'లో మొదటిసారిగా ఈ హక్కులను ప్రతిపాదించారు. ఆ తర్వాత..

- 1911లో కలకత్తాలో నిర్వహించిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో హక్కులపై తీర్మానాన్ని ఆమోదించారు.
- 1922లో మహాత్మా గాంధీ సాధారణ ప్రజల హక్కుల గురించి 'యంగ్ ఇండియా'లో ప్రస్తావించారు.
- 1925లో అనిబీసెంట్.. కామన్వెల్త్ ఆఫ్ ఇండియా బిల్లులో, ఐర్లాండ్ రాజ్యాంగంలో ప్రస్తావించిన విధంగానే భారతీయులకూ ప్రాథమిక హక్కులు ఉండాలని ప్రతిపాదించారు.
- 1927లో మద్రాసులో ఎం.ఎ. అన్సారీ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో భావి రాజ్యాంగానికి ప్రాథమిక హక్కులు ప్రాతిపదిక కావాలనే తీర్మానాన్ని ఆమోదించారు.
- 1928లో మోతీలాల్ నెహ్రూ కమిటీ వెల్లడించిన నివేదికలో 'ప్రాథమిక హక్కులకు ఆమోదం పొందడం పౌరుల అవసరం'గా పేర్కొన్నారు.
- 1931లో కరాచీలో వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన కొంతమంది ప్రముఖులు ప్రాథమిక హక్కుల గురించి డిమాండ్ చేశారు. మన రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చడానికి వీరి నివేదికే ప్రాతిపదిక అయింది.
- 1931లో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీ భావి భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చాలని కోరారు.
- 1945లో తేజ్ బహదూర్ సప్రూ నాయకత్వంలో ఏర్పడిన పార్టీ రహిత మేధావుల సంఘం కూడా ప్రాథమిక హక్కులు కావాలని డిమాండ్ చేసింది.

రాజ్యాంగ పరిషత్తు - ప్రాథమిక హక్కులు

హక్కులను రాజ్యాంగంలో చేర్చి, వాటికి ఒక నిర్దిష్ట స్వరూపాన్ని కల్పించడానికి రాజ్యాంగ పరిషత్తు 1947 జనవరి 24న సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన 54 మంది సభ్యులతో ఒక సలహా సంఘాన్ని నియమించింది. ఈ సలహా సంఘం ప్రాథమిక హక్కుల పరిశీలన కోసం 1947 ఫిబ్రవరి 12న ఆచార్య జె.బి. కృపలాని అధ్యక్షతన ఒక ఉప సంఘాన్ని నియమించింది. ఉప సంఘం సూచన మేరకు రాజ్యాంగ పరిషత్ సలహాదారు బి.ఎన్. రావు హక్కులపై ఒక ముసాయిదా తయారు చేశారు. ఈ ముసాయిదాలో హక్కులను.. న్యాయ సంరక్షణ ఉన్న హక్కులు, న్యాయ సంరక్షణ లేని హక్కులుగా వర్గీకరించారు.

ప్రాథమిక హక్కులు - లక్షణాలు

- ప్రవేశికలో పేర్కొన్న న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అనే తాత్విక ఆదర్శాలకు వాస్తవికతను చేకూర్చే విధంగా ప్రాథమిక హక్కులను పొందుపరిచారు.
- ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ (Justiciable) ఉంది. ఇది అత్యంత ముఖ్యమైన లక్షణం. వీటి రక్షణ, అమలుకు రాజ్యాంగంలో న్యాయపరమైన ఏర్పాట్లు ఉన్నాయి.
- ప్రాథమిక హక్కులు ప్రభుత్వ నిరపేక్ష అధికారాల (Absolute Authority)పై పరిమితులు. ప్రభుత్వాలు తమ అధికారాలను రాజ్యాంగానికి లోబడి, ప్రజల హక్కులకు భంగం కలిగించకుండా వినియోగించాలి.
- కొన్ని ప్రాథమిక హక్కులు నకారాత్మకమైనవి (Negative). అంటే ఇవి ప్రభుత్వ అధికారితపై పరిమితులు.

ఉదా: నిబంధనలు 14, 15, 16, 20, 21 మొదలైనవి. ఇవి ప్రభుత్వం ఏయే అంశాలను చేయకూడదో సూచిస్తాయి.

- మరికొన్ని హక్కులు సకారాత్మకమైనవి (Positive). ఇవి ప్రభుత్వ బాధ్యతలను సూచిస్తాయి.

ఉదా: నిబంధన 17లోని అస్పృశ్యత నిషేధం, నిబంధన 24లోని బాల కార్మిక వ్యవస్థ నిషేధం.

- ప్రాథమిక హక్కులన్నింటినీ జాతీయ అత్యవసర పరిస్థితుల్లో రద్దు చేయవచ్చు. నిబంధనలు 20, 21 మాత్రం రద్దుకావు.
- ప్రాథమిక హక్కులన్నీ స్వతహాగా అమల్లోకి వస్తాయి. కానీ, నిబంధనలు 17, 23, 24లో ప్రస్తావించిన అంశాలు స్వతహాగా అమల్లోకి రావు (Non self-executory). వీటి అమలు కోసం పార్లమెంటు ప్రత్యేక చట్టాలు చేయాల్సి ఉంటుంది.
- ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. దీని కోసం రాజ్యాంగ సవరణ అవసరం. కానీ, సవరణ పేరుతో వీటి స్ఫూర్తికి భంగం కలిగించకూడదు.
- కొన్ని ప్రాథమిక హక్కులు కొన్ని వర్గాలు, సాయుధ బలగాలు, పోలీసులు, ఖైదీలు, అత్యవసర సర్వీసుల్లో పనిచేస్తున్నవారికి పరిమితంగా వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక హక్కులు పౌరుల చర్యలకు వ్యతిరేకంగా కూడా లభిస్తాయి.

ఉదా: ప్రకరణ 17 - అస్పృశ్యత నివారణ, ప్రకరణ 23 - వెట్టిచాకిరి రద్దు, ప్రకరణ 24 - బాలకార్మిక వ్యవస్థ రద్దు.

- కొన్ని హక్కులను అల్పసంఖ్యాక వర్గాల ప్రయోజనాలు కాపాడి, జాతీయ సమగ్రత నిలపడానికి ఉద్దేశించారు.

ఉదా: మతస్వేచ్ఛ హక్కు, విద్యా సాంస్కృతిక హక్కు.

- ప్రాథమిక హక్కుల్లో పేర్కొన్న నిషేధాలు/విపక్షలు.. ప్రభుత్వాలు, పౌరులకు సమానంగా వర్తిస్తాయి.

ఉదా: జాతి, మత, కుల, లింగ, జన్మ సంబంధ వివక్షలను ఎవరూ పాటించకూడదు.



ప్రాథమిక హక్కుల వర్గీకరణ

భారత రాజ్యాంగంలో 7 రకాల ప్రాథమిక హక్కుల గురించి తెలిపారు.

1. సమానత్వ హక్కు (Right to Equality): ప్రకరణలు 14-18.
2. వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్య హక్కు (Personal Freedoms): ప్రకరణలు 19-22.
3. పీడనాన్ని నిరోధించే హక్కు (Right against Exploitation): ప్రకరణలు 23, 24.
4. మత స్వాతంత్ర్య హక్కు (Right to Religion): ప్రకరణలు 25-28.
5. సాంస్కృతిక, విద్యా హక్కులు (Cultural & Educational rights): ప్రకరణలు 29, 30.
6. ఆస్తి హక్కు (Right to Property): ప్రకరణ 31.
7. రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies): ప్రకరణ 32.

ప్రత్యేక వివరణ

పైన పేర్కొన్న ప్రాథమిక హక్కుల్లో అత్యంత వివాదాస్పదమైన ఆస్తి హక్కు (ప్రకరణ 31)ను, ఆస్తి సంపాదన విషయంలో వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన 19(1)(f)ను 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. వీటిని 12వ భాగంలోని 300(ఎ)లో చేర్చారు. ప్రస్తుతం ఆస్తి హక్కు రాజ్యాంగబద్ధ హక్కు (Constitutional Right) మాత్రమే. దీన్ని ఒక చట్టబద్ధమైన హక్కుగానూ పరిగణిస్తున్నారు.

ప్రకరణ 12 - రాజ్యం నిర్వచనం

ప్రాథమిక హక్కులను మౌలికంగా రాజ్యం నిరపేక్ష అధికారాలకు వ్యతిరేకంగా పొందుపరిచారు. రాజ్యాంగంలో రాజ్యం అనే పదాన్ని చాలా చోట్ల ప్రయోగించారు. అయితే రాజ్యం నిర్వచనాన్ని మాత్రం ప్రకరణ 12లో పేర్కొన్నారు. రాజ్యం అనే పదానికి విస్తృతమైన నిర్వచనాన్ని ఇచ్చారు. ప్రాథమిక హక్కులను రాజ్యం లేదా ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా గుర్తించారు. కాబట్టి ఏయే సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయి? అనే అంశాన్ని స్పష్టంగా నిర్వచించకపోతే కొన్ని సంస్థలు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినా వాటిపై న్యాయస్థానంలో ప్రశ్నించే అవకాశం ఉండదు. అందువల్ల దీనికి విస్తృతమైన నిర్వచనం అవసరం. దీని ప్రకారం రాజ్యం అంటే..

ఎ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు; కేంద్ర, రాష్ట్ర శాసనసభలు

బి. స్థానిక ప్రభుత్వాలు (మున్సిపాలిటీలు, పంచాయతీలు, జిల్లా బోర్డులు, ట్రస్టులు)

సి. ప్రభుత్వ ఆదేశాల ద్వారా ఏర్పాటైన చట్టబద్ధ, చట్టేతర సంస్థలు (ఎల్.ఐ.సి., ఓ.ఎన్.జి.సి., ఎన్.టి.పి.సి. మొదలైనవి)

డి. న్యాయవ్యవస్థ కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు తన తీర్పుల్లో తెలిపింది. అదేవిధంగా ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్న ప్రైవేట్ సంస్థలు కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయని పేర్కొంది.

పైన పేర్కొన్న సంస్థలతో పాటు ఎలాంటి ఇతర సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయనే అంశాన్ని సుప్రీంకోర్టు వివిధ కేసుల తీర్పుల సందర్భంగా స్పష్టపరిచింది. అవి:

అజయ్ సహాయ్ వర్సెస్ ఖలీద్ ముజీద్ (1981): సుప్రీంకోర్టు ఈ కేసు తీర్పులో ఒక సంస్థను రాజ్యం అనే నిర్వచనంలోకి చేర్చడానికి కింది ప్రాతిపదికలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది.

- మూలధనంలో ప్రభుత్వ వాటా ఉండాలి.
- ఆ సంస్థ మొత్తం ఖర్చును ప్రభుత్వం భరించాలి.
- ఆ సంస్థపై సంపూర్ణ పరిపాలనా నియంత్రణ ఉండాలి.
- ఆ సంస్థ ఆర్థిక లావాదేవీలు ప్రభుత్వ నియంత్రణలో ఉండాలి.

న్యాయస్థానాలు రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయి - సుప్రీంకోర్టు తీర్పులు

ఎ.ఆర్. అంతూలే వర్సెస్ ఆర్.ఎస్. నాయక్ కేసు (1988): న్యాయస్థానాల కొన్ని చర్యలు రాజ్య నిర్వచనంలోకి వస్తాయని ఈ కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. దీనికి రాజ్యాంగంలో స్పష్టమైన ఆధారాలున్నాయి. ప్రకరణ 145, 146 ప్రకారం సుప్రీంకోర్టు సొంత నియమ, నిబంధనలను రూపొందించుకోవచ్చు. అదేవిధంగా తన సిబ్బందిని నియమించుకునే అధికారం కూడా సుప్రీంకోర్టుకు ఉంది. ఈ చర్యలు కార్యనిర్వాహకపరమైనవి. వీటివల్ల పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు వాటిని న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చు.

కాబట్టి న్యాయశాఖ కార్యనిర్వాహక విధులను నిర్వర్తిస్తున్నప్పుడు మాత్రమే రాజ్యమనే పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు ప్రకటించింది.

రాజ్యం నిర్వచనం- మినహాయింపులు

సహకార సంఘాలు; బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా; ప్రభుత్వ ధన సహాయం పొందని ప్రైవేట్ విద్యాసంస్థలు; ప్రభుత్వ పరిపాలన, ఆర్థిక నియంత్రణ లేని ఇతర సంస్థలు రాజ్యం నిర్వచనం పరిధిలోకి రావు.

ప్రకరణ 13-చట్టం నిర్వచనం, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైన చట్టాలు-న్యాయ సమీక్షాధికారం

ప్రకరణ 13(1) ప్రకారం రాజ్యాంగం అమల్లోకి వచ్చిన వెంటనే అంతవరకు అమల్లో ఉన్న చట్టాలు ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైతే.. అవి చెల్లకుండా పోతాయి. ప్రకరణ 13(2) ప్రకారం ప్రాథమిక హక్కులను హరించే లేదా పరిమితం చేసే చట్టాలు, ఆదేశాలు చెల్లవు.

ప్రకరణ 13(3)లో పేర్కొన్న చట్టం నిర్వచనం కిందకి వచ్చే అంశాలు:

- కేంద్ర, రాష్ట్ర శాసనసభలు రూపొందించిన శాసనాలు.
- రాష్ట్రపతి, గవర్నర్ జారీ చేసిన ఆదేశాలు, ఆర్డినెన్స్‌లు.
- ప్రభుత్వ రూల్స్, రెగ్యులేషన్స్, నోటిఫికేషన్స్, ప్రకటనలు.
- ప్రభుత్వం గుర్తించిన, చట్టబద్ధత ఉన్న ఆచార వ్యవహారాలు.

ప్రత్యేక వివరణ

1971లో 24వ రాజ్యాంగ సవరణ ద్వారా.. నిబంధన 368 ప్రకారం రాజ్యాంగానికి చేసిన సవరణలను నిబంధన 13లో పేర్కొన్న 'చట్టం' నిర్వచన పరిధి నుంచి మినహాయించారు. ఈ అంశాన్ని గోలక్‌నాథ్ కేసు(1967)లో సుప్రీంకోర్టు తీర్పును అధిగమించడానికి చేర్చారు. కానీ, సుప్రీంకోర్టు 1973లో కేశవానందభారతి కేసులో ఈ సవరణ చెల్లదని తీర్పు చెప్పింది. కాబట్టి రాజ్యాంగ సవరణ కూడా చట్టం నిర్వచన పరిధిలోకి వస్తుంది.

ఏ పరీక్షల్లో విశ్వసనీయత ఎక్కువ?

జీవశాస్త్ర మూల్యాంకనం

1. ఉపాధ్యాయుడు తను బోధనా లక్ష్యాలను ఎంతవరకు సాధించగలుగుతున్నాడో తెలుసుకోవడానికి వాడే ప్రక్రియ?
 1) బోధనా పద్ధతి 2) బోధనా ఉద్దేశం
 3) మూల్యాంకనం 4) ఉన్ముఖీకరణ
2. మూల్యాంకనంలో పరస్పరం ఆధారపడిన అంశాల్లో.. అభ్యసనా అనుభవాలు, మూల్యాంకనం సాధనాలతోపాటు ఉండేది?
 1) లక్ష్యాలు
 2) బోధనోపకరణాలు
 3) బోధనా పద్ధతులు 4) పరీక్షలు
3. మూల్యాంకనం అనేది ఒక అవిరళ ప్రక్రియ, మొత్తం విద్యావ్యవస్థలో ఒక సమైక్య భాగమై విద్యకు అన్ని లక్ష్యాల తోనూ దగ్గర సంబంధం ఉంటుంది అని తెలిపినవారు?
 1) కొఠారి కమిషన్
 2) మొదలియార్ కమిషన్
 3) తారాదేవి రిపోర్ట్
 4) రాధాకృష్ణన్ కమిషన్
4. ప్రాచీన పరీక్షా విధానం కేవలం ఏ రంగానికి ప్రాముఖ్యత ఇచ్చింది?
 1) మానసిక చలనాత్మక రంగం
 2) భావావేశ రంగం
 3) క్రీడా రంగం 4) జ్ఞానాత్మక రంగం
5. ఒక విషయాన్ని గురించి లేదా వ్యక్తిని గురించి పరిమాణాత్మకంగా అంచనా కట్టడానికి విద్యాసంబంధమైన వాటిని గురించి మాత్రమే నిర్వహించేది?
 1) మాపనం 2) మూల్యాంకనం
 3) పరీక్ష 4) పైవన్నీ
6. మూల్యాంకనానికి ఒక ఆకారాన్ని ఒక అధికారాన్ని కల్పించి విద్యార్థి వర్తమాన ప్రగతిని అంచనా వేసేది?
 1) పరీక్ష 2) మాపనం
 3) మూల్యాంకనం 4) ఇవేవీకావు
7. నిరంతర ప్రక్రియ విద్యార్థి సమగ్ర మూర్తిమత్వాన్ని తెలియజేస్తూ, భూత, భవిష్యత్, వర్తమాన ప్రగతిని అంచనా వేసేది?
 1) పరీక్ష 2) మాపనం
 3) మూల్యాంకనం 4) స్లిప్‌టెస్ట్
8. బోధనాభ్యసన ప్రక్రియ ప్రారంభించే ముందు విద్యార్థుల సామర్థ్యాలను తెలుసు కోవడానికి ఉపయోగించే మూల్యాంకనం?
 1) సంకలన మూల్యాంకనం
 2) లోపనిర్ధారణ మూల్యాంకనం
 3) నిర్మాణాత్మక, రూపణ మూల్యాంకనం
 4) 1, 2
9. బోధన మధ్యలో విద్యార్థి అభ్యసనాన్ని అంచెలంచెలుగా తెలుసుకొని బోధనా పద్ధతిలో మార్పులు చేసుకునేందుకు ఉపాధ్యాయుడు ఏ మూల్యాంకనం చేస్తాడు?
 1) సంకలన 2) రూపణ, నిర్మాణాత్మక
 3) సంకలన, రూపణ 4) లోపనిర్ధారణ
10. సంకలనాత్మక మూల్యాంకనం ఏ విధంగా జరుగుతుంది?
 1) బోధనకు ముందు 2) బోధన మధ్యలో
 3) బోధన పూర్తైన తర్వాత
 4) బోధనకు ముందు, తర్వాత
11. వార్షిక పరీక్షలను ఏ మూల్యాంకనానికి సాధనాలుగా చెప్పొచ్చు?
 1) నిర్మాణాత్మక 2) సంకలన
 3) లోప నిర్ధారణ 4) పైవన్నీ
12. ఉపాధ్యాయుడు పాఠ్యాంశాన్ని అర్థం చేసుకున్న లక్ష్మీ అనే బాలిక ప్రవర్తనా సరళిని, అదే పాఠ్య విషయాలను అర్థం చేసుకున్న సీతలో ఆశించిన మార్పులకు చేపట్టాల్సిన అభ్యసనానుభవాలను నిర్ణయించే విధానం?
 1) వైషమ్య విధానం 2) గుర్తింపు విధానం
 3) పరీక్ష విధానం 4) విధానమేకానిది
13. 'కణ విభజనలో క్షయకరణ విభజనకు సంబంధించిన దశలను వివరించండి?' పై ప్రశ్న ఏ రకమైన పరీక్షల్లో వస్తుంది?
 1) పరిపృచ్ఛ 2) మౌఖిక పరీక్ష
 3) లక్ష్యాత్మకపరీక్ష 4) వ్యాసరూప పరీక్ష
14. ఉపాధ్యాయుడి ఆత్మాశ్రయ భావాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉండటం వల్ల విద్యార్థికి ఏ పరీక్షల్లో న్యాయం జరగకపోవచ్చు?
 1) లక్ష్యాత్మక పరీక్ష 2) అభిరుచి శోధిక
 3) వ్యాసరూప పరీక్ష
 4) సహజ సామర్థ్య పరీక్ష
15. 'ఆవరణ వ్యవస్థలో వినియోగదారులు--- పై ఆధారపడే ఉంటాయి?' ఇది ఏ రకమైన పరీక్షల్లో వస్తుంది.
 1) వ్యాసరూప 2) లక్ష్యాత్మక
 3) పరిపృచ్ఛ 4) సహజ సామర్థ్య
16. ఏ పరీక్షల్లో విశ్వసనీయత ఎక్కువ?
 1) ప్రశ్నావళి 2) వ్యాసరూప
 3) పరిపృచ్ఛ 4) లక్ష్యాత్మక
17. లక్ష్యాత్మక పరీక్షల్లో దేనికి అవకాశం లేదు?
 1) మాస్ కాపీయింగ్ 2) జ్ఞానం
 3) ఉపాధ్యాయుడి ఆత్మాశ్రయత
 4) విశ్వసనీయత
18. ముద్రణాయంత్రం కనిపెట్టక ముందు నుంచే ఏ పరీక్షలు ఉన్నాయి?
 1) వ్యాసరూప 2) లక్ష్యాత్మక
 3) ప్రశ్నావళి 4) మౌఖిక
19. డీఎస్సీ పరీక్షలు ఏ రకం పరీక్షలకు ఉదాహరణ?
 1) లక్ష్యాత్మక 2) మౌఖిక
 3) వ్యాసరూప 4) అభిరుచి శోధిక
20. విద్యార్థుల మానసిక ప్రవృత్తి, భావవ్యక్తీకరణ పరీక్షించడానికి తోడ్పడే పరీక్షలు?
 1) వ్యాసరూప 2) లక్ష్యాత్మక
 3) మౌఖిక
 4) ప్రామాణీకరణం చేసిన పరీక్షలు



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సైన్స్ మెథడాలజీ

21. శిక్షణ సామర్థ్యం ఉన్న వ్యక్తులను ఆ సామర్థ్యం లేని వ్యక్తుల నుంచి వేరు చేయడానికి ఉపయోగపడేవి?
 1) సమస్యా విధాన పరీక్షలు
 2) సహజ సామర్థ్య పరీక్షలు
 3) ప్రామాణీకరణ పరీక్షలు
 4) లక్ష్యాత్మక పరీక్షలు
22. విద్యార్థికి జీవశాస్త్ర, ప్రయోగశాల్లో అమీబా నమూనాను చూపి గుర్తించమనడం ఏ పరీక్షకు ఉదాహరణ?
 1) లక్ష్యాత్మక 2) సహజ సామర్థ్య
 3) నిష్పాదన 4) ప్రామాణీకరణ
23. పరిస్థితిని బట్టి సందర్భానుసారంగా ప్రశ్నలను ప్రత్యక్షంగా అడగటం?
 1) అనియత పరిపృచ్ఛ
 2) నియత పరిపృచ్ఛ
 3) సామూహిక పరిపృచ్ఛ
 4) ప్రశ్నావళి
24. ఉపాఖ్యాన రికార్డు అని దేన్ని పిలుస్తారు?
 1) అభిరుచి శోధిక 2) నియత పరిపృచ్ఛ
 3) జీవిత సంఘటన పత్రావళి
 4) ప్రశ్నావళి
25. ఒక విద్యార్థికి చెందిన నాయకత్వ లక్షణాలను అంచనా వేయడానికి ఉపకరించే సాధనం?
 1) అభిరుచి శోధిక 2) చెక్‌లిస్ట్
 3) జీవిత సంఘటన పత్రావళి
 4) అంచనా మాపని
26. ఈ రకం పరీక్షల్లో ప్రశ్నకు ఎదురుగా అవును, కాదు అనేవి మాత్రమే ఉంటాయి. ఇది మూర్తిమత్వ పరీక్ష?
 1) లక్ష్యాత్మక 2) వ్యాసరూప
 3) చెక్‌లిస్ట్ 4) అభిరుచి శోధిక
27. విద్యార్థి గురించిన పూర్తి చిత్రం సంవత్సరం వారీగా అతని వికాసం తెలుసుకునేది?
 1) జీవిత సంఘటన పత్రావళి
 2) అభిరుచి శోధిక 3) చెక్‌లిస్ట్
 4) క్రమాభివృద్ధి, సంచిత పత్రావళి
28. తారాదేవి రిపోర్ట్ పరీక్షల సంస్కరణల్లో సూచించిన ప్రకారం, ప్రశ్నపత్రంలో లక్ష్యా త్మక ప్రశ్నలకు ఇవ్వాల్సిన సమయం?
 1) 1 గంట 2) 2 ½ గంటలు
 3) ½ గంట 4) 3 గంటలు
29. ఎవరైతే బోధిస్తారో వారే పరీక్షించడం ఆవశ్యకం అని వివరించిన వారు?
 1) తారాదేవి రిపోర్ట్
 2) యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్
 3) కొఠారి కమిషన్
 4) మొదలియార్ కమిషన్
30. విద్యార్థుల ఫలితాలను చూపే యోగ్యతా పత్రాలు వేర్వేరు సబ్జెక్టుల్లో విద్యార్థుల నిష్పాదనాన్ని తెలిపేవిగా ఉండాలి - కానీ మొత్తం పరీక్షలో పాస్, ఫెయిల్ అని నిర్ణయించేవిగా ఉండొద్దు అని సూచించింది?
 1) కొఠారి కమిషన్ 2) తారాదేవి రిపోర్ట్
 3) యూజీసీ 4) మొదలియార్ కమిషన్
31. ఉత్తమ నికషకు ఉండాల్సిన లక్షణం కానిది?
 1) సప్రమాణత 2) లక్ష్యాత్మకత
 3) ఆచరణాత్మకత 4) ఆత్మాశ్రయత
32. లక్ష్యాత్మక అంటే ఒక పరీక్ష పత్రాన్ని వేర్వేరు ఉపాధ్యాయులు దిద్దినప్పుడు?
 1) వేర్వేరు మార్కులు రావాలి
 2) ఒకే మార్కులు రావాలి
 3) మొదటి ఉపాధ్యాయుడి మార్కులు పరిగణించాలి.
 4) చివర దిద్దిన ఉపాధ్యాయుడి మార్కులు పరిగణించాలి
33. కింది వాటిలో ఏ పరీక్షలకు విశ్వసనీయత తక్కువగా ఉంటుంది?
 1) నిష్పాదన పరీక్షలు
 2) లక్ష్యాత్మక పరీక్షలు
 3) వ్యాసరూప పరీక్షలు
 4) పైవన్నీ
34. అన్ని పాఠ్యాంశాల్లోని అన్ని విషయాలను పరీక్షించేటట్లు పరీక్షా పత్రం ఇస్తే దానికి ఏ లక్షణం ఉందని అంటారు?
 1) ఆచరణాత్మకత 2) విశ్వసనీయత
 3) లక్ష్యాత్మకత 4) సమగ్రత
35. పాఠ్య విభాగాన్ని బోధించిన తర్వాత రూపొందించుకున్న బోధనా లక్ష్యాలు నెరవేరింది?
 1) వార్షిక పరీక్ష 2) త్రైమాసిక పరీక్ష
 3) యూనిట్ పరీక్ష
 4) అర్ధసంవత్సర పరీక్ష
36. యూనిట్ పరీక్షలో నైపుణ్యానికి ఇచ్చే మార్కుల శాతం?
 1) 24 2) 32 3) 12 4) 18
37. యూనిట్ పరీక్షలో కఠిన స్థాయి ప్రశ్నలకు ఇచ్చే మార్కుల శాతం?
 1) 24 2) 53 3) 14 4) 100
38. యూనిట్ పరీక్షలో ప్రశ్నపత్రం రూపకల్పనలో కింది వాటిలో దేనికి ఎక్కువ మార్కులు కేటాయించాలి?
 1) కఠిన స్థాయి 2) సాధారణ స్థాయి
 3) తేలిక స్థాయి
 4) అన్నింటికీ సమానంగా
39. ఉపాధ్యాయ నిర్మిత పరీక్షల్లో ప్రశ్నపత్రం సప్రమాణత రూపొందించడానికి తోడ్పడేది?
 1) అమోనియా ప్రింట్ 2) న్యూస్ ప్రింట్
 3) జిరాక్స్ ప్రింట్ 4) బ్లూ ప్రింట్
40. బ్లూ ప్రింట్ తయారీలో దేనికి ప్రాముఖ్యత ఉండదు?
 1) లక్ష్యాలు 2) ఉపప్రమాణం
 3) ఉపాధ్యాయుల అభిరుచి
 4) పరీక్షాంశ రకం

సమాధానాలు

1) 3	2) 1	3) 1	4) 4	5) 3
6) 2	7) 3	8) 2	9) 2	10) 3
11) 2	12) 1	13) 4	14) 3	15) 2
16) 4	17) 3	18) 4	19) 1	20) 3
21) 2	22) 3	23) 1	24) 3	25) 4
26) 3	27) 4	28) 3	29) 2	30) 1
31) 4	32) 2	33) 3	34) 4	35) 3
36) 3	37) 1	38) 2	39) 4	40) 3

విద్య, ఉద్యోగ సమాచారం

ఎల్ఐసీ-హెచ్ఎఫ్ఎల్‌లో 192 అప్రెంటిస్‌లు

ఎల్ఐసీ-హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్ఎఫ్ఎల్) దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఖాళీగా ఉన్న అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 192.
- » **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 01.06.2021 నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలి.
- » **వయసు:** 20 నుంచి 25 ఏళ్లు ఉండాలి.
- » **స్టైపెండ్:** నెలకు రూ.12,000.
- » **శిక్షణా కాల వ్యవధి:** 12 నెలలు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **పరీక్ష ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.944, ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు రూ.708, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 472.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **పరీక్ష ఫీజు చెల్లించడానికి చివరితేది:** 24.09.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.09.2025.
- » **ప్రవేశ పరీక్ష తేది:** 01.10.2025.
- » **శిక్షణ ప్రారంభతేది:** 01.11.2025.
- » **వెబ్‌సైట్:** www.lichousing.com

ఎయిమ్స్ రిషికేశ్‌లో వివిధ ఉద్యోగాలు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)రిషికేశ్ తాత్కాలిక ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- » **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్1(నాన్ మెడికల్)-01, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్1-01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి పదో తరగతి, డిప్లొమా, డిగ్రీ, పీజీ(బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, పబ్లిక్ హెల్త్, నర్సింగ్)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వయసు:** 25ఏళ్ల నుంచి 30ఏళ్లు మించకూడదు
- » **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్ రూ.61,600, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ రూ.18,000 నుంచి రూ.19,800.
- » **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
- » **ఈమెయిల్:** aiimsrishikesh.edu.in.
- » **దరఖాస్తులకు చివరితేది:** 20.09.2025.
- » **వెబ్‌సైట్:** https://aiimsrishikesh.edu.in

వస్తువు వేగాన్ని రెండింతలు చేస్తే దాని గతిజశక్తి?

యాంత్రిక శాస్త్రం

ప్రచోదనం

ఏదైనా ఒక వస్తువుపై అతి స్వల్పకాలంలో అత్యధిక బలాన్ని ప్రయోగిస్తే దాన్ని ప్రచోదనం అంటారు.

ప్రచోదనం (I) = బలం × కాలం

$I = F \times \Delta t$


$I/\Delta t = F$

ప్రకారం ఒక వస్తువుపై అత్యధిక బలాన్ని అతిస్వల్పకాలంలో ప్రయోగిస్తే ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ప్రమాణాలు: డైన్ సెకన్, న్యూటన్ సెకన్

అనువర్తనాలు:

- జంపింగ్ పోటీలో దూకే స్థలం వద్ద గోతిని తవ్వి దానిలో వరిపొట్టు, రంపం పొట్టు, ఇసుక, స్పాంజ్‌ను ఉంచుతారు. వీటివల్ల కాల పరిమితి పెరిగి ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. ఫలితంగా దూకుతున్న వ్యక్తికి గాయాలుకావు.
- క్రికెట్‌లో బంతిని క్యాచ్ పట్టుకునే సమయంలో ఫీల్డర్ చేతులను ముందుకు చాపి, తర్వాత క్రమంగా వెనక్కి తీసుకుంటాడు. ఇలా చేయడం వల్ల కాలపరిమితి పెరిగి ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. అందువల్ల ఫీల్డర్ చేతులకు గాయాలు కావు.
- వాహనాల్లో షాక్ అబ్జార్బ్స్ (స్ప్రింగ్‌లు) అమరుస్తారు. దీనివల్ల వాహనాలు గుంతలున్న రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు ప్రచోదన ప్రభావం తగ్గుతుంది.
- సున్నితమైన గాజు వస్తువులు, పింగాణీ, మట్టి వస్తువులను రవాణా చేసేటప్పుడు వాటి చుట్టూ దూది, గడ్డి, స్పాంజి, థర్మాకోల్ మొదలైన వాటిని అమరుస్తారు. ఫలితంగా ఆ వస్తువుల రవాణా సమయంలో ప్రచోదన ప్రభావం తగ్గుతుంది.
- గమనంలో వున్న ఒక వాహనం అంతే ద్రవ్యరాశి ఉన్న విరామస్థితిలోని మరో వాహనాన్ని ఢీకొడితే.. కదులుతున్న వాహనం ఆగి ఉన్న వాహనంపై తక్కువ సమయంలో ఎక్కువ బలాన్ని ప్రయోగిస్తుంది. కాబట్టి ఆగి ఉన్న వాహనానికి ఎక్కువ నష్టం జరుగుతుంది.
- కొంత ఎత్తు నుంచి స్వేచ్ఛగా దృఢమైన తలం పైకి దూకిన వ్యక్తి తన శరీర బరువు మొత్తాన్నీ స్వల్పకాలంలో ఆ తలంపై ప్రయోగిస్తాడు. దీంతో ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా అతడికి గాయాలవుతాయి. కానీ అదే వ్యక్తి సరిపడా నీరున్న బావిలో దూకితే కాలపరిమితి పెరిగి, ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. కాబట్టి ఆ వ్యక్తికి ఎలాంటి గాయాలు కావు.
- ఒక ఇనుప మేకుపై అత్యధిక బలాన్ని అతి స్వల్ప కాలంలో ప్రయోగిస్తే ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉండి, ఆ మేకు గోడలోకి లేదా చెక్కదిమ్మలోకి చొచ్చుకొని వెళ్లగలుగుతుంది.



ప్రక్షేపకం (Projectile)

ఏదైనా ఒక వస్తువును భూమి క్షితిజ సమాంతర దిశకు కొంత కోణంలో (90° తప్ప) పైకి విసిరినప్పుడు అది పరావలయ మార్గంలో ప్రయాణించి భూమిని మరో బిందువు వద్ద తాకుతుంది. ఈ విధంగా విసిరిన వస్తువును ప్రక్షేపకం అంటారు.

ప్రక్షేపకం ఎల్లప్పుడూ పరావలయ లేదా అర్థ పరావలయ మార్గంలో ప్రయాణిస్తుంది.

ఉదాహరణలు:

1. తుపాకి నుంచి వెలువడిన బుల్లెట్, యుద్ధ ట్యాంకుల నుంచి వెలువడిన విస్ఫోటక పదార్థాలు పరావలయ మార్గంలో ప్రయాణిస్తాయి.
2. ప్రయోగించిన క్షిపణి, రాకెట్‌లు కూడా పరావలయ మార్గంలో ప్రయాణిస్తాయి.
3. కదులుతున్న వాహనంలో నుంచి ఒక వస్తువును బయటకు జారవిడిస్తే అది పరావలయ మార్గంలో ప్రయాణించి కింద పడుతుంది.
4. గగనతలంలో ఎగురుతున్న ఒక జెట్ విమానం నుంచి బాంబును జారవిడిస్తే అది పరావలయ మార్గంలో ప్రయాణించి లక్ష్యాన్ని తాకుతుంది.

వ్యాప్తి (Range)

ఒక ప్రక్షేపకం భూమి క్షితిజ సమాంతర దిశలో ప్రయాణించిన గరిష్ఠ దూరాన్ని వ్యాప్తి అంటారు. గరిష్ఠ వ్యాప్తి పొందాలంటే ప్రక్షేపకాన్ని 45° కోణంతో ప్రయోగించాలి.

యాంత్రికశక్తి

ఒక వస్తువు క్షితిజ శక్తి, గతిజ శక్తుల మొత్తాన్ని యాంత్రిక శక్తి (Mechanical Energy) అంటారు.

యాంత్రిక శక్తి = P.E. + K.E.

స్థితిజ శక్తి:

ఒక వస్తువుకు తన స్థితి లేదా స్థానం లేదా నిర్మాణం వల్ల కలిగే శక్తిని క్షితిజ శక్తి అంటారు.

క్షితిజ శక్తి (P.E.) = mgh

m = వస్తువు ద్రవ్యరాశి (ఎల్లప్పుడు స్థిరం)

g = గురుత్వ త్వరణం (ఒక ప్రదేశంలో g విలువ స్థిరం)

h = భూమి ఉపరితలం నుంచి వస్తువు పొందిన ఎత్తు.

వస్తువు పొందిన ఎత్తు విలువ పెరిగితే వస్తువు పొందిన క్షితిజ శక్తి కూడా పెరుగుతుంది.

ఉదాహరణలు:

- రిజర్వాయర్లలో, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో ఉండే నీటికి స్థితిజశక్తి ఉంటుంది.
- ఒక తీగను స్ప్రింగ్‌లా చుట్టినపుడు దానిలో PE నిల్వ ఉంటుంది.
- ఒక రబ్బరు పట్టీని సాగదీసినప్పుడు కూడా దానిలో స్థితిజశక్తి ఉంటుంది.
- విల్లులో బాణం అమర్చి వెనక్కి లాగినప్పుడు దానిలోనూ PE నిల్వ ఉంటుంది.

గతిజశక్తి:

ఒక వస్తువు తన గమనం వల్ల పొందిన శక్తిని గతిజశక్తి అంటారు.

గతిజ శక్తి = KE = ½mv²

m = వస్తువు ద్రవ్యరాశి;

v = వేగం

- గమనంలో వున్న రాయి, బంతికి ఈ శక్తి ఉంటుంది.
- పేల్చిన తుపాకీ గుండు, తుఫాన్ గాలులకు, రంపం మిల్లులో వేగంగా తిరిగే రంపానికి గతిజ శక్తి ఉంటుంది.
- వేగం పెరిగితే వస్తువు గతిజశక్తి కూడా పెరుగుతుంది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం

- గతిజశక్తి సమీకరణం, రేఖీయ ద్రవ్యవేగాల మధ్య సంబంధం

$K.E. = p^2/2m$

$\Rightarrow K.E. \propto p^2$

- గమనంలో వున్న వస్తువు రేఖీయ ద్రవ్యవేగాన్ని x% పెంచినప్పుడు దాని K.E.లో పెరుగుదల శాతం = x(200+x)/100

ప్రశ్న: గమనంలో ఉన్న వస్తువు రేఖీయ ద్రవ్యవేగాన్ని 100 శాతం పెంచితే, దాని K.E. లో మార్పు (పెరుగుదల)శాతం ఎంత?

= x(200+x)/100 (∵ x = 100%)

= 100(200+100)/100

= 300

K.E.లో పెరుగుదల = 300%

- గమనంలో ఉన్న వస్తువు వేగాన్ని రెండింతలు చేస్తే దాని K.E. నాలుగు రెట్లు పెరుగుతుంది.

యాంత్రిక శక్తికి ఉదాహరణలు:

ఒక వస్తువు ఏక కాలంలో క్షితిజ, గతిజ శక్తులను కలిగి ఉంటే వాటికి ఉదాహరణలు.

- గగన తలంలో ఎగురుతున్న విమానం, రాకెట్లు, క్షిపణులు, గాలిపటం, మేఘాలు, పక్షి, బెలూన్ మొదలైన వాటికి యాంత్రిక శక్తి ఉంటుంది.
- గమనంలో ఉన్న వాహనంలోని ప్రయాణికుడు యాంత్రిక శక్తిని కలిగి ఉంటాడు.
- సౌర కుటుంబంలో సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలు లేదా గ్రహాల చుట్టూ పరిభ్రమిస్తున్న ఉపగ్రహాలకు యాంత్రిక శక్తి ఉంటుంది.
- పరమాణు కేంద్రకం చుట్టూ పరిభ్రమిస్తున్న ఎలక్ట్రాన్‌కు యాంత్రిక శక్తి ఉంటుంది.

నోట్: బావిలోని నీరు, లోయలో వున్న వస్తువు, గనిలోని కార్మికుడికి క్షితిజ శక్తి ఉంటుంది.

- తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ రెక్కలకు క్షితిజ శక్తి, భ్రమణ గతిజ శక్తులుంటాయి.

శక్తి రూపాంతరాలు

- రిజర్వాయర్‌లో నిలకడగా ఉన్న నీరు క్షితిజ శక్తిని కలిగి ఉంటుంది. ఈ నీరు జలపాతంలా కిందకి పడుతున్నపుడు దాని స్థితిజశక్తి గతిజశక్తిగా మారుతుంది. నీటి ప్రవాహానికి ఎదురుగా విద్యుత్ టర్బైన్‌ను అమరిస్తే జనరేటర్‌లో విద్యుత్‌గా రూపాంతరం చెందుతుంది.
- గడియారంలో చుట్టగా చుట్టిన స్ప్రింగ్‌లో స్థితిజ శక్తి ఉంటుంది. ఈ స్థితిజ శక్తి గడియారంలోని ముల్లు తిరగడానికి కావాల్సిన K.E.గా మారుతుంది.
- పక్షులను వేటాడటానికి ఉపయోగించే గులేరులోని రబ్బరు పట్టీ మధ్యభాగంలో ఒక చిన్న రాయిని అమర్చి వెనక్కి లాగితే, ఆ రబ్బరు పట్టీలోని స్థితిజశక్తి రాయికి గతిజశక్తిని అందిస్తుంది. ఫలితంగా రాయి ముందుకు దూసుకెళ్తుంది. ఇలాంటి శక్తి రూపాంతరం ధనస్సు, బాణాల్లో కూడా జరుగుతుంది.
- వాహనాల్లో ఇంధనాలను మండించినప్పుడు వెలువడే ఉష్ణశక్తి వాటిని కదిలించడానికి కావల్సిన యాంత్రిక శక్తిగా మారుతుంది.
- సైకిల్ డైనమోలో యాంత్రికశక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది.
- పరుగు తీస్తున్న వ్యక్తిలో కండర శక్తి గతిజశక్తిగా మారుతుంది.
- ఒక వ్యక్తి.. భవనం, పర్వతం, స్తంభం మొదలైన వాటిపై ఎక్కినప్పుడు కండర శక్తి స్థితిజ శక్తిగా రూపాంతరం చెందుతుంది.
- చెట్టు కొమ్మపై వాలిన పక్షి ఎగరడం ఆరంభించినప్పుడు దాని కండర శక్తి(PE) యాంత్రిక శక్తిగా రూపాంతరం చెందుతుంది.
- సముద్రంలో ఆటుపోట్లు ఏర్పడినప్పుడు ఉవ్వెత్తున లేచిన సముద్ర కెరటాల స్థితిజశక్తి ఒడ్డుకు గతిజశక్తిగా అందుతుంది.
- చిన్న పిల్లలు ఆడుకునే ఆట బొమ్మల్లో అమర్చిన ఘటాల్లోని రసాయనశక్తి విద్యుచ్ఛక్తిగా, తర్వాత బొమ్మలను కదిలించడానికి అవసరమైన యాంత్రిక శక్తిగా మారుతుంది.
- విద్యుత్ మోటార్‌లో విద్యుత్ శక్తి యాంత్రిక శక్తిగా మారుతుంది.

భ్రమణ చలనం లేదా కోణీయ చలనం

ఒక వస్తువు ఏదైనా స్థిర బిందువు చుట్టూ వృత్తాకార మార్గంలో పరిభ్రమిస్తే ఆ చలనాన్ని భ్రమణ చలనం లేదా కోణీయ చలనమంటారు.

ఉదా: తిరుగుతున్న ఫ్యాన్ రెక్కలు, వాహనం చక్రాలు, సౌరకుటుంబంలోని గ్రహాలు, ఉపగ్రహాలు భ్రమణ చలనాన్ని కలిగి ఉంటాయి.

- భ్రమణ చలనంలో ఉన్న ప్రతి వస్తువుకు ఏక కాలంలో రేఖీయ, కోణీయ భౌతిక రాశులుంటాయి.

రేఖీయ స్థానభ్రంశం (Linear displacement)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు వృత్త పరిధిపై పొందిన స్థానభ్రంశాన్ని రేఖీయ స్థాన భ్రంశం అంటారు.

ప్రమాణాలు: సెం.మీ. లేదా మీటర్

కోణీయ స్థానభ్రంశం (Angular displacement)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు ఆ వృత్త కేంద్రం వద్ద పొందిన స్థానభ్రంశాన్ని కోణీయ స్థానభ్రంశం అంటారు.

$\theta = \angle BOA$

ప్రమాణాలు: డిగ్రీ, రేడియన్ (రేడియన్ – అంతర్జాతీయ ప్రమాణం)

- రేఖీయ, కోణీయ స్థానభ్రంశాల మధ్య సంబంధం: వృత్త చాపం (AB) = వృత్త వ్యాసార్ధం × కేంద్రం వద్ద కోణం

$\overline{S} = r \times \theta$

రేఖీయ వేగం (V)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు నిర్ణీత కాలంలో వృత్త పరిధిపై పొందిన రేఖీయ స్థానభ్రంశాన్ని రేఖీయ వేగం అంటారు.

$V = S/t$

ప్రమాణాలు: సెం.మీ./సెకన్, మీ./సెకన్

కోణీయ వేగం (ω)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు నిర్ణీత కాలంలో వృత్త కేంద్రం వద్ద పొందిన కోణీయ స్థానభ్రంశాన్ని కోణీయ వేగం అంటారు.

$\omega = \theta/t$;

ప్రమాణాలు: డిగ్రీ/ సెకన్ లేదా రేడియన్ / సెకన్.

- రేఖీయ, కోణీయ వేగాల మధ్య సంబంధం $v = r\omega$
- భ్రమణ చలనంలో రేఖీయవేగం ఒక కణం నుంచి మరో కణానికి మారుతుంది. కానీ కోణీయ వేగం అన్ని కణాలకు సమానం.

కోణీయ ద్రవ్యవేగం

భ్రమణ చలనంలో ఉన్న వస్తువుకు ఉండే ద్రవ్యవేగాన్ని కోణీయ ద్రవ్యవేగం అంటారు.

$L = mvr$ లేదా $L = mr^2\omega$

ప్రమాణాలు: గ్రామ్.సెం.మీ.²/సెకన్, కేజీ. సెం.మీ.²/సెకన్

$L = mvr \Rightarrow L/r = mv$

$V \propto 1/r$

(ద్రవ్యరాశి స్థిరంగా ఉన్నప్పుడు)

- భ్రమణ చలనంలో ఉన్న వస్తువు రేఖీయ వేగం దాని వృత్త వ్యాసార్ధానికి విలోమానుపాతంలో ఉంటుంది. కాబట్టి కక్ష్యావ్యాసార్ధం పెరిగితే రేఖీయ వేగం తగ్గుతుంది.

ఉదా: భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న ఒక కృత్రిమ ఉపగ్రహాన్ని అల్పకక్ష్య నుంచి అధిక కక్ష్యలోకి బదిలీ చేస్తే ఆ ఉపగ్రహం రేఖీయ వేగం తగ్గుతుంది. కక్ష్య వ్యాసార్ధం పెరగడమే దీనికి కారణం.

- భ్రమణ చలనం చేస్తున్న వస్తువుకు ఏకకాలంలో అభికేంద్ర, అపకేంద్ర బలాలు ఉంటాయి.

What is the code for 'Indians'?

MODEL QUESTIONS

Directions (Q.No. 1-5): In these questions, a relationship between different elements is shown in the statement(s). The statements are followed by two conclusions.

Give answer:

1) If only conclusion I follows
2) If only conclusion II follows
3) If either conclusion I or II follows
4) If neither conclusion I nor II follows
5) If both conclusions I and II follow

1. *Statements:*
A < M > P, S £ A, X £ P
Conclusion: I) M > S
II) X< M

2. *Statements:* A>M ³ P £ S,
Q £ P, M < D
Conclusion: I) D > A
II) M ³ Q

3. *Statements:* K = E ³ L ³ M,
I > N ³ T, E £ R=T
Conclusions: I) I > M
II) L £ N

4. *Statements:*
Y < W < L, Z ³ X = L, Y = R,
M < S < R
Conclusions:
I) M < X
II) Z > Y

5. Statements:
R = X > M, X £ K < S
P £ L = M
Conclusions:
I) L < S
II) K > P

6. In a certain code'ANEUPLOID' is written as 'UDOLINEPA'. How will 'EDUCATION' be written in that code?
1) UCODINEAT
2) UCODINETA
3) UCOIDNETA
4) UOCDINETA
5) None of these

Directions (Q.No.7-9): In each question given below have five statements. You have to take the given statements to be true even if they seem to be at variance from commonly known facts and then choose the option which suggests one of the statements as a logical valid conclusion from the given statements.

7. *Statements:*
1) Some stars are suns.
2) Some suns are planets.
3) All planets are satellites.
4) All meteors are satellites.
5) Some suns are satellites.

8. *Statements:*
1) All fishes are birds.
2) All birds are rats.
3) All rats are cows.
4) Some rats are fishes
5) Somecows aregoats

9. *Statements:*
1) All curtains are rods
2) Some rods are sheets
3) No curtain is pillow
4) Some sheets are pillows
5) No rod is pillow

Directions (Q. No. 10 - 14): Study the information and answer the following questions:

In a certain code language:
'not many gold items' is written as 'C@16, D+15, D#9, E$11'
'quality and latest things' is written as,
'F$22, C#3,G+19,F@14'
'creativity leads best word' is written as,
'D@4,J+E, E$14, D#25'
'god makes it beauty' is written as, 'F+4,C#9,B@11, E$15

10. What is the code for 'nest' in the given code language?
1) D@16 2) M@16
3) D@4 4) B@4
5) P@22

11. What is the code for 'majesty' in the given code language?
1) Y+5 2) G+15
3) G+25 4) A+15
5) G$15

12. What is the code for 'Indians' in the given code language?
1) G#11 2) R$11
3) G$11 4) G+11
5) W@4

13. What is the code for 'standard' in the given code language?
1) H$21 2) H@21
3) H#19 4) H#21
5) I#21

14. What is the code for 'fairy tricks' in the given code language?
1) D+13 F$20
2) B+15 F$22
3) E+8 F$22
4) D+15 F$21
5) T+15 F$22

Directions (Q.No. 15-20): Study the information and answer the given questions:

There are eight persons A, B, C, D, E, F, G and H seated in a circle all facing away from the centre but not necessarily in the same order. A is second to the right of B. C is immediate neighbour of neither A nor B. There are three persons between E and G. F is third to the left of D. E is immediate neighbour of B. G is immediate neighbour of D. F is not the neighbour of B.



BANK EXAMS

REASONING

15. Who is second to the left of B?
1) F 2) E
3) C 4) D
5) None of these

16. Who is between E and H?
1) F 2) B
3) C 4) D
5) None of these

17. If F and G interchange their positions, then who will be second to the right of E?
1) F 2) G
3) C 4) D
5) None of these

18. In which of the following pairs is the second person to the immediate left of first person?
1) CF 2) EG
3) BA 4) GD
5) None of these

19. How many persons are seated between F and H?
1) Three 2) Two
3) One 4) None
5) None of these

20. Which of the following pairs has the first person sitting third to the left of the second person?
1) GB 2) BH
3) GH 4) AF
5) None of these

Key with Explanations

1) 5;
S £ A < M > P ³ X. Hence, both the conclusions follow.

2) 2;
A > M < D. Hence, A and D cannot be compared. So, conclusion (I) does not follow.
M ³ P ³ Q.
Hence, Conclusion (II) follows.

3) 5;
I > N ³ T = R ³ E = K ³ L ³ M. Hence, both the conclusions (I) & (II) follow.

4) 5;
M < S < R= Y < W < L = X £ Z. Hence, both the conclusions (I) & (II) follow.

5) 5;
P £ L = M < X = R £ K < S. Hence, both the conclusions (I) & (II) follow.

6) 2;
Vowels and consonants given in the word are arranged alternatively, starting with the vowel - Vowels in the reverse alphabetical order and consonants in the alphabetical order.

7) 5;
Some Suns are planets + All planets are satellites =Some suns are satellites

8) 4;
All fishes are birds + All birds are rats = Some rats are fishes

9) 3;
All curtains are rods + No rod is pillow = No curtain is pillow

(10-14): Each word is coded in the following way.

Each word is coded with alphabet in the first place, symbol in the middle and number in the third place.

The number of letters of the given word is represented by the alphabet based on the value of its position in the alphabet. For example, a three letter word is represented by 'C', four letter word by 'D' and so on.

Symbol represents the last letter of the given word. 'T' is represented by '@', 'Y' is represented by '+', 'D' is represented by '#' and 'S' is represented by '$'

Number represents the sum of value of the first letter, as per the alphabetical order, of the given word and '2'. For example, the value of the first letter in 'not' is 14, and that is added to 2 to get 16.

the value of the first letter in 'many' is 13, and that is added to 2 to get 15

10) 1;
'D' stands for the number of letters of the word 'nest'. @ represents the last letter i.e. 'T'. Number represents the value of the first letter i.e, 14 which when added to 2 becomes 16


11) 2;
G stands for number of letters in the word(7), 'Y' is represented by '+' . M(13) +2 = 15

12) 3;
G stands for number of letters in the word(7), 'S' is represented by '$'. I(9) +2 = 11

13) 4;
H stands for number of letters in the word(8), 'D' is represented by '#'. S(19) +2 = 21

14) 3;
E stands for number of letters in the word 'fairy'(5), 'Y' is represented by '+'. F(6) +2 = 8
F stands for number of letters in the word 'tricks'(6), 'S' is represented by '$'.
T(20) + 2 = 22

(15-20):



15) 4; 16) 2; 17) 2;
18) 1; 19) 1; 20) 1.